సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 18
సంచిక: 50
సోమవారం 12-5-2025
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'





సన్నిధి
సాక్షి ఫ్యామిలీ II
హైదరాబాద్
సోమవారం ॥ 12-5-2025

నేడు బుద్ధ జయంతి

మతాతీతమైన సత్యాలు

మానవుడు మానవుడుగా మనగలగాలంటే ఏం చేయాలో బోధించాడు బుద్ధుడు. వాటికే పంచశీలాలని పేరు. 1) ప్రాణం తీయకు 2) దొంగతనం చేయకు 3) అబద్ధాలాడకు 4) కామంతో చరించకు 5) మద్యం సేవించకు- వీటిని ఏ మతం కూడా కాదనలేదు. ఈ సత్యాలు మతాతీతాలు. సమాజం సజావుగా, కందెన వేసిన బండిచక్రంలా సాఫీగా సాగాలంటే పంచశీలాలను పాటించడం ఎంతో అవసరం.

బుద్ధుడు తాత్విక చింతనలోనూ, మనోవిజ్ఞానశాస్త్రంలోనూ, సమాజ సంక్షేమంలోనూ, మూలాలకు వెళ్లి, అంతకుముందు ఎవరూ చూడని, ఆలోచించని ఎన్నో విషయాలను మానవ కల్యాణం కోసం అందించిన మహనీయుడు. మనిషికే మహనీయుడిగా పట్టంకట్టిన ఆ మానవతావాది ప్రతిపాదించిన మార్గాన్ని అనుసరించడమే ఆయనకు అర్పించే అసలైన నివాళి.

బుద్ధం శరణం గచ్ఛామి ధర్మం శరణం గచ్ఛామి
సంఘం శరణం గచ్ఛామి

మానవాళికి మహాబోధకుడు

ఎల్లప్పుడూ రాగద్వేషాలతో, కామక్రోధాలతో, హింసతో, సతమతమవుతున్న మానవాళిని జాగృత పరచటానికి ఉద్భవించిన మహాపురుషుడు గౌతమబుద్ధుడు. ఆయన అసలు పేరు సిద్ధార్థ గౌతముడు. కపిలవస్తును ఏలే శుద్ధోధన చక్రవర్తికి, ఆయన పట్టపురాణి మహామాయాదేవికి వైశాఖ శుద్ధపూర్ణిమనాడు జన్మించాడు. అతడు పుట్టిన ఏడోరోజునే తల్లి మరణించడంతో పినతల్లి గౌతమి, తానే తల్లి అయి పెంచింది.

కొడుకు పుట్టగానే తండ్రి శుద్ధోధనుడు జాతకం చూపించాడు. జాతకం ప్రకారం అతడు మహాచక్రవర్తి కాని, మహాప్రవక్త కాని అవుతాడని పండితులు చెప్పారు. తన పుత్రుడు చక్రవర్తి కావాలని ఆశించిన తండ్రి, అతనికి కష్టాలు, బాధలు అంటే ఏమిటో తెలియకుండా పెంచాడు. అంతేకాదు, అతనికి పదహారవ ఏటనే అంతే ఈడుగల యశోధరతో వివాహం జరిపించాడు.

కొంతకాలం గడిచింది

ఒకనాడు నగర వ్యాహ్యాళికి రథంపై వెళ్లిన సిద్ధార్థునికి దారిలో నాలుగు దృశ్యాలు ఎదురయ్యాయి. అవి ఒక ముసలివాడు, ఒక రోగి, ఒక శవం, ఒక శమణుడు. అసలే ఆలోచనాపరుడైన అతని మనసులో ఇవి పెద్ద అలజడినే రేపాయి. మానవులు ఎదుర్కొనే ఈ దుఃఖాన్ని ఎలాగైనా పరిష్కరించి తీరాలనుకున్నాడు. నాలుగో దృశ్యం సన్యాసి – అతనికి మార్గాన్ని స్ఫురింపజేసింది. అప్పటికప్పుడే సన్యసించాలని, తపస్సు చేయాలని నిర్ణయం తీసుకున్నాడు.

గౌతముడు బుద్ధుడయిన వేళ...

అప్పుడాయన వయసు 29 సంవత్సరాలు. అప్పుడే ఆయనకు రాహులుడనే పుత్రుడు జన్మించాడు. ఆ రాత్రే అడవికి పయనమయ్యాడు. ప్రపంచం అంతా మొద్దునిద్దరోతోంది. మాయనిద్రలో నుంచి సిద్ధార్థుడొక్కడే మేల్కొన్నాడు, ప్రపంచాన్ని నిద్ర లేపటానికి. అడవికి వెళ్లి ఆరు సంవత్సరాలు మానవాళి దుఃఖం గురించి ఆలోచించాడు. చివరకు జ్ఞానోదయమైంది. అప్పటికాయన వయస్సు 35 సంవత్సరాలు.


బుద్ధుడు నిర్వాణం చెందింది, జ్ఞానోదయమైందీ కూడా వైశాఖ శుద్ధ పూర్ణిమ నాడే.

దుఃఖం అంటే ఏమిటి?

బుద్ధుడు ప్రపంచంలో దుఃఖం ఉందన్నాడు. ఆ దుఃఖ భావనను చాలామంది అపార్థం చేసుకున్నారు. దుఃఖం అంటే మనం మామూలుగా శోకం, ఏడుపు, పెడబొబ్బలు అనుకుంటాం. శోకం దుఃఖంలో భాగమే అయినా, దుఃఖం అర్థం అది కాదు. 'దుఃఖం' అంటే తొలగించాల్సిన ఖాళీ. అంటే ప్రతి మనిషిలోనూ తొలగించవలసిన అసంతృప్తి ఉంటుంది. అసంతృప్తి లేని మానవుడు ఉండడు. ఇలా ఎప్పుడూ అసంతృప్తి ఉంటుంది. ఈ విధమైన ఆ 'ఖాళీనే ఆధునికులు దురవస్థ అంటున్నారు. దీనిని పరిష్కరించటానికి తృష్ణను తొలగించాలన్నాడు. ఆ తృష్ణ పోవాలంటే 'స్వార్థం' లేకుండా ఉండాలి. స్వార్థం లేకుండా ఉండాలంటే 'నేను' అనే భావన ఉండకూడదు. 'నేను' లేకుండా ఉండాలంటే, 'ఆత్మ' లేకుండా ఉండాలి. అందుకే ఆయన 'అనాత్మ 'వాదాన్ని ప్రవేశపెట్టాడు. ఇది బుద్ధుడు మానవాళికి చేసిన మహోపదేశం.

ప్రపంచాన్ని మేల్కొలిపిన ఆ బోధలు ఏమిటి?

ప్రపంచాన్ని పరివర్తన దిశగా నడిపేందుకు బుద్ధుడు నాలుగు సత్యాలను బోధించాడు. వీటిని ఆర్యసత్యాలంటారు. వీటిల్లో మొదటిది... దుఃఖం. అంటే ఈ ప్రపంచంలో దుఃఖం ఉంది. రెండో సత్యం... దీనికి కారణం తృష్ణ. మూడో సత్యం... దుఃఖాన్ని తొలగించే వీలుంది. నాలుగో సత్యం... దుఃఖాన్ని తొలగించే మార్గం ఉంది. ఆ మార్గమే ఆర్య అష్టాంగమార్గం. ఈ నాలుగు సత్యాలను చెప్పడంలో బుద్ధుడు ఒక శాస్త్రీయ విధానాన్ని అనుసరించాడు. అదే కార్యకారణ సిద్ధాంతం. బుద్ధునికి ముందే ఈ సిద్ధాంతం ఉన్నా దానికి ఒక శాస్త్రీయ ప్రాతిపదికను ఏర్పాటు చేసినది మాత్రం ఆయనే. బుద్ధుడు ప్రపంచానికి అందించిన ఆలోచనా విధానం పూర్తిగా శాస్త్రీయమైనది. హేతుబద్ధమైనది.



జననం మరణం ఒకే రోజు

తనకు జ్ఞానోదయం అయిన తరవాత తాను కనుగొన్న ధర్మాన్ని రాజు, పేద, ఉన్నత, దళిత, కుల, వర్గ, మతభేదాలను పట్టించుకోకుండా 45 సంవత్సరాల పాటు నిరంతరాయంగా బోధించాడు ఆయన జన్మించినది, జ్ఞానోదయం కలిగింది. నిర్వాణం చెందిందీ కూడా వైశాఖ పున్నమినాడే. అందుకే ఈ పున్నమిని బుద్ధపున్నమి అని అంటారు.

– డి.వి.ఆర్. భాస్కర్

పర్వదినం

పరమ పవిత్రమైన పున్నమి


వైశాఖ పౌర్ణమి వైష్ణవులకు, శైవులకూ కూడా ఎంతో పర్వదినం. విష్ణుమూర్తి రెండవ అవతారమైన కూర్మావతారం ఈ రోజునే ఉద్భవించడం, పన్నిద్దరు ఆళ్వారులలో ముఖ్యుడైన నమ్మాళ్వార్ జన్మించినది కూడా వైశాఖ పున్నమి నాడే కావడం విష్ణుభక్తులకు ఉల్లాసభరితమైతే, ఎనిమిది పాదాలతో, సువర్ణ సదృశమైన రెక్కలతో, సింహపుదేహంతో ఉన్న శివుని రూపమైన శరభేశ్వరుడి అవతరించినది ఈరోజే కావడం శైవులకు సంతోషకారణం. దక్షిణాదిన పురాతనమైన ఆలయాలలో ఈ శరభ రూపం తప్పకుండా కనిపిస్తుంది. కాబట్టి శైవారాధకులకు కూడా ఈ రోజు విశిష్టమే!

సంప్రదాయపరంగా కూడా వైశాఖ పౌర్ణమి అపూర్వమైనది. ఈ రోజును మహావైశాఖిగా పిలుచుకుంటారు. ఈనాడు సముద్రస్నానం చేస్తే విశేషమైన ఫలితం వస్తుందని చెబుతారు. ఎండ ఉధృతంగా ఉండే ఈ సమయంలో దధ్యోజనం (పెరుగన్నం), గొడుగు, ఉదకుంభం లాంటివి దానం చేయడం పుణ్యప్రదం.

(నేడు వైశాఖ పున్నమి)

ఆధ్యాత్మికకథ

దేని విలువ దానిదే!



ఒక గ్రామంలోని రచ్చబండ వద్ద ఓ ఆధ్యాత్మికవేత్త ప్రవచనం చెబుతూ ఉన్నాడు. అందులో భాగంగా ''ఈ సృష్టిలోని విషయాలు మనకి అంత సులభంగా అర్థం కావు. ఈ సృష్టిలో అన్నీ విలువైనవే. ప్రతి ఒక్కటీ ఏదో ఒక కారణంగా సృష్టింపబడుతుంది. మనకి ఉపయోగపడదని, మనకి తెలియదని దేన్నీ వృథాగా భావించకూడదు'' అని చెప్పాడు.

అప్పుడే ఒక పశువుల కాపరి అడవినుంచి జీవాలను ఇంటికి తోలుకుని వెళ్తున్నాడు. ఆధ్యాత్మికవేత్త ఉపన్యాసం విని కొద్దిసేపు ఆగి ''ఈ మేక మెడ దగ్గర రెండు లింగాలు ఉన్నాయి. ఇవి దేనికి పనికి వస్తాయి. తోలుకూ మాంసానికీ రెండిటికీ పనికి రానివి కదా ఇవి'' అని నిష్ఠూరంగా అడిగాడు.

చిరునవ్వు నవ్విన ఆధ్యాత్మికవేత్త ''సృష్టి రహస్యాలు కనుక్కోవడం కష్టం. అవి ఎందుకు సృష్టింప బడ్డాయో మనకు తెలియకపోవచ్చు. నీకు బాగా అర్థమయ్యేట్లు నేను విన్న ఒక పాత కథ చెబుతాను విను.

పూర్వం ఒక ఋషి ఉండేవాడు. అతడి తపశ్శక్తి వల్ల అతడికి కొన్ని శక్తులు వచ్చాయి. తను ఏది కోరుకుంటే అది జరిగేది.

ఆ ఋషి ఒకరోజున నదీ స్నానం చేసి లేస్తున్నప్పుడు తన ముక్కు వెంట్రుకలు దట్టంగా పెరగడం గమనించాడు. కొంచెం అసౌకర్యంగా భావించాడు. 'దేనికి పనికివస్తాయి ఇవి? ఇవి లేకుంటే మాత్రం నేను జీవించలేనా' అని భావించి అవన్నీ రాలిపోయేట్లు కోరుకున్నాడు. అతడు కోరినట్లే జరిగింది.

అది జరిగిన కొద్దిసేపటికే ఉచ్ఛ్వాసనిశ్వాసలు తీసుకోవడం కష్టమయ్యింది. రోజురోజుకీ ఆ ఋషి ఆరోగ్యం క్షీణించి చివరికి ప్రాణాల మీదికి తెచ్చుకున్నాడు. చిన్న వెంట్రుకలైనా దాని విలువ దానికి ఉందని గుర్తించకపోవడం వల్ల జరిగిన అనర్థం అది. కాబట్టి ఈ సృష్టిలో ప్రతిదీ ఏదో ఒక కార్య నిమిత్తం సృష్టింపబడిందే. కాకుంటే మనం వాటి ప్రయోజనాలన్నిటినీ గుర్తించలేము. మనకు, మన ఆలోచనలకూ పరిమితులు ఉన్నాయి. కాబట్టి సృష్టి మర్మాలను మనం గౌరవించక తప్పదు'' అని వివరించాడు.

'అది ఎందుకు ఇలా ఉంది, ఇది ఎందుకు అలా ఉండకూడదు అని ఆలోచించి లాభం లేదు. ఉన్నది ఉన్నట్లు స్వీకరించడం ఉత్తమం' అని గ్రహించిన పశువుల కాపరి జీవాలను తోలుకుని ఇంటివైపు నడిచాడు.

– ఆర్.సి.కృష్ణస్వామి రాజు

సాక్షి సినిమా

డుమ్... డుమారే...



● సాయి శ్రీనివాస్, రోహిత్, మనోజ్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మనోజ్ మంచు, నారా రోహిత్ హీరోలుగా నటించిన యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'భైరవం'. ఈ చిత్రంలో అదితీ శంకర్, ఆనంది, దివ్యా పిళ్లై హీరోయిన్లు. డా. జయంతిలాల్ గడా సమర్పణలో కేకే రాధామోహన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 30న విడుదల కానుంది. ఈ సినిమాలో స్నేహం నేపథ్యంలో సాగే 'డుమ్... డుమారే' పాట లిరికల్ వీడియోను ఆదివారం విడుదల చేశారు. సంగీత దర్శకుడు శ్రీ చరణ్ పాకాల స్వరపరచిన ఈ పాటకు భాస్కరభట్ల సాహిత్యం అందించగా, రేవంత్, సాహితీ చాగంటి, సౌజన్య ఆలపించారు.


నీ మాటే నచ్చే...



● రూపేష్, ఆకాంక్షా సింగ్

''రాత్రంతా రచ్చే... మరి నువ్వంటే పిచ్చే... నీ మాటే నచ్చే...' అంటూ సాగుతుంది 'షష్టిపూర్తి' సినిమాలోని 'రాత్రంతా రచ్చే..' పాట. రూపేష్, ఆకాంక్షా సింగ్ హీరో, హీరోయిన్లుగా, రాజేంద్రప్రసాద్, అర్చన కీలక పాత్రల్లో నటించిన చిత్రం ఇది. పవన్ ప్రభ దర్శకత్వంలో రూపేష్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 30న విడుదల కానుంది. తాజాగా 'రాత్రంతా రచ్చే..' సాంగ్ ప్రోమోను విడుదల చేశారు. ఈ చిత్రసంగీత దర్శకుడు ఇళయరాజా స్వరపరచిన ఈ పాటకు చైతన్య ప్రసాద్ సాహిత్యం అందించారు. ఈ పాటను ఇళయరాజా తనయుడు, సంగీత దర్శకుడు యువన్ శంకర్ రాజా, నిత్యాశ్రీ పాడారు. ''మా నాన్న సంగీత దర్శకత్వంలో ఈ తెలుగు పాట పాడినందుకు ఆనందంగా ఉంది. ఇది కూల్ సాంగ్'' అని తెలిపారు యువన్ శంకర్ రాజా. ''ఈ సిట్యుయేషన్‌కి, ఈ పాట మూడ్‌కి యువన్ శంకర్ రాజా వాయిస్ అయితే పర్ఫెక్ట్ అనుకున్నాం. కానీ ఇళయరాజాగారు మరో తమిళ సింగర్‌తో పాడించారు. తర్వాత మేం పట్టుబట్టడంతో యువన్ శంకర్ రాజాతోనే పాడించారు. ఆర్ట్ డైరెక్టర్ తోట తరణిగారు ఈ పాట కోసం నాలుగు సెట్లు వేశారు'' అన్నారు పవన్ ప్రభ.


సిందూరం ఎక్కడ అని ప్రపంచం అడుగుతోంది



పహల్గాం ఉగ్రదాడిపై అమితాబ్ బచ్చన్ భావోద్వేగ పోస్ట్

కశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడి ఘటన యావత్ భారతదేశాన్ని కలచివేసింది. ఈ ఘటనకు ప్రతీకారంగా పాకిస్తాన్‌పై భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టిన విషయం తెలిసిందే. ఈ పహల్గాం ఘటన, ఆపరేషన్ సిందూర్‌లపై ఇప్పటికే పలువురు ప్రముఖ నటీనటులు స్పందించారు. తాజాగా ప్రముఖ నటుడు అమితాబ్ బచ్చన్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ''భార్యతో కలిసి వేసవి సెలవుల కోసం పహల్గాం వెళ్లిన భర్తను ఉగ్రమూక కాల్చి చంపింది. తన భర్తను చంపవద్దని ఆ భార్య ఎంతగానో ఏడుస్తూ, ప్రాధేయపడినా ఆ ఉగ్ర ఉన్మాది వినలేదు. ఆమె కళ్ల ముందే భర్తను అతి కిరాతకంగా కాల్చి చంపాడు. ఆమెను విధవరాలని చేశాడు. భర్త మరణాన్ని తట్టుకోలేని ఆ భార్య... తనను కూడా చంపేయమని అడిగినా... 'నిన్ను చంపను... వెళ్లి చెప్పుకో..' అని ఆ రాక్షసుడు అన్నాడు. నా కుమార్తెలాంటి ఆమె మానసిక స్థితి చూస్తుంటే .. 'ఆమె వద్ద చితాభస్మం ఉన్నా... సిందూరం ఎక్కడ అని ప్రపంచం అడుగుతోంది' అని మా నాన్న (హరివంశ్ రాయ్ బచ్చన్) రాసిన ఓ పద్యంలోని వాక్యం నాకు గుర్తొచ్చింది. అందుకే నేను నీకు సిందూరం ఇస్తున్నా... ఆపరేషన్ సిందూర్... జై హింద్... భారత సైన్యమా... ఎప్పటికీ ఆగకు... వెనకడుగు వేయకు'' అంటూ భావోద్వేగమైన పోస్టును షేర్ చేశారు అమితాబ్ బచ్చన్.

పవర్‌ఫుల్ యాక్షన్



● సుధీర్‌బాబు

సుధీర్‌బాబు హీరోగా ఆర్‌ఎస్ నాయుడు దర్శకత్వంలో ఓ యాక్షన్ డ్రామా తెరకెక్కనుంది. 'ఏ బ్రోకెన్ సోల్ ఆన్ ఏ బ్రూటల్ సెలబ్రేషన్' అనేది ఈ సినిమా ఉపశీర్షిక. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ ఈ సినిమాను నిర్మించనున్నారు. మే 11 (ఆదివారం) సుధీర్‌బాబు బర్త్ డే సందర్భంగా ఈ సినిమాను ప్రకటించారు. ''ఈ సినిమా కోసం సుధీర్ బాబు ప్రత్యేకంగా మేకోవర్ అయ్యారు. బలమైన యాక్షన్ క్యారెక్టర్ కావడంతో ఆయన బీస్ట్ మోడ్ లోకి వెళ్లారు'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

కోలీవుడ్ ఎంట్రీ



● రాజ్ తరుణ్

రాజ్ తరుణ్ కోలీవుడ్ ఎంట్రీ ఖరారైంది. రాజ్ తరుణ్ హీరోగా ప్రముఖ సినిమాటోగ్రాఫర్–దర్శకుడు విజయ్ మిల్టన్ దర్శకత్వంలో ఓ ద్విభాషా (తెలుగు, తమిళం) చిత్రం తెరకెక్కనుంది. రఫ్‌నోట్ ప్రొడక్షన్స్ సంస్థ ఈ సినిమాను నిర్మించనుంది. మే 11 (ఆదివారం) రాజ్ తరుణ్ బర్త్ డే సందర్భంగా ఈ సినిమాను ప్రకటించారు. తెలుగు, తమిళ భాషల్లో ఈ చిత్రం ఏకకాలంలో చిత్రీకరణ జరుపుకోనుంది. రాజ్ తరుణ్‌కు ఇదే తొలి తమిళ చిత్రం కావడం విశేషం. ''గోలీసోడా' ఫ్రాంచైజీలో భాగంగా విజయ్ మిల్టన్ ఈ సినిమాను తెరకెక్కించనున్నారు. ఈ సినిమా కోసం రాజ్ తరుణ్ మేకోవర్ అయిన తీరు ప్రేక్షకులను ఆశ్చర్యపరిచేలా ఉంటుంది. విభిన్నమైన కథ, బలమైన స్క్రీన్‌ప్లేతో ఈ యాక్షన్ ప్యాక్డ్ మూవీ ప్రేక్షకులను అలరించేలా ఉంటుంది'' అని చిత్రబృందం పేర్కొంది.

అనంతమైన ప్రేమ



● ప్రీతీ నేహా, సాత్విక్ వర్మ

వరలక్ష్మీ పప్పుల సమర్పణలో భాను దర్శకత్వంలో కనకదుర్గా రావు పప్పుల నిర్మించిన ప్రేమకథా చిత్రానికి 'ప్రేమిస్తున్నా' టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ చిత్రంలో సాత్విక్ వర్మ, ప్రీతీ నేహా హీరో హీరోయిన్లు. ''ప్రేమలో ఇప్పటివరకూ ఎవరూ టచ్ చేయని ఓ పాయింట్‌తో ఈ చిత్రాన్ని రూపొందించాం. ఈ ప్రేమకథలో ఆకాశమంత ప్రేమ... అనంతమైన ప్రేమ ఉంటుంది. దివంగత ప్రముఖ సంగీతదర్శకుడు సాలూరి రాజేశ్వర రావుగారి కుటుంబం నుండి వస్తోన్న సిద్ధార్థ్ సాలూరి ఈ సినిమాకు ఐదు అద్భుతమైన పాటలు ఇచ్చారు. ఈ చిత్రంలో నటించిన ఇద్దరు ప్రముఖ నటుల వివరాలు త్వరలో తెలియజేస్తాం'' అని యూనిట్ పేర్కొంది.

పోరాడే శక్తిని అమ్మ మాత్రమే ఇస్తుంది - దర్శకుడు ఈశ్వర్‌బాబు

దియా రాజ్, రోహిత్ బొడ్డపాటి, వికాస్ వశిష్ఠ, ఇనయా సుల్తానా, రిహానా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఫ్రైడే'. ఈశ్వర్‌బాబు ధూళిపూడి దర్శకత్వంలో కేసనకుర్తి శ్రీనివాస్ నిర్మించిన ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. మదర్స్ డే సందర్భంగా ఈ సినిమాలోని 'అమ్మ' పాటను ఆంధ్రప్రదేశ్ హోం మినిస్టర్ వంగలపూడి అనిత రిలీజ్ చేశారు. మధు కిరణ్ సాహిత్యం అందించిన ఈ పాటను స్నిగ్ధ నయని పాడారు. ప్రజ్వల్ క్రిష్ ఈ సినిమాకు సంగీత దర్శకుడు. అనంతరం జరిగిన ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో హీరో రోహిత్ మాట్లాడుతూ– ''ఈశ్వర్‌గారు ఈ సినిమా కథ చెప్పినప్పుడు షాక్ అయ్యాను. అంత డిఫరెంట్‌గా ఉంది'' అన్నారు. ''పోరాడే శక్తిని అమ్మ మాత్రమే ఇస్తుంది. మా సినిమా చూసిన తర్వాత ప్రతీ తల్లి తన కొడుకుని ఓ ఛత్రపతి శివాజీలా, మహారాణా ప్రతాప్ సింగ్‌లా పెంచుతారు'' అని తెలిపారు ఈశ్వర్‌బాబు. ''నేను ప్రయోజకుడ్ని అయ్యే టైమ్‌కి మా అమ్మగారు చనిపోయారు. నా ఎదుగుదలను ఆమె చూడలేదు. ఈశ్వర్ చెప్పిన కథ నా మనసుకు తాకింది'' అన్నారు కేసనకుర్తి శ్రీనివాస్. ''ఈ చిత్రంలో మంచి పాత్ర ఇచ్చిన దర్శక–నిర్మాతలకు థ్యాంక్స్'' అని తెలిపారు దియా రాజ్.



● శ్రీనివాస్, దియా రాజ్, రోహిత్, ఈశ్వర్‌బాబు

డైరెక్షన్... యాక్షన్... కల్ట్ స్టార్ట్



● విశ్వక్ సేన్, అల్లు అరవింద్

మాస్ యాక్టర్‌గా విశ్వక్ సేన్‌కి మంచి ఫాలోయింగ్ ఉన్న సంగతి తెలిసిందే. దర్శకునిగా తొలి చిత్రం 'ఫలక్‌నుమా దాస్'తోనే తన ప్రతిభను నిరూపించుకున్నారు విశ్వక్. ఆ తర్వాత 'దాస్ కీ ధమ్కీ' చిత్రంలో నటించి, దర్శకత్వం వహించారు. ఇప్పుడు విశ్వక్ సేన్ హీరోగా ఆయన డైరెక్షన్‌లోనే '#కల్ట్' చిత్రం ఆరంభమైంది. ఈ చిత్రానికి కథ కూడా రాసుకున్నారు విశ్వక్. 40 మంది నూతన నటీనటులను పరిచయం చేస్తూ, కరాటే రాజు, సందీప్ కాకర్ల నిర్మిస్తున్న ఈ చిత్రం ఆదివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. నిర్మాత ఎస్. రాధాకృష్ణ (చిన్నబాబు) టైటిల్ లోగోను లాంచ్ చేశారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ముహూర్తపు షాట్‌కు కెమెరా స్విచ్చాన్ చేయగా, అల్లు అరవింద్ క్లాప్ కొట్టారు. ఆదివారమే రెగ్యులర్ షూటింగ్ ఆరంభించారు. ''వాస్తవ ఘటనల ఆధారంగా న్యూ ఏజ్ పార్టీ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. తెలుగు, హిందీ, జపనీస్, స్పానిష్, ఇంగ్లిష్ భాషల్లో సినిమాని రిలీజ్ చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది. నటుడు–దర్శకుడు తరుణ్ భాస్కర్ డైలాగ్స్ అందించిన ఈ చిత్రానికి సంగీతం: రవి బస్రూర్, కెమెరా: అరవింద్ విశ్వనాథన్.


కథే నా బలం - నవీన్ చంద్ర



● నవీన్ చంద్ర, సందీప్ కిషన్

''నవీన్ నాకంటే సీనియర్ నటుడు. అదృష్టాన్ని కాకుండా కష్టాన్ని మాత్రమే నమ్ముకున్న నవీన్ తన ప్రతి సినిమాలో బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇచ్చారు. 'లెవన్' సినిమా ట్రైలర్‌లో మంచి క్రాఫ్ట్ కనిపించింది. కథని, కంటెంట్‌ని నమ్ముకుని చేసిన సినిమా ఇది. ఈ సినిమాతో నవీన్‌కి ఒక మంచి హిట్ రావాలని కోరుకుంటున్నాను'' అని సందీప్ కిషన్ అన్నారు. నవీన్ చంద్ర హీరోగా నటించిన ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ మూవీ 'లెవన్'. ఈ ద్విభాషా (తెలుగు, తమిళం) చిత్రాన్ని లోకేశ్ అజ్లస్ దర్శకత్వంలో అజ్మల్ ఖాన్, రేయా హరి నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 16న విడుదల కానుంది. రుచిర ఎంటర్‌టైన్మెంట్స్ డిస్ట్రిబ్యూటర్ ఎన్. సుధాకర్ రెడ్డి ఈ సినిమా థియేట్రికల్ హక్కులను సొంతం చేసుకున్నారు. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా నటుడు–నిర్మాత సందీప్ కిషన్, అతిథులుగా దర్శకులు కరుణకుమార్, విశ్వనాథ్, అనిల్ విశ్వనాథ్, సాయిరాజేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు. ఈ వేడుకలో నవీన్ చంద్ర మాట్లాడుతూ– ''ఇప్పటివరకు ఈ సినిమా చూసిన వారు బాగుందని చెప్పారు. వాళ్ల రియాక్షన్స్ చూసినప్పుడు నా ఆత్మవిశ్వాసం మరింత పెరిగింది. నా కథే నా బలం. నేను చేసే కథలు, పాత్రలు బాగుంటాయని ప్రేక్షకులు మొదట్నుంచి ప్రశంసిస్తున్నారు. ఈ గౌరవానికి రిటర్న్‌గా ఈ సినిమా ఉంటుందని నమ్ముతున్నాను. ఈ సినిమాలో ఉన్న యునిక్ కాన్సెప్ట్‌ని ఇప్పటివరకు ఏ థ్రిల్లర్ మూవీలోనూ చూసి ఉండరు. ఈ సినిమా టైటిల్‌లోనే చాలా క్లూస్ ఉన్నాయి. ఎవరైనా ఆ క్లూస్‌ని డీకోడ్ చేస్తే వాళ్ళకి చాలా మంచి గిఫ్ట్ ఇస్తాను'' అని తెలిపారు. ''ఓ సినిమాకి సరైన నటీనటులు కుదిరితే, ఆ సినిమా సగం గెలిచినట్లే. అలా 'లెవన్' సినిమా సగం గెలిచింది. ఈ సినిమాను థియేటర్స్‌లో చూడండి'' అని తెలిపారు లోకేశ్.

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 18
సంచిక: 50
సోమవారం 12-5-2025
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'



జయం మనదే
మహిళల ముక్కోణపు వన్డే టోర్నీ విజేత భారత్. శ్రీలంకపై ఘనవిజయం -12లో



మిస్ సెల్లింగ్..
బీమా పాలసీలను తప్పుడు మార్గాల్లో విక్రయించడం ఎక్కువైంది -13లో



'పుల్వామా' మా పనే
పుల్వామా దాడి వెనుక తమ హస్తం ఉన్నట్లు పాక్ ఎయిర్ వైస్ మార్షల్ ఔరంగజేబ్ అహ్మద్ స్పష్టం చేశారు.
వివరాలు 6లో ▸



తక్షణమే పార్లమెంట్ భేటీ
'పహల్గాం' తదనంతర పరిణామాలపై చర్చకు పార్లమెంట్‌ను సమావేశ పరచాలని రాహుల్, ఖర్గే ప్రధాని మోదీని కోరారు.
వివరాలు 6లో ▸



బ్రహ్మోస్ దెబ్బకే పాక్ దిగొచ్చిందా?
సరిహద్దులపై ఎడాపెడా దాడులకు తెగబడ్డ పాక్ బ్రహ్మాస్త్రం దెబ్బకు దిగొచ్చిందా? అంటే అవుననే సమాధానమే వస్తోంది.
వివరాలు 6లో ▸



మధ్యవర్తిత్వం ప్రసక్తే లేదు
దశాబ్దాలుగా సంఘర్షణలకు కారణమైన జమ్మూకశ్మీర్ అంశంలో మూడో వ్యక్తి జోక్యం అక్కర్లేదని భారత్ పునరుద్ఘాటించింది.
వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

వచ్చే రెండ్రోజులు మండే ఎండలు



రాష్ట్రంలో రానున్న రెండ్రోజులు సాధారణం, అంతకంటే కాస్త ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సూచించింది. ఆదివారం ఖమ్మంలో అత్యధికంగా 41.4 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.
- వివరాలు 14లో▶

బీఎస్సీ అగ్రికల్చర్‌లో కొత్త కోర్సు



ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నాలుగేళ్ల బీఎస్సీ వ్యవసాయ డిగ్రీ కోర్సును ప్రారంభించింది. మూడేళ్లు ఇక్కడ, ఒక ఏడాది ఆస్ట్రేలియాలో చదవాల్సి ఉంటుంది.
- వివరాలు 3లో▶

సీఎంవో కూర్పులో మార్పులు



సీఎంగా బాధ్యతలు స్వీకరించి ఏడాదిన్నర పూర్తైన నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి సీఎంఓ పనితీరును సమీక్షించి మార్పులు, చేర్పులకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు సీఎంఓలోని విధులను ఆయా అధికారులకు ప్రభుత్వం బట్వాడా చేసింది.
- వివరాలు 14లో▶

మన భాషలోనే.. ఆటాడుకుందాం



ప్రపంచవ్యాప్తంగా గత ఏడాది గేమర్స్ ఏకంగా 39,000 కోట్ల గంటలు మొబైల్‌లో గడిపారంటే అతిశయోక్తి కాదు. యూజర్ల సంఖ్యను పెంచుకోవడానికి డెవలపర్లు స్థానిక భాషల్లో గేమ్స్‌ను పరిచయం చేస్తున్నారు.
- వివరాలు 5లో▶

ఇదండీ జోక్



ప్రతి తూటాకూ.. క్షిపణితో బదులు..

పాక్‌కు ప్రధాని మోదీ తీవ్ర హెచ్చరికలు

ఉగ్రవాదులతో పాటు పీఓకేనూ అప్పగించాల్సిందే.. అప్పటిదాకా సిందూర్ కొనసాగుతుంది



త్రివిధ దళాల అధిపతులతో సమావేశంలో ప్రధాని మోదీ. చిత్రంలో రాజ్‌నాథ్‌సింగ్, జైశంకర్, విక్రమ్ మిస్రీ తదితరులు

- పరిస్థితిపై ప్రధాని అత్యున్నత స్థాయి సమీక్ష
- రావల్పిండి దాకా మన సైనిక గర్జన: రాజ్‌నాథ్
- దిగొచ్చిన పాక్; దాడులు, కాల్పులకు తెర
- విరమణపై మంత్రుల స్థాయి చర్చకు ప్రతిపాదన
- డీజీఎంవో స్థాయిలోనే జరుగుతాయన్న కేంద్రం
- మళ్లీ దుస్సాహసానికి దిగితే ఖబడ్దార్: సైన్యం


చావుదెబ్బ కొట్టాం
పాక్ రాజధానిపైనే దాడి చేశాం: సైనిక ఆపరేషన్స్ డీజీల వెల్లడి
- పాక్ సైన్యం వేడుకున్నందుకే విరమణ
- దుస్సాహసానికి దిగితే మళ్లీ గుణపాఠం
- ఉగ్రవాదం అంతానికే 'ఆపరేషన్ సిందూర్'

6లో

కోరి కుదుర్చుకున్న కాల్పుల విరమణను గంటల్లోనే ఉల్లంఘించిన దాయాదికి క్రమంగా తత్వం బోధపడుతోంది. భారత్‌పై దుస్సాహసానికి దిగితే పర్యవసానం ఎలా ఉంటుందో తెలిసొస్తోంది. మన ప్రతిదాడుల్లో సైనిక వ్యవస్థలు, కీలక వైమానిక బేస్‌లు నేలమట్టం కావడంతో పాక్ బెంబేలెత్తడం తెలిసిందే. ఆ దాడుల్లో బ్రహ్మోస్ క్షిపణిని కూడా ప్రయోగించామన్న వార్తలతో మరింత భయోత్పాతానికి లోనైంది. ఆదివారం కాల్పులను పూర్తిగా కట్టిపెట్టింది. 'విరమణకు కట్టుబడతాం. దీనిపై విదేశాంగ మంత్రులు, లేదంటే జాతీయ భద్రతా సలహాదారుల స్థాయిలో చర్చిద్దాం' అంటూ కాళ్లబేరానికొచ్చింది. ఆ విజ్ఞప్తిని కేంద్రం నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. కేవలం డీజీఎంఓల స్థాయిలో మాత్రమే చర్చలు జరుగుతాయని స్పష్టం చేసింది. పాక్‌కు అంతకంటే ప్రాధాన్యం ఇచ్చేది లేదని చెప్పకనే చెప్పింది. అసలు పాక్ డీజీఎంఓ కోరితేనే కాల్పుల విరమణకు అంగీకరించినట్టు డీజీఎంఓ రాజీవ్ ఘాయ్ ఆదివారం మీడియా ముందు కుండబద్దలు కొట్టారు. దాయాది ఇకపై ఏమాత్రం కవ్వింపు చర్యలకు దిగినా ఉపేక్షించేది లేదని మోదీ స్పష్టం చేశారు. 'వాళ్ల తూటాలు ప్రయోగిస్తే క్షిపణులతో బదులివ్వండి' అంటూ త్రివిధ దళాలను ఆదేశించారు. ఆపరేషన్ సిందూర్ ముగియలేదని ప్రధాని స్పష్టం చేశారు. ఉగ్రవాదులతో పాటు ఆక్రమిత కశ్మీర్‌ను కూడా పాక్ అప్పగించాల్సిందేనని తేల్చేశారు. ఇకపై దాయాదితో చర్చలేవైనా ఈ రెండు అంశాలపై మాత్రమే జరుగుతాయని కుండబద్దలు కొట్టారు. మన సైనిక గర్జనలు రావల్పిండి దాకా కొనసాగాయని దాయాదిని ఉద్దేశించి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ ఎద్దేవా చేశారు. మళ్లీ దుస్సాహసానికి దిగితే ఖబడ్దార్ అంటూ సైన్యం కూడా పాక్‌కు తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. సరిహద్దుల వెంబడి కాల్పులు ఆగిపోవడంతో జమ్మూ కశ్మీర్ నుంచి రాజస్తాన్ దాకా ఆదివారం ప్రశాంతత నెలకొంది.

డీజీలు ఏమన్నారంటే...

కాల్పుల విరమణకు ప్రతిపాదించింది పాకిస్తానే. పాక్ డీజీఎంఓ ఫోన్ చేసి ఒప్పందం చేసుకుందామని కోరారు. ఇస్లామాబాద్‌కు కూతవేటు దూరంలోని అతి కీలకమైన చక్లాలాతో సహా పాక్ ప్రధాన వైమానిక స్థావరాలన్నింటినీ దెబ్బతీశాం.



డీజీఎంఓ లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్

శత్రు లక్ష్యాలను ఛేదించడమే మా పని. వాళ్ల మృతదేహాలను, శవపేటికలను లెక్కించడం కాదు. పాక్‌కు చెందిన అత్యాధునిక యుద్ధ విమానాలను కూల్చేశాం. ఒక్కటి కూడా మన గగనతలంలోకి రాకుండా తరిమికొట్టాం.



డీజీఏఓ ఎయిర్ మార్షల్ ఎ.కె.భారతి

మన దాడుల్లో పాక్ ఓడరేవులకు తీవ్ర నష్టం వాటిల్లింది. కరాచీ ఓడరేవుపైనా భారీ దాడులు చేశాం. మన నావికా దళం అరేబియా సముద్రంలో నిత్యం అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. పాక్ ఎలాంటి కవ్వింపులకు దిగినా దీటుగా బుద్ధి చెబుతాం.



డీజీఎన్‌ఓ వైస్ అడ్మిరల్ ఎ.ఎన్.ప్రమోద్

ఉన్నతాధికారులతో కలసి ఫలితాలను విడుదల చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో బాలకిష్టారెడ్డి, దేవసేన, యోగితారాణా తదితరులు



అర్హతలో బాలికలు.. ర్యాంకుల్లో బాలురు

ఇంజనీరింగ్‌లో పదికి పది బాలురకే
- అగ్రి, ఫార్మసీలో తొలి పదిలో 9 బాలురకు
- రెండు విభాగాల్లోనూ అర్హతలో బాలికలదే పైచేయి
- ఇంజనీరింగ్ టాపర్ విజయనగరం వాసి
- అగ్రి, ఫార్మసీలో మొదటి ర్యాంకు హైదరాబాద్‌కు
- ఈఏపీసెట్ ఫలితాలు విడుదల చేసిన సీఎం రేవంత్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష (టీజీఈఏపీసెట్)లో బాలికలే పైచేయి సాధించారు. అయితే, టాప్ ర్యాంకుల్లో మాత్రం బాలురే ముందు వరుసలో ఉన్నారు. ఇంజనీరింగ్, అగ్రి, ఫార్మా విభాగాల్లో టాప్ ర్యాంకులు అత్యధికంగా బాలురకే దక్కాయి. మొత్తంగా ఇంజనీరింగ్ విభాగంలో 73.26 శాతం అర్హత సాధిస్తే, అగ్రి, ఫార్మసీ సెట్‌లో 87.82 శాతం మంది అర్హత సాధించారు. ఈఏపీసెట్ ఫలితాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం ఉదయం 11 గంటలకు తన నివాసంలో విడుదల చేశారు. అర్హత సాధించిన విద్యార్థులకు సీఎం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, వైస్ చైర్మన్ ప్రొఫెసర్ పురుషోత్తం, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేష్, విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా, సాంకేతిక విద్య
మిగతా 3వ పేజీలో ▶

నేడు సాగర్.. రేపు చార్మినార్..

'మిస్ వరల్డ్' కార్యక్రమాలు యథాతథం



- మంగళవారం చార్మినార్, లాడ్‌బజార్‌లో షాపింగ్ చేయనున్న సుందరీమణులు
- చౌమొహల్లా ప్యాలెస్‌లో స్వాగత విందుకు హాజరు
- సీఎం, సినీ, క్రీడా, ఇతర ప్రముఖులు పాల్గొనే అవకాశం
- నేటి సాయంత్రం నాగార్జునసాగర్‌కు కంటెస్టెంట్లు

సాక్షి, హైదరాబాద్: ప్రపంచ సుందరి పోటీల సందర్భంగా తలపెట్టిన కార్యక్రమాలను ముందు నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారమే నిర్వహించనున్నారు. భారత్–పాకిస్తాన్ మధ్య యుద్ధ వాతావరణం, పోటీదారుల భద్రత నేపథ్యంలో కొన్ని కార్యక్రమాల నిర్వహణపై నిర్వాహకులు తొలుత సందిగ్ధంలో పడ్డారు. ముఖ్యంగా చార్మినార్ వద్ద హెరిటేజ్ వాక్, అనంతరం పాత నగరంలోని చౌమొహల్లా ప్యాలెస్‌లో స్వాగత విందు కార్యక్రమాలు రద్దు చేసే అంశాన్ని పరిశీలించారు. కానీ ఇప్పుడు వాటిని
మిగతా 14వ పేజీలో ▶



మరో 25 చోట్ల స్లాట్ బుకింగ్స్

నేటి నుంచి సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో అమల్లోకి కొత్త విధానం
- వచ్చే నెల చివరినాటికి రాష్ట్రవ్యాప్తంగా స్లాట్ బుకింగ్స్
- అధిక రద్దీ ఉన్న ఆఫీసుల్లో అదనపు సిబ్బంది నియామకం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి

సాక్షి, హైదరాబాద్: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ కోసం గంటల తరబడి వేచి ఉండాల్సిన అవసరం లేకుండా రాష్ట్రవ్యాప్తంగా వచ్చేనెల చివరి నాటికి స్లాట్‌బుకింగ్ పద్ధతి పూర్తిగా అందుబాటులోకి వస్తుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గత నెల పదో తేదీన 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ ప్రక్రియ ప్రారంభించగా.. సోమవారం నుంచి మరో 25 కార్యాలయాల్లో ఈ విధానాన్ని అమలు చేయనున్నట్లు ఆదివారం ఆయన ఒక ప్రకటనలో వెల్లడించారు. స్లాట్ బుకింగ్ పద్ధతితో కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టామని మంత్రి తెలిపారు. వచ్చే నెల చివరినాటికి రాష్ట్రంలోని 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ విధానాన్ని అమల్లోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

అధికారులదే బాధ్యత..: ప్రజలకు వేగంగా, సమర్థవంతంగా సేవలందించడమే లక్ష్యంగా తీసుకొచ్చిన సంస్కరణలను అమలుచేసే బాధ్యత అధికారులదేనని మంత్రి స్పష్టం చేశారు. రోజుకు 48 కంటే ఎక్కువ
మిగతా 5వ పేజీలో ▶

పారిశ్రామికవాడ.. సమస్యలే నిండా!


సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామిక వాడలో వందల సంఖ్యలో పరిశ్రమలు ఉన్నా సరైన నీటి సరఫరా సౌకర్యం లేదు. పరిసర గ్రామాల వ్యవసాయ క్షేత్రాల నుంచి తరలిస్తున్నారు. మెదక్–నర్సాపూర్ జాతీయ రహదారికి 2 కిలోమీటర్ల దూరంలో ఉండటం, రవాణా సౌకర్యం లేకపోవడంతో కార్మికులకు కాలినడకే శరణ్యమవుతోంది. రోడ్డు పక్కన ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు సీసీ కెమెరాలను కమ్మేయడంతో ఉపయోగం లేకుండా పోయింది. పార్కింగ్ సమస్య తలనొప్పిగా మారింది. యాజమాన్యాలు, ఉద్యోగుల కార్లు, ద్విచక్ర వాహనాలు రోడ్డుకు ఇరువైపులా నిలవడంతో ఇరుకుగా మారి కార్మికులు ప్రమాదాల బారిన పడుతున్నారు.



ఇదీ రాష్ట్రంలోని అనేక పారిశ్రామికవాడల పరిస్థితి
- మౌలిక సదుపాయాలే కొరవడిన వైనం
- పరిశ్రమలకు, కార్మికులకు అరకొరగానే నీటి వసతి
- రవాణా వసతి లేదు..రోడ్లను పట్టించుకునే వారు లేరు
- అధ్వానంగా అంతర్గత రోడ్లు..మురుగునీటి పరుగులు
- వ్యర్థాల నిర్వహణ, రీసైక్లింగ్, డంపింగ్ వ్యవస్థల లేమితో ఇక్కట్లు
- ఇండస్ట్రియల్ లోకల్ ఏరియా అథారిటీలకు నిధుల కొరత

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పారిశ్రామిక రంగం రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది. హైదరాబాద్‌ను ఐటీ, ఫార్మా, బయోటెక్ హబ్‌గా మార్చిన ఈ రంగం.. ఉపాధి అవకాశాలను సృష్టించి, విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తోంది. పారిశ్రామిక కారిడార్‌లు, స్పెషల్ ఎకనామిక్ జోన్‌లు ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తున్నాయి. అయితే పారిశ్రామిక రంగానికి వెన్నెముకగా నిలుస్తున్న పారిశ్రామిక వాడల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. కనీస మౌలిక వసతులు లేక యాజమాన్యాలు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, పరిశ్రమల ఉత్పాదకతపైనా దీని ప్రభావం పడుతోంది.

రాష్ట్రంలో 180 పారిశ్రామిక పార్కులు
రాష్ట్రంలో టీజీఐఐసీతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో అభివృద్ధి చేసినవి కలుపుకొని సుమారు 180 పారిశ్రామిక పార్కులు ఉన్నాయి. అయితే వీటిల్లో చాలావరకు రోడ్లు, డ్రైనేజీలు, పారిశుధ్యం, విద్యుత్, ఇంటర్‌నెట్, రవాణా, పార్కింగ్ సమస్యలతో పాటు భద్రతా లోపాలతో కొట్టుమిట్టాడుతున్నాయి. పారిశ్రామిక వాడల్లో మౌలిక వసతులు
మిగతా 5వ పేజీలో ▶



'సీతారామ' 90 శాతం పూర్తి చేశాం

- ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ, హైడ్రాలజీ అనుమతులున్నాయి
- కాంగ్రెస్ మంత్రులు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు
- మాజీమంత్రి హరీశ్‌రావు ఫైర్

సాక్షి, హైదరాబాద్: నిజం మౌనంగా ఉంటే అబద్ధం రాజ్యం ఏలుతుందన్న నానుడి సీతారామ ప్రాజెక్టుకు అనుమతుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న వాదనకు అక్షరాలా సరిపోతుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ మంత్రులు పదేపదే అసత్యాలను ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తాము సీతారామ ప్రాజెక్టు పనులు 90 శాతం పూర్తి చేశామని స్పష్టం చేశారు. ప్రాజెక్టు అనుమతులకు సంబంధించి కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఉత్తర్వుల కాపీతో ఆదివారం ఆయన ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు.

అబద్ధపు ప్రచారాలకు పరాకాష్ట: 'సీతారామ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌ను 2018 అక్టోబర్ 30న సీడబ్ల్యూసీకి పంపిస్తే.. 2021 సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో 113.795 టీఎంసీల నీళ్ల ప్రతిపాదిత సీతారామ ప్రాజెక్టుకు అందుబాటులో ఉంటాయని సీడబ్ల్యూసీ హైడ్రాలజీ విభాగం నిర్ధారించింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 6.74 లక్షల ఎకరాలకు సాగు, తాగునీటి అవసరాలకు, పారిశ్రామిక అవసరాలకు ఈ ప్రాజెక్టు నుంచి
మిగతా 5వ పేజీలో ▶

క్లుప్తంగా...

మీ ప్రేమ, బలం, త్యాగం అపరిమితమైనవి

తల్లులందరికీ వైఎస్ జగన్ మాతృ దినోత్సవ శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: మాతృ దినోత్సవం సందర్భంగా తల్లులందరికీ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. 'మీ ప్రేమ, బలం, త్యాగం అపరిమితమైనవి. ఎప్పటికీ మిమ్మల్ని గౌరవిస్తూనే ఉంటాం. మాతృ దినోత్సవ శుభాకాంక్షలు అమ్మా' అంటూ ఆదివారం వైఎస్ జగన్ 'ఎక్స్'లో పోస్టు చేశారు.

చరిత్ర తిరగరాసిన నారాయణ

సాక్షి, హైదరాబాద్: ఈఏపీ సెట్ ఫలితాల్లో ఇంజనీరింగ్, అగ్రి, ఫార్మసీ రెండు విభాగాల్లోనూ రెండు స్టేట్ ఫస్ట్ ర్యాంకులతో నారాయణ విద్యాసంస్థ చరిత్ర సృష్టించింది. స్టేట్ 1, 1, 8, 9, 10, 11 వంటి అత్యుత్తమ ర్యాంకులు నారాయణ విద్యార్థులు కైవసం చేసుకున్నారు. ఇంజనీరింగ్ విభాగంలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ భరత్ చంద్ర, బణి బ్రత మాజీ 8 వ ర్యాంకు, శ్రీకార్తిక్ స్టేట్ 10వ ర్యాంకు సాధించారని నారాయణ విద్యాసంస్థ తెలిపింది. అగ్రి, ఫార్మసీ విభాగంలో పి.సాకేత్ రెడ్డి స్టేట్ ఫస్ట్ ర్యాంక్, ఎ.శామ్యూల్ సాత్విక్ స్టేట్ 9 వ ర్యాంకు కైవసం చేసుకున్నాడని తెలిపింది. టాప్ 100లో 15 ర్యాంకులు నారాయణ విద్యార్థులే చేజిక్కించుకున్నారని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ పేర్కొన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో 100 లోపు 39 ర్యాంకులు కేవలం నారాయణ విద్యాప్రణాళిక ద్వారానే సాధించారని పేర్కొన్నారు.

శ్రీచైతన్య విజయభేరి

సాక్షి, హైదరాబాద్: ఈఏపీసెట్–2025 ఫలితాల్లో ఇంజనీరింగ్, అగ్రి/ఫార్మాలో శ్రీ చైతన్య విద్యార్థులు టాప్ ర్యాంకులతో ప్రథమ స్థానంలో నిలిచి.. ఎప్పట్లాగే రికార్డులు సృష్టించారని శ్రీచైతన్య విద్యాసంస్థ ప్రకటించింది. ఇంజనీరింగ్‌లో టాప్ 10 లోపు 6 ర్యాంకులు, టాప్ 100లోపు 50 ర్యాంకులు. అగ్రి/ఫార్మాలో టాప్ 10 లోపు 7 ర్యాంకులు, టాప్ 20 లోపు 17 ర్యాంకులు, 100 లోపు 70 ర్యాంకులను తమ విద్యార్థులు సాధించారని సంస్థ వెల్లడించింది. ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్ 2025 ఫలితాల్లో కూడా 300కి 300 మార్కులతో ఓపెన్ కేటగిరీలో ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ సాధించిన విద్యార్థి కూడా శ్రీచైతన్య తెలంగాణ విద్యార్థేనని స్పష్టం చేసింది.

ఈఏపీసెట్‌లో 'అల్ఫోర్స్' చరిత్రాత్మక విజయం

కరీంనగర్: ఈఏపీసెట్–2025 ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ఫలితాల్లో 'అల్ఫోర్స్'విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి చరిత్రాత్మక విజయం సాధించారని విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. 33 మంది విద్యార్థులు వెయ్యిలోపు ర్యాంక్ సాధించడం విశేషమని పేర్కొన్నారు. 72 మంది విద్యార్థులు రెండువేల లోపు, 105 మంది మూడు వేల లోపు, 192 మంది ఐదువేల లోపు ర్యాంకులు సాధించి అల్ఫోర్స్ కీర్తి ప్రతిష్ఠలను దశదిశలా చాటారని తెలిపారు. ఇటీవల 461 మంది విద్యార్థులు ఐఐటీ (అడ్వాన్స్‌డ్)కు అర్హత సాధించడం అల్ఫోర్స్ మరో సంచలనమని పేర్కొన్నారు.

ఈఏపీసెట్‌లో ఎస్‌ఆర్ విద్యార్థుల ప్రతిభ

విద్యారణ్యపురి: ఈఏపీ సెట్–2025 ఫలితాల్లో ఎస్ఆర్ విద్యా సంస్థల విద్యార్థులు ప్రతిభ చాటారని ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి తెలిపారు. ఎంపీసీ విభాగంలో వి.నాగసిద్ధార్థ రాష్ట్ర స్థాయి 32వ ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నారు. ఎంపీసీలో మేధాకార్తిక్ 234వ ర్యాంకు, జోగు అభిరామ్ 471వ ర్యాంకు, బైపీసీలో ఎం.వినయ్ 149వ ర్యాంకు, ఎండీ అబ్దుల్లా మొహీనుద్దీన్ 162వ ర్యాంకు సాధించారని పేర్కొన్నారు. ర్యాంకులు సాధించిన వారిలో.. కె.అంజనాసంతోషి 178, పి.సాయిదివ్యాన్ 183, కె.సాయికిరణ్ 200, జి.సాయిహర్షిణి 268, వై.స్నేహితారెడ్డి 390, కె.ఏంజిల్ 412, వి.ప్రత్యున్నారెడ్డి 475, తోట ప్రణయ 496, మహ్మద్‌షాహిద్ రెహాన్ 513, చల్లా అన్సిక 539 ర్యాంకు సాధించినట్లు వివరించారు.

బీసీ గురుకుల జూనియర్ ప్రవేశాల గడువు 17

సాక్షి, హైదరాబాద్: మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ పరిధిలోని జూనియర్ కళాశాలల్లో ప్రవేశ దరఖాస్తు గడువును ఈనెల 17 వరకు పొడిగించినట్లు సొసైటీ కార్యదర్శి బి.సైదులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో https://mjptbcwreis.telangana.gov.in లేదా https://mjpabcwreis.cgg.gov.in/ TSMJBCWEB/ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశ పరీక్ష లేకుండానే.. పదో తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా సీట్ల కేటాయింపు జరుపుతామని తెలిపారు. మరిన్ని వివరాలకు 040–23328266 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అర్హతలో బాలికలు.. ర్యాంకుల్లో బాలురు

▶ మొదటి పేజీ తరువాయి

కమిషనర్ దేవసేన, జేఎన్‌టీయూహెచ్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కిషన్‌రెడ్డి, సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ దీన్‌కుమార్ తదితరులు హాజరయ్యారు.

టాపర్లంతా బాలురే


ఈఏపీసెట్ పరీక్షలు ఏప్రిల్ 29 నుంచి మే 4వ తేదీ వరకు నిర్వహించిన విషయం తెలిసిందే. ఇంజనీరింగ్ సెట్‌కు 2,20,326 మంది దరఖాస్తు చేసుకుంటే, 2,07,190 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 1,51,779 మంది (73.26 శాతం) అర్హత సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి 86,762 మంది దరఖాస్తు చేసుకుంటే, 81,198 మంది పరీక్ష రాశారు. వీరిలో 71,309 మంది అర్హత సాధించారు. ఇంజనీరింగ్ సెట్‌లో బాలికలు 73.88 శాతం ఉత్తీర్ణత సాధించగా, బాలురు 72.79 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. అగ్రి, ఫార్మసీ సెట్‌లో బాలికలు 88.32 శాతం, బాలురు 86.29 శాతం అర్హత సాధించారు. అయితే, టాప్ ర్యాంకుల్లో ఎక్కువగా బాలురే కైవసం చేసుకున్నారు. ఇంజనీరింగ్‌లో మొదటి పది ర్యాంకులు బాలురకే దక్కాయి. ఆంధ్రప్రదేశ్‌లోని పార్వతీపురంకు చెందిన పల్లా భరత్‌చంద్ర మొదటి ర్యాంకు దక్కించుకుంటే, హైదరాబాద్‌కు చెందిన ఉడగండ్ల రమాచరణ్‌రెడ్డి రెండో ర్యాంకు దక్కించుకున్నారు. మూడో ర్యాంకు కూడా ఏపీకి చెందిన పమ్మిన హేమసాయి సూర్యకార్తీక్‌కు వచ్చింది. నాన్–లోకల్ కోటాను ఈ ఏడాది నుంచి ఎత్తివేయటంతో ఏపీకి చెందిన విద్యార్థులు సెట్ రాయడం వరకే అర్హులు. వారికి స్థానిక ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్లు కేటాయించరు. అగ్రి, ఫార్మసీ విభాగంలో మొదటి పది ర్యాంకుల్లో 9 ర్యాంకులు బాలురకే దక్కాయి. హైదరాబాద్‌కు చెందిన సాకేత్‌రెడ్డి మొదటి స్థానం పొందారు. రంగారెడ్డి జిల్లాకు చెందిన బ్రాహ్మిణి రెండ్ల ఐదవ ర్యాంకు సాధించారు.

2022 నుంచి 2025 వరకు సెట్ రాసినవారు,అర్హులు

	ఇంజనీరింగ్	అగ్రి, ఫార్మా
2025 పరీక్ష రాసినవారు	2,07,190	81,198
అర్హులు	1,51,779	71,309
అర్హత శాతం	73.26	87.82
2024 పరీక్ష రాసినవారు	2,40,618	91,633
అర్హులు	1,80,424	82,163
అర్హత శాతం	74.98	89.67
2023 పరీక్ష రాసినవారు	1,95,275	1,06,514
అర్హులు	1,56,879	91,935
అర్హత శాతం	80.34	86.31
2022 పరీక్ష రాసినవారు	1,56,860	80,575
అర్హులు	1,26,140	71,180
అర్హత శాతం	80.42	88.34

ఇంజనీరింగ్ టాపర్స్ వీరే (160 మార్కులకు వారు సాధించినవి)

పేరు	జిల్లా	మార్కులు
పల్లా భరత్ చంద్ర	పార్వతీపురం (ఏపీ)	150.058
ఉడగండ్ల రామచరణ్ రెడ్డి	శేర్‌లింగంపల్లి (రంగారెడ్డి జిల్లా)	148.284
పమ్మిన హేమసాయి సూర్య కార్తీక్	విజయనగరం (ఏపీ)	147.085
లక్ష్మీ భార్గవ్ మెండె	నాచారం, హైదరాబాద్	146.150
మంత్రిరెడ్డి వెంకట గణేష్ రాయల్	శేర్‌లింగంపల్లి, హైదరాబాద్	144.053
సుంకర సాయి రిషాంత్ రెడ్డి	శేర్‌లింగంపల్లి, హైదరాబాద్	143.723
రుపిత్ బండారి	మాదాపూర్, హైదరాబాద్	142.579
బానీ భాత్ర మాజీ	బడంగ్‌పేట, రంగారెడ్డి జిల్లా	141.084
కొత్త ధనుష్‌రెడ్డి	హైదరాబాద్	140.246
కొమ్మ సాయి కార్తీక్	మేడ్చల్, హైదరాబాద్	138.257



పల్లా భరత్ చంద్ర, ఉడగండ్ల రామ చరణ్ రెడ్డి, హేమసాయి సూర్య కార్తీక్, లక్ష్మీ భార్గవ్ మెండె, వెంకట గణేష్ రాయల్, సాయి రిషాంత్ రెడ్డి, రుషిత్ బండారి, బానీ భాత్ర మాజీ, కొత్త ధనుష్‌రెడ్డి, కొమ్మ సాయి కార్తీక్



సాకేత్ రెడ్డి పెద్దక్కగారి, సబ్బాని లలిత్ వరేణ్య, చాడా అక్షిత్, రచ్చాల సాయినంద్, బ్రాహ్మిణి రెండ్ల, గుమ్మడిదల తేజేష్, కొలాన్ అఖిరందన్‌రెడ్డి, భానుప్రకాశ్ రెడ్డి సాధు, శామ్యూల్ సాత్విక్, శశికిరణ్‌రెడ్డి ఏ

అగ్రి, ఫార్మసీలో టాపర్స్ వీరే..

పేరు	జిల్లా	మార్కులు
సాకేత్ రెడ్డి పెద్దక్కగారి	మేడ్చల్, హైదరాబాద్	141.688
సబ్బాని లలిత్ వరేణ్య	కరీంనగర్	140.477
చాడా అక్షిత్	వరంగల్	140.000
పెద్దింటి రచ్చాల సాయినంద్	కొత్తకోట, వనపర్తి	138.823
బ్రాహ్మిణి రెండ్ల	మాదాపూర్, హైదరాబాద్	138.710
గుమ్మడిదల తేజేష్	మేడ్చల్, హైదరాబాద్	137.823
కొలాన్ అఖిరందన్‌రెడ్డి	నిజాంపేట, హైదరాబాద్	137.653
భానుప్రకాశ్ రెడ్డి సాధు	సరూర్‌నగర్, హైదరాబాద్	136.702
అర్జ శామ్యూల్ సాత్విక్	రంగారెడ్డి, హైదరాబాద్	136.674
శశికిరణ్‌రెడ్డి ఎ	బాలాపూర్, హైదరాబాద్	136.494

ఇంజనీరింగ్ విభాగంలో అర్హత సాధించినవారు

విభాగం	దరఖాస్తులు	పరీక్ష రాసినవారు	అర్హత పొందినవారు	అర్హత శాతం
బాలికలు	94,109	88,139	65,120	73.88
బాలురు	1,26,217	1,19,051	86,659	72.79
మొత్తం	2,20,326	2,07,190	1,51,779	73.26

అగ్రి, ఫార్మసీ విభాగంలో అర్హత సాధించినవారు

విభాగం	దరఖాస్తు చేసినవారు	హాజరైనవారు	అర్హత సాధించినవారు	అర్హత శాతం
బాలికలు	65,469	61,331	54,166	88.32
బాలురు	21,293	19,867	17,143	86.29
మొత్తం	86,762	81,198	71,309	87.82

ఇంజనీరింగ్ విభాగంలో సామాజికవర్గాల వారీగా అర్హత సాధించినవారు
(ఎస్సీ, ఎస్టీ కేటగిరీకి సున్నా మార్కులు వచ్చినా అర్హత సాధించినట్టే. ఇతర విభాగాలకు 25 శాతం కనీస మార్కులు (40 మార్కులు రావాలి)

	బాలికలు			బాలురు			అర్హత శాతం
క్యాస్ట్	దరఖాస్తులు	హాజరు	అర్హులు	దరఖాస్తులు	హాజరు	అర్హులు	(మొత్తం)
బీసీ–ఎ	7,415	6,934	4,336	9,548	8,982	5,481	61.68
బీసీ–బి	20,873	19,875	13,341	25,937	24,902	16,475	66.59
బీసీ–సి	416	385	247	650	606	407	65.99
బీసీ–డీ	20,194	19,066	12,182	24,902	23,744	14,878	63.21
బీసీ–ఈ	3,765	3,560	2,279	8,849	8,503	5,262	62.51
ఓసీ	24,235	22,348	16,764	32,358	29,854	21,696	73.68
ఎస్సీ	11,636	10,819	10,819	14,316	13,369	13,369	100
ఎస్టీ	5,575	5,152	5,152	9,657	9,091	9,091	100
మొత్తం	94,109	88,139	65,120	1,26,217	1,19,051	86,659	73.26

ఇంజనీరింగ్ ర్యాంకర్లు...

ఐఐటీ బాంబేలో చదవాలని ఉంది

ఐఐటీ బాంబేలో చదవాలని ఉంది. ఎంసెట్‌లో 2వ ర్యాంక్ రావడం చాలా సంతోషంగా ఉంది. తల్లిదండ్రుల ప్రోత్సాహం, అధ్యాపకుల గైడెన్స్‌తో ర్యాంకు సాధించగలిగా.

– ఉడగండ్ల రామచరణ్‌రెడ్డి, 2వ ర్యాంకర్

ఐఐటీ బాంబేలో ఇంజనీరింగ్ చదువుతా

ఐఐటీ బాంబేలో సీటు సాధించడం లక్ష్యం. జేఈఈ మెయిన్‌లో 70వ ర్యాంకు వచ్చింది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే మంచి ర్యాంక్ సాధించగలిగా. ఐఐటీ తర్వాత సివిల్ సర్వీసెస్‌కు సిద్ధం కావాలని ఉంది.

– లక్ష్మీ భార్గవ్, 4వ ర్యాంకర్

సివిల్ సర్వీసెస్ టార్గెట్

సివిల్ సర్వీసెస్ సాధించటం నా లక్ష్యం. ఐఐటీ బాంబేలో కంప్యూటర్ సైన్స్ కోర్సు చేయాలని ఉంది. ఇటీవల జేఈఈ మెయిన్‌లో జనరల్ కేటగిరీ 75వ ర్యాంక్, ఓబీసీలో 10వ ర్యాంక్ సాధించా. ఇంజనీరింగ్ పూర్తి కాగానే సివిల్స్‌కు సిద్ధమవుతా.

– సూర్యకార్తీక్, 3వ ర్యాంకర్

ఐఐటీ బాంబేలో చేరటమే లక్ష్యం

ఐఐటీ బాంబేలో ఇంజనీరింగ్ చదవటమే నా లక్ష్యం. ప్రస్తుతం ఈఏపీ సెట్‌లో 5వ ర్యాంక్ రావటం సంతోషంగా ఉంది. ఈ పరీక్ష కోసం ప్రణాళికాబద్ధంగా చదివాను.

– వెంకటగణేష్ రాయల్, 5వ ర్యాంకర్

భవిష్యత్‌లో సివిల్స్‌కు ప్రిపేరవుతా

ఈఏపీ సెట్‌లో మంచి ర్యాంక్ రావటం సంతోషంగా ఉంది. నా అసలు లక్ష్యం సివిల్స్ సాధించటం. భవిష్యత్‌లో సివిల్స్‌కు ప్రిపేరవుతా. నా సోదరి కూడా సివిల్స్ సాధించింది. ఇటీవల జేఈఈ మెయిన్‌లో ఆలిండియా 31వ ర్యాంక్ సాధించా. ఓబీసీ కేటగిరీలో మూడో ర్యాంకు వచ్చింది. జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు సీరియస్‌గా చదువుతున్నాను.

–రుస్మిత్ బండారి, 7వ ర్యాంకర్

అగ్రికల్చర్, ఫార్మసీ ర్యాంకర్లు....

డాక్టర్‌గా పేద ప్రజలకు సేవ చేయాలని ఉంది

డాక్టర్‌గా పేద ప్రజలు సేవ చేయాలని ఉంది. నీట్‌లో కూడా మంచి ర్యాంక్ ఆశిస్తున్నా. తల్లిదండ్రుల, అధ్యాపకులు, స్నేహితుల ప్రోత్సాహంతోనే టాప్ ర్యాంక్ సాధించగలిగా.

– సాకేత్‌రెడ్డి, 1వ ర్యాంకర్

మెడిసిన్ చదివి ప్రజలకు సేవ చేస్తా

మెడిసిన్ చేసి ప్రజలకు సేవ చేయాలని ఉంది. నీట్‌లో కూడా ర్యాంకు వస్తుందని ఆశిస్తున్నా. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఈఏపీ సెట్‌లో మంచి ర్యాంకు సాధించాను. అధ్యాపకులు కూడా మంచి సలహాలు, సూచనలు ఇచ్చారు.

–బ్రాహ్మిణి రెండ్ల, 5వ ర్యాంకర్,

వైద్యవృత్తి పట్ల నాకు ఆసక్తి

వైద్యవృత్తి పట్ల నాకు ఆసక్తి ఎక్కువ. ఈఏపీ సెట్‌లో మంచి ర్యాంక్ రావడం సంతోషంగా ఉంది. తల్లిదండ్రుల ప్రోత్సాహం, అధ్యాపకుల శిక్షణతో ర్యాంకు సాధించగలిగా. నీట్‌లో కూడా మంచి ర్యాంకు వస్తుందని ఆశిస్తున్నా.

– గుమ్మడిదల తేజస్, 6వ ర్యాంకర్

డాక్టర్ కావాలన్నదే లక్ష్యం

కష్టపడి చదవటం వల్లే మూడో ర్యాంక్ సాధించగలిగాను. సంతోషంగా ఉంది. డాక్టర్ కావాలన్నదే నా లక్ష్యం. ఇంటర్మీడియెట్ బైపీసీలో 992 మార్కులు వచ్చాయి. ఇటీవల 'నీట్' పరీక్ష రాశాను. మంచి మార్కులు వస్తాయని భావిస్తున్నాను. నీట్ ఫలితాలు విడుదలయ్యాక ఎంబీబీఎస్‌లో చేరతాను.

– చాడా అక్షిత్, 3వ ర్యాంకర్

డాక్టర్ కావడం నా కల

డాక్టర్ కావడం నా కల. వైద్య వృత్తిలో చేరి పేద ప్రజలకు సేవ చేస్తా. నీట్‌లో సైతం మంచి ర్యాంక్ వస్తుందని ఆశిస్తున్నా. నా తల్లిదండ్రుల ప్రోత్సాహం, ప్రణాళికాబద్ధంగా చదవడంవల్లే మంచి ర్యాంక్ సాధించగలిగాను.

– కొలను అఖీరానంద్‌రెడ్డి, 7వ ర్యాంకర్

తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉంది

ఈఏపీ సెట్‌లో ర్యాంక్ సాధించడానికి దేవుడి దయ, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో ఉంది. మంచి ర్యాంక్ సాధించడం సంతోషంగా ఉంది. కళాశాల ప్రిన్సిపాల్, డీన్ పూర్తి సహకారం అందించారు.

– అర్జా శామ్యూల్ సాత్విక్, 9 ర్యాంకర్

గొప్ప డాక్టర్‌గా పేరు తెచ్చుకుంటా

ఈఏపీ సెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో 4వ ర్యాంక్ రావడం సంతోషంగా ఉంది. నా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, లెక్చరర్ల ప్రోత్సాహం వల్లే ఇది సాధ్యమైంది. నేను ప్రతి రోజూ 16 గంటలు చదివాను. ఇందులో మంచి ర్యాంక్ వచ్చినప్పటికీ నా దృష్టి మొత్తం నీట్‌పైనే ఉంది. గొప్ప డాక్టర్‌గా పేరు తెచ్చుకోవాలని ఉంది.

– సాయినంద్, 4వ ర్యాంకర్

పేదలకు వైద్య సేవలు అందిస్తా

డాక్టర్‌గా మారి పేదలకు సేవ చేయాలని ఉంది. నీట్‌లో కూడా టాప్ టెన్ ర్యాంక్ ఆశిస్తున్నా. మొదటి నుంచి డాక్టర్ కావాలనేది నా లక్ష్యం. ఆ దిశలోనే పట్టుదలతో చదివా. ఆసక్తి లేకపోయినా కళాశాల అధ్యాపకుల సలహాతోనే టీజీ ఈఏపీసెట్ పరీక్ష రాశాను. నీట్ పరీక్ష అంతకంటే బాగా రాశాను. అధ్యాపకుల బోధన, తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ర్యాంక్ సాధించగలిగాను.

– భానుప్రకాష్‌రెడ్డి, 8వ ర్యాంకర్

డాక్టర్ కావటమే లక్ష్యం

డాక్టర్ కావటమే నా లక్ష్యం. అందుకోసం కష్టపడి చదివాను. దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్ చదివాను. నీట్ కోసం శిక్షణ తీసుకుంటూనే ఈఏపీ సెట్ రాశాను.

– శశికిరణ్, 10వ ర్యాంకర్

బీఎస్సీ అగ్రికల్చర్‌లో నాలుగేళ్ల కోర్సు

- వ్యవసాయ విశ్వవిద్యాలయం, వెస్టర్న్ సిడ్నీ వర్సిటీల సంయుక్త భాగస్వామ్యంతో
- మూడేళ్లు ఇక్కడ... ఏడాది ఆస్ట్రేలియాలో చదువు
- వివరాలు వెల్లడించిన ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీ వీసీ అల్దాస్ జానయ్య

సాక్షి, హైదరాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం–వెస్టర్న్ సిడ్నీ వర్సిటీ కలసి నూతన సంయుక్త వ్యవసాయ విద్యాకోర్సును ప్రారంభించనుంది. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రస్తుతం రెగ్యులర్ విధానంలో బీఎస్సీ (అగ్రికల్చర్), కమ్యూనిటీ సైన్స్, ఫుడ్‌సైన్స్ టెక్నాలజీ, అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కోర్సులు ఉన్న విషయం తెలిసిందే. 2025– 26 విద్యా సంవత్సరం నుంచి ఆస్ట్రేలియాలోని వెస్టర్న్ సిడ్నీ వర్సిటీ (డబ్ల్యూఎస్‌యూ)తో కలసి నాలుగేళ్ల బీఎస్సీ వ్యవసాయ డిగ్రీ కోర్సును ప్రారంభించనుంది. మూడు సంవత్సరాలు ఇక్కడ, ఒక ఏడాది ఆస్ట్రేలియాలో చదవాల్సి ఉంటుంది. ఒకవేళ విద్యార్థులు ఎమ్మెస్సీ చేయాలనుకుంటే మరో ఏడాది వెస్టర్న్ సిడ్నీ వర్సిటీలో చదవాల్సి ఉంటుంది. బీఎస్సీ డిగ్రీ మన దగ్గర నుంచి, ఎంఎస్సీ డిగ్రీ వెస్టర్న్ సిడ్నీ వర్సిటీ నుంచి పొందొచ్చు. ఎవరైనా విద్యార్థులు పీజీ తర్వాత అక్కడే పీహెచ్‌డీ చేయాలనుకుంటే ఎలాంటి ఫీజులు లేకుండా స్కాలర్‌షిప్ సాయంతో కోర్సు పూర్తి చేయొచ్చు. దీనిపై రెండు వర్సిటీల మధ్య ఒప్పందం కుదిరే ప్రక్రియ తుది దశలో ఉందని వ్యవసాయ విశ్వవిద్యాలయ వీసీ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వెస్టర్న్ సిడ్నీ వర్సిటీ అందించే అన్ని వ్యవసాయ కోర్సులకు భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి గుర్తింపు ఉందన్నారు. ఈ మేరకు ఐసీఏఆర్, డబ్ల్యూఎస్‌యూల మధ్య గత సంవత్సరం ఒప్పందం కుదిరిందని జానయ్య చెప్పారు. ఈ ప్రవేశాలకు సంబంధించి త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. కాగా, ఈఏపీసీఈటీ–2025 ఫలితాల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు వీసీ జానయ్య అభినందనలు తెలిపారు. వ్యవసాయ వర్సిటీలో రెగ్యులర్, ప్రత్యేక కోటా సీట్లు పెంచడంతోపాటు ఫీజులు కూడా తగ్గించామని చెప్పారు.

సోదాలు అప్రజాస్వామికం

బ్రిటిష్ పాలనను గుర్తు చేస్తున్న కూటమి సర్కారు

- నచ్చని పత్రికలను అణగదొక్కడం చంద్రబాబుతోనే మొదలైంది
- 'సామ్నా' ఏపీ అధ్యక్షుడు నల్లి ధర్మారావు



శ్రీకాకుళం: బ్రిటిష్ పాలనను కూటమి ప్రభుత్వం గుర్తుకు తెస్తోందని 'సామ్నా' ఏపీ అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావు అన్నారు. సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డి నివాసంలో పోలీసులు సెర్చ్ వారెంట్ లేకుండా తనిఖీలు చేయడాన్ని ఆయన ఖండించారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా పోలీసు బలగంతో సోదాలు చేయించడం కూటమి ప్రభుత్వ అప్రజాస్వామిక విధానానికి పరాకాష్టగా అభివర్ణించారు. ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ ఏమన్నారంటే...

ఇలాంటి ఘటనలు లేవు

పత్రికా సంపాదకులపై దాడులకు శ్రీకారం చుట్టింది బ్రిటిష్ ప్రభుత్వంలోనే. మన దేశంలో ఒక సంపాదకీయం రాసినందుకు గాడిచర్ల హరిసర్వోత్తమరావుపై రాజద్రోహం నేరాన్ని ఆపాదించి జైలు శిక్ష విధించారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత ఇలాంటి ఘటనలు మళ్లీ జరగలేదు. 1975లో ఎమర్జెన్సీ సమయంలో ఆ నాటి ప్రధాన మంత్రి ఇందిరా గాంధీ నిర్బంధాన్ని అమలు చేశారు. అయితే పత్రికల కార్యాలయాలు, సంపాదకుల ఇళ్లపై మాత్రం దాడులు జరిగిన దాఖలాలు లేవు.

నచ్చకపోతే అణగదొక్కుతారా?

నచ్చిన పత్రికలను ప్రోత్సహించడం, నచ్చని పత్రికలను అణగదొక్కడం చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాకే మొదలైంది. పత్రికా రంగాన్ని గుప్పెట్లో ఉంచుకోవడం ద్వారా ప్రజాభిప్రాయాన్ని తనకు అనుకూలంగా మార్చుకోగలమనే భావన సరైనది కాదని వైఎస్ రాజశేఖరరెడ్డి ఘన విజయంతో రుజువైంది. చంద్రబాబు పాలనలో భావప్రకటన స్వేచ్ఛపై మునుపెన్నడూ లేని విధంగా అణచివేతకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.



అధికార బలంతో వేధింపులు

దేశానికి ఒకటే పవిత్ర గంథం. అది రాజ్యాంగం. వ్యవస్థలన్నీ దీనికి లోబడే పనిచేయాలి. కూటమి ప్రభుత్వం అలా పనిచేయడం లేదని ఏపీ హైకోర్టు అనేక కేసుల విచారణ సమయంలో మందలిస్తూ కీలకమైన వ్యాఖ్యలు చేసింది. అయినా కూటమి ప్రభుత్వం వాటిని గౌరవిస్తున్నట్టు కనిపించడం లేదు. మీడియాలో వచ్చిన వార్త, కథనంపై లీగల్‌గా చర్యలు తీసుకోవడానికి చట్టం కొన్ని అవకాశాలు కల్పించింది. వాటిని విస్మరించి నేరుగా అధికార బలంతో క్రిమినల్ కేసులు బనాయించి, వేధించడం ఈ ప్రభుత్వమే ప్రారంభించింది. ఒక ఎడిటర్ ఇంట్లో ముందస్తు సమాచారం ఇవ్వకుండా సోదాలు చేయించడం కూటమి ప్రభుత్వ అప్రజాస్వామిక విధానానికి పరాకాష్ట.

ఏముంటాయి అక్షరాలు తప్ప

ఎడిటర్ ఇంట్లో ఏముంటాయి. అక్షరాలే తప్ప ఆయుధాలు కాదు కదా. అక్షరాలను కూడా ఆయుధాలుగా భావించిన ఒకనాటి బ్రిటిష్ వైఖరి బయటపెట్టుకోవడం తప్ప సాధించిందేమీ లేదు. అణచివేతలతో చరిత్రహీనులుగా మిగిలిపోవడం తప్ప ఏమీ చేయలేరు. మన ప్రజాస్వామ్యం గొప్పది. ప్రజలు సరైన సమయంలో తమ చైతన్యాన్ని ప్రకటిస్తారు. ఐజేయూ, ఏపీయూడబ్ల్యూజే, సామ్నా, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు, ఫొటో జర్నలిస్టు సంఘాలు కలిసి 'సాక్షి' పట్ల కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న నియంతృత్వ ధోరణిలకు వ్యతిరేకంగా గళం వినిపిస్తూనే ఉంటాయి.



“అన్ని పదార్థాలూ మట్టి నుంచే వస్తాయి.
అన్ని పదార్థాలూ మట్టి కావడంతో ముగుస్తాయి.
– జెనోఫనీజ్

సాక్షి
సోమవారం, 12 మే 2025

కొన్ని చేమంతులమ్మా!

‘వాన కురిసినప్పుడే గడెయ్ నువ్వు జడేసేది’ అంటుంది నామిని సుబ్రహ్మణ్యం నాయుడు కథల్లో ఒక పాత్ర మరో పాత్రతో. వాన కురిసినప్పుడు జడ వేయడం ఏమిటి? అనంటే అసలు ఆ పాత్రకు జడేసుకునే టైమే ఉండదన్నమాట. నూనె రాసుకోవడం ఇంకా పెద్దమాట. తైల సంస్కారం లేక కేశ పోషణ పట్టించుకోక చిక్కిరి బిక్కిరి జుట్టుతో బతకడమే పెద్దపనిగా ఉన్న ఆ పాత్ర మీద దయతో వాన కురిస్తే, జుట్టును పూర్తిగా తడిపితే, అప్పుడామె ఇదే అదననుకొని ఆ తడి మీద దువ్వెనతో జడను సవరించుకుంటుంది. బహుశా అప్పుడామె అద్దంలో చూసుకోవచ్చు. ఆ పెదాలకు నవ్వుంటుందని గుర్తు చేసుకోవచ్చు.

చిన్నారి పిల్ల దుర్గ తనకు తానే గొప్ప బంగారు బొమ్మ! ఆ పిల్ల ఒంటి మీద ఏముందని? పట్టు వస్త్రాలా? బంగారు ఆభరణాలా? బొట్టు బిళ్లలా? జడ కుప్పెలా? ముతక వస్త్రాన్ని చుట్టుకుని బుజ్జి తమ్ముణ్ణి వెంటేసుకుని తుంగ పొదల మైదానాల్లో వనకన్యలా తిరుగుతూ ఉంటుంది. కాస్త అలంకరించుకుందామని అనుకుందేమో... పక్కింటిలో పూసలదండ దొంగిలిస్తుంది. ఆ చిన్నాచితక దండకు పెద్ద రాద్ధాంతం. చివరకు దుర్గ ఆ దండ వేసుకోనే వేసుకోదు. వానలో తడిసి జబ్బు చేసి చనిపోతుంది. ఆమెను దాచి పెట్టిన నేల మీద అందమైన గడ్డిపూలు పూసే ఉంటాయి– ‘పథేర్ పాంచాలి’ నవలలో!

యానాదుల ఆడపిల్లలు మన ఆడపిల్లలకు సమానమా? యానాదులు అనేవారు మన లెక్కన మనుషులేనా? నువ్వేమనుకుంటే వాళ్లకేంటోయ్! వాళ్లకూ ఉంటాయి కలలూ కనుకొలకలూ. మూడేళ్ల చిట్టి కుమార్తెను చూసుకుని ఆ యానాది తల్లికి ఎంత మురిపెమో. చింకి పాతల్లో ఉంటేనేం ... బంగారు భరిణె. వైఢూర్యాల రాశి. ఒకరోజు తంగేడుపూలు తెచ్చి కూతురి చెవులకు జూకాలుగా చేస్తుంది. మరోరోజు పచ్చగన్నేరుపూల మాల వేస్తుంది. ఓయమ్మా... ఎంత బాగుందో నా బంగారు కూతురు. వీటికే ఇంత బాగుంటే బంగారు నగ వేస్తే ఇంకెంత బాగుంటుందో! పక్కనే షావుకారు ఇల్లు. అక్కడే మెడలో కంటెతో ఆడుకుంటున్న షావుకారు కూతురు. ఆ పిల్ల మెడలోని కంటె తీసి తన కూతురి మెడలో వేసి ఒక నిమిషం చూసుకుంటుంది. పాపం... యానాది తల్లి. కూతురితో సహా జైల్లో పడుతుంది. దొంగతనం చేసినందుకని జనం అనుకున్నారు. కూతురికి ముస్తాబు చేసినందుకు అని యానాది అనుకుంది. చింతాదీక్షితులు– ‘అభిప్రాయభేదం’ కథలో.

ఉన్నవి పన్నెండు రూపాయలు. చీరేమో ఇరవై రెండు రూపాయలకు తక్కువ రావడం లేదు. ‘కొంచెం... కొంచెమైనా తగ్గదంటారా’.... ‘ఇదేం శుక్రవారం సంత కాదు బేరాలాడ్డానికి’.... ఆ అవమానానికి తండ్రి లోలోపల నెత్తురు కక్కాడు. కూతురు భూమిని చీల్చుకు కూరుకుపోవాలనుకుంది. ఏమడిగిందని... జరీ అంచు తెల్లచీర. ఆరో ఏట నుంచి ఆశ పడుతుంటే పదహారో ఏటకు తండ్రి ఎల్లాగో పన్నెండు రూపాయలు సంపాదించి షాపుకు తీసుకెళితే మెడకు బిగ వేసుకునే రేటు. ‘ఇంతుంటుందని తెలియదమ్మా’... ‘పర్లేదు పోదాం పద నాన్నా’.... ఇప్పుడు కాకపోతే మరోసారి... ఇరవై రెండు రూపాయలు సంపాదించి వెళ్లి కొనుక్కోవాలి... పిచ్చిదానా... అప్పటికా చీర అరవై ఆరు రూపాయలు ఉంటుందే! రావిశాస్త్రి కథ కదూ ఇది.

ఎవరి ముస్తాబులు వారికి ఉంటాయి. అందుకు పాకులాడటమూ ఉంటుంది. చక్కదనం ప్రతి జీవి ప్రాథమిక లక్షణం. చక్కదిద్దుకోవాలనుకోవడం స్వాభావికం. అయితే మనిషికి తప్ప ఇతర జాతుల అంతర్ కొలతల్లో అందమూ, అంద వికారమూ ఉండదు. చిలుకల అందం చిలుకలది. కోయిలల అందం కోయిలలది. అలాగే సిరిగల వారి అందం సిరిగల వారిదైతే సాదాసీదా గడపల్లోని ముగ్గుల, మందారాల అందం వాటిదీనూ! ఏ సింగారమూ లేకపోయినా పెరట్లో కాసిన్ని చేమంతులు పూయకపోవు. ముడిచి మెరవగలరు తళుక్కున.

వారేనా? ఎర్ర ఇటుకలు తల మీద ఉన్నప్పుడు, నల్ల నీటికడవ నడుమున మోస్తున్నప్పుడు, కాలే ఇనుముపై సమ్మెట పోటు వేసే సమయాన గాజులు గలగలలాడుతున్నప్పుడు, నారు గుచ్చుతున్నప్పుడు, పిల్లలు కోరిన చెట్టుకాయను పకపకా నవ్వుతూ దోటీతో రాలుస్తున్నప్పుడు, బాబును స్కూల్లో దింపి ఆఫీసుకు వెళ్లే తొందరలో పౌడర్ రాసుకోనప్పుడు, గట్టిగా అరుస్తున్నప్పుడు, మెత్తగా మాట్లాడుతున్నప్పుడు, ఒక రాత్రి స్నానమాడి ముస్తాబైనపుడు, పురుడుకని పుట్టింటికి చేరినప్పుడు... ఉంటాయి అందమైన సమయాలు ప్రతి ఒక్కరికీ! అందం లేనిదెవ్వరికి?

‘నిను చూసి కోరునేమో ప్రతి కన్నూ... ప్రియా... వారికి నా దృష్టి ఎక్కడ?’ అన్నాడొక కవి. చూపు వేరు. దృష్టి వేరు. సౌందర్య దృష్టిని కనుగొనేవారు ప్రతి సందర్భంలో, ప్రతి సాధారణతలోనూ కనుగొంటారు. గరిక పచ్చ మైదానాలదే రంగైతే... తుపానులు రేగే ఎడారుల బంగారు వర్ణాన్ని ఏమనాలి? ఉన్నది ఉంటుంది. ఉన్నది ఏదైనా అది బాగుంటుంది.

ప్రపంచ అందాల పోటీలు హైదరాబాద్‌లో జరుగుతున్నాయి. వేడుకల కళ వేడుకలది. ఇదే సమయంలో పోషక ఆహారం, తగిన విశ్రాంతి, ఆర్థిక స్వాతంత్ర్యం, మాటకు విలువ, సంపదలో అధికారంలో సమ భాగస్వామ్యం కలిగిన ఆత్మగౌరవ జీవన సౌందర్యం ప్రతి మహిళకూ హక్కుగా ఉండాలని కోరుకోవడం సముచితమే! అది దృష్టి.

శాంతితోనే స్థిరమైన అభివృద్ధి

విశ్లేషణ



సంజయ బారు

ఇరుదేశాల మధ్య చెలరేగిన ఉద్రిక్తతలు కాల్పుల విరమణ ఒప్పందంతో కొంతలో కొంత చల్లబడినప్పటికీ, దక్షిణాసియా అభివృద్ధికి శాశ్వత శాంతి నెలకొనాల్సి ఉంది. దీనికి కావాల్సిన రాజకీయ నాయకత్వ కొరత ఉందన్నది కాదన లేని నిజం.

పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) నుండి ఉత్పన్నమయ్యే సీమాంతర ఉగ్రవాద దాడులపై తాను ఎలా స్పందిస్తాను అనే అంశాన్ని భారతదేశం సరికొత్తగా నిర్వచించింది. సింపుల్‌గా చెప్పాలంటే భారత్ తిరిగి దాడి చేస్తుంది. దీని ప్రకారమే భారత వైమానిక దళం పాకిస్తాన్‌లోని వివిధ లక్ష్యాలను గురి చూసి కొట్టి తన పనిని పూర్తి చేసింది. పహెల్‌గామ్‌లో జరిగిన దారుణమైన, విషాదకరమైన, మత తత్వ ఉగ్రవాద దాడులకు ప్రతిస్పందనగా, భారతదేశం పీఓకేలోని ఉగ్రవాద శిబిరాలను మాత్రమే కాకుండా పాకిస్తాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై కూడా దాడి చేసింది. పాకిస్తాన్‌పై ఒత్తిడి తేవడానికి అవస రమైన వరుస చర్యలను చేపట్టడం ద్వారా భారత్ ముందడుగువేసింది. దీనిపై రాజకీయ పరంగా దేశంలో విస్తృత స్థాయిలో ఐక్యత ఏర్పడింది.

కొత్త యుగానికి నాంది పలకాలి!

అయితే, భారతదేశమైనా, పాకిస్తాన్ అయినా తమను తాము తీవ్రంగా గాయపరచుకోకుండా పూర్తి స్థాయి సైనిక యుద్ధాన్ని చేపట్టలేవని, చేపట్టినా దాన్ని కొనసాగించలేవని అన్ని పక్షాలకూ స్పష్టంగా తెలిసిపోయి ఉండాలి. ఇరుదేశాల మధ్య యుద్ధంలో ఓడిపోయిన వారు వాస్తవానికి– భారత్, పాక్ ప్రజలే! ఒక పక్షాన్ని మరొక పక్షం అనుమానించిన ప్రతిసారీ ఈ రెండు దేశాలూ పరస్పర దాడులకు పాల్పడతాయనే అభిప్రాయం ఇప్పుడు స్థిరపడింది. తన భూభాగంలో జాఫర్ ఎక్స్‌ప్రెస్‌పై జరిగిన దాడిలో 25 మంది మరణించిన విషయాన్ని ప్రస్తావిస్తూ, పహెల్‌గామ్ ఉగ్రవాద దాడికి పాకిస్తాన్ కారణాన్ని వివరించింది. అంతర్జాతీయ సమాజం ప్రతిస్పందనలను పరిశీలిస్తే కొన్ని దేశాలు మాత్రమే ఒక పక్షం కథనాన్ని నమ్మడానికి సిద్ధంగా ఉన్నాయి. సంఘటనలపై భారతీయ కథనానికి ఎక్కువ మంది మద్దతుదారులు ఉన్నప్పటికీ, పాకిస్తాన్ కూడా తనదైన మద్దతుదారులను కూడగట్టింది.

రెండు దేశాల ముందు ఉన్న సవాలు, నిజానికి భారత ఉపఖండం అంతటా ఇప్పుడు ఉన్న సవాలు – గత శతాబ్దంలో ఉనికిలోకి వచ్చిన అనేక దేశాలు కూడా ప్రాంతీయ, దేశీయ శాంతికి, అభివృద్ధికి చెందిన కొత్త యుగానికి నాంది పలికే నాయకత్వాన్ని కనుగొనడమే! విచార కరంగా, దక్షిణాసియాలో అలాంటి రాజకీయ నాయకత్వ కొరత ఉంది. వలసవాదం నుండి విముక్తి పొందినప్పటి నుండి ఈ ప్రాంతం స్వీయ చరిత్ర, భౌగోళిక పరిస్థితులు, గత చరిత్రలతో అంతర్గత పోరాటాల కారణంగా వెనుకబడి ఉంది.

పొరుగు సంబంధాలు కీలకం

దక్షిణాసియా విషాదం ఏమిటంటే, ఈ ప్రాంతంలోని పలు దేశాలలో చాలా మందికి తమ బండిని ప్రపంచంలోని మిగిలిన ప్రాంతాలకు తీసుకెళ్లవచ్చుననీ, పొరుగువారితో సంబంధాలను మెరుగుపర్చుకోకుండానే అభివృద్ధిని కొనసాగించవచ్చుననీ నమ్మకం ఉంది. గత పావు శతాబ్దంలో భారతదేశపు విశ్వసనీయ ఆర్థిక పనితీరు, తన పొరుగువారితో ప్రబలంగా ఉన్న వివాదాలను పరిష్కరించకుండానే ఎదగడాన్ని భారత్ కొనసాగించగలదని చాలా మంది నమ్మేలా చేసింది. కొంతవరకు, అది సాధ్యమైంది. అయితే, భారతదేశం దీర్ఘకాలిక యుద్ధంలోకి లాగబడితే అది కూడా ఆర్థికంగా దెబ్బతింటుంది.



చెలరేగిన ఘర్షణ వాతావరణపు దుమ్ము కాస్తా అణిగి, ‘యుద్ధం పొగమంచు’ నుండి బయటపడిన తర్వాత, రెండు దేశాలలోని రాజకీయ నాయకత్వం ప్రాంతీయ భద్రత అంటే ఏమిటో సుదీర్ఘంగా పరిశీలించాలి. స్థిరమైన ఆర్థిక అభివృద్ధి కోసం ప్రాంతీయ వాతావరణాన్ని తప్పకుండా నిర్వచించాలి. భూభాగం గురించిన నిరంతర వివాదాల ద్వారా ఎవరి ప్రయోజనాలు నెరవేరుతాయి? ప్రతి దేశంలోనూ, ప్రాంతం అంతటా మతపరమైన ప్రాంతీయ విభజనల నుండి ఎవరు ప్రయోజనం పొందుతారు?

సరిహద్దుకు ఇరువైపులా గొప్ప వ్యూహకర్తల జ్ఞానం ఉన్నప్పటికీ, నేడు ఏ పక్షమూ ప్రాంతీయ శాంతి, భద్రత కోసం కొత్త చట్రాన్ని నిర్వచించలేకపోయింది. ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి, ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ నాయకత్వంలో 2000–2007 కాలంలో చివరిసారిగా ఒక ప్రయత్నం జరిగింది. పాకిస్తాన్ అధ్యక్షుడు పర్వేజ్ ముషారఫ్ కొంతకాలం వారి చొరవతో ముందుకు సాగారు. కానీ ఆయన త్వరలోనే పదవీచ్యుతుడయ్యారు. అప్పటి నుండి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆయన ప్రభుత్వం శాంతి భద్రతలకు సంబంధించి ‘మన్మోహన్ – ముషారఫ్’ ఫార్ములాను తిరస్కరించింది.

ఈ రోజు ఆ ఫార్ములా గురించి ప్రస్తావిస్తే ఎగతాళి చేస్తున్నారు. అయినా సరే... దీనిని తప్పక ప్రస్తావించాలి. అమెరికా, చైనా, జర్మనీ తర్వాత భారత ఆర్థిక వ్యవస్థ నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడానికి సిద్ధంగా ఉంది. జపాన్‌ను అధిగమించింది. స్వదేశంలో ఎదుర్కొంటున్న సవాళ్లు, భారత వృద్ధి ప్రక్రియలో లోపాలు ఉన్నప్పటికీ, భారతదేశం అభివృద్ధి చెందడం కొనసాగించడానికీ, ప్రపంచాన్ని అనుకూలమైన నిబంధనలతో నిమగ్నం చేయడానికీ తప్పక అవకాశం ఉంది.

నియంత్రణ రేఖే సరిహద్దు

భారతదేశం తన సొంత పొరుగు ప్రాంతాన్ని సురక్షితం చేసుకోకుండా అలా చేయగలదని భావించడం చాలా మంది సమకాలీన విశ్లేషకులు, వ్యూహకర్తల ఊహ మాత్రమే! భారత్ పొరుగు దేశాలు పాకిస్తాన్, బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక భారతదేశానికి చెప్పడానికి ప్రయత్నిస్తున్నది ఏమిటంటే, వారు భారత్ నుండి ఎటువంటి ప్రయోజనాలనూ పొందకపోతే ఈ వృద్ధి వ్యయాలు పెరుగుతాయి. మోదీ ప్రభుత్వం పాటించిన గత దశాబ్దపు భారత విధానం ఏమిటంటే, కష్టాల్లో ఉన్న పొరుగువారిపై భారీ ఖర్చులను విధించడమే. ఇది స్వల్పకాలిక ప్రయోజనాలను అందించవచ్చు కానీ దాని పర్యవసానాలు భారత్ కూడా ఎదుర్కోవాల్సి ఉంటుంది.

మేము పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను తిరిగి స్వాధీనం చేసుకుంటామని భారత్ ప్రదర్శించే రాజకీయ ధైర్యం, కశ్మీర్‌ను స్వాధీనం చేసుకోవడం గురించిన పాకిస్తాన్ వాక్చాతుర్యానికి చెల్లిపోతుంది. కానీ రెండూ ఎప్పటికీ జరగవు! సిమ్లా ఒప్పందం, లాహోర్ డిక్లరేషన్, మన్మోహన్–ముషారఫ్ ఫార్ములా ముఖ్య ఉద్దేశ్యం అదే! అన్ని ప్రధాన శక్తులు – అమెరికా, రష్యా, చైనా – నియంత్రణ రేఖ వాస్తవానికి అంతర్జాతీయ సరిహద్దు అనే ఆలోచనను సమర్థించాయి. నేడు రెండు దేశాలలోని ప్రముఖులు అలాంటి పరిష్కారాన్ని తిరస్కరిస్తున్నారు. అయితే, క్షేత్రస్థాయిలో వాస్తవికత నుండి తప్పించుకునే అవకాశం లేదనీ, ఈ వాస్తవికత అందరికీ పెనుభారంగా మారవచ్చనీ ఇరువైపులా ఉన్న వాస్తవికవాదులకు తెలుసు.

వ్యాసకర్త సెంటర్ ఫర్ ఎయిర్ పవర్ స్టడీస్ వ్యవస్థాపకుడు, భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మీడియా సలహాదారు

◆ దక్షిణాసియా విషాదం ఏమిటంటే, ఈ ప్రాంతంలోని పలు దేశాలలో చాలా మందికి పొరుగువారితో సంబంధాలను మెరుగుపర్చుకోకుండానే అభివృద్ధిని కొనసాగించవచ్చుననే నమ్మకం ఉంది.

◆ అమెరికా, చైనా, జర్మనీ తర్వాత ఇండియా నాల్గవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడానికి సిద్ధంగా ఉంది. ఇది జపాన్‌ను అధిగమించింది. భారత్ పొరుగు దేశాలు పాకిస్తాన్, బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక చెప్పడానికి ప్రయత్నిస్తున్నది ఏమంటే– వారు భారత్ నుండి ఎటువంటి ప్రయోజనాలనూ పొందకపోతే ఈ వృద్ధి వ్యయాలు పెరుగుతాయి.

సోషల్ మీడియా

ఏం సాధించినట్టు?



నోటిదాకా వచ్చిన విజయాన్ని పోగొట్టుకోవడం సుదీర్ఘ భారత రాజకీయ సంప్రదాయం. 1948 నుంచి ఇదే వరుస. అప్పుడు సైన్యం విజయం దిశగా సాగుతుండగా జమ్ము కశ్మీర్ అంశాన్ని ఇండియా ఐక్యరాజ్యసమితికి నివేదించింది. 2025లో కూడా ఏ స్పష్టమైన లక్ష్యాలనూ సాధించకుండానే ‘ఆపరేషన్ సిందూర్’ ఆగింది.

– బ్రహ్మ చెల్లానీ, వ్యూహాత్మక అంశాల నిపుణుడు

దేనికోసం?



అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) నుంచి పాకిస్తాన్‌కు 2.3 బిలియన్ డాలర్లా? ఒసామా బిన్ లాడెన్‌కు ఆశ్రయం ఇచ్చే, ఉగ్రవాదులకు శిక్షణ ఇచ్చే, ఇండియాలో దాడులకు నిధులను కూర్చే, అఫ్గానిస్తాన్‌ను అస్థిరపర్చే, పష్తూన్, బెలోచ్ గొంతులను అణిచివేసే ప్రభుత్వానికా?

– మరియమ్ సోలైమంఖిల్, అఫ్గాన్ బహిష్కృత నేత

సెల్యూట్



జమ్ము, కశ్మీర్, పంజాబ్, రాజస్థాన్‌లలోని అన్ని సరిహద్దు గ్రామాల పౌరులకు దేశం సెల్యూట్ చేయాల్సి ఉంది. దురాక్రమణదారులు, శత్రువుల దాడులను వాళ్లు శతాబ్దాలుగా భరించారు. పైగా దాన్ని గర్వంగా, ధైర్యంగా చేశారు.

– మానిక్ ఎం. జాలీ, ఆర్మీ మేజర్ (రిటైర్డ్)

ఎందుకు?



యుద్ధాన్ని వ్యతిరేకించే ముఖాలన్నీ ఉగ్రవాద వ్యతిరేక చర్యలను వ్యతిరేకిస్తాయి. ఉగ్రవాదాన్ని కాదు.

– బోష్ ఫాస్టిన్, కార్టూనిస్ట్

సాధనం

గుర్తు చేసుకోవాల్సింది: అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) అనేది ప్రపంచ పెట్టుబడీదారీ విధానాలను అమలుజరపడం కోసం ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాదానికి నిధులు సమకూర్చే సామ్రాజ్యవాద సాధనం.

– సిద్ధార్థ్, విశ్లేషకుడు

ఇన్ బాక్స్

అవిశ్రాంత యోధుడు

కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ నిస్వార్థ ప్రజా నాయకుడు. ఈ తరానికి తెలియవలసిన గొప్ప త్యాగధనుడు. 1926 మే 12న నేటి సూర్యాపేట జిల్లా ఆత్మకూరు (ఎస్) మండలం ఏపూరి గ్రామంలో జన్మించారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమించిన ‘ఆంధ్ర మహాసభ’లో 15 ఏండ్ల ఓంకార్ వాలంటీర్‌గా చేరారు. ఆ తరువాత తుపాకి చేతపట్టి మహత్తర వీరతెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నిజాం సైనికులతోనూ, యూనియన్ సైన్యంతోనూ తలపడి పోరాడారు. సాయుధ పోరాట విరమణ తర్వాత వరంగల్ జిల్లాను ఉద్యమ కేంద్రంగా మలుచుకొని కౌలుదారు చట్టం అమలు కోసం, భూస్వాముల ఆగడాలకు వ్యతిరేకంగా మలిదశ భూ పోరాటాలను నిర్మిస్తూ ఒక లక్ష 67 వేల ఎకరాల ప్రభుత్వ, భూస్వామ్య భూములను పేద ప్రజలకు సాధించి పెట్టారు. ఈ పోరాటాల ఫలితంగా 1972లో నర్సంపేట నియోజకవర్గ ప్రజలు నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభకు అఖండ విజయంతో గెలిపించి పంపించారు. 1972 నుంచి 83 వరకు మూడుసార్లు సీపీఎం నుంచి, 1985 నుంచి 1994 వరకు రెండుసార్లు ఎంసీపీఐ (యూ) నుంచి నర్సంపేట ప్రజలు గెలిపించారు. ప్రజల కోసమే జీవితాన్ని అంకితం చేసిన ఓంకార్‌పై ఐదుసార్లు హత్యాప్రయత్నాలు జరిగాయి. 2008 అక్టోబర్ 17వ తేదీన అమరత్వం పొందే వరకు ఆయన శరీరంలో ఒక బుల్లెట్ అలాగే ఉండి పోయింది.



కామ్రేడ్ ఓంకార్

మార్క్సిస్టు సైద్ధాంతిక రాజకీయ నిబద్ధతతో ఉన్న ఓంకార్... ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ, ఆ తరువాత సీపీఎంలో కీలక బాధ్యతలు నిర్వహించారు. సిద్ధాంత విధానాలను ఎత్తిచూపిన ఓంకార్‌ను సీపీఎం బహిష్కరించడంతో 1984 ఫిబ్రవరి 18న ఎంసీపీని స్థాపించారు. 6 నెలల్లో దేశవ్యాప్తంగా వచ్చిన సంబంధాలతో ఎంసీపీఐగా దాన్ని మార్చారు. 1964 కమ్యూనిస్ట్ పార్టీ కార్యక్రమాన్ని అంగీకరించే పార్టీలను ఏకం చేసి 2006లో ఎంసీపీఐ(యూ)గా ఏర్పరిచారు. దేశ పరిస్థితులకు అనువైన వర్గసామాజిక జమిలి పోరాటాలు బలపడాలని ఆశించారు. వర్గ రహిత సమాజం కోసం అహర్నిశలు పోరాడిన అమరజీవి ఓంకార్ జన్మించి వందేళ్లు. ఈ సందర్భంగా 2025 మే 12 నుండి 2026 మే 12 వరకు అనేక ప్రజాచైతన్య కార్యక్రమాలతో పాటు, ఆయన గురించి ఈనాటి తరానికి తెలియజేసే కార్యక్రమాలకు ఎంసీపీఐ (యూ) తెలంగాణ రాష్ట్ర కమిటీ పూనుకుంది. ఈ కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనడానికి ఇదే మా ఆహ్వానం!

– వనం సుధాకర్, ఎంసీపీఐ (యూ) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు (నేడు కామ్రేడ్ ఓంకార్ శత జయంతి ప్రారంభం)

ఇప్పటికైనా బౌద్ధాన్ని అర్థం చేసుకున్నామా?

సందర్భం



ప్రొ॥ చల్లపల్లి స్వరూపరాణి

‘నా దృక్పథం రాజకీయాల నుంచి కాక మత సంస్కృతి నుంచి అలవడింది.’’

– డా॥ బీఆర్ అంబేడ్కర్

హేతువుకు ప్రాధాన్యమిచ్చి స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే భావనలను ముందుకు తీసుకొచ్చిన బౌద్ధం ప్రాచీన భారతదేశంలోనే కాకుండా ఆధునిక కాలంలో కూడా ఎంతో ప్రాసంగికతను కలిగివుంది. గౌతమబుద్ధుడు భారతదేశపు మొట్టమొదటి సామాజిక విప్లవకారుడు. ఆయన తన కాలం నాటికి అమలులో ఉన్న సాంఘిక దుర్నీతినీ; మతం పేరున జరుగుతున్న హింసాకాండ, అమానవీయతనూ ప్రశ్నించాడు. హేతువు పునాదిగా ప్రజాస్వామిక సంస్కృతిని నెలకొల్పడానికి ప్రయత్నం చేశాడు.

బుద్ధుడు క్రీస్తుపూర్వం ఆరవ శతాబ్దికి చెందిన వాడైనప్పటికీ ఆయన బోధించిన సమానత్వ భావన, హేతువాద దృక్పథం, ప్రజాస్వామికతత్త్వం ఈనాటికీ ఎంతో ప్రాసంగికతను సంతరించుకున్నాయి. ఆయన ముందుకు తీసుకువచ్చిన ‘అనాత్మవాదం’, ‘అనిత్యత’, ‘ప్రతీత్య సముత్పాద’ వంటి భావనలు బౌద్ధాన్ని ఇతర మతాల కంటే భిన్నంగా నిలబెట్టాయనవచ్చు. ఈ భావనలు బౌద్ధాన్ని ఒక మతం అనే స్థాయి నుంచి గొప్ప ప్రాపంచిక దృక్పథాన్నిచ్చే తాత్విక స్థాయికి తీసుకెళ్ళాయనవచ్చు. బుద్ధుడి బోధనలలో ముఖ్యమైన ‘అష్టాంగ మార్గం’ మనుషుల వ్యక్తిత్వ వికాసానికి దోహదంజేసే అత్యున్నత మార్గం. సమత, కరుణ, ప్రజ్ఞ, మైత్రి, శీలం అనేవి బుద్ధుని తాత్వికతలోని ప్రధాన అంశాలు. అలాగే బుద్ధుడు వైదిక మతంలో భాగం అని వాదించడం బుద్ధుణ్ణి బ్రాహ్మణవాదంలో జీర్ణం చేసుకోవాలనే ప్రయత్నం చెయ్యడమే! అటువంటి ఆకాంక్షల ఫలితమే పురాణాల కాలానికి బుద్ధుడిని విష్ణుమూర్తి దశావతారాలలో ఒక అవతారంగా మార్చడమని తెలుస్తోంది.

విద్య, విజ్ఞానం, ఆధునిక భావాల పరంగా ఎంతో ముందంజ వేశామని భావిస్తున్న ఇరవై ఒకటో శతాబ్దంలో కూడా మతమౌఢ్యం పెచ్చరిల్లిపోతోంది. బౌద్ధం రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అంశాల పరంగా విస్తృతమైన పరిధి కలిగిన తత్త్వం కాబట్టి సమకాలీన సామాజిక, సాంస్కృతిక వైరుద్ధ్యాలకు బౌద్ధంలో పరిష్కారమార్గాలు వెదకవచ్చు. పండిత అయోతీదాస్, ప్రొఫెసర్ లక్ష్మీ నరసు, డా॥ అంబేడ్కర్ బౌద్ధాన్ని సామాజిక విముక్తి సిద్ధాంతంగా ప్రతిపాదించారు. అంబేడ్కర్ బౌద్ధాన్ని స్వీకరించడాన్ని హిందూమతంలో అంటరానివారనే దళితుల సామాజిక స్థాయిని తిరస్కరించడంగా భావించాడు.

ఈనాడు ప్రపంచ వ్యాప్తంగా లౌకికవాదులు, హేతువాదులు, శాస్త్రవేత్తలు అయిన మేధావులు తాము బౌద్ధాభిమానులమని చెప్పుకోవడానికి గర్విస్తున్నారు. ఎడ్విన్ ఆర్నాల్డ్ అన్నట్లు బుద్ధుడు ‘ఆసియా జ్యోతి’ మాత్రమే కాదు ఆయన బోధనల ప్రాసంగికత పెరిగేకొద్దీ బుద్ధుడు ‘ప్రపంచ జ్యోతి’గా పరిణామం చెందుతున్నాడు.



అయితే బుద్ధుడిని సమాజం కేవలం అహింసామూర్తిగా, చెట్టు కింద కూర్చుని తపస్సు చేసుకున్న సన్యాసిగా, లేకపోతే శాకాహారిగా మాత్రమే అర్థం చేసుకున్నట్లు అనిపిస్తుంది. బుద్ధుడు అహింసావాది అన్నమాట నిజమే... కానీ శాంతిని, న్యాయాన్ని స్థాపించడం కోసం యుద్ధం చెయ్యడంలో తప్పు లేదంటాడు. ఆయన కేవలం ధ్యానం మాత్రమే చెయ్యక ప్రాపంచిక విషయాలపై వివిధ వ్యక్తులతో చర్చించి సత్యాన్ని నిర్ధారించుకున్నాడు. చాలామంది భావించినట్లు బుద్ధుడు శాకాహారి కాడు. అలాగే ఆయన శాకాహారాన్ని కీర్తించలేదు. క్రతువులలో జంతు వధను ఖండించి, పండితుల భాషగా ఉన్న సంస్కృతం స్థానంలో ప్రజల భాష అయిన ‘పాళీ’ని ప్రతిపాదించి వైదిక సంస్కృతికి ప్రత్యామ్నాయ సంస్కృతిని ప్రవేశ పెట్టాడు. నిజానికి బౌద్ధం సంధించిన విమర్శల ఫలితంగానే తర్వాత కాలంలో హిందూమతం తనను తాను సంస్కరించుకుని అహింసనూ, శాకాహారాన్నీ ఆదర్శాలుగా స్వీకరించింది. బౌద్ధ భిక్షువులు సామాజిక కార్యకర్తల వలే బహుజన హితం, బహుజన సుఖం కోసం పనిచెయ్యాలని బుద్ధుడు సూచించాడు.

బౌద్ధసంఘంలో రాజుల నుంచి, బానిసల వరకు అందరికీ సమాన హోదాను కల్పించాడు. బౌద్ధసంఘంలో ‘ఉపాలి’ అనే మంగలి కులస్థుడు, ‘జీవకుడు’ అనే వేశ్యాపుత్రుడు, ‘ఆమ్రపాలి’ అనే వేశ్య, రాజవంశీకులైన ‘ప్రసేనజిత్’, రాకుమార్తె ‘విశాఖ’; భర్త, బిడ్డల చేత, సమాజం చేత నిర్లక్ష్యానికి గురైన స్త్రీలు... సమానమైన గుర్తింపును పొందారు. భిన్న సామాజిక వర్గాల మధ్య బుద్ధుడు సామరస్యాన్ని కుదిర్చాడు. ‘విధికుడు’ అనే చర్మకారుడు అమరావతి క్షేత్రానికి కానుకగా ఇచ్చిన పూర్ణకుంభం బౌద్ధంలోని సమతకు చిహ్నంగా మిగిలింది. బౌద్ధంలో దేవుడి స్థానాన్ని నైతికత ఆక్రమిస్తుంది. ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త గెయిల్ ఆంవెత్ బౌద్ధం అధికారిక మతంగా ఉన్న ప్రాచీన భారత సంస్కృతిని ‘బుద్ధిస్ట్ సివిలైజేషన్’గా పేర్కొన్నారు. ‘భారతీయ ఆత్మను కలిగి ఉన్న బౌద్ధాన్ని దేశం నుంచి వెళ్లగొట్టి భారతదేశం ఆత్మహత్య చేసుకుంద’ని గురజాడ అనడంలో అతిశయోక్తి లేదు. బౌద్ధం అనే గొడుగు కింద ప్రజల్లో సమైక్య భావన ఏర్పడే అవకాశం ఉంది.

వ్యాసకర్త ఆచార్య నాగార్జున యూనివర్సిటీ బుద్ధిస్ట్ స్టడీస్ శాఖలో సీనియర్ ప్రొఫెసర్ (నేడు బుద్ధ పూర్ణిమ)

ఎప్పటికీ ప్రజలతోనే...

మే 12, 2025న ‘అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య’ (ఏసీఎఫ్) 50 వసంతాల పరిపూర్తి స్ఫూర్తి సభలు హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతాయి. ఇందులో ‘అరుణోదయం’ సావనీర్ ఆవిష్కృతమవుతుంది.



1974 మే 12న ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాలలో అమరులు కామ్రేడ్ జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ చొరవతో ఏసీఎఫ్ ఏర్పడింది. ఏసీఎఫ్ చరిత్రను అంతా అవలోకనం చేసుకోవడానికి ఇంతకు మించిన తరుణం మరొకటి ఉండదు. కామ్రేడ్ జంపాల చంద్రశేఖర ప్రసాద్ ఎమర్జెన్సీలో హత్యగావించబడగానే... ఎమర్జెన్సీ డిటెన్యూగా ఉన్న విప్లవ కవి వై.కాశీపతి జైల్లోనే ‘ఉయ్యాలో /జంపాల/ఈ దోపిడీ కూల దొయ్యాల’ అనీ... ‘నీ బార సాల జరిపేము/చెరసాలలో మేము’ అనీ పాటలు రాశారు. అలాగే ‘అరుణోదయం – ఉషోదయం – నూతన క్రాంతి యుగోదయం’ అంటూ అరుణోదయ బ్యానరు గీతం రచించారు. అరుణోదయ కళాకారులు వీటిని ఆలపించారు. అప్పటి నుంచి ప్రజా కవుల, ప్రజా ఉద్యమకారుల త్యాగాలన్నీ కీర్తిస్తూ పాడుతోంది ఏసీఎఫ్.

పాత సాంప్రదాయిక కళారూపాలలోని వస్తువు సారాన్ని మార్చుకొంటూ కొత్త సారంతో తెలంగాణ సాయుధ పోరాటం నుండి నేటి వరకు డజన్ల కొలది కళారూపాలను అరుణోదయ అందిపుచ్చుకుంది. శ్రీకాకుళం, గోదావరి లోయ, కరీంనగర్ లాంటి సాయుధ రైతాంగ పోరాటాలను గానం చేసింది. సింగరేణి, బీడీ కార్మికుల లాంటి శ్రమజీవుల సమస్యలపై కళారూపాలు రూపొందించింది. ఆదివాసుల స్వయంపాలనను ఎలుగెత్తి పాడింది. స్త్రీ విముక్తిని చాటింది. మైనార్టీల ఆత్మరక్షణా హక్కులను లేవనెత్తింది. పీడిత కులాల సమస్యలను, వర్గ–కుల పోరాటాల ఆవశ్యకతను గానం చేసింది. తెలంగాణ, రాయలసీమ, ఉత్తరాంధ్ర అనే తేడా లేకుండా ప్రజల ఆకాంక్షలను ఎలుగెత్తింది. అందుకే అరుణోదయ ఒక సంస్థగా కంటే ఒక సాంస్కృతికోద్యమంగానే ప్రజల్లో శ్వాసిస్తూ ఉంది.

– అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఏపీ, తెలంగాణ రాష్ట్రాల కార్యవర్గాలు (నేడు అరుణోదయ 50 వసంతాల పరిపూర్తి స్ఫూర్తి సభ)

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** పౌర్ణమి రా.9.03 వరకు, తదుపరి బహుళ పాడ్యమి, **నక్షత్రం:** విశాఖ పూర్తి (24 గంటలు), **వర్జ్యం:** ప.11.40 నుండి 1.26 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.21 నుండి 1.13 వరకు, తదుపరి ప.2.56 నుండి 3.48 వరకు **అమృతఘడియలు:** రా.10.16 నుండి 12.03 వరకు, మహా వైశాఖ, బుద్ధపూర్ణిమ; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.33, **సూర్యాస్తమయం:** 6.18.

నల్లి కుట్ల రాజకీయాలు మానుకో ఈటలా

- జగ్గారెడ్డి హెచ్చరిక



సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్ రెడ్డిని, కాంగ్రెస్ పార్టీని ఉద్దేశించి మల్కాజిగిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ఇంకోసారి వ్యాఖ్యలు చేస్తే.. నడిరోడ్డులో బట్టలు విప్పి గుంజీలు తీయించడం ఖాయమని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి హెచ్చరించారు. జగ్గారెడ్డి ఆదివారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. రాజేందర్ ఇప్పటికైనా నల్లి కుట్ల రాజకీయాలు మానుకోవాలన్నారు. ఆయన హద్దు దాటి మాట్లాడటం వల్లే తాను హద్దులు దాటి మాట్లాడుతున్నానని స్పష్టం చేశారు. నియోజకవర్గ ప్రజల సమస్యలపై ఒక్కరోజైనా రాజేందర్.. సీఎంను కలిశారా? అని ప్రశ్నించారు. బీజేపీలో కోరుకున్న పదవులు రాకపోయేసరికి.. గంజాయి తాగినవాడిలా, సైకోలా ఈటల మారిపోయారని ఎద్దేవా చేశారు. పార్లమెంటరీ భాషలో ప్రశ్నిస్తే.. అదే భాషలో సమాధానం ఇస్తానన్నారు. బూతులు మాట్లాడితే.. బూతులతోనే సమాధానమిస్తానన్నారు. పదవి రాలేదన్న ఉక్రోషంతో మాట్లాడుతున్నారేమోనని.. సీఎం రేవంత్‌రెడ్డి జాలితో వదిలేసినా.. తాము వదిలేయమని హెచ్చరించారు. 'నువ్వు అడవిలో తుపాకులు పట్టిన అనుకుంటున్నవేమో.. మేం జనంలోనే తుపాకులు పట్టిన వాళ్లం.. నీకు అంత సీన్ లేదు.. నువ్వు ఫోకస్ కావాలనుకుంటే ఇంకో పార్టీని ఎంచుకో. కాంగ్రెస్ జోలికి వస్తే. ఊడ తీసుడే..'అని జగ్గారెడ్డి హెచ్చరించారు.

'సీతారామ' 90 శాతం పూర్తి చేశాం

▶ మొదటి పేజీ తరువాయి

నీటిని వినియోగించుకోవచ్చు.ఇంత స్పష్టంగా సెంట్రల్ వాటర్ కమిషన్, హైడ్రాలజీ అనుమతులు ఉన్న సీతారామ ప్రాజెక్టుకు నీటి కేటాయింపులు జరగలేదని, ప్రాజెక్టుకు అనుమతులు లేవని మాట్లాడడం.. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అబద్ధపు ప్రచారాలకు పరాకాష్ట..' అని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ ఘనతను వారిదిగా చెప్పుకుంటున్నారు..

'సొంత రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టేది కాంగ్రెస్ నేతలే. కృష్ణా జలాల్లో రాష్ట్రానికి కేటాయించిన వాటాను పూర్తిగా వినియోగించుకోలేని స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. ఏడాదిన్నరగా ఒక్క ఎకరాకు అదనపు నీరివ్వకుండా బీఆర్ఎస్ ఘనతను తనదిగా చెప్పుకుంటోంది. ఖమ్మం జిల్లా రైతాంగాన్ని ఆదుకోవడానికే సీతారామ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించాం. రాజీవ్, ఇందిరా సాగర్ ప్రాజెక్టుల కింద 3.33 లక్షల ఎకరాల ప్రతిపాదిత ఆయకట్టుతో పాటు, అదనంగా మరో 3.41 లక్షల ఎకరాలకు సాగునీరందించి, నిల్వ సామర్థ్యాన్ని 1.2 టీఎంసీల నుంచి 10 టీఎంసీలకు పెంచి రూ.7,967 కోట్లతో పనులు ప్రారంభించడం జరిగింది..'అని మాజీమంత్రి తెలిపారు.

అనుమతుల్లేవనడం అవగాహన రాహిత్యం

'సీతారామ ప్రాజెక్టు కింద 90 శాతం పనులు పూర్తి చేసినా.. ఇప్పుడు అనుమతులు లేవంటూ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించడం ఆయన అవగాహన రాహిత్యమే. టీఏసీ తప్ప అన్ని అనుమతులు వచ్చాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టు దగ్గర ఫొటోలకు పోజులిచ్చి, అదే ప్రాజెక్టుపై విమర్శలు చేయడం సిగ్గుచేటు. మీ పాలనలో ఎడారిగా మారిన తెలంగాణ నేలను మా పాలనలో సస్యశ్యామలం చేశాం. ప్రతి అంశంలో బీఆర్ఎస్ పాలనపై దుమ్మెత్తి పోయడం కాకుండా మిగిలిన ప్రాజెక్టు పనులను ఇప్పటికైనా చిత్తశుద్ధితో పూర్తి చేయాలని మంత్రి ఉత్తమ్‌ను కోరుతున్నా..'అని హరీశ్‌రావు తన ప్రకటనలో పేర్కొన్నారు.

మన భాషలోనే.. ఆటాడుకుందాం

- దేశీయ భాషల్లో మొబైల్ గేమ్స్
- దేశంలో 55 కోట్ల గేమర్స్
- తెలుగు సహా స్థానిక భాషల్లో ఆడేస్తున్నారు
- 2024లో వీడియో గేమ్స్‌కి పెరిగిన క్రేజ్
- భారత్‌లో 5,729 కోట్ల గంటల కాలక్షేపం
- ప్రపంచ వ్యాప్తంగా డెవలపర్లకు లాభాలు
- మొత్తం రూ.6,95,360 కోట్ల ఆదాయం
- భారీగా ఖర్చు చేస్తున్న యాపిల్ యూజర్స్



వీడియో గేమ్స్... పిల్లల దగ్గరి నుంచీ యువత వరకూ వీటి క్రేజ్ చెప్పనక్కర్లేదు. ఆట మొదలుపెట్టారంటే సమయమే తెలీదు. ప్రపంచవ్యాప్తంగా గత ఏడాది గేమర్స్ ఏకంగా 39,000 కోట్ల గంటలు మొబైల్‌లో గడిపారంటే అతిశయోక్తి కాదు. మొబైల్ గేమ్స్ క్రేజ్ అంతలా విస్తరించింది. 2024లో ప్రపంచ వ్యాప్తంగా సగటున నిమిషానికి 94,000 డౌన్‌లోడ్స్ జరిగాయి. మనదేశం కూడా ఇందుకు ఏమీ తీసిపోలేదు. గత ఏడాది కొత్తగా 821 కోట్ల డౌన్‌లోడ్స్ అయ్యాయి. 5,729 కోట్ల గంటలపాటు మొబైల్ గేమ్స్ ఆడారు. యూజర్ల సంఖ్యను పెంచుకోవడానికి డెవలపర్లు హిందీ సహా తెలుగు, తమిళం వంటి స్థానిక భాషల్లో గేమ్స్‌ను పరిచయం చేస్తుండడం జోష్‌ను పెంచుతోంది.

భారీగా యాడ్స్

మొబైల్ గేమ్స్‌లో భాగంగా ప్రపంచవ్యాప్తంగా 2024లో 5,04,576 కోట్ల యాడ్స్ యూజర్ల స్క్రీన్‌పై దర్శనమిచ్చాయి. దీనిని బట్టి.. ఈ గేమ్స్‌కి ఎంత ఆదరణ ఉందో, వివిధ బ్రాండ్ల మార్కెటింగ్ వ్యూహం ఏ స్థాయికి చేరిందో అర్థం చేసుకోవచ్చు. ఇక ప్రపంచవ్యాప్తంగా 2023తో పోలిస్తే 2024లో గేమర్స్ 12% అధికంగా 3.5 లక్షల కోట్ల సెషన్స్ పూర్తి చేశారు. గేమ్స్‌లో మరిన్ని ఫీచర్లు, దశలు, ప్రీమియం కంటెంట్ కోసం యూజర్లు వెచ్చించిన (ఇన్‌యాప్ పర్చేజ్) మొత్తం రూ.6,95,360 కోట్లు. ఇలా డెవలపర్లు అందుకున్న ఆదాయం 2024లో 3.8% పెరిగింది.

డౌన్‌లోడ్స్ ఇలా..

మార్కెట్	డౌన్‌లోడ్స్ (కోట్లలో)	ఇన్‌యాప్ రెవెన్యూ (రూ.కోట్లలో)	వెచ్చించిన సమయం (కోట్ల గంటల్లో)
ప్రపంచ వ్యాప్తంగా	4,940	6,95,360	39,000
భారత్	821	3,440	5,729

స్థానిక భాషల్లో 70%

భారత్‌లో సుమారు 55 కోట్ల మంది గేమింగ్ యూజర్లు ఉన్నారు. వీరిలో 70% మంది స్థానిక భాషల్లో గేమ్స్‌ను ఇష్టపడుతున్నారు. కంపెనీలు ఇందుకు తగ్గట్టుగా ప్రాంతీయ భాషల్లో గేమ్స్‌ను అందుబాటులోకి తెచ్చాయి. 2024లో భారత్‌లో టాప్–10లో స్థానం సంపాదించిన మొబైల్ గేమ్స్‌లో చాలావరకు హిందీ సహా దేశీయ భాషల్లో ఆడుకునే సౌలభ్యం ఉంది.

'లుడో కింగ్' గేమ్‌ని ప్రస్తుతం తెలుగు, హిందీ, గుజరాతీ, కన్నడ, మరాఠీ, బెంగాలీ, తమిళం, మలయాళంలో ఆడుకునే అవకాశం ఉంది. 'ఫ్రీ ఫైర్ మ్యాక్స్' బెంగాలీ, హిందీ, ఉర్దూలో ఆడేయొచ్చు. క్యాండీ క్రష్ సాగా బెంగాలీ, హిందీ, ఉర్దూలోనూ అందుబాటులో ఉంది.

తెలుగు సహా హిందీ, తమిళం, కన్నడ, ఒడియా, బెంగాలీ వంటి స్థానిక భాషల్లో గేమ్స్‌ను తేవడం వల్ల యూజర్లు కొనసాగడంతో పాటు, సంతృప్తి చెందుతారన్నది కంపెనీల మాట. దేశీయంగా విజయవంతం కావాలంటే ఈ విధానం తప్పదని చెబుతున్నాయి.

సింహభాగం యాపిల్ యూజర్స్

మొత్తం డౌన్‌లోడ్స్‌లో ఆండ్రాయిడ్ ఫోన్స్ ద్వారా 4,120 కోట్లు, మిగిలినవి యాపిల్ ఫోన్స్ ద్వారా జరిగాయి. అయితే ఇన్‌యాప్ పర్చేజ్ ద్వారా యాపిల్ యూజర్లు అత్యధికంగా రూ.4,51,136 కోట్లు ఖర్చు చేయడం విశేషం. డౌన్‌లోడ్స్, డెవలపర్లకు ఆదాయం పరంగా యూఎస్ఏ టాప్‌లో ఉంది. రూ.8,480 కోట్లకుపైగా ఆదాయం ఆర్జించిన యాప్స్ పదేళ్ల క్రితం 2 ఉంటే.. గత ఏడాది వీటి సంఖ్య 11కు దూసుకెళ్లింది. ఇక భారత్‌లో డౌన్‌లోడ్స్‌లో సిమ్యులేషన్, ఆర్కేడ్, పజిల్, టేబుల్ టాప్, యాక్షన్ విభాగాలు టాప్–5లో నిలిచాయి. డౌన్‌లోడ్స్‌లో ఇండియన్ వెహికల్స్ సిమ్యులేటర్ 3డీ, ఇన్‌యాప్ పర్చేజ్‌లో ఫ్రీ ఫైర్ గేమ్ తొలి స్థానంలో ఉన్నాయి.

గేమింగ్ హైలైట్స్

- భారత్‌లో సులభంగా ఆడగలిగే వీడియో గేమ్స్ (హైపర్ క్యాజువల్) 2,000 కోట్ల డౌన్‌లోడ్స్ నమోదయ్యాయి.
- ప్రతి సెకనుకు 1,60,000 యాడ్స్ ప్రత్యక్షమయ్యాయి.
- గేమ్స్‌కు వెచ్చించిన సమయం గత ఏడాది 7.9% పెరిగింది.
- 2020లో కరోనా మహమ్మారి కాలంలో ఏకంగా 5,760 కోట్ల డౌన్‌లోడ్స్ జరిగాయి.
- డెవలపర్లు అత్యధికంగా 2021లో రూ.7,41,152 కోట్లు ఆర్జించారు.

– సాక్షి, స్పెషల్ డెస్క్

పైసలుంటేనే పనులివ్వండి

- చేసిన పనులకు ఏళ్ల తరబడి బిల్లులు రాక కష్టాల్లో కాంట్రాక్టర్లు
- ముఖ్యమంత్రికి బిల్డర్స్ అసోసియేషన్ బహిరంగ లేఖ

సాక్షి, హైదరాబాద్: ఆర్థిక వెసులుబాటు మేరకు ప్రభుత్వం కాంట్రాక్టర్లకు పనులు అప్పగించాలని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ శాఖ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేసింది. ఆర్థిక అంచనాలకు మించి పనులివ్వడం వల్ల, ఆ తరువాత ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు ఆర్థికంగా చితికిపోతున్నారని ఆదివారం రాసిన బహిరంగ లేఖలో పేర్కొంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి సీఎం ఇటీవల వెల్లడించిన అంశాలతో ఏకీభవిస్తున్నామని తెలిపింది. ప్రస్తుతం ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులకు బిల్లుల చెల్లించాలంటే ఆరేడు సంవత్సరాలు పడుతుందని పేర్కొంది. బిల్లులు రాక అప్పుల వాళ్ల ఒత్తిళ్లు తట్టుకోలేక చిన్నతనంలోనే కాంట్రాక్టర్లు గుండెపోటుతో మరణిస్తున్నారని బిల్డర్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు డీవీఎన్ రెడ్డి, రాష్ట్ర శాఖ అధ్యక్షుడు సురేందర్ ఆవేదన వ్యక్తంచేశారు. ఇటీవల గుండెపోటుతో మరణించిన అసోసియేషన్ సభ్యుడు, తిరుమల కన్‌స్ట్రక్షన్స్ ఎండీ గట్టు ప్రవీణ్ (46)కు శ్రద్ధాంజలి ఘటించిన అనంతరం ఈ లేఖ విడుదల చేశారు.

ఇబ్బందులకు గురిచేయొద్దు

ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని లేఖలో డీవీఎన్ రెడ్డి, సురేందర్ పేర్కొన్నారు. అయితే, తమను ఆర్థిక ఇబ్బందులకు గురిచేయొద్దని విజ్ఞప్తి చేశారు. ఆర్ అండ్ బీలో గత ప్రభుత్వంలో రూ.10 వేల కోట్ల వరకు, ప్రస్తుత ప్రభుత్వం వచ్చాక మరో రూ.8 వేల కోట్ల పనులు ప్రారంభమయ్యాయని.. అయితే ఏ ఆర్థిక సంవత్సరంలోనూ రూ.2 వేల కోట్లకు మించి బిల్లులు చెల్లించలేదని తెలిపారు. పంచాయతీరాజ్ శాఖలో ప్రస్తుతం రూ.10 వేల కోట్ల మేరకు పనులు సాగుతున్నాయని, ఆ శాఖలోనూ ఏనాడు రూ.1,200 కోట్లకు మించి బిల్లులు విడుదల కాలేదని చెప్పారు. ఈ లెక్కన బిల్లుల కోసం తాము ఆరేడు సంవత్సరాలు వేచి ఉండాల్సిన పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కాంట్రాక్ట్ పనులు చేస్తున్న కాంట్రాక్టర్లకు ఎక్కడా అప్పు పుట్టడంలేదని ఆవేదన వ్యక్త చేశారు. ప్రభుత్వం ఏ సంవత్సరం ఎంత మేరకు బిల్లులు చెల్లించగలదో అంత మేరకే పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సీఎంకు సూచించారు. కాంట్రాక్టర్లు సుమారు మూడు లక్షల మందికి ప్రత్యక్షంగా, పది లక్షల మందికి పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్నారని, వారిని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు.



గట్టు ప్రవీణ్ చిత్రపటం వద్ద అంజలి ఘటిస్తున్న కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు

జీవన్‌రెడ్డి పార్టీకి పెద్ద దిక్కు

- మంత్రి దామోదర రాజనర్సింహ



జగిత్యాలటౌన్: అసలైన కాంగ్రెస్‌వాది జీవన్‌రెడ్డి అని.. ఆయన పార్టీకి పెద్ద దిక్కు అని, తామంతా ఆయన శిష్యులమని రాష్ట్ర వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. జగిత్యాల పర్యటనలో భాగంగా ఆదివారం ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మణ్, ఆది శ్రీనివాస్‌తో కలిసి జీవన్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి మాట్లాడారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ ఆలోచనపరుడైన జీవన్‌రెడ్డి పార్టీకి.. ప్రభుత్వానికి సలహాలు, సూచనలిస్తూ పెద్ద దిక్కుగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. పార్టీలో తామంతా ఆయనకు జూనియర్లమని, ఆయన గురించి పార్టీ ఆలోచిస్తోందని, సముచిత స్థానం లభించేలా ప్రయత్నిస్తున్నామన్నారు.

సరస్వతి పుష్కరాల ప్రారంభోత్సవానికి సీఎం రాక

- రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో ఈ నెల 15 నుంచి 26వ తేదీ వరకు జరిగే సరస్వతి నది పుష్కరాల ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్నట్లు రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. పుష్కరాలకు సీఎం మంజూరు చేసిన రూ.35 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం సరస్వతీ మాత విగ్రహం, పుష్కర ఘాట్, హారతి సభాస్థలిని ప్రారంభిస్తారన్నారు. మరుసటి రోజు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇతర మంత్రులు, వస్తారని చెప్పారు. అనంతరం అధికారులతో పుష్కర ఏర్పాట్లపై సమీక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగొద్దని అధికారులను ఆదేశించారు. పనులు నెమ్మదించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వెంట దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, కమిషనర్ వెంకట్‌రావు, సింగరేణి సీఎండీ బలరాంనాయక్, కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే, ఈఓ మహేశ్ ఉన్నారు.


రోడ్డు ప్రమాదంలో తండ్రీకూతురు దుర్మరణం

- ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొనడంతో ఘటన

నిర్మల్/ఆదిలాబాద్‌టౌన్: ఆగి ఉన్న వాహనాన్ని కారు ఢీకొట్టగా తండ్రీకూతురు మృతి చెందారు. ఈ ఘటన నిర్మల్ జిల్లాలో చోటు చేసుకుంది. మాతృదినోత్సవం రోజున తల్లికి గర్భశోకంతోపాటు సౌభాగ్యమూ దూరం చేసింది. తనతో కలిసి పుట్టిన కవల సోదరిని ఒంటరి చేసింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. తండ్రీకూతురు శంకర్(50), కృతిక(20) హైదరాబాద్ నుంచి శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత సొంతూరైన ఆదిలాబాద్‌కు కారులో బయల్దేరారు. నిర్మల్ రూరల్ మండలం నీలాయిపేట సమీపంలో ఎన్‌హెచ్–44 బైపాస్ రోడ్డు వద్దకు ఆదివారం వేకువజామున చేరుకున్నారు. ఈ క్రమంలో రోడ్డుపై ఎలాంటి సూచికలు లేకుండా నిలిపి ఉంచిన ఐషర్ వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో శంకర్, కృతిక తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గమనించి 108లో నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. డ్రైవర్ విలాస్ పరిస్థితి సీరియస్‌గా ఉండటంతో మహారాష్ట్రలోని యవత్మాల్ ఆస్పత్రికి తరలించినట్టు తెలిసింది. ఘటన జరిగిన సమయంలో విలాస్ డ్రైవింగ్ చేస్తుండగా, ముందు సీట్లో శంకర్, వెనుక సీట్లో కతిక ఉన్నట్టు పోలీసులు చెబుతున్నారు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు డ్రైవర్ ఐషర్ వాహనాన్ని నిలిపినట్టు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు నిర్మల్ రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు.



దెబ్బతిన్న కారు



శంకర్, కృతిక

మరో 25 చోట్ల స్లాట్ బుకింగ్స్

▶ మొదటి పేజీ తరువాయి

స్లాట్స్ అవసరం ఉన్న కార్యాలయాలలో అదనపు సబ్ రిజిస్ట్రార్లను నియమిస్తామని చెప్పారు. ఇప్పటికే ప్రయోగాత్మకంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్ కార్యాలయంలో అదనంగా ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు, సిబ్బందిని నియమించినట్లు వెల్లడించారు. ఈ విధానాన్ని ఉప్పల్, మహేశ్వరం, మంచిర్యాల కార్యాలయాలలో కూడా ప్రవేశపెడుతున్నట్లు వివరించారు.

కార్యాలయాల పునర్వ్యవస్థీకరణ

స్లాట్ బుకింగ్ విధానాన్ని దృష్టిలో పెట్టుకొని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను పునర్వ్యవస్థీకరిస్తున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. అధిక రద్దీ, తక్కువ రద్దీ ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిని విలీనం చేసి పనిభారాన్ని సమానం చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఇప్పటికే రంగారెడ్డి జిల్లాలోని చంపాపేట, సరూర్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల అధికార పరిధి విలీనం విజయవంతమైందని తెలిపారు. షాద్‌నగర్ – ఫారూక్‌నగర్, సిద్దిపేట – సిద్దిపేట (రూరల్) కార్యాలయాల పరిధిని కూడా విలీనం చేసినట్లు వెల్లడించారు.

నేటి నుంచి స్లాట్ బుకింగ్ ప్రారంభం కానున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

హైదరాబాద్ ఆర్.ఓ.ఆఫీసు, హైదరాబాద్ ఆర్.ఓ. ఆఫీసు సౌత్, నారపల్లి, ఘట్‌కేసర్, మల్కాజిగిరి, ఉప్పల్, కాప్రా, బీబీనగర్, సిద్దిపేట, సిద్దిపేట రూరల్, గజ్వేల్, మంచిర్యాల, పెద్దపల్లి, వరంగల్ ఆర్.ఓ. ఆఫీసు, జనగాం, ఘనపూర్, నర్సంపేట, కల్వకుర్తి, నారాయణపేట, మహేశ్వరం, రంగారెడ్డి ఆర్.ఓ. ఆఫీసు, షాద్‌నగర్, ఫరూక్‌నగర్, వనస్థలిపురం, శేరిలింగంపల్లి.

పారిశ్రామికవాడ.. సమస్యలే నిండా!

▶ మొదటి పేజీ తరువాయి

కల్పించాల్సిన ఇండస్ట్రియల్ లోకల్ ఏరియా అథారిటీ (ఐలా)లు నిధుల లేమితో సతమతమవుతున్నాయి. మరోవైపు రాష్ట్ర పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థ టీజీఐఐసీ రియల్ ఎస్టేట్ సంస్థగా మారిందనే విమర్శలు వస్తున్నాయి. టీజీఐఐసీ భూముల విక్రయం ద్వారా నిధులు సమకూర్చుకుంటే, ప్రభుత్వం వాటిని ఇతర అవసరాల కోసం మళ్లిస్తోంది.

అప్రోచ్ రోడ్లు లేక..

వందలాది ఎకరాల్లో పారిశ్రామిక పార్కులు ఏర్పాటవుతున్నా వాటికి అప్రోచ్ రోడ్లు లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇరుకైన గ్రామీణ ప్రాంత రోడ్ల మీదుగా భారీ వాహనాలు వెళ్తుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఉదాహరణకు ఇటీవల మేడ్చల్ జిల్లాలో టీజీఐఐసీ 196 ఎకరాల విస్తీర్ణంలో మాదారం పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేసినా నేటికీ అప్రోచ్ రోడ్డు లేకపోవడం, అంతర్గత రోడ్ల నిర్మాణం కాకపోవడంతో ప్లాట్లు కొనుగోలు చేసిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. పారిశ్రామిక పార్కుల్లోనూ అంతర్గత రోడ్ల నిర్మాణానికి సరిపడా నిధులు లేకపోవడంతో 'ఐలా'లు కేవలం మరమ్మతులకే పరిమితం అవుతున్నాయి. మరోవైపు పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు ప్రజా రవాణా సౌకర్యాలు అందుబాటులో లేకపోవడం ఉత్పాదకతపై ప్రభావం చూపుతోంది.


చాలాచోట్ల మంచినీటి ఎద్దడి

పారిశ్రామికవాడల్లో నీటి సౌకర్యం కీలకం కాగా అనేక పారిశ్రామికవాడల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంటోంది. నిబంధనల ప్రకారం పారిశ్రామిక వాడలకు ప్రభుత్వం నీటి సరఫరా చేయాల్సి ఉన్నా ఆచరణలో కనిపించడం లేదు. అనేక పారిశ్రామిక వాడల్లో వాన నీటి కాలువలు, డ్రైనేజీల్లో చెత్త పేరుకుపోవడంతో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయి. వ్యర్థాల రీ సైక్లింగ్ వసతి, డంపింగ్ యార్డులు లేకపోవడం, పారిశ్రామిక వాడల నుంచి చెత్తను రోజుల తరబడి తరలించకపోవడంతో అపరిశుభ్ర వాతావరణం రాజ్యమేలుతోంది. లోతట్టులో ఉన్న పరిశ్రమలు, ఖాళీ ప్లాట్లలో మురుగు నీరు నిల్వ ఉండటంతో దుర్గంధం వెలువడుతోంది. కొన్నిచోట్ల 132 కేవీ సబ్‌స్టేషన్లు పారిశ్రామిక వాడలకు దూరంగా ఉండటంతో తరచూ హై, లో ఓల్టేజీ సమస్యలు తలెత్తుతున్నాయి. డిమాండుకు అనుగుణంగా ఓల్టేజి నియంత్రించే వ్యవస్థ లేకపోవడంతో సమస్యలు ఎదురవుతున్నాయి.

వెలగని వీధి దీపాలు

పలు పారిశ్రామిక వాడల్లో వీధి దీపాల నిర్వహణ సక్రమంగా ఉండటం లేదు. దీంతో రాత్రి వేళ విధులకు వెళ్లే కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. చీకటి ప్రాంతాల్లో ప్రమాదాలు జరుగుతుండగా, మహిళా కార్మికులు భయం భయంగా రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఇక సీసీ కెమెరాల నిర్వహణ కూడా సక్రమంగా ఉండటం లేదు. నిర్మాణంలో ఉన్న పరిశ్రమల నుంచి స్టీలు సామగ్రి తరచూ చోరీకి గురవుతున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నాయి. ముడి సరుకులు, పారిశ్రామిక ఉత్పత్తులు చోరీకి గురవుతున్న ఘటనలపై పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నా దర్యాప్తులో కీలకమైన సీసీ కెమెరాలు సరిగా పని చేయక పోవడంతో సమస్యలెదురవుతున్నాయి.

పేరుకే ఆదర్శం




ఆదర్శ పారిశ్రామికవాడగా గుర్తింపు ఉన్న చర్లపల్లి పారిశ్రామికవాడలో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్నా. నేను పనిచేసే కంపెనీకి చేరుకోవాలంటే రవాణా సౌకర్యం లేదు. లోపలికి నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తోంది. లేదంటే షేరింగ్ ఆటోలు ఎక్కాలి. మాకు వచ్చే అరకొర జీతాల్లోంచి రోజూ ఆటో చార్జీలకు చెల్లించాలంటే కష్టమవుతోంది. ఉదయం, సాయంత్రం సమయాల్లో బస్సులు నడిపేలా చూడాలని పలుమార్లు ఆర్టీసీ అధికారులకు పారిశ్రామికవాడ పెద్దలకు మేం విన్నవించుకున్నా ఫలితం లేదు.
– అనూష, కార్మికురాలు, చర్లపల్లి పారిశ్రామికవాడ

ఒకప్పుడు ది బెస్ట్


ఒకప్పుడు ది బెస్ట్ 'ఐలా'గా పేరు పొందిన ఉప్పల్ పారిశ్రామిక వాడలో ఇప్పుడు మౌలిక వసతులు వసతులు కరువయ్యాయి. ప్రధాన రహదారులు బాగానే ఉన్నట్టు కన్పించినా అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. గతంలో ఫుట్‌పాత్‌లు, రహదారుల పక్కన పచ్చని చెట్లు ఆహ్లాదాన్ని పంచేవి. ఇప్పుడు పర్యవేక్షణ లేక, కనీసం నీరు పోసేవారు లేక చాలా వరకు చెట్లు ఎండిపోయాయి. ఫుట్‌పాత్‌లు, రోడ్లు కలిసి పోయాయి. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో అంతర్గత రోడ్లపై ఎక్కడ చూసినా మురుగు పరుగులు పెడుతోంది. ఇక వీధి లైట్లు సైతం సరిగ్గా వెలగడం లేదు. కొన్నాళ్లుగా పారిశుధ్యం లోపించింది. ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతోంది. 2017 నుంచి 'ఐలా'కు ఎన్నికలు జరగకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.
– టి.సత్యనారాయణ, ఉప్పల్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ కార్యదర్శి

నివాస ప్రాంతాలు ఏర్పాటు చేయాలి



పారిశ్రామిక వాడలకు అనుబంధంగా నివాస ప్రాంతాలు ఏర్పాటు చేయాలని గతంలో ప్రణాళికలు సిద్ధం చేశారు. 'వాక్ టు వర్క్'నినాదంతో ఈ విధంగా ఏర్పాటు చేయడం వల్ల పరిశ్రమల్లో ఉత్పాదకత పెరుగుతుంది. కార్మికులు రాకపోకలకు వెచ్చించే సమయం, డబ్బు ఆదా అవుతుంది. అయితే పారిశ్రామిక వాడల్లో మురుగు నీటి శుద్ధి ప్లాంట్ల (ఎస్‌టీపీ) ఏర్పాటుతో పాటు వరద, మురుగునీటి కాలువలు నిర్మించాలి. అలాగే పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలను పైపుల ద్వారా తీసుకెళ్లే వ్యవస్థను పటిష్టం చేయాలి. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీలు), పోలీస్ అవుట్ పోస్టులు కూడా ఏర్పాటు చేయాలి.
– మునగాల గోపాలరావు, ప్రధాన కార్యదర్శి, చర్లపల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్

ఫైర్ ఇంజిన్లు చేరుకునేదెలా?



వీధి దీపాల సమస్యల వల్ల మహిళా కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. పారిశ్రామిక వాడలకు ప్రజా రవాణా లేకపోవడం, భారీ వాహనాలకు పార్కింగ్ ప్రదేశాలు లేకపోవడం సమస్యాత్మకంగా ఉంది. భారీ వాహనాలను రోడ్లపైనే నిలుపుతున్నారు. యాజమాన్యాలు అనుమతులు ఉల్లంఘించి నిర్మాణాలు చేయడంతో ప్రమాదాలు జరిగినపుడు ఫైర్ ఇంజిన్లు చేరుకోలేకపోతున్నాయి. సమస్యలను తరచూ అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా ఫలితం ఉండటం లేదు.
– కొల్కూరి నర్సింహారెడ్డి, ఐఎన్‌టీయూసీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు

ఆర్మీ కమాండర్లకు పూర్తి స్వేచ్ఛ

పాక్ దాడులను తిప్పికొట్టాలని ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది ఆదేశం

న్యూఢిల్లీ: సరిహద్దుల్లో పాకిస్తాన్ సైన్యం దాడులకు దిగితే గట్టిగా ప్రతిస్పందించాలని, తగిన రీతిలో బుద్ధి చెప్పాలని ఆర్మీ కమాండర్లకు సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది ఆదేశాలు జారీ చేశారు. దాడులను తిప్పికొట్టే విషయంలో వారికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చినట్లు అధికార వర్గాలు తెలియజేశాయి. సైనిక చర్యలు నిలిపివేస్తూ అంగీకారానికి వచ్చినట్లు భారత్, పాక్ శనివారం ప్రకటించడం తెలిసిందే. అయినప్పటికీ పాక్ సైన్యం కవ్వింపు చర్యలకు పాల్పడింది. శనివారం రాత్రి సరిహద్దుల్లో కాల్పులు జరపగా, భారత సైన్యం సమర్థంగా తిప్పికొట్టింది. ఈ పరిణామాలపై ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది సమీక్ష జరిపారు. మరోసారి పాక్ సైన్యం కాల్పులకు గట్టిగా ప్రతిస్పందించాలని ఆదేశించారు. ఈ విషయంలో ఆర్మీ కమాండర్లకు పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నట్లు ఆయన తెల్పిచెప్పారు.

పాక్ తూటాలకు... క్షిపణులతో బదులివ్వండి

దుశ్చర్యలకు దీటుగా బదులు • సైన్యానికి మోదీ ఆదేశం



న్యూఢిల్లీ: సీమాంతర ఉగ్రవాదం పట్ల భారత్ ప్రతిస్పందన ఇకపై సరికొత్త రీతిలో ఉంటుందని ప్రధాని నరేంద్ర మోదీ తేల్చిచెప్పారు. ''పాక్‌తూటాలకు కచ్చితంగా క్షిపణులతో సమాధానం చెప్పండి. అది చేపట్టే ఒక్కో దుశ్చర్యకూ కలలో కూడా ఊహించనంత బలంగా బదులివ్వండి'' అని సైనిక దళాలను ఆదేశించారు. త్రివిధ దళాల అధినేతలతో ఆయన ఆదివారం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, విదేశాంగ కార్యదర్శి విక్రం మిస్రీ తదితరులు పాల్గొన్నారు. ఆపరేషన్ సిందూర్‌పై విస్తృతంగా చర్చించారు. పాక్ దాడులను సహించడానికి ఏ మాత్రమూ వీల్లేదంటూ మోదీ స్పష్టమైన ఆదేశాలిచ్చినట్లు రక్షణ శాఖ అధికారులు వెల్లడించారు. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదంపై, ముష్కరులపై 'ఆపరేషన్ సిందూర్' ఇంకా ముగియలేదని స్పష్టంచేశారు. సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తే చెల్లించాల్సిన మూల్యం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. కశ్మీర్ అంశంలో విదేశీ మధ్యవర్తిత్వాన్ని అంగీకరించేది లేదని పునరుద్ఘాటించారు. పాకిస్తాన్‌తో జరిగే ఏ చర్చలైనా సరే కేవలం పాక్ ఆక్రమిత కశ్మీర్(పీఓకే)ను, పాక్‌లో దాక్కున్న ఉగ్రవాదులను భారత్‌కు అప్పగించడంపైనే ఉంటాయని కేంద్రం తేల్చిచెప్పింది. చట్టవిరుద్ధంగా ఆక్రమించుకున్న పీఓకేను, ఉగ్రవాద మూకలను భారత్‌కు అప్పగించాల్సిందేనని, పాక్‌కు మరో గత్యంతరం లేదని స్పష్టం చేసింది. ''ఆ దేశంతో చర్చలు వీటిపై మాత్రమే జరుగుతాయి. అది కూడా కేవలం డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ (డీజీఎంఓ) స్థాయిలో మాత్రమే కొనసాగుతాయి'' అని కేంద్రం ఉద్ఘాటించింది. పాక్ ఆక్రమిత కశ్మీర్ సహా ఉగ్రవాదుల అప్పగింతపై తప్ప మరో అంశంపై చర్చించే ప్రసక్తే లేదని తెలిపింది. ఉగ్రవాదానికి పాక్ మద్దతు కొనసాగుతున్నంత కాలం సింధూ నది జలాల ఒప్పందాన్ని నిలిపివేయడం తథ్యమని పేర్కొంది. విదేశాంగ మంత్రులు, లేదా జాతీయ భద్రతా సలహాదారుల స్థాయిలో చర్చలు జరగాలని పాక్ ప్రతిపాదిస్తుండగా అందుకు భారత్‌కు అంగీకరించడం లేదు.

దాడి చేస్తే గట్టిగా ఎదురుదెబ్బ

జేడీ వాన్స్‌కు మోదీ స్పష్టీకరణ

న్యూఢిల్లీ/వాషింగ్టన్: పాకిస్తాన్ ఒకవేళ భారత్‌పై మళ్లీ దాడికి దిగితే అంతకంటే గట్టిగానే ఎదురుదెబ్బ తీస్తామని అమెరికాకు మోదీ తేల్చిచెప్పారు. తమ ప్రతిస్పందన అత్యంత తీవ్ర స్థాయిలో, దాయాదికి వినాశకరంగా ఉంటుందని స్పష్టంచేశారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ శనివారం మోదీతోఫోన్‌లో మాట్లాడారు. కాల్పుల విరమణ ఒప్పందం గురించి ప్రస్తావించారు. అనంతరం విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, పాక్ ఆర్మీ చీఫ్ అసిం మునీర్‌తో కూడా వాన్స్ చర్చించారు. పాక్ కాల్పులు ఆపితేనే సంయమనం పాటిస్తామని అమెరికాకు భారత్ తేల్చిచెప్పినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలియజేశాయి. భారత్–పాక్ ఘర్షణల గురించి అమెరికా నిఘా వర్గాల నుంచి ఆందోళనకరమైన సమాచారం అందిన కారణంగానే మోదీతో వాన్స్ మాట్లాడారని సమాచారం. సున్నితమైన అంశం కావడంతో బయటకు వెల్లడించలేదని మీడియాలో కథనాలు వెలువడ్డాయి.

పాక్‌ను చావుదెబ్బ కొట్టాం

రాజధానిపైనే దాడి చేశాం

సైనిక ఆపరేషన్స్ డీజీల వెల్లడి

- పాక్ సైన్యం వేడుకున్నందుకే విరమణ
- దుస్సాహసానికి దిగితే మళ్లీ గుణపాఠం
- వారి దాడులను దీటుగా తిప్పికొట్టాం
- కీలక ఎయిర్‌బేస్‌లను ధ్వంసం చేశాం
- పలు యుద్ధ విమానాలు కూల్చేశాం
- 40 మందికి పైగా పాక్ సైనికులు మృతి
- ఉగ్రవాదం అంతానికే 'ఆపరేషన్ సిందూర్'
- 100కు పైగా ముష్కరులు హతం
- పలువురు కీలక అగ్రనేతలు కూడా
- మీడియాకు వెల్లడించిన డీజీలు



డీజీఏఓ ఏకే భారతి | డీజీఎంఓ రాజీవ్ ఘాయ్ | డీజీఎన్ఓ ఏఎన్ ప్రమోద్

న్యూఢిల్లీ: త్రివిధ బలగాలు నాలుగు రోజుల పాటు చేపట్టిన సంయుక్త ఆపరేషన్‌లో పాకిస్తాన్ కోలుకోలేని రీతిలో దెబ్బతిన్నట్టు భారత సైన్యం వెల్లడించింది. పాక్ సైన్యం అత్యంత తీవ్రస్థాయిలో నష్టాలు చవిచూసిందని తెలిపింది. ఇకముందు కూడా పాక్ ఎలాంటి దుశ్చర్యలకు పాల్పడ్డా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. మర్చిపోలేని రీతిలో గుణపాఠం చెప్పడం ఖాయమని స్పష్టం చేసింది. ''పాకిస్తాన్ విజ్ఞప్తి మేరకే కాల్పుల విరమణకు అంగీకారం కుదిరింది. కానీ గంటల్లోనే ఒప్పందాన్ని ఉల్లంఘించి పాక్ సైన్యం కాల్పులు, దాడులకు దిగింది. ఇదే పరిస్థితి కొనసాగితే మన ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుంది. మన బలగాలు అందుకు పూర్తిగా సంసిద్ధంగా ఉన్నాయి. క్షేత్రస్థాయి పరిస్థితిని బట్టి ఎప్పటికప్పుడు దీటుగా స్పందించేందుకు బలగాలకు సైన్యాధ్యక్షుడు పూర్తి అధికారాలిచ్చారు'' అని డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్(డీజీఎంఓ) లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ ప్రకటించారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఎయిర్ ఆపరేషన్స్(డీజీఏఓ) ఎయిర్ మార్షల్ ఏకే భారతి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ నావల్ ఆపరేషన్స్(డీజీఎన్ఓ) వైస్ అడ్మిరల్ ఏఎన్ ప్రమోద్‌తో కలిసి ఆయన ఆదివారం సాయంత్రం మీడియాతో మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్, తదనంతరం సరిహద్దు రాష్ట్రాలపై పాక్ దాడులు, మన సైనిక ప్రతిచర్య తదితరాల అంశాలను కూలంకషంగా వివరించారు. మొత్తం ఆపరేషన్‌లో ఐదుగురు భారత సైనికులు అమరులైనట్లు వెల్లడించారు. అమర జవాన్లకు, పాక్ మతిలేని దాడుల్లో దుర్మరణం పాలైన భారత పౌరులకు ఘనంగా నివాళులు అర్పించారు. సైనిక ఆపరేషన్ల గురించి త్రివిధ దళాల అత్యున్నతాధికారులు ఇలా సంయుక్తంగా విలేకరుల సమావేశం నిర్వహించడం అత్యంత అరుదు కావడం విశేషం.

ఆ ముష్కరులు హతం

''పలు అత్యాధునిక పాక్ యుద్ధ విమానాలను నేలకూల్చాం. మనకున్న సమాచారం మేరకే 40 మందికి పైగా పాక్ సైనికులు మరణించారు. 100 మందికిపైగా ఉగ్రవాదులు హతమయ్యారు. వీరిలో కరడుగట్టిన ఉగ్రవాదులు యూసుఫ్ అజార్, అబ్దుల్ మాలిక్ రవూఫ్, ముదాసిర్ అహ్మద్ తదితరులు ఉన్నారు. 1999లో ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానాన్ని హైజాక్ చేసినవారు, 2019లో పుల్వామా దాడికి పాల్పనవారు మరణించారు. పాక్, పీఓకేలో తొమ్మిది ఉగ్రవాద స్థావరాలను పూర్తిగా ధ్వంసం చేశాం. అజ్మల్ కసబ్, డేవిడ్ హెడ్లీ ఉగ్రవాద శిక్షణ పొందిన కేంద్రాలు నేలమట్టమయ్యాయి. పాక్ రాజధాని ఇస్లామాబాద్‌కు కూతవేటు దూరంలోని అతి కీలకమైన చక్లాలా సహా ప్రధాన వైమానిక స్థావరాలన్నీ మన దాడుల్లో కోలుకోలేని విధంగా దెబ్బతిన్నాయి. లాహోర్ తదితర సైనిక స్థావరాల్లోని కీలక రాడార్ వ్యవస్థలు నేలమట్టమయ్యాయి. ఉగ్రవాదాన్ని సహించే ప్రసక్తే లేదు'' అని డీజీఎంఓ రాజీవ్ ఘాయ్ వివరించారు. ఇకపై తమ భూభాగంలో ఏ ప్రాంతమూ సురక్షితం కాదని పాకిస్తాన్‌కు పూర్తిస్థాయిలో తెలిసొచ్చిందన్నారు. ''మనం ఎంతో సంయమనం పాటించాం. కేవలం పాక్ ఉగ్రవాద స్థావరాలనే లక్ష్యంగా చేసుకొని కచ్చితత్వంతో కూడిన దాడులు చేశాం. సామాన్య ప్రజల నివాసాలకు ఎలాంటి నష్టం జరగకుండా జాగ్రత్తపడ్డాం. మన దేశ సార్వభౌమత్వం ప్రాదేశిక సమగ్రతకు, పౌరుల భద్రతకు ఎలాంటి ముప్పు వాటిల్లినా నిర్ణయాత్మకంగా ప్రతిస్పందిస్తాం'' అని ఉద్ఘాటించారు. పాకిస్తాన్ డీజీఎంఓ శనివారం మధ్యాహ్నం తనతో మాట్లాడారని, దాడులు ఆపాలని కోరారని తెలిపారు.

ఉగ్రవాద క్యాంపులు భస్మీపటలం

పాక్ దాడుల్లో భారత్ కూడా యుద్ధ విమానాలు నష్టపోయిందా అని ప్రశ్నించగా, యుద్ధంలో కొన్ని నష్టాలు సహజమని ఎయిర్ మార్షల్ ఎ.కె.భారతి బదులిచ్చారు. అయితే, ''లక్ష్యాలన్నీ సాధించాం. మన పైలెట్లంతా సురక్షితంగా తిరిగొచ్చారు'' అని చెప్పారు. ''పాక్ యుద్ధ విమానాలు మన భూభాగంలోకి ప్రవేశించకుండా తిప్పికొట్టాం. అయితే, కచ్చితంగా ఎన్ని యుద్ధ విమానాలు కూల్చేశామన్నది ఇప్పుడే బయటపెట్టలేం.



పాకిస్తాన్ ఎయిర్‌బేస్‌లు, కమాండ్ సెంటర్లు, సైనిక మౌలిక సదుపాయాలు, గగనతల రక్షణ వ్యవస్థలను నాశనం చేశాం. పాక్ రాజధాని ఇస్లామాబాద్ దాకా చొచ్చుకెళ్లాం. అక్కడ వైమానిక స్థావరాన్ని నేలమట్టం చేశాం. ఉగ్రవాదుల క్యాంప్‌లను నామరూపాల్లేకుండా చేయాలన్న లక్ష్యం ఇప్పటికే సాధించాం. ఈ ఫలితాలు మొత్తం ప్రపంచానికి అనుభవంలోకి వస్తాయి'' అని ఎ.కె.భారతి స్పష్టం చేశారు. పాక్ వైమానిక స్థావరాలకు జరిగిన నష్టాన్ని ఫొటోల సాయంతో వివరించారు.

పాక్ హార్బర్లకు తీవ్ర నష్టం

ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా సముద్రంతోపాటు భూఉపరితలంపై నిర్దేశిత లక్ష్యాలపై కచ్చితత్వంతో కూడిన దాడులు చేశామని వైస్ అడ్మిరల్ ఎ.ఎన్.ప్రమోద్ చెప్పారు. పాకిస్తాన్‌లో ప్రధానమైన కరాచీలోనూ దాడులు జరిగాయని తెలిపారు. ''పహల్గాం ఉగ్రవాద దాడి అనంతరం మేము అప్రమత్తమయ్యాం. అరేబియా సముద్రంలో లైవ్–ఫైరింగ్ డ్రిల్స్, లాంచ్ టెస్టులు, కాంబాట్ ఆపరేషన్ డ్రిల్స్ నిర్వహించాం. పాకిస్తాన్ ముష్కరులకు గుణపాఠం నేర్పాలన్న లక్ష్యంతో మా కార్యాచరణ సిద్ధం చేసుకున్నాం. మన సైనిక దళాలు అరేబియా సముద్రంలో నిత్యం అప్రమత్తంగా ఉన్నాయి. ఎలాంటి విపత్కర పరిణామాలు ఎదురైనా ఢీకొట్టేందుకు సిద్ధమయ్యాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందగానే ఉగ్రవాద స్థావరాలపై విరుచుకుపడ్డాం. పాకిస్తాన్ సైన్యం దాడులను గట్టిగా తిప్పికొట్టాం. పాక్ నావికాదళంపై మన నావికాదళం పైచేయి సాధించింది. పాక్ ఎత్తుగడలు గమనిస్తూ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాం. ఇండియన్ నేవీ దాడుల్లో పాక్ హార్బర్లకు తీవ్ర నష్టం వాటిల్లింది. పాక్ చర్యల పట్ల మన ప్రతిస్పందన దీటుగా, ప్రణాళికాబద్ధంగా సాగింది'' అని ఎ.ఎన్.ప్రమోద్ స్పష్టం చేశారు.

మధ్యవర్తిత్వం ప్రసక్తే లేదు

కశ్మీర్ విషయంలో ట్రంప్ ఆఫర్‌ను తిరస్కరించిన భారత్

న్యూఢిల్లీ/న్యూయార్క్/వాషింగ్టన్: రావణకాష్టంగా రగిలిపోతున్న, దశాబ్దాలుగా ఎటూ తేలకుండా సందిగ్ధత, సంఘర్షణలకు కారణమైన జమ్మూకశ్మీర్ అంశంలో మూడో వ్యక్తి జోక్యం అక్కర్లేదని భారత్ పునరుద్ఘాటించింది. కశ్మీర్ విషయంలో మధ్యవర్తిత్వం వహించేందుకు ఆసక్తి కనబరుస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై భారత్ ఆదివారం స్పందించింది. ''కశ్మీర్‌పై మాకు స్పష్టమైన విధానం ఉంది. చర్చలంటూ జరిగితే పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను భారత్‌కు అప్పగించడం గురించే. అంతకంటే మాట్లాడేది ఏదీ లేదు. ఉగ్రవాదుల అప్పగింత గురించి పాక్ మాట్లాడదల్చుకుంటే సిద్ధంగా ఉన్నాం. అంతకు మించి మాట్లాడటానికి మరో టాపిక్‌ేమీ లేదు. ఇతర అంశాలపై ఇతరుల మధ్యవర్తిత్వం ఆశించట్లేము. ఇతరులు మధ్యవర్తిత్వం చేయాల్సిన అవసరం కూడా మాకు లేదు'' అని ప్రకటించింది.

జేజేలు అంటూనే జోక్యానికి యత్నం

కాల్పుల విరమణకు ముందడుగు వేసి అత్యంత యుక్తితో వ్యవహరించిన శక్తివంతమైన భారత్, పాక్ అగ్రనాయకత్వాలను చూసి ఎంతో గర్విస్తున్నానని ఓవైపు పొగుడుతూనే మరోవైపు కశ్మీర్ అంశంలో మధ్యవర్తిగా నిలబడతానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తన అసలు ఉద్దేశ్యాన్ని బయటపెట్టారు. ఈ మేరకు ఆదివారం ఆయన 'ట్రూత్ సోషల్'లో ఒక పోస్ట్‌చేశారు. ''ప్రస్తుత ఉద్రిక్తతలను తగ్గించుకోకపోతే వినాశనం తప్పదని భవిష్యత్ దర్శనం చేసి కాల్పుల విరమణకు మొగ్గుచూపిన భారత్, పాక్ నాయకత్వాలను చూస్తే నాకెంతో గర్వంగా ఉంది. అయితే దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉండి పోయిన కశ్మీర్ అంశానికి పరిష్కారం కనుగొనేందుకు మీ రెండు దేశాలతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నా'' అంటూ ట్రంప్ వ్యాఖ్యానించారు.

ట్రంప్ జోక్యాన్ని స్వాగతించిన పాక్

మధ్యవర్తిగా నిలబడేందుకు సిద్ధంగా ఉన్నానని ట్రంప్ చేసిన ప్రకటనపై పాకిస్తాన్ స్పందించింది. ''కాల్పుల విరమణ అంశంలో మధ్యవర్తిగా వ్యవహరించి నిర్మాణాత్మక పాత్ర పోషించినందుకు అమెరికాను అభినందిస్తున్నాం. ఇక జమ్మూకశ్మీర్ వివాద పరిష్కారానికి కృషి చేస్తానని ట్రంప్ ప్రకటన చేయడం ఎంతో సంతోషకరం. ఆయన సుముఖత వ్యక్తంచేయడాన్ని మేం అభినందిస్తున్నాం'' అని పాకిస్తాన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది.

పుల్వామా మా పనే

ఎట్టకేలకు అంగీకరించిన పాక్



ఇస్లామాబాద్: జమ్మూ కశ్మీర్‌లో జరిగే ఉగ్రవాద దాడులతో తమకు సంబంధం లేదంటూ ఇన్నాళ్లుగా బుకాయిస్తూ వస్తున్న పాకిస్తాన్ ఎట్టకేలకు నిజం అంగీకరించింది. పుల్వామాలో 2019 ఫిబ్రవరి 14న 40 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లను బలి తీసుకున్న దాడి వెనుక తమ హస్తం ఉన్నట్లు ఆ దేశ ఎయిర్ వైస్ మార్షల్, ఎయిర్‌ఫోర్స్ పబ్లిక్ రిలేషన్స్ డైరెక్టర్ జనరల్ ఔరంగజేబ్ అహ్మద్ స్పష్టం చేశారు. ఇతర సైనికాధికారులతో కలిసి ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లా డారు. ''పాకిస్తాన్ గగనతలం, భూభాగం, జలవనరులు లేదా ప్రజలకు ఎలాంటి ముప్పు వాటిల్లినా సహించే ప్రసక్తే లేదు. ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడం. ప్రత్యర్థులను వదలిపెట్టం. మా దేశాన్ని కచ్చితంగా కాపాడుకుంటాం. ప్రజలకు మాపై ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం. ఈ విషయాన్ని పుల్వామాలో నిరూపించుకున్నాం. మా తిరుగులేని ఎత్తుగడలు ఏమి టో చూపించాం. మా కార్యదక్షత, వ్యూహాత్మక చతురత ఎ లాంటివో తెలియజెప్పాం'' అని విదేశీ మీడియా సాక్షిగా అహ్మద్ చెప్పుకొచ్చారు. పుల్వామా దాడి వెనుక తమ పాత్ర ఉందని పాక్ బహిరంగంగా ఒప్పుకోవడం ఇదే తొలిసారి. పుల్వామాలో సీఆర్‌పీఎఫ్ జవాన్ల కాన్వాయ్‌ని జైషే మహ్మద్ ఆత్మాహుతి దళ సభ్యుడు పేల్చేయడం తెలిసిందే. తర్వాత 12 రోజులకు భారత వైమానిక దళం పాకిస్తాన్‌లోని బాలాకోట్‌లోని జైషే ఉగ్ర శిక్షణ శిబిరాలపై సర్జికల్ దాడులు చేసింది. అహ్మద్‌తో పాటు మీడియా సమావేశంలో పాల్గొన్న లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌధురి తండ్రి సుల్తాన్ బషీరుద్దీన్ మహమూద్ అల్‌కాయిదాతో సన్నిహిత బంధమున్న ఉగ్రవాది కావడం తెలిసిందే.

'బ్రహ్మోస్' దెబ్బకే... పాక్ దిగొచ్చిందా?!

- ఉగ్ర శిబిరాలపై ప్రయోగం
- జాతీయ మీడియా కథనాలు
- బికనీర్ సమీపంలో క్షిపణి బూస్టర్, నోస్




బ్రహ్మోస్ క్షిపణివిగా భావిస్తున్న విడిభాగాలు

జైపూర్/ లఖ్‌నవూ/ న్యూఢిల్లీ: సరిహద్దులపై ఎడాపెడా దాడులకు తెగబడ్డ పాక్ బ్రహ్మాస్త్రం దెబ్బకు దిగొచ్చిందా? అంటే అవుననే సమాధానమే వస్తోంది. అత్యంత శక్తిమంతమైన సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి బ్రహ్మోస్‌ను పాక్ మీదికి భారత్ ప్రయోగించినట్టు వెలుగులోకి వచ్చింది. రాజస్తాన్‌లోని బికనీర్‌లో పాక్ సరిహద్దు ప్రాంతంలో బ్రహ్మోస్ బూస్టర్, నోస్‌క్యాప్ లభించడం దీన్ని ధ్రువీకరిస్తోంది. ఉగ్రసంస్థ జైషే మహ్మద్ మూలాలను పెకలిస్తూ పాక్‌లోని బహావల్‌పూర్‌లో ఉన్న దాని ప్రధాన స్థావరంపై మే 7 అర్ధరాత్రి దాటాక భారత క్షిపణులు విరుచుకుపడటం తెలిసిందే. బ్రహ్మోస్ బూస్టర్, నోస్ క్యాప్ దొరికింది బహావల్‌పూర్ ఉన్న దిశలోనే. బ్రహ్మోస్‌ను ప్రయోగించాక దాన్నుంచి విడివడే అనుబంధ భాగాల శకలాలతో అవి దాదాపుగా పోలుతున్నాయి. కనుక ఆ గగనతలం గుండానే బ్రహ్మోస్ దూసుకుపోయి ఉంటుందని భావిస్తున్నారు. బహావల్‌పూర్‌లోని జైషే భవనాలను కూల్చేందుకు శక్తిమంతమైన క్షిపణులను ప్రయోగించినట్లు భారత్ ఇప్పటికే ప్రకటించడం తెలిసిందే. వాటిలో బ్రహ్మోస్ కూడా ఉందన్న వార్తలకు ఇది కూడా బలం చేకూరుస్తోంది. ఈ మేరకు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. యుద్ధంలో బ్రహ్మోస్‌ను వాడటం ఇదే తొలిసారి. అయితే దాని వినియోగాన్ని కేంద్రం ధృవీకరించడం లేదు.

బ్రహ్మోస్ దెబ్బ పాక్‌కు తెలుసు: యోగి

''బ్రహ్మోస్ క్షిపణి సత్తా ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచానికి తెలిసి వచ్చింది. ఇంకా ఎవరికైనా తెలియాలంటే తాజాగా ఆ దెబ్బను రుచిచూసిన పాక్‌ను అడిగి తెలుసుకోవచ్చు'' అని యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అన్నారు. లఖ్‌నవూలో బ్రహ్మోస్ ఏరోస్పేస్ ఇంటిగ్రేషన్ అండ్ టెస్టింగ్ కేంద్రం ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. ''ఉగ్రవాదాన్ని అంతంచేయనంత వరకు ఆ సమస్యకు పరిష్కారం లభించదు. మోదీ నాయకత్వంలో ఉగ్రవాదాన్ని శాశ్వతంగా అణచివేయాల్సిన తరుణమొచ్చింది. ఉగ్రవాదం కుక్కతోక వంటిది. దాన్నెప్పటికీ సరిచేయలేం. ఉగ్రవాదులకు వాళ్ల బాషలోనే బుద్ధిచెప్పాలి'' అన్నారు.

సైనిక సందేశం బ్రహ్మోస్: రాజ్‌నాథ్



భారత సాయుధ బలగాల సామర్థ్యానికి బ్రహ్మోస్ నిలువెత్తు నిదర్శనమని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. ఆదివారం లఖ్‌నవూలో నూతన బ్రహ్మోస్ ఏరోస్పేస్ ఇంటిగ్రేటెడ్ అండ్ టెస్టింగ్ కేంద్రాన్ని ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ''నేషనల్ టెక్నాలజీ డే (ఆదివారం) రోజే బ్రహ్మోస్ తయారీ కేంద్రాన్ని ప్రారంభించుకుంటున్నాం. ప్రపంచంలోని అత్యంత శక్తివంతమైన, వేగవంతమైన సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణుల్లో బ్రహ్మోస్ ఒకటి. ఇది శక్తిమంతమైన ఆయుధం మాత్రమే కాదు, మన సాయుధ బలగాల అమేయ సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటే ఒక సందేశం. శత్రువులకు సింహస్వప్నం. సరిహద్దుల పరిరక్షణలో మన అంకితభావాన్ని ఈ క్షిపణి చాటిచెబుతుంది'' అన్నారు. రూ.300 కోట్లతో నిర్మించిన ఈ తయారీ కేంద్రంలో మ్యాక్ 2.8 వేగంతో 290 నుంచి 400 కి.మీ. దూరంలోని లక్ష్యాలను ఛేదించే బ్రహ్మోస్ క్షిపణుల తయారు చేయనున్నారు.

'నూర్‌ఖాన్' నేలమట్టం

పాక్ వైమానిక స్థావరం ధ్వంసమైనట్లు ఉపగ్రహ చిత్రాల్లో వెల్లడి



ఇస్లామాబాద్: పాకిస్తాన్‌పై భారత్ చేస్తున్న మెరుపుదాడుల్లో ఆ దేశ వైమానిక స్థావరాలు నేలమట్టమవుతున్నాయి. తాజాగా ఇస్లామాబాద్, రావల్పిండి జంట నగరాల సమీపంలోని నూర్ ఖాన్ వైమానిక స్థావరం మీదా భారత్ దాడులు చేసిన విషయం తాజాగా చైనా ఉపగ్రహ చిత్రాలతో స్పష్టమైంది. చైనాకు చెందిన కృత్రిమ ఉపగ్రహాల సంస్థ 'మిజాజ్‌విజన్' తీసిన తాజా శాటిలైట్ ఫొటోలు భారత దాడి తీరును బహిర్గతం చేశాయి. ఇప్పటికే రఫీఖీ, మురీద్, నూర్ ఖాన్, ఛునియన్, సుక్కూర్‌లలో వైమానిక స్థావరాలపై దాడి చేసినట్లు భారత్ ప్రకటించింది. ఈ దాడులను పాకిస్తాన్ సైతం ధృవీకరించింది. రావల్పిండిలోని నూర్‌ఖాన్‌తోపాటు ఛక్వాల్‌లోని మురీద్ స్థావరం, పంజాబ్ ప్రావిన్స్‌లోని ఝుంగ్ జిల్లాలోని రఫీఖీ బేస్‌పైనా బాంబులు పడ్డాయని పాకిస్తాన్ సైన్యం అధికార ప్రతినిధి లెఫ్టినెంట్ జనరల్ అహ్మెద్ షరీఫ్ వెల్లడించారు. పాక్ రాజధాని ఇస్లామాబాద్‌కు అత్యంత సమీపంలోని నూర్‌ఖాన్ బేస్ ఆ దేశానికి చాలా కీలకమైన వైమానిక స్థావరం. ఇక్కడ చాలా ప్రధానమైన స్క్వాడ్రాన్‌లు ఉంటాయి. సైనిక, సరకు రవాణా సదుపాయాలు ఇక్కడ ఉన్నాయి. సీ–130 హెర్క్యులస్, సాబ్–2000 సైనిక ఉపకరణాల రవాణా విమానాలను ఇక్కడే నిలిపి ఉంచుతారు. గాల్లోనే విమానాలకు ఇంధనాన్ని నింపే ఐఎల్–78 వంటి రీఫ్యూయిలర్ విమానాలతోపాటు పాక్‌లోని వీవీఐపీలకు సంబంధించిన చిన్న విమానాలకూ ఇదే కీలక స్థావరం.

పార్లమెంట్‌ను తక్షణం సమావేశపర్చండి

- ప్రధాని మోదీకి మళ్లీ లేఖ రాసిన ఖర్గే, రాహుల్
- కాల్పుల విరమణను ట్రంప్ ప్రకటించడమేంటని ప్రశ్న

సాక్షి, న్యూఢిల్లీ: పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ సహా కాల్పుల విరమణ అంశాలపై చర్చించేందుకు తక్షణమే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రధాని మోదీని కోరారు. కేంద్రం శనివారం సాయంత్రం పాకిస్తాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందాన్ని ప్రకటించడం తెల్సిందే. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని కోరుతూ ఇద్దరు నేతలు మోదీకి ఆదివారం విడివిడిగా లేఖలు రాశారు. కాల్పుల విరమణపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటనను ఈ లేఖల్లో వారు ప్రస్తావించారు 'పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని వెంటనే ఏర్పాటు చేయాలనే ప్రతిపక్షాల ఏకగ్రీవ అభ్యర్థనను పునరుద్ఘాటిస్తున్నాను. పహల్గాం ఉగ్రవాద దాడి, ఆపరేషన్ సిందూర్, కాల్పుల విరమణపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మొదటగా ప్రకటించడంపై ప్రజలు, వారి ప్రతినిధులు చర్చించడం చాలా ముఖ్యం. ఇది రాబోయే సవాళ్లను ఎదుర్కోవడానికి మన సమష్టి సంకల్పాన్ని ప్రదర్శించడానికి ఒక అవకాశం అవుతుంది. మీరు ఈ డిమాండ్‌ను తీవ్రంగా, త్వరగా పరిశీలిస్తారని విశ్వసిస్తున్నాను'అని రాహుల్ తన లేఖలో పేర్కొన్నారు. రాహుల్ లేఖకు మద్దతు పలికిన ఖర్గే, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడిగా పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. ప్రధాని అంగీకరిస్తారని తన లేఖలో ఆశాభావం వ్యక్తం చేశారు. పహల్గాం దాడి, ఆపరేషన్ సిందూర్ సమయాల్లో నిర్వహించిన అఖిలపక్ష సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వ చర్యలపై సంపూర్ణ మద్దతు ప్రకటించిన కాంగ్రెస్, ఆ సమయాల్లోనూ పార్లమెంట్‌ను ప్రత్యేకంగా సమావేశపర్చాలని కోరడం తెల్సిందే.

నేలకొరిగిన మరో జవాను

న్యూఢిల్లీ: సరిహద్దుల వద్ద పాకిస్తాన్ బలగాలు జరిపిన కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన మరో జవాను ఆస్పత్రిలో తుది శ్వాస విడిచారని బీఎస్ఎఫ్ ఆదివారం తెలిపింది. 'కానిస్టేబుల్ దీపక్ ఛిమ్‌ఎన్‌గాఖామ్ ఈ నెల 10న జమ్మూ జిల్లా ఆర్ఎస్ పుర సెక్టార్‌లో సరిహద్దుల వైపు నుంచి పాక్ బలగాలు జరిపిన కాల్పుల్లో తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం ఆయనం వీరమరణం పొందారు'అని సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. దీపక్ మృతిపై బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్‌తోపాటు ఇతర అధికారులు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి సానుభూతి ప్రకటించారు. శనివారం జరిగిన కాల్పుల్లో గాయపడిన బీఎస్ఎఫ్ 7వ బెటాలియన్‌కు సబ్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ ఇంతియాజ్ ఆ వెంటనే కన్నుమూయడం తెల్సిందే.

ఆపరేషన్ సిందూర్ కొనసాగుతోంది

అసత్య వార్తలను నమ్మొద్దు • వాయుసేన స్పష్టీకరణ

న్యూఢిల్లీ: ఉగ్రవాదుల అంతమే లక్ష్యంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ఇంకా కొనసా గుతోందని భారత వాయుసేన ఆది వారం ప్రకటించింది. సిందూర్ ఆపరేషన్‌కు సంబంధించిన అసత్య ప్రచారాలు, కథనాలను నమ్మొద్దని ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (ఐఏఎఫ్) దేశ పౌరులనుద్దేశిస్తూ తన సామాజిక మాధ్యమ 'ఎక్స్' ఖాతాలో ఒక ప్రకటన విడుదలచేసింది. ''ఆపరేషన్‌కు సంబంధించిన సమస్త సమాచారాన్ని మీడియా ప్రతినిధులకు త్వరలోనే పూర్తిస్థాయిలో వివరిస్తాం. అప్పటిదాకా వస్తున్న వదంతులను ఎవరూ నమ్మొద్దు. అనధికార సమాచారాన్ని ఎవరూ వ్యాప్తిచేయొద్దు. ఇప్పటిదాకా ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాలను భారత వాయుసేన పూర్తిచేసింది. అత్యంత ఖచ్చితత్వంతో దాడులు చేస్తూ ఇచ్చిన బాధ్యతలను నెరవేరుస్తోంది. అత్యంత విచక్షణతో, మరింత జాగ్రత్తలు తీసుకుంటూ ఆపరేషన్‌ను కొనసాగిస్తున్నాం. జాతి ప్రయోజనాలే పరమావధిగా పనిచేస్తున్నాం'' అని ఎక్స్‌లో పేర్కొంది. భారత్, పాక్‌ల మధ్య ఉద్రిక్తతలను తగ్గించేందుకు సమర్థవంతంగా కృషిచేశామని, కాల్పుల విరమణకు ఇరుదేశాలు ఒప్పుకున్నాయని అమెరికా ప్రకటించిన మరుసటి రోజే భారత వాయుసేన ఈ ప్రకటన చేయడం గమనార్హం. శనివారం సాయంత్రం కాల్పుల విరమణ అమల్లోకి వచ్చిందని ప్రకటనలు వెలువడిన కొద్దిసేపటికే జమ్మూకశ్మీర్‌లోని రాజౌరీ సెక్టార్‌లో సరిహద్దు వెంట పాకిస్తాన్ భారీ స్థాయిలో కాల్పులు మొదలెట్టడం తెల్సిందే. దీంతో భారత గగనతల రక్షణ వ్యవస్థలు మళ్లీ రంగంలోకి దిగాయి.

సాక్షి
హైదరాబాద్
సోమవారం । 12 । మే । 2025



సంస్కరణలతోనే ఖైదీల సంక్షేమం

ఖైదీల సంక్షేమం కోసం తెలంగాణ జైళ్ల శాఖ చేపడుతున్న సంస్కరణలతో రాష్ట్రంలో జైళ్లు పునరావాస కేంద్రాలను తలపిస్తున్నాయని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. -8లో



హెరిటేజ్ వాక్‌కు సర్వం సిద్ధం..

పాతబస్తీలో మిస్ వరల్డ్ సుందరాంగులు సందడి చేయనున్నారు. నగరంలో ఈ నెల 13న చార్మినార్‌లో హెరిటేజ్ వాక్ జరగనుంది. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 39.0/25.0

నగరంలో సోమవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 39, కనిష్టంగా 25 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముంది.

పాత కక్షలతో వ్యక్తి దారుణ హత్య

కత్తులతో పొడిచి చంపిన ముగ్గురు నిందితులు



సిద్దిక్ (ఫైల్)

కుత్బుల్లాపూర్: గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో దాడి చేయడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో కలకలం రేపింది. పోలీసులు స్థానికుల కథనం ప్రకారం.. బొల్లారం ప్రాంతానికి చెందిన సిద్దిక్ మేడ్చల్‌లో నివాసం ఉంటూ వారాంతపు మార్కెట్‌లో బ్యాటరీ లైట్లు సప్లై చేస్తుంటాడు. ఈ నేపథ్యంలో కొంపల్లి మున్సిపల్ పరిధిలోని సెంట్రల్ పార్క్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మార్కెట్‌లో బ్యాటరీ లైట్లు సాయంత్రం ఇచ్చి.. తిరిగి రాత్రి తీసుకునే క్రమంలో ముగ్గురు వ్యక్తులు అతడిపై కత్తులతో దాడి చేయడంతో అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. గతంలో సిద్దిక్ బొల్లారం ప్రాంతంలో బ్యాటరీ లైట్లు ఏర్పాటు విషయంలో మరో వర్గంతో గొడవ పడ్డాడని... అది మనసులో పెట్టుకొని కక్షగట్టినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మాట్లాడుకుందాం.. అంటూ పిలిచి విచక్షణారహితంగా పొట్ట, ఛాతీ భాగాల్లో కత్తులతో పొడిచారు. ఇంతటితో ఆగకుండా నిందితుల్లో ఒకరు కొన ప్రాణంతో కొట్టుమిట్టాడుతున్న సిద్దిక్ మెడను కోసేసినట్లు స్థానికులు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న పేటబషీరాబాద్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అక్కడి సీసీ కెమెరాలు పరిశీలించారు. సిద్దిక్‌తో ఇటీవల జరిగిన గొడవలపై ఆరాతీశారు. ముగ్గురు నిందితులు వచ్చినట్లు స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకొని వారిని పట్టుకునేందుకు రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు ఏసీపీ రాములు పేర్కొన్నారు. ఘటనా స్థలాన్ని సీఐ విజయ్‌వర్ధన్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ అజయ్ పరిశీలించారు. పాత కక్షల నేపథ్యంలో ఈ హత్య జరిగి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఆ దిశగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భారత్‌కు వ్యతిరేకంగా ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు

యువకుడిపై కేసు నమోదు

శంషాబాద్ రూరల్: ఇన్‌స్టాగ్రామ్‌లో భారతదేశానికి వ్యతిరేకంగా పోస్టు చేసిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని పాల్మాకులకు చెందిన సయ్యద్ ఇక్రముద్దీన్ (25)తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పాకిస్థాన్‌కు మద్దతు తెలుపుతూ మన దేశానికి వ్యతిరేకంగా పోస్టు చేశాడు. దీనిని గుర్తించిన స్థానికులు శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న సదరు యువకుడి వర్గీయులు ఆదివారం శంషాబాద్ ఠాణాకు రావడంతో.. మరో వర్గం వారు కూడా అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్తత పరిస్థితులు చోటుచేసుకున్నాయి. అతడిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.





ఇటీవల కురిసిన వర్షాలతో వాతావరణం కాస్త చల్లబడినట్లు అనిపించినా.. మళ్లీ ఎండలు మండుతున్నాయి. రోజురోజుకూ పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో నగరవాసులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. బయటికి రావాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నారు. అత్యవసర పనులైతేనే రోడ్లపైకి వస్తున్నారు. ఆదివారం భానుడు ప్రతాపం చూపించడంతో నగరంలోని ప్రధాన కూడళ్లు బోసిపోయి కనిపించాయి. ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్డు తదితర ప్రాంతాలు నిర్మానుష్యంగా మారాయి.

ఉచ్చులోకి దించి.. మాట మార్చి!

చర్లపల్లి సెంట్రల్ జైలులో షేర్ అలీ కేశ్వానీ

- 2004 నాటి కేసులో 2013లో అరెస్టయిన పాకిస్థానీ
- సరైన సాక్ష్యాధారాలు లేక 2015లో వీగిన కేసు
- తమ దేశీయుడని అంగీకరించని దాయాది దేశం



సాక్షి, సిటీబ్యూరో: ఉగ్రవాదం, గూఢచర్యం, వీరికి సహాయ సహకారాలు అందించడం కోసం పాకిస్థాన్ తన దేశీయుల్ని భారత్‌లోకి పంపిస్తూనే ఉంటుంది. ఎవరైనా ఇక్కడ పట్టుబడితే వారిని తమ దేశీయుడని అంగీకరించడానికి మాత్రం వెనకడుగు వేస్తోంది. కొందరిని మాత్రమే తమ జాతీయులని అంగీకరిస్తూ.. మిగిలిన వారితో తమకు సంబంధం లేనట్లు చేతులు దులుపుకొంటోంది. ఈ కారణంగానే 2004లో నమోదైన కేసులో 2013లో అరెస్టు అయి, 2015లో ఆ కేసు వీగిపోయినా 76 ఏళ్ల వయసున్న పాకిస్థానీ షేర్ అలీ కేశ్వానీ ఇప్పటికీ చర్లపల్లి కేంద్రం కారాగారంలో మగ్గుతున్నాడు.

ఐఎస్ఐ ఆదేశాలతో వచ్చిన అర్షద్...



పాకిస్థాన్‌లోని రహీమైఖర్‌ఖాన్ జిల్లా ఖాన్‌పూర్‌కు చెందిన అర్షద్ మహమూద్ అలియాస్ అర్షద్ మాలిక్‌ను 2002 నవంబరులో పాక్ ఇంటెలిజెన్స్ సంస్థ ఐఎస్ఐ అధికారులు ఫీర్జీ, లియాఖత్ సంప్రదించారు. మూడు నెలల పాటు వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చి, భారత ఆర్మీ యూనిట్ల సమాచారం అందించడానికి సిద్ధం చేశారు. అర్షద్‌కు పాకిస్థాన్ పాస్‌పోర్ట్ ఇచ్చి బంగ్లాదేశ్ పంపారు. అక్కడ ఐఎస్ఐ ఏజెంట్లు అర్షద్ పేరుతో బంగ్లాదేశ్ పాస్‌పోర్ట్ ఇచ్చి 2003 మార్చిలో బెహరామ్‌పూర్ మీదుగా కోల్‌కతా పంపారు. హైదరాబాద్‌లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవాలని 2003 జూలైలో పాస్‌పోర్ట్ అందుకున్నాడు. దీంతో సిటీకి వచ్చిన అర్షద్ ముత్యాల్‌బాగ్‌లో మకాం ఏర్పాటు చేసుకున్నాడు. చుట్టుపక్కల వారితో తాను వైద్య పరికరాలు అమ్మే చిన్న వ్యాపారినంటూ, కోల్‌కతా నుంచి వచ్చినట్లు చెప్పుకొన్నాడు.

2004లో పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు..

నగరంలోని భద్రతా బలగాలకు చెందిన సున్నిత ప్రాంతాల్లో తిరిగి, వివరాలు సేకరించే అర్షద్ మాలిక్ రాత్రి వేళల్లో వాటిని ఐఎస్ఐకి పంపేవాడు. కింగ్‌కోఠి అగర్వాల్ చాంబర్స్‌లో ఉండే హైదరాబాద్ సైబర్ కేఫ్ నుంచి ఈ-మెయిల్స్ ద్వారా షేర్ చేసేవాడు. ఇందుకు ప్రతిఫలంగా పాకిస్థాన్ నుంచి ఫీర్జీ హవాలా ద్వారా ఎప్పటికప్పుడు ఇతనికి సొమ్ము పంపేవాడు. 2004 మార్చి 9న హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సైబర్ కేఫ్‌లో ఉన్న అర్షద్‌ను పట్టుకున్నారు. ఇతడి నుంచి ఆర్మీ లొకేషన్స్ ఫొటోలు, సికింద్రాబాద్-హైదరాబాద్‌ల్లో ఉన్న ఆర్మీ లొకేషన్స్ స్కెచ్‌లు, ఆర్మీ అధికారుల టెలిఫోన్ డైరెక్టరీలు స్వాధీనం చేసుకున్నారు. తొలుత అబిడ్స్ పోలీసుస్టేషన్‌లో నమోదైన ఈ కేసుల ఆ తర్వాత సిట్‌కు బదిలీ అయింది.

ఇతడి విచారణలో వెలుగులోకి ..

అర్షద్ విచారణ నేపథ్యంలోనే ఇతడికి షేర్ అలీ కేశ్వానీ అనే పాకిస్థానీ సహకరించినట్లు వెలుగులోకి వచ్చింది. ఇతడిని ఉగ్ర ఫైనాన్షియర్‌గా మార్చిన పాకిస్థాన్.. భారత్‌కు పంపింది. ఇక్కడ ఉన్న ఐఎస్ఐ ఏజెంట్లకు ఆర్థిక సాయం చేస్తున్న కేశ్వానీని ఆగ్రా పోలీసులు 2004 జనవరిలోనే అరెస్టు చేశారు. అక్కడ కేసు విచారణ పూర్తి కావడం, జైలు శిక్ష సైతం విధించడంతో సుదీర్ఘ కాలం సిటీకి తీసుకురాలేకపోయారు. అర్షద్‌కు నాంపల్లి కోర్టు 2009లో జీవితఖైదు విధించింది. కేశ్వానీని నగర పోలీసులు 2013లో ఇక్కడికి తీసుకువచ్చారు. 2015 మార్చి 9న ఇతడిపై ఉన్న కేసు వీగిపోయింది. ఇలాంటి వాళ్ల శిక్షాకాలం పూర్తయినా, కేసు వీగిపోయినా జైలు నుంచి బయటకు పంపాలంటే పాకిస్థాన్ సదరు వ్యక్తి తమ పౌరుడే అని అంగీకరించాలి. అర్షద్ తమ జాతీయుడేనని అంగీకరించడంతో 2017లో అతడిని పాక్‌కు పంపేశారు. కేశ్వానీ విషయంలో ఇలా జరగకపోవడంతో ఇప్పటికీ చర్లపల్లి జైలులోనే ఉన్నాడు.

సిటీ.. కొట్టింది సీటీ



- ఎప్‌సెట్ టాప్ టెన్‌లో మనోళ్లే
- మెరిసిన నగర విద్యార్థులు
- ఇంజినీరింగ్‌లో 8 ర్యాంకులు
- ఫార్మసీ, అగ్రికల్చర్‌లో 7 ర్యాంకులు

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ ఎప్‌సెట్ (ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ) టాప్‌టెన్‌లో నగర విద్యార్థులు అత్యధిక ర్యాంకులు సాధించారు. ఇంజినీరింగ్ విభాగంలో ఎనిమిది ర్యాంకులు, అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో ఏడు ర్యాంకులు దక్కించుకున్నారు. ఇంజినీరింగ్ విభాగంలో మొదటి 10 ర్యాంకులూ బాలురకే లభించగా, అందులో రెండు మినహా 8 ర్యాంకులు హైదరాబాదీలే సాధించారు. మిగిలిన ఇద్దరు ర్యాంకర్లు కూడా హైదరాబాద్‌లోని కళాశాలలో చదివి టాప్‌టెన్‌లో నిలిచారు. ఇక అగ్రికల్చర్, ఫార్మసీ టాప్‌టెన్‌లో కూడా తొమ్మిది మంది బాలురు, ఒక బాలికకు ర్యాంకులు దక్కాయి. మొత్తం పది ర్యాంకుల్లో మూడు ర్యాంకులు మినహా మిగిలిన ఏడు ర్యాంకులు హైదరాబాదీలే దక్కించుకున్నారు.

ర్యాంకులు ఇలా..

ఇంజినీరింగ్ విభాగంలో శేరిలింగంపల్లికి చెందిన ఉడగండ్ల రామ్‌చరణ్ రెడ్డికి రెండో ర్యాంకు, నాచారానికి చెందిన మెండె లక్ష్మి భార్గవ్‌కు నాలుగో ర్యాంకు లభించాయి. మాదాపూర్‌లోని మంత్రిరెడ్డి వెంకట గణేశ్ రాయల్‌కు ఐదో ర్యాంకు, సుంకర సాయి రిశాంత్ రెడ్డికి ఆరో ర్యాంకు, కాకతీయ హిల్స్‌కు చెందిన రషిమ్మత్ బండారి ఏడో ర్యాంకు, బండగ్‌పేటకు చెందిన బనిబ్రత మజీకి ఎనిమిదో ర్యాంకు, హైదరాబాద్‌కు చెందిన కొత్త ధనుష్ రెడ్డికి తొమ్మిదో ర్యాంకు, మేడ్చల్‌కు చెందిన కొమ్మ కార్తీక్‌కు పదో ర్యాంకు దక్కాయి.

అగ్రికల్చర్, ఫార్మాలోనూ..

అగ్రికల్చర్, ఫార్మా ఫలితాల్లో మేడ్చల్‌కు చెందిన సాకేత్ రెడ్డి మొదటి ర్యాంకు సాధించారు. మాదాపూర్‌కు చెందిన బ్రాహ్మణి ఐదో ర్యాంకు, కూకట్‌పల్లికి చెందిన గుమ్మడిదల తేజస్ ఆరో ర్యాంకు, నిజాంపేటకు చెందిన కొలను అభిరానంద రెడ్డి ఏడో ర్యాంకు, సరూర్‌నగర్‌కు చెందిన భానుప్రకాశ్ రెడ్డి ఎనిమిదో ర్యాంకు, హైదర్‌గూడకు చెందిన అర్జా శామ్యూల్ సాత్విక్ తొమ్మిదో ర్యాంకు, బాలాపూర్‌కు చెందిన అద్దుల శశికరణ్ రెడ్డి పదో ర్యాంకు సాధించారు.

సిరుల మామిడి

- లక్ష్యానికి మించిన ఆదాయం
- ఉత్తరాది రాష్ట్రాలకు భారీగా ఎగుమతులు
- రూ.222 కోట్ల టర్నోవర్
- సమకూరిన ఆదాయం రూ.2.22 కోట్లు
- బాటసింగారం మార్కెట్ రికార్డు



సాక్షి, సిటీబ్యూరో: పండ్లలో రారాజు మామిడి. వేసవి వచ్చిందంటే చాలు ప్రతి ఒక్కరూ మామిడి పండ్ల రుచులను ఆస్వాదించాలనుకుంటారు. వివిధ ప్రాంతాల్లో పండే ప్రత్యేక రకాలు సైతం హైదరాబాద్ మార్కెట్లలో లభిస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోనే అతిపెద్ద మార్కెట్‌గా పేరుగాంచిన బాటసింగారం మార్కెట్‌కు మామిడి పండ్ల సీజన్ సిరుల వర్షం కురిపిస్తోంది. ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.222 కోట్ల టర్నోవర్‌తో రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరింది. స్థానిక మార్కెట్‌లో లభించే 11 రకాల పండ్లు రాష్ట్ర సరిహద్దులు దాటి ఉత్తర భారతంలోని పలు రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. గ్రేడ్‌ను బట్టి కిలో రూ.70 నుంచి రూ.120 వరకు ధరలు పలుకుతున్నాయి.

ఎటుచూసినా మామిడి రాశులే..

బాటసింగారం పండ్ల మార్కెట్ యార్డులో ఎటు చూసినా నిలువెత్తు మామిడి రాశులు దర్శనమిస్తున్నాయి. వందలాది మంది కార్మికులు నిత్యం పండ్లను గ్రేడింగ్ చేసే పనుల్లో నిమగ్నమవుతున్నారు. మార్కింగ్ చేసిన ట్రేలను లారీల్లో నింపే పనిలో కళాసీలు.. లావాదేవీల లెక్కలు చూసుకునే వర్తకులు, రైతులు అక్కడ అంతా బిజీబిజీగా కనిపిస్తారు. రూ.వందల కోట్ల టర్నోవర్ జరుగుతోంది. లక్షల క్వింటాళ్ల మామిడి పండ్లు ఎగుమతి అవుతున్నాయి. నిత్యం 1,500 వరకు వాహనాలు మామిడి పంటతో వచ్చిపోతున్నాయి.

- ఈ ఏడాది ఇప్పటి వరకు 7.34 లక్షల క్వింటాళ్లు వచ్చినట్లు మార్కెట్ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా, గుంటూరు, అనంతపురం, తెలంగాణలోని మహబూబ్‌నగర్, ఖమ్మం, నల్లగొండ, మెదక్, కర్ణాటక రాష్ట్రాల నుంచి మామిడి బాటసింగారం మార్కెట్‌కు వస్తోంది. గ్రేడింగ్ చేసిన సుమారు 70 శాతం పండ్లను రాజస్థాన్, పంజాబ్, ఉత్తరప్రదేశ్, హరియాణా, మహారాష్ట్ర, గుజరాత్, ఢిల్లీ, కర్ణాటక ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. మిగతా 30 శాతం స్థానిక అవసరాలకు వినియోగిస్తున్నారు.

రికార్డు స్థాయి అమ్మకాలు నమోదు..



ఈ సీజన్‌లో మామిడి పండ్లు అంచనాలకు మించి వస్తున్నాయి. రికార్డు స్థాయిలో అమ్మకాలు ఉంటాయని ఆశిస్తున్నాం. బంగినపల్లి ఇతర రకాలు ఉత్తర భారత దేశంలో మంచి గిరాకీ ఉంది. సుమారు 75 శాతం ఎగుమతి అవుతున్నాయి. మార్కెట్‌కు వచ్చే రైతులు, వర్తకులకు అనువైన వాతావరణాన్ని కల్పించాం. రైతులు తమ ఉత్పత్తులను అమ్ముకోవడానికి ఇదే ఉత్తమమైన మార్కెట్ అని నమ్ముతున్నారు. అనుకున్నట్లుగానే మంచి ధర లభిస్తుంది ఇతర రాష్ట్రాల నుంచి రైతులు ఇక్కడకు తమ పండ్లను తెస్తున్నారంటేనే ఇక్కడ పరిస్థితులు ఎంత సానుకూలంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. మరో నెల రోజుల వరకు పండ్లు వచ్చే అవకాశం ఉంది. గతంలో ఎన్నడూ లేని గణాంకాలు చూస్తాం.

– చిలక మధుసూదన్‌రెడ్డి, గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్

- గతంతో పోల్చితే రాష్ట్రంలో మామిడి దిగుబడులు తగ్గినా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే దిగుమతులు ఆ స్థానాన్ని భర్తీ చేస్తున్నాయి. గత ఏడాది ఇదే సమయంలో బాటసింగారం మార్కెట్‌కు 6,99,886 క్వింటాళ్ల మామిడి పండ్లు రాగా, ఈ ఏడాది ఈ నెల 10వ తేదీ నాటికి 7,34,154 క్వింటాళ్ల మామిడి వచ్చిందని మార్కెట్ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. సుమారు 64 వేల మంది రైతులు తమ ఉత్పత్తులను అమ్ముకున్నారు. రూ.222 కోట్ల టర్నోవర్ అయ్యింది. ఇందులో 1 శాతం రుసుము కింద మార్కెట్‌కు రూ.2.22 కోట్ల ఆదాయం సమకూరింది.

సిఫార్సులకే పెద్దపీట!

ఇందిరమ్మ ఇళ్లలో ఇష్టారాజ్యం

- దరఖాస్తులు, సర్వేలు.. అన్నింటికీ తూట్లు
- నిబంధనలకు విరుద్ధంగా జాబితాలు
- నేతల అనుయాయులకే అందలం
- నెరవేరని పేదల సొంతింటి కల



ఇబ్రహీంపట్నంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పారదర్శకంగా జరగాల్సిన ఇందిరమ్మ ఇళ్ల అర్హుల ఎంపిక పూర్తిగా రాజకీయ కోణంలో జరిగినట్లు.. సిఫార్సులకే పెద్దపీట వేసినట్లు విమర్శలు వస్తున్నాయి. అధికారుల క్షేత్రస్థాయి సర్వేకు భిన్నంగా అర్హుల జాబితా రూపొందినట్లు ఆరోపణలు లేకపోలేదు. మొదటి విడత పైలెట్ ప్రాజెక్టులో భాగంగా కొంత వరకు అర్హులకే ఇళ్లు దక్కినప్పటికీ.. రెండో విడత జాబితా తయారీ పూర్తిగా ఎమ్మెల్యే, వారి అనుచరుల కనుసన్నల్లో పూర్తయింది. ఇందిరమ్మ కమిటీలు సిఫార్సు చేసిన కార్యకర్తలు/ఓటర్లకే ఇళ్లను కట్టబెట్టినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అర్హులకు బదులు అనర్హులు వచ్చి చేరినట్లు సమాచారం. విషయం అధికారులకు తెలిసీ ఏమీ చేయలేక..వారు సూచించిన పేర్లను లబ్ధిదారుల జాబితాలో చేర్చుతున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా పేదల సొంతింటి కల నెరవేరకుండా పోతోంది.

రాజకీయ జోక్యంతో..

ప్రజాపాలనలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం జిల్లా వ్యాప్తంగా 80.54 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. కులగణన/ఇంటింటి సర్వేలో భాగంగా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అర్హులను గుర్తించారు. సర్వేలో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వకూడదనే ఉద్దేశంతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, జియో ట్యాగింగ్ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించారు. ఎంపిక చేసిన బృందాలు దరఖాస్తు దారుని ఇంటికి చేరుకుని వివరాలు సేకరించాయి. ఒక కుటుంబానికి ఒకే ఇల్లు కేటాయించేలా జాబితా రూపొందించారు. అర్హులైన లబ్ధిదారుల జాబితాను తొలుత ఎంపీడీఓలు/ మున్సిపల్ కమిషనర్ల లాగిన్‌లో ఉంచారు. గ్రామ సభలు/ వార్డు సభల్లో ఆయా లబ్ధిదారుల జాబితాను చదివి వినిపించారు. తీరా తుదిజాబితా రూపకల్పనలో రాజకీయ పైరవీకారులకే పెద్దపీట వేసినట్లు తెలిసింది. తొలి విడతలో 15 వేల ఇళ్లు మంజూరు కాగా, వీరిలో ఇప్పటికే ఏడు వేల మందిని ఎంపిక చేసి, వారికి ధ్రువీకరణ పత్రాలు సైతం జారీ చేశారు. మిగిలిన వారికి మరో రెండు మూడు రోజుల్లో అందజేయాల్సి ఉంది. పారదర్శకంగా, నిజాయితీగా పేదలకు దక్కాల్సిన ఇళ్లు రాజకీయ జోక్యంతో పార్టీ నాయకులు తన్నుకుపోతున్నారు. ఎమ్మెల్యే చెప్పిన వారి పేర్లను మాత్రమే జాబితాలో చేర్చుతుండటం.. ఎండీఓ, మున్సిపల్ కమిషనర్లు వాటినే ధ్రువీకరిస్తుండటం.. కలెక్టర్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాటికి ఆమోదముద్ర వేస్తుండటం వివాదాస్పదంగా మారుతోంది.

సర్వేలో భాగంగా గుర్తించిన తాత్కాలిక ఇళ్లు

నివాసాలు	లక్షల్లో
తాటి ఆకులు/ గడ్డితో ఏర్పాటు చేసినవి	0.66
సగం కూలిపోయి, టార్పలిన్‌తో కప్పినవి	0.95
మట్టిగోడలతో కూడిన సిమెంట్ రేకులవి	2.69
మట్టిగోడలు జీఐ షీట్స్‌తో కూడినవి	2.43
మట్టిగోడలతో కూడిన పెంకుటిళ్లు	2.59
సిమెంట్ ఇటుకలు టార్పలిన్ కవర్లు	0.33
టైల్డ్ రూఫ్స్ విత్ బ్రిక్స్‌వాల్స్	2.08
సిమెంట్ ఇటుకలు/రేకులు	2.04
సిమెంట్ ఇటుకలు/జీఐ షీట్స్	2.25
మట్టితో కూడిన మిద్దె ఇళ్లు	1.75
ఆర్‌సీసీ రూఫ్ రెంట్ ఇళ్లు	0.55

ఇందిరమ్మ ఇళ్ల కోసం జిల్లా వ్యాప్తంగా అందిన దరఖాస్తులు

వచ్చిన మొత్తం దరఖాస్తులు:	80.54 లక్షలు
అధికారులు పరిశీలించినవి:	71.51 లక్షలు
వీరిలో ఖాళీ స్థలాలు ఉన్నవారు:	40.86 లక్షలు
అర్హత సాధించిన లబ్ధిదారులు:	18.32 లక్షలు
జిల్లాకు మంజూరైన మొత్తం ఇళ్లు:	24,000
తొలి విడతలో మంజూరైనవి:	15,000

అందని ఆర్థిక సాయం.. పెరిగిన సిమెంట్ ధర

మరోవైపు ఇందిరమ్మ ఇల్లు మంజూరై, సొంత ఖర్చులతో బేస్‌మెంట్ వరకు పూర్తి చేసిన వారికి ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఆర్థిక సహకారం అందకపోవడంతో వారు అయోమయంలో పడి పోయారు. ఇప్పటికే చేతిలో ఉన్న సొమ్ము పూర్తిగా ఖర్చు కాగా, కొత్తగా మార్కెట్లో అప్పు పుట్టని పరిస్థితి. అంతేకాదు ఇంటి నిర్మాణం 600 చదరపు అడుగుల విస్తీర్ణానికి మించకూడదనే నిబంధనకు తోడు ఇటీవల పెరిగిన సిమెంట్, కూలీ ధరలు కూడా లబ్ధిదారుల పాలిట శాపంగా మారుతున్నాయి. ఏప్రిల్ నెలాఖరు వరకు సిమెంట్ బస్తా రూ.290 నుంచి రూ.300 వరకు ఉండగా, ప్రస్తుతం ఒక్కో బస్తా ధర (కంపెనీని బట్టి) రూ.30 నుంచి రూ.50 వరకు పెరిగింది. పెరిగిన ధరలు భారంగా మారనుండటంతో మెజార్టీ లబ్ధిదారులు పిల్లరు గుంతలు, బేస్‌మెంట్ దశలోనే నిర్మాణాలను నిలిపివేయడం గమనార్హం. ఇదిలా ఉంటే కొంత మంది మధ్యవర్తులు కొత్తగా ఇళ్లు కట్టుకోవాలని భావించే ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేని సాధారణ మధ్య తరగతి ప్రజలకు ఇళ్లు మంజూరు చేయిస్తామని ఆశ చూపించి, వారి నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

తహసీల్దార్ నోటీసులతో హైడ్రాకు సంబంధం లేదు

- ఎంపీ ఈటల వ్యాఖ్యలు దురదృష్టకరం
- ఏవీ రంగనాథ్

సాక్షి, సిటీబ్యూరో: బాచుపల్లి తహసీల్దార్ ఇటీవల రెండు అపార్ట్‌మెంట్లకు ఇచ్చిన నోటీసులతో హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీకి (హైడ్రా) ఎలాంటి సంబంధం లేదని కమిషనర్ ఏవీ రంగనాథ్ స్పష్టం చేశారు. దీనిపై మేడ్చల్ కలెక్టర్‌ను సంప్రదించామని, ఆ నోటీసులు ఎందుకు ఇచ్చారో తహసీల్దార్‌ను వివరణ అడగాలని కోరినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కాలంలో ప్రతీ నోటీస్, కూల్చివేతల్ని హైడ్రాకు ఆపాదిస్తూ ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని రంగనాథ్ పేర్కొన్నారు. కబ్జాలు చేసే బడా బాబుల పట్ల కఠినంగా ఉండే హైడ్రా.. సామాన్యులకు అండగా ఉంటుందని పునరుద్ఘాటించారు. కలెక్టర్‌కు కూడా తెలియకుండా తహసీల్దార్ నోటీసులు ఇచ్చారంటూ ఓ వైపు చెబుతున్న ఎంపీ ఈటల రాజేందర్.. మరోవైపు హైడ్రాను దోషిగా నిలబెట్టాలని ప్రయత్నించడం దురదృష్టకరమని రంగనాథ్ పేర్కొన్నారు. ఎంపీ రాజేందర్ మాటలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా, అయోమయానికి గురిచేసేలా ఉన్నాయన్నారు. హైడ్రా పని తీరుపై ప్రజలకు పూర్తి స్పష్టత వస్తున్న ఈ తరుణంలో ఎంపీ వ్యాఖ్యలు అయోమయానికి గురి చేసేలా ఉన్నాయని హైడ్రా కమిషనర్ అభిప్రాయపడ్డారు. ఇటీవల సచివాలయంలో ఎంపీ ఈటలను కలిసిన సందర్భంలో హైడ్రా కార్యకలాపాలను ఆయనకు వివరించామన్నారు. 2024 జూలైకి ముందు కట్టిన నివాసాల జోలికి హైడ్రా వెళ్లొద్దని రంగనాథ్ మరోసారి స్పష్టం చేశారు. వీటితో పాటు అనుమతులు తీసుకున్న వాణిజ్య సముదాయాలను కూడా హైడ్రా తొలగించదన్నారు. పేదలు, సామాన్యులను హైడ్రా ఏ దశలోనూ ఇబ్బంది పెట్టదని రంగనాథ్ హామీ ఇచ్చారు.

చెరువులో దూకి వృద్ధురాలి ఆత్మహత్య


సుశీల మృతదేహం

శామీర్‌పేట్: అనారోగ్యంతో బాధపడుతూ మనస్తాపానికి లోనైన ఓ వృద్ధురాలు చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శామీర్‌పేట పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నగరంలోని రసూల్‌పుర కు చెందిన కాగితాల సుశీల (60) కూలీ పని చేసి జీవనం సాగిస్తోంది. గత కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం పనికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి శామీర్‌పేట పెద్దచెరువు వద్దకు వచ్చింది. ఆదివారం ఉదయం చెరువులో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీపులు పంచనామ నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి బలవన్మరణం

చిలకలగూడ : ఆన్‌లైన్‌ బెట్టింగులకు అలవాటు పడి ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చిలకలగూడ ఠాణా పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సబిత కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్‌కు చెందిన బూక్యా లింగన్న (26) నగరంలోని ఓ ప్రైవేటు బ్యాంకులో సేల్స్‌ సర్వీస్‌ ప్రొవైడర్‌గా పనిచేస్తూ, భార్య పూజిత, రెండేళ్ల కుమారునితో కలిసి సీతాఫల్‌మండి మేడిబావిలో నివాసం ఉంటున్నాడు. గర్భవతి అయిన అతడి భార్య పూజిత ప్రసవం కోసం పుట్టింటికి వెళ్లింది. శనివారం ఉదయం నుంచి ఆమె పలుమార్లు ఫోన్‌ చేసినా లింగన్న లిఫ్ట్‌ చేయకపోవడంతో అనుమానం వచ్చి అతడి స్నేహితుడు బిక్షుకు ఫోన్‌ చేసి సమాచారం అందించింది. ఆదివారం సాయంత్రం అతను లింగన్న ఇంటికి వెళ్లి తలుపు కొట్టినా స్పందించలేదు. స్థానికుల సహాయంతో తలుపులు బద్దలు కొట్టి చూడగా లింగన్న సీలింగ్‌ ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని కనిపించాడు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు, పోలీసులకు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహం నుంచి తీవ్ర దుర్వాసన వస్తుండటంతో రెండు రోజుల క్రితమే అతను ఉరి వేసుకుని ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. ఆన్‌లైన్‌ బెట్టింగ్‌లకు అలవాటు పడిన లింగన్న ఆర్థికంగా నష్టపోయాడని, అప్పులు తీర్చలేక ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చునని పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. మృతుని సోదరి నీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సంస్కరణలతోనే ఖైదీల సంక్షేమం

- మంత్రి శ్రీధర్‌బాబు
- చర్లపల్లి జైలులో ఖైదీల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్ ముగింపు
- ఛాంపియన్‌గా నిలిచిన చర్లపల్లి సెంట్రల్ జైల్ టీం
- రన్నరప్‌గా హైదరాబాద్ సెంట్రల్ జైల్


కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్ మహేందర్‌రెడ్డి తదితరులు

కుషాయిగూడ: ఖైదీల సంక్షేమం కోసం తెలంగాణ జైళ్లశాఖ చేపడుతున్న సంస్కరణలతో రాష్ట్రంలో జైళ్లు పునరావాస కేంద్రాలను తలపిస్తున్నాయని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. తెలంగాణ జైళ్లశాఖ ఆధ్వర్యంలో చర్లపల్లి కేంద్ర కారాగారంలో మూడు రోజులుగా కొనసాగుతున్న ఖైదీల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ మీట్ -2025 ముగింపు కార్యక్రమంలో ఆదివారం ప్రభుత్వ విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి, జైళ్లశాఖ డీజీపీ డాక్టర్ సౌమ్య మిశ్రాలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఖైదీల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ జైళ్లశాఖ అధికారులు అంకితభావంతో పని చేస్తున్నారన్నారు. అనుకోని పరిస్థితుల కారణంగా జైళ్లలో శిక్ష అనుభవిస్తున్న ఖైదీల్లో మార్పు తీసుకురావాలన్నారు. ఆ దిశగా జైళ్లశాఖ అమలు చేస్తున్న సంస్కరణలు, అందిస్తున్న పరిజ్ఞానాన్ని ఖైదీలు సద్వినియోగం చేసుకుని జైలు నుంచి బయటికి వచ్చిన తర్వాత ఉన్నతంగా జీవించాలన్నారు. జైలు పరిశ్రమల ఉత్పత్తులు బహుళ జాతి ప్రమాణాలకు ఏ మాత్రం తగ్గకుండా ఉండటం అభినందనీయమన్నారు. ఖైదీలతో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకుల్లో నిజాయితీతో సేవలందిస్తున్నారన్నారు. ఖైదీలు నిత్యం యోగా, ధ్యానం వంటి నియమాలను పాటించి క్రమశిక్షణను అలవరుచుకోవాలన్నారు. తెలంగాణ జైళ్లశాఖ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాతృ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చాంపియన్‌గా నిలిచిన చర్లపల్లి సెంట్రల్‌జైల్ జట్టు, రన్నరప్‌గా నిలిచిన సెంట్రల్ జైల్ హైదరాబాద్‌లకు ట్రోఫీలను ప్రదానం చేసి అభినందించారు.


గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

ఖైదీలు పరివర్తన చెందాలి..

క్షణికావేశంలో నేరాలకు పాల్పడి జైలుశిక్ష అనుభవిస్తున్న ఖైదీలు పరివర్తన చెందాలని ప్రభుత్వ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. జైలు జీవితంలో మంచితనాన్ని అలవరుచుకుని ప్రశాతంగా జీవించాలన్నారు. డీజీపీ సౌమ్య మిశ్రా మాట్లాడుతూ మీట్‌ను పురస్కరించుకుని ఖైదీలకు రెండు నెలల పాటు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. శిక్షణ సమయంలో వారికి కావాల్సిన న్యూట్రీషియన్ ఫుడ్ అందజేశామన్నారు. మూడు రోజుల పాటుగా నిర్వహించిన ఇండోర్, అవుట్‌డోర్ క్రీడలతో పాటు సాంస్కృతిక పోటీల్లో ఖైదీలు క్రమశిక్షణతో పాల్గొని వారి అంకితభావాన్ని చాటరన్నారు. కార్యక్రమంలో చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్, ఉప్పల్ ఇన్‌చార్జీలు వజ్రేష్ యాదవ్, మందముల పరమేశ్వర్‌రెడ్డి, జైళ్లశాఖ అధికారులు రాజేష్, మురళీబాబు, సంపత్, శ్రీనివాస్, శివకుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాత కరెన్సీ మార్పిడికి యత్నం

- రూ.99 లక్షల నగదు స్వాధీనం
- నలుగురి అరెస్టు..మరో నలుగురి పరారీ

సనత్‌నగర్: రద్దయిన కరెన్సీ నోట్లను మార్చేందుకు యత్నిస్తున్న నలుగురు వ్యక్తులను బేగంపేట పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి రూ.99 లక్షల విలువైన కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. బేగంపేట ఎస్‌ఐ జయచందర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.టీవోలీ ఎక్స్‌ట్రీమ్ థియేటర్ వద్ద రద్దయిన పాత నోట్ల మార్పిడీకి యత్నిస్తున్నట్లు సమాచారం అందడంతో శనివారం మధ్యాహ్నం ఎస్‌ఐ శ్రీధర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా వేపూర్ గ్రామానికి చెందిన మల్లేశ్వర్, బుర్రా శివకుమార్, పుట్టపల్లి రవీందర్‌రెడ్డి, గొల్లమందల రవిలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.99 లక్షల విలువైన రద్దయిన రూ.1000, రూ.500ల కరెన్సీ నోట్లతో పాటు కారు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. 20 శాతం కమీషన్ ప్రాతిపదికన వీరు మరికొందరితో కలిసి పాత నోట్ల మార్పిడికి యత్నిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నలుగురు నిందితులను అరెస్టు చేయగా, పరారీలో ఉన్న మరో నలుగురి కోసం గాలిస్తున్నారు. బేగంపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైద్యుల నిర్లక్ష్యం కారణంగా యువకుడి మృతి ?

- పోలీసులకు ఫిర్యాదు
- ఆస్పత్రి యాజమాన్యం, వైద్యులపై కేసు నమోదు.


పరమేష్ (ఫైల్)

దుండిగల్: వైద్యుల నిర్లక్ష్యం కారణంగా ఓ యువకుడు మృతి చెందాడని ఆరోపిస్తూ అతడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆస్పత్రి వైద్యులు, యాజమాన్యంపై దుండిగల్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. సూర్యాపేట, ఎరకారం గ్రామానికి చెందిన కుర్ర పరమేష్(26) హయత్‌నగర్‌లో ఉంటూ ప్యాకర్స్ అండ్ మూవర్స్‌లో కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఈ నెల 5న అతను బహదూర్‌పల్లిలోని ఓ ఇంట్లో ఇంటి సామన్లు తరలించేందుకు వచ్చాడు. ఈ సందర్భంగా అతడి కాలికి రేకు తగిలి నరం తెగడంతో తీవ్ర రక్తస్రావం అయింది. వెంటనే అతడిని బహదూర్‌పల్లిలోని ఎస్‌వీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. రెండు రోజుల చికిత్స అనంతరం ఆసుపత్రి యాజమాన్యం బాధితుడు కోలుకున్నాడని రేపు డిశ్చార్జ్ చేస్తామని చెప్పారు. అయితే నాలుగు రోజులు గడిచినా అతడిని డిశ్చార్జ్ చేయకపోవడంతో కుటుంబ సభ్యులు వైద్యులను నిలదీశారు. పరమేష్ తలలో రక్తం గడ్డ కట్టిందని, ఆపరేషన్ చేశామని, అతని పరిస్థితి సీరియస్ గా ఉందని చెప్పాడు. దీంతో అతడిని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఈ నెల 10న మృతి చెందాడు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మృతుడి సోదరుడు మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఎస్‌వీ ఆస్పత్రి యాజమాన్యం, వైద్యులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని...

- యువకుడి ఆత్మహత్య


భార్యతో రవి (ఫైల్)

దుండిగల్: చిన్న నాటి స్నేహితురాలిని ప్రేమించి పెద్దలను ఎదిరించి పెళ్లి చేసుకున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆమె పుట్టింటికి వెళ్లిపోవడంతో మనస్తాపానికిలోనైన ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, పెద్దకొత్తపల్లి మండలం, యాపర్ల గ్రామానికి చెందిన తిమ్మరాజు రవి(25) కుటుంబం కొన్నేళ్ల క్రితం నగరానికి వలస వచ్చి కూకట్‌పల్లి, శంషీగూడలో నివాసముంటోంది. రవి కూకట్‌పల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న సమయంలో తన స్నేహితురాలు నీలవేణితో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. రెండేళ్ల క్రితం వారు పెద్దలను ఎదిరించి ఆర్య సమాజ్‌లో పెళ్లి చేసుకున్నారు. గత 8 నెలలుగా వారు బౌరంపేటలోని ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్నారు. రవి కారు డ్రైవర్‌గా పని చేస్తుండగా నీలవేణి ఇంటి వద్దనే ఉంటుంది. కొద్ది రోజులుగా వీరి మధ్య మనస్పర్థలు తలెత్తాయి. ఈ నెల 10న భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. అదే రోజు మధ్యాహ్నం తన ఇంటికి వచ్చిన తల్లితో కలిసి నీలవేణి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన రవి తన తల్లికి ఫోన్ చేసి తన భార్య ఇంటి నుంచి వెళ్లిపోయిందని, తనకు బతకాలని లేదని చెప్పి విలపించాడు. దీంతో ఇంటికి రావాలని కోరగా ఫోన్ పెట్టేశాడు. ఆదివారం ఉదయం ఫోన్ చేసినా స్పందించకపోవడంతో తల్లి, సోదరుడు బౌరంపేటకు వచ్చి చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనుమతి లేకుండా మద్యం వినియోగం

- ఎక్సైజ్ పోలీసుల దాడులు


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

మొయినాబాద్: ఎలాంటి అనుమతి లేకుండా ఫంక్షన్‌లో మద్యం వినియోగిస్తున్న ఫాంహౌస్‌పై ఎక్సైజ్ పోలీసులు దాడి చేశారు. ఢిల్లీ, గోవా రాష్ట్రాలకు చెందిన రూ.4 లక్షల విలువ చేసే నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని తోలుకట్టలో నగరానికి చెందిన తేజా రెడ్డి ఫాంహౌస్ ఉంది. శనివారం రాత్రి ఇక్కడ ఓ ఫంక్షన్ నిర్వహించారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఫంక్షన్‌లో మద్యం వినియోగిస్తున్నట్లు సమాచారం అందుకున్న శంషాబాద్ డీటీఎఫ్ ఎక్సైజ్ పోలీసులు అర్ధరాత్రి ఫాంహౌస్‌పై దాడి చేశారు. ఫంక్షన్‌లో వినియోగిస్తున్న ఢిల్లీకి చెందిన 50 బ్లాక్ లేబులు బాటిళ్లు, గోవాకు చెందిన నాలుగు యివాస్‌రీగల్ బాటిళ్లు, తెలంగాణకు చెందిన 3 లిక్కర్ బాటిళ్లు, 12 బీర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుందని తెలిపారు. నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫార్మా ఠాణా తరలింపు..

- కుర్మిద్ద తాత్కాలిక భవనంలోకి మార్పు
- ప్రస్తుతం నక్కర్తమేడిపల్లిలో కొనసాగుతున్న పీఎస్
- మార్చొద్దని గ్రామస్తుల ఆందోళన



నక్కర్తమేడిపల్లిలో కొనసాగుతున్న ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్

యాచారం: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఫార్మా సిటీ ఏర్పాటుకు రంగం సిద్ధం చేసింది. అందులో భాగంగా భూ సేకరణకు శ్రీకారం చుట్టింది. దీనిని వ్యతిరేకిస్తూ.. రైతులు ఆందోళనలు చేశారు. నిరసన కార్యక్రమాలు పెరుగుతున్న నేపథ్యంలో ఫార్మా భద్రతకు స్థానికంగా పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. అనుకున్నదే తడవుగా.. ఫార్మా భూములు సేకరించిన యాచారం, కందుకూరు మండలాల పరిధి 20 గ్రామాలు, వాటి అనుబంధ గ్రామాలను కలుపుతూ రాచకొండ కమిషనరేట్ పరిధి నక్కర్తమేడిపల్లిలో అద్దె భవనంలో "హైదరాబాద్ గ్రీన్ ఫార్మా సిటీ ఠాణా"ను ఏర్పాటు చేసింది. ఒక సీఐ, ఎస్‌ఐలు, 30 మంది పోలీస్ సిబ్బందిని నియమించింది. ప్రస్తుతం పోలీసు పహారాలో నెల రోజులుగా ఫార్మా భూముల సర్వే, ఫెన్సింగ్ పనులు కొనసాగుతున్నాయి.

పదిరోజుల్లో..

ఫార్మాసిటీ పీఎస్‌ను యాచారం మండలం కుర్మిద్దకు తరలించనున్నారు. గతంలో పోలీస్ అవుట్ పోస్టును ఏర్పాటు చేసిన భవనంలోకి మార్చనున్నారు. అందుకు తగిన ఏర్పాట్లు జరుగుతుండగా.. సీఐ లిక్కి కృష్ణంరాజు దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజులు ఈ భవనాన్ని పరిశీలించారు. మరో రెండు మూడు రోజుల్లో పనులు పూర్తి కానుండగా.. పది రోజుల వ్యవధిలో పీఎస్‌ను మార్చేందుకు పోలీస్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

'నెట్ జీరో సిటీ'గా..

గత ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన ఫార్మా సిటీని రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్.. అవే భూముల్లో ఫ్యూచర్ సిటీకి శ్రీకారం చుట్టింది. అయితే ఫార్మాను రద్దు చేసి, ఠాణా పేరు అదే ఉంటే ప్రజలు అయోమయానికి గురయ్యే అవకాశం ఉందని భావించిన పోలీసు యంత్రాంగం.. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్‌ను పేరును "నెట్ జీరో సిటీ పీఎస్"గా మార్చేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. దీంతో కుర్మిద్దలోనూ పూర్వ పేరుతో ప్రజలకు సేవలు అందించాలని అధికారులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా.. నక్కర్తమేడిపల్లి నుంచి పోలీస్ స్టేషన్ తరలించవద్దని ఆ గ్రామస్తులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

అందరికీ అందుబాటులో..



ఫార్మాసిటీ పీఎస్‌ను అందరికీ అందుబాటులో ఉండే విధంగా యాచారం మండలం మధ్యలో ఉన్న కుర్మిద్ద గ్రామానికి మార్చబోతున్నాం. అక్కడి తాత్కా లిక భవనంలో పీఎస్‌కు తగిన ఏర్పాట్లు పూర్తి కావచ్చాయి. పది రోజుల్లో ఠాణాను తరలిస్తాం. ఫార్మా పీఎస్‌ను నెట్ జీరో సిటీగా పేరు మార్చేందుకు ప్రభుత్వానికి ప్రపోజల్ పంపించాం.

– లిక్కి కృష్ణంరాజు, సీఐ, ఫార్మాసిటీ పీఎస్

హాష్ ఆయిల్ పట్టివేత..

కుత్బుల్లాపూర్: ఓ వ్యక్తి నుండి రూ.3 లక్షల విలువ చేసే హాష్ ఆయిల్‌ను ఎస్‌ఎఫ్‌టీపీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.. కుత్బుల్లాపూర్ అయోధ్యనగర్‌లో హాష్ ఆయిల్ విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌టీఎఫ్‌ఏ టీమ్ లీడర్ అంజిరెడ్డి నేతృత్వంలో ఆదివారం దాడులు నిర్వహించి మహదేవపురానికి చెందిన సుభాష్, మల్కాజ్‌గిరికి చెందిన రామచంద్రరాజును అదుపులోకి తీసుకున్నారు. నవీన్‌రాజు అనే మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 300 గ్రాముల హాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నామని, దాని విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.3 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.

1.2 కేజీల గంజాయి పట్టివేత

దూల్‌పేట్‌లోని రహీంపురాలో ఎస్‌ఎఫ్‌టీపీ టీమ్ దాడులు నిర్వహించి అర్జున్ సింగ్ అనే వ్యక్తి నుంచి 1.2 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సంజు అనే మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు.

వ్యాపారి ఆత్మహత్య


ప్రశాంత్ కుమార్ మృతదేహం

సికింద్రాబాద్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఓల్డ్ అల్వాల్ మంగాపురం కాలనీకి చెందిన పీచర ప్రశాంత్‌కుమార్(48) వృత్తి రీత్యా వ్యాపారి. కొంత కాలంగా అతను అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీనికి తోడు అతడి తల్లి కేన్సర్‌తో ఇబ్బంది పడుతోంది. దీంతో మనస్తాపానికి లోనైన అతను ఈ నెల 8న గుండ్ల పోచంపల్లి, బొల్లారం రైల్వేస్టేషన్ల మధ్య సిద్ధిపేట, మల్కాజిగిరి ప్యాసింజర్ రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహం వద్ద లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుని భార్య వాసంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చాక్లెట్లు దొంగిలించిన వ్యక్తిపై కేసు

వెంగళరావునగర్: సూపర్‌మార్కెట్‌లో చాక్లెట్లు దొంగిలించిన యువకుడిని మధురానగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్‌కాలనీలోని కేపీఎన్ సూపర్‌మార్కెట్‌కు గత నెల 28న ఓ వ్యక్తి వచ్చి గుట్టుచప్పుడు కాకుండా దాదాపు రూ.10వేలు విలువ చేసే చాక్లెట్లను కవర్‌లో నింపుకుని బిల్లు చెల్లించకుండా వెళ్లిపోయాడు. అనంతరం లెక్కలు చూసుకున్న మేనేజర్ ఇతర సిబ్బంది సీసీ కెమెరాలను పరిశీలించి గుర్తుతెలియని వ్యక్తి చాక్లెట్లు దొంగిలించాడని గ్రహించారు. అదే వ్యక్తి ఆదివారం కూడా సూపర్‌మార్కెట్‌కు వచ్చాడు. దాదాపు రూ.3వేల విలువైన చాక్లెట్లను తీసుకున్నాడు. ఈ క్రమంలో సూపర్‌మార్కెట్‌లో పని చేస్తున్న సిబ్బంది అతడిని గుర్తుపట్టి మేనేజర్‌కు తెలియజేశారు. మేనేజర్ ఉదయ్‌కిరణ్ మధురానగర్ పీఎస్‌కు ఫిర్యాదు చేయగా పోలీసులు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

లారీ డ్రైవర్‌పై అకారణంగా దాడి

ఇద్దరిపై కేసు నమోదు

వెంగళరావునగర్: మద్యం సేవించిన ఇద్దరు ఆటో డ్రైవర్లు అకారణంగా చెత్త తరలించే లారీ డ్రైవర్‌పై దాడి చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీరాంనగర్‌లో నివాసం ఉంటున్న చంద్రయ్య శనివారం రాత్రి చెత్త తరలించడానికి యార్డులోకి వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి చంద్రశేఖర్ అనే ఆటో డ్రైవర్ వచ్చి లారీని పక్కకు తీయాలని కేకలు వేశాడు. కొద్దిసేపు ఆగమని చెప్పగా లారీ డ్రైవర్, హెల్పర్లపై గొడవ పడ్డాడు. మద్యం సేవించి ఎందుకు ఆటో నడుపుతున్నావని లారీ డ్రైవర్ ప్రశ్నించగా అతడిపై దాడి చేశాడు. అంతేగాకుండా ఫోన్ చేసి నర్సింహా అనే మరో వ్యక్తిని పిలిపించాడు. అతను కూడా లారీ డ్రైవర్‌పై దాడి చేశాడు. దీంతో లారీ డ్రైవర్ చంద్రయ్యకు గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం బాధితుడు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు?

కేశంపేట: గుర్తు తెలియని వ్యక్తులు గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టిన సంఘటన మండల పరిధిలోని వేములనర్వ గ్రామ శివారులోని పాత బీరప్ప దేవాయలం సమీపంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములనర్వ గ్రామం నుంచి అల్వాల వైపు వెళ్లే దారిలో పాత బీరప్ప దేదాలయం సమీపంలో ఓ రైతుకు చెందిన వ్యవసాయ పొలంలో గుర్తు తెలియని వ్యక్తులు మూడు రోజుల క్రితం జేసీబీ సాయంతో గుంతను తీసి పూడ్చివేశారు. ఆదివారం సమీపంలోని రైతులు గుర్తించి గ్రామస్తులకు సమాచారం అందించారు. గుంత సమీపంలో పూజా సామగ్రితో పాటు నిమ్మకాయలు, గుమ్మడికాయలు కన్పించాయి. ఓ కుండను పగులగొట్టిన ఆనవాళ్లు కన్పించాయి. గతంలో పాత బీరప్ప గుడి సమీపంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. సమాచారం అందుకున్న సీఐ నరహరి సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. గుంత తీసి మళ్లీ పూడ్చిన ఆనవాళ్లు ఉన్నట్టు తెలిపారు.

పాలిసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

మేడ్చల్: రేపు మేడ్చల్‌లో నిర్వహించే పాలిసెట్‌కు అంతా సిద్ధం చేసినట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అరుంధతి తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ఈనెల 13న పాలిసెట్ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. మేడ్చల్‌లోని గిర్మాపూర్ పాలిటెక్నిక్ కళాశాల, స్ఫూర్తి, ఎస్ఎస్ఆర్ జూనియర్ కళాశాల, హైటెక్, హైటెక్ మోడ్రన్, ఎస్ఎస్‌జీ, ఆక్స్‌ఫర్డ్, ఢిల్లీ వరల్డ్ పాఠశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, పరీక్ష ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం1.30 వరకు ఉంటుందని ప్రిన్సిపాల్ అరుంధతి ప్రకటించారు.

వయోవృద్ధుల సంరక్షణ అందరి బాధ్యత

మోతీనగర్: వయోవృద్ధులను కంటికి రెప్పలాగా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.వి. ప్రసాద్ పేర్కొన్నారు. మూసాపేట డివిజన్ మోతీనగర్ సీనియర్ సిటిజన్స్ కౌన్సిల్ నెలవారి సమావేశంలో ఆదివారం ఆయన పాల్గొని మాట్లాడారు. ఇటీవల జమ్మూ కశ్మీర్‌లో యాత్రికులపై ఉగ్రవాదులు దాడి చేసిన సందర్భంగా సాహిత్య సమావేశాలు, ఉపన్యాసాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ నలమాల్పు అంజిరెడ్డి, సెక్రటరీ ఏవీ సాగర్, కోశాధికారి కొల్లప్ప, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో టపాసులు కాల్చొద్దు

మోతీనగర్: ప్రస్తుతం నెలకొన్న యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో బహిరంగ ప్రదేశాల్లో టపాసులు కాల్చవద్దని అల్లాపూర్ సీఐ ఎస్. వెంకట్‌రెడ్డి సూచించారు. సైబరాబాద్ సీపీ ఆదేశాల మేరకు అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో టపాసులు కాల్చివేతతో జరిగే అనర్థాలను వివరించారు. పెద్ద శబ్దంతో టపాసులు కాల్చితే ప్రజలు ఆందోళనకు గురవుతారన్నారు. ఎలాంటి దుష్పరిమాణాలకు ఆస్కారం లేకుండా బహిరంగ ప్రదేశాల్లో టపాసులు కాల్చడాన్ని నిషేధించామని, ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్సైలు మాజీద్ ఆలీ, మాల్యా నాయక్, డివిజన్‌లోని పలు బస్తీ, కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా డ్రైవింగ్‌లో శిక్షణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ నిబంధనలకు విరుద్ధంగా క్యాంపస్‌లో కొందరు బయటి వ్యక్తులు కార్ డ్రైవింగ్‌లో శిక్షణ తీసుకుంటున్నారు. అయితే సెక్యూరిటీ సిబ్బంది మాత్రం పట్టించుకోవడం లేదు. క్యాంపస్‌లో నిబంధనలకు విరుద్ధంగా బయటి వ్యక్తులు కారుతో పాటు ఇతర వాహనాల డ్రైవింగ్‌లో శిక్షణ, పెంపుడు కుక్కలతో తిరగడం, ఆవులు, గేదలు మొక్కలను పాడుచేయడం, వీడియో షుటింగులతో రీల్స్ చేయడం, జంతువులను బలి ఇవ్వడం తదితర కార్యక్రమాలు సెక్యూరిటీ సిబ్బంది ఎదుటే చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ఆదివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట బయటి వ్యక్తులు సెక్యూరిటీ సిబ్బంది ముందే కారు డ్రైవింగ్ చేస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఏటా కోటి రూపాయాలు తీసుకుంటున్న ప్రైవేటు సెక్యూరిటీ యాజమాన్యం వర్సిటీ భద్రతను పట్టించుకోవడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్

అఫ్జల్‌గంజ్: భారత సాంకేతిక విద్యామండలి, న్యూఢిల్లీ, ఎన్‌సీసీఐపీల సంయుక్తాధ్వర్యంలో జరిగిన ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ (సార్వత్రిక మానవీయ విలువలు) స్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ముగిశాయి. వాలెడిక్టరీ సెషన్ సందర్భంగా చైర్మన్ చలమారెడ్డి, సెక్రటరీ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ గిరిధర్ ఆకుల, ఐక్యూ ఏసీ కో ఆర్డినేటర్ గాయత్రీ పావనీ మానవ విలువల ప్రాముఖ్యతను వివరించారు. మహారాష్ట్ర నుంచి వచ్చిన కార్యక్రమ నిపుణురాలు నిధి చిరాగ్, జేఎన్‌టీయూ అనంతపురం నుంచి వచ్చిన సహ సమన్వయకర్త ప్రసాంతి, పరిశీలకురాలు ఇష్రత్ మీరా మిర్జానా పాల్గొన్నారు.

'వందే జనని భారతి'

గన్‌ఫౌండ్రి: తెలంగాణ రాష్ట్ర భాష సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఆదివారం రవీంద్రభారతిలో సర్వ కళాకారుల సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో వందే జనని భారతి పేరిట నిర్వహించిన సంగీత, నృత్య నీరాజనం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు నాటక కళాపరిషత్ అధ్యక్షులు సారిపల్లి కొండలరావు మాట్లాడుతూ.. మన రాష్ట్రంలో ప్రతిభ ఉండి గుర్తింపులేని కళాకారులు ఎందరో ఉన్నారని అలాంటి వారిని వెలుగులోకి తీసుకురావాలని సంకల్పంతో పనిచేయడం అభినందనీయమన్నారు. అనంతరం పలువురు కళాకారులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

షేక్‌పేట్ డివిజన్ అభివృద్ధికి కృషి

గోల్కొండ: షేక్‌పేట్ డివిజన్ అభివృద్ధికి కాంగ్రెస్ రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ కృషి చేస్తున్నారని షేక్‌పేట్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు డి.సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి డివిజన్ పరిధిలోని వినాయక్‌నగర్, మణికొండ రోడ్డు, జై హింద్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్‌లోని హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి ఆయన నిధులు కేటాయించారన్నారు.

స్మార్ట్ చెక్ 42

చిన్నారుల్లో లోపాలను గుర్తించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో కొనసాగుతున్న సర్వే..

- 42 ప్రశ్నలను యాప్‌లో నమోదు చేస్తున్న టీచర్లు
- ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని లక్ష్యం
- లోపాలు గుర్తించిన చిన్నారులకు మెరుగైన చికిత్స


అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కలిగిస్తున్న అధికారులు

బంజారాహిల్స్: చిన్నారుల్లో లోపాలను గుర్తించి వాటిని సరిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన ప్రణాళికలు రూపొందించి సంబంధిత అధికారులకు అమలు కోసం ఆదేశాలు జారీ చేసింది. ప్రారంభంలోనే లోపాలను గుర్తించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తోంది. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ద ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటలెక్చువల్ డిజిబిలిటీస్ (ఎన్ఐఈపీఐడీ) స్మార్ట్ చెక్-42 పేరుతో అంగన్‌వాడీ కేంద్రాల్లో సర్వేను ప్రారంభించింది.

◆ ఐసీడీఎస్ ఖైరతాబాద్ జోన్ పరిధిలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల వారీగా ఐదేళ్ల లోపు చిన్నారులపై చేపట్టిన ఈ సర్వే ఈ నెలాఖరు లోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సర్వే పూర్తయ్యాక వాటి ఫలితాల ఆధారంగా చిన్నారుల్లో గుర్తించిన లోపాలకు అవసరమైన చికిత్స అందించి వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేలా ప్రభుత్వం తదుపరి చర్యలు చేపట్టనుంది.

◆ ఐసీడీఎస్ ఖైరతాబాద్ జోన్ పరిధి కిందికి వచ్చే సోమాజిగూడ, ఖైరతాబాద్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, ఎర్రగడ్డ, బోరబండ, వెంగళరావునగర్ డివిజన్ల పరిధిలో ఉన్న 151 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ సర్వే నిర్వహిస్తున్నారు.

◆ ప్రత్యేక యాప్ ద్వారా ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల్లో గుర్తించిన లోపాలను నమోదు చేస్తున్నారు. 151 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఐదేళ్ల లోపు చిన్నారులు 17,650 మంది ఉండగా, ఇప్పటికే చాలా వరకు పూర్తి కావచ్చింది.

42 ప్రశ్నలతో సర్వే..

◆ ప్రతి అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో ఐదేళ్ల లోపు పిల్లలందరినీ సర్వే చేస్తారు. స్మార్ట్ చెక్-42 సర్వేలో మొత్తం 42 ప్రశ్నలు ఉండగా ఎనిమిది విభాగాలుగా సర్వే ఫార్మాట్‌లను రూపొందించారు. ఇందులో పుట్టిన వెంటనే రెండు నెలల లోపు, 3-5 నెలల లోపు, 6-11 నెలలు, 12-23 నెలలు, 24-35 నెలలు, 36-47 నెలలు, 48-59 నెలల వరకు ఇలా మొత్తం ఎనిమిది విభాగాల్లో ఒక్కోదాంట్లో వయస్సు ఆధారంగా భిన్నమైన ప్రశ్నలను చేసి జవాబులు నమోదు చేస్తున్నారు.

◆ చిన్నారులు పుట్టిన వెంటనే ఏడ్చారా..?, తల్లిదండ్రులు, సంరక్షకుల గొంతుకు అనుగుణంగా స్పందిస్తున్నారా..?, పాలు తాగడంలో ఇబ్బందులు పడుతున్నారా..? ఇలా ఒక్కో విభాగంలో ఆయా వయస్సుల్లో ఎదురయ్యే లోపాలను గుర్తించే విధంగా ఈ ప్రశ్నావళిని పకడ్బందీగా రూపొందించి సర్వే చేస్తున్నారు. ఈ మేరకు అంగన్‌వాడీ కేంద్రాల ఉపాధ్యాయులు తమ మొబైల్ ఫోన్‌లోని యాప్‌లో 'ఎస్'లేదా 'నో', ఇతర వివరాలు ఉంటే వాటిని నమోదు చేస్తున్నారు.

◆ ప్రతి చిన్నారికి సంబంధించిన సర్వే వివరాలు న్యూట్రిషనల్ హెల్త్ ట్రాకింగ్ సిస్టమ్ సర్వర్‌లో నిక్షిప్తమవుతాయి. సర్వే ఫలితాల ఆధారంగా చిన్నారుల్లో ఏవైనా లోపాలు కనబడితే అవసరమైన చికిత్స అందించనున్నారు. స్మార్ట్ చెక్ సర్వేను ప్రారంభించి 11 రోజులు అవుతుంది. అంగన్‌వాడీ కేంద్రాల వారీగా టీచర్లు చేపట్టిన సర్వే ఇప్పటికే చాలావరకు పూర్తి కాగా, ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాలని నిర్ణయించారు. అంగన్‌వాడీ టీచర్లు సర్వేలోని ప్రశ్నలను ఆకళింపు చేసుకుని సమాధానాలను స్పష్టంగా నమోదు చేస్తేనే లోపాలు ఉన్న చిన్నారులకు సంపూర్ణ న్యాయం జరుగుతుందని, వారు ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడుపుతారని అధికారులు పేర్కొంటున్నారు.

పర్యావరణాన్ని కాపాడటమే మన లక్ష్యం

ప్రపంచ పర్యావరణ సంస్థను అభినందించిన పుదుచ్చేరి సీఎం


పుదుచ్చేరి సీఎం రంగస్వామికు మొక్కను బహూకరిస్తున్న సీహెచ్.భద్ర

హిమాయత్‌నగర్: పర్యావరణాన్ని కాపాడటమే మన లక్ష్యమని... పర్యావరణ జీవ జాతి సంరక్షణ కోసం ప్రపంచ పర్యావరణ సంస్థ చేస్తున్న కార్యక్రమాలను పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగస్వామి అభినందించారని ప్రపంచ పర్యావరణ సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్.భద్ర తెలిపారు. ఇటీవల పుదుచ్చేరిలో పర్యావరణం అంశంపై సీఎంను వారి నివాసంలో కలిసి పర్యావరణంపై చర్చించామని తెలిపారు. భవిష్యత్‌లో పుదుచ్చేరి కేంద్రపాలిత రాష్ట్రాన్ని పర్యావరణ పరిరక్షణకు అనుకూలమైన ప్రదేశంగా తీర్చిదిద్దుతామని సీఎం తెలిపారని చెప్పారు. పర్యావరణ పరిరక్షణపై ప్రపంచంలో ఏ సంస్థ చేయలేని విధంగా లక్షలాది మొక్కలు నాటుతూ వేలాది కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు.

◆ భూమి మీద జీవజాతిని, వృక్షజాతిని, మానవ జాతిని, జంతుజాతిని, జీవవైవిధ్యాన్ని కాపాడటమే లక్ష్యంగా పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులను చైతన్యపరుస్తూ ప్రపంచ పర్యావరణ సంస్థ చేపట్టిన కార్యక్రమాలు సీఎం అభినందించినట్లు తెలిపారు. భవిష్యత్‌లో కూడా పుదుచ్చేరి ప్రభుత్వం పర్యావరణ సంబంధించిన కార్యక్రమాలను చేపడుతుందని చెప్పారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ రికగ్నైజేషన్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ గౌరవ చైర్మన్ తమ్మినేని సత్యనారాయణ, ఫైలింగ్ ఇండియా సంస్థ చైర్మన్ చల్లూరి శ్రీనివాస్, పర్యావరణ సంస్థ పాండిచ్చేరి రాష్ట్ర కో-ఆర్డినేటర్ సురేష్, ప్రధాన కార్యదర్శి నిఖిల్, కోశాధికారి రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

ఫిలింనగర్‌లో చిరు వ్యాపారులకు షాక్.!


ట్రాఫిక్ పోలీసులతో మాట్లాడుతున్న చిరు వ్యాపారులు

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని అపోలో చౌరస్తాతో పాటు ఫిలిం చాంబర్ చుట్టూ మహనీయుల చౌరస్తా వద్ద కొన్నేళ్లుగా చిరు వ్యాపారాలు చేసుకుంటూ ఉపాధి పొందుతున్న వారికి ట్రాఫిక్ పోలీసులు చుక్కలు చూపిస్తున్నారు. రోడ్డకిరువైపులా వ్యాపారాలు చేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్న ఈ వ్యాపారులను ఫిలింనగర్‌కు చెందిన కొందరు పెద్దలు టార్గెట్ చేసి వ్యాపారాలను నడపకుండా ట్రాఫిక్ పోలీసులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు. ఫిలింనగర్ పెద్దల ఒత్తిడికి తలొగ్గుతున్న ట్రాఫిక్ పోలీసులు ప్రతిరోజూ ఫిలింనగర్ కాలనీలో ఎక్కడికక్కడ వ్యాపారాలను అడ్డుకుంటూ సామాగ్రిని తొలగిస్తూ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

◆ ఫిలింనగర్‌లోని చిరువ్యాపారులకు అండగా ప్రజాప్రతినిధులు అంతగా అండగా నిలవకపోవడంతో వీరి కష్టాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ చిరువ్యాపారులను ఇబ్బంది పెట్టవద్దంటూ పలుమార్లు ట్రాఫిక్ పోలీసులను హెచ్చరించినా మార్పు ఉండడం లేదు. ఫిలిం ఛాంబర్ చుట్టూ, అపోలో రోడ్డులో, ఫిలింనగర్ కాలనీలో సుమారు 70-100 మంది వరకు రోడ్డుకు రెండువైపులా చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఫిలింనగర్‌లోని కొందరు పెద్దలకు ఈ చిన్న వ్యాపారులంటే గిట్టడం లేదు.

◆ వ్యాపారాలు తొలగించాలంటూ ఎప్పటికప్పుడు ఫిర్యాదులు చేస్తుండడంతో ట్రాఫిక్ పోలీసులు కూడా చర్యలు తీసుకోక తప్పడం లేదు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు స్పందించి స్వయం ఉపాధి పొందుతున్న చిరువ్యాపారుల జోలికి వెళ్లవద్దని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికే తాము చాలా నష్టపోతున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కూరగాయల ధరలు

శ్రీనగర్‌కాలనీ: ఎర్రగడ్డ రైతుబజార్ కూరగాయల ధరలు కిలో రూపాయల్లో టమాట 13, నల్లవంకాయ 18, పొడుగువంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 38, క్యాప్సికం 47, పచ్చికాకరకాయ 35, పందిరిబీర 35, క్యాబేజీ 13, క్యారెట్ 25, దొండకాయ 35, గుండు బీన్నీస్ 125, గింజచిక్కుడు 55, గోకరకాయ 35, కీర 28, దోసకాయ 18, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 25, చామగడ్డ 35, మొరంగడ్డ 15, కందగడ్డ 80, క్యాలీఫ్లవర్ 23, సొరకాయ 11, పొట్లకాయ 18, అరిటికాయ 11, మునగకాయ 3-4, మామిడికాయ 60, ముల్లంగి 5-6, ఉల్లి పారక 35లుగా ఉన్నాయి.

గమనిక: ఈ ధరలు సోమవారం ఉదయం 9గంటల వరకు అమలులో ఉంటాయి.

సార్వత్రిక సమ్మె వాల్ పోస్టర్ ఆవిష్కరణ



రహమత్‌నగర్: దేశ వ్యాప్తంగా ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సీఐటీయూ నగర నాయకుడు రాపర్తి అశోక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సమ్మెను సంబంధించిన వాల్ పోస్టర్‌ను కార్మికులతో కలిసి ఎస్పీఆర్‌హిల్స్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. నాలుగు లేబర్‌కోడ్‌లను వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవదాస్, భాగ్యరాజ్, జైపాల్, బాలయ్య, ఐద్వా నాయకురాలు సమాధానం పాల్గొన్నారు.

షేక్‌పేట్‌లో బాక్సింగ్ శిక్షణ

గోల్కొండ: బల్దియా వారు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలలో జోష్ నెలకొని ఉంది. షేక్‌పేట్‌లో జరుగుతున్న వేసవి బాక్సింగ్ క్యాంప్‌లో టీనేజర్స్ ఎంతో ఉత్సాహంగా బాక్సింగ్ నేర్చుకుంటున్నారు. పంచులు విసురుతు ప్రత్యర్థులను పడగొడుతూ కోచ్ నుంచి కొత్త కొత్త పంచులు ఎలా విసరాలో నేర్చుకుంటున్నారు. ఇక్కడ బాక్సింగ్‌లో శిక్షణ పొందిన వారు గతంలో రాష్ట్రస్థాయి పోటీలలో పతకాలు సాధించారని కోచ్ శివకుమార్ అన్నారు.

జియోఫిజిక్స్‌లో పీహెచ్‌డీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ సైన్స్ కాలేజీ జియోఫిజిక్ విభాగం నుంచి ప్రియాంక పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ సాధించారు. సైన్స్ కాలేజీ మాజీ ప్రిన్సిపల్ ప్రొ.వీరయ్య పర్యవేక్షణలో భౌగోళిక ఎలక్ట్రికల్, జియో కెమికల్ విధానాల అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించినట్లు తెలిపారు.

సమ్మర్ సందడి

ఆటపాటలతో సందడిగా మారిన గతి ప్రభుత్వ పాఠశాల







వెంకటేశ్వరకాలనీ: వేసవి సెలవుల్లో విద్యార్థులకు తెలియని విషయాలను తెలిసేలా... ఆహ్లాదంగా గడిపి వేసవి సెలవులను మరింత ఆనంద జ్ఞాపకాలుగా మిగిల్చుకునేందుకు ప్రభుత్వం బడుల్లో వేసవి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసింది. బంజారాహిల్స్ రోడ్ నం.7లోని గతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్ విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంటోంది. సుమారు 80 మంది విద్యార్థులు ఈ సమ్మర్ క్యాంప్‌లో అటు కంప్యూటర్ నేర్చుకోవడంతో పాటు ఇటు ఆటపాటలతో సందడి చేస్తున్నారు. లిటిల్‌స్టార్ హైస్కూల్, గతి హైస్కూల్, సెయింట్ ఆల్ఫాన్సెస్ హైస్కూల్, ప్రాక్టీసింగ్ హైస్కూల్, పంజగుట్ట పడవ స్కూల్ తదితర పాఠశాలలకు చెందిన విద్యార్థులు, స్థానికులు ఈ సమ్మర్ క్యాంప్‌లో పాల్గొంటున్నారు.

ఈనెల 15వ తేదీ వరకు సమ్మర్ క్యాంపు..

◆ ఈ సమ్మర్ క్యాంప్ ఉదయం 8నుంచి 11గంటల వరకు ఉంటుందన్నారు. ఈ క్యాంపు ఈనెల 15వ తేదీ వరకు నిర్వహించనున్నారు. కంప్యూటర్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, యోగా, మెడిటేషన్, ఇంగ్లిష్, సైన్స్‌లో శిక్షణ ఇస్తున్నారు. గణితం ట్రిక్స్ ఇందులో నేర్పిస్తున్నారు. కబడ్డీ, ఖోఖో ఆటల్లో కూడా తర్ఫీదు ఇస్తున్నారు. ఇదే పాఠశాలకు చెందిన ఇంగ్లిష్ టీచర్ ప్రసాద్‌బాబు ఈ సమ్మర్ క్యాంప్ కో-ఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు. టీచ్ ఫర్ చేంజ్ అనే స్వచ్ఛంద సంస్థ కూడా శిక్షణ పొందిన ఉపాధ్యాయులను ఈ సమ్మర్ క్యాంప్‌లో పాల్గొనేలా చేసి విద్యార్థులకు వివిధ అంశాల్లో మెలకువలు నేర్పిస్తున్నారు. సమ్మర్ క్యాంప్ తమకెంతగానో ఉపయోగపడుతుందన్నారు. వచ్చే నెలా 10వ తేదీ వరకు పొడిగిస్తే బాగుంటుందని విద్యార్థులు కోరుతున్నారు.



సీసీ కెమెరాలు అందజేత


పోలీసులకు సీసీ కమెరాలు అందజేస్తున్న కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్, ఖయ్యూం

రహమత్‌నగర్: సాధారణంగా పుట్టిన రోజున కేక్ కట్ కట్టింగ్, అన్నదానం లాంటి కర్యాక్రమాలు జరుపుకోవడం మనం చూస్తుంటాం. కానీ బోరబండ డివిజన్‌కు చెందిన భరత్‌నగర్ బస్తీ అధ్యక్షుడు సయ్యద్ ఖయ్యూం తన పుట్టిన రోజున సీసీ టీవీ కెమెరాలు అందజేసి తన సేవాగుణాన్ని చాటుకున్నారు. శనివారం రాత్రి బోరబండ పోలీసులకు నాలుగు సీసీ కెమెరాలు అందించి సేవాగుణం చాటుకున్నాడు. కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ మాట్లాడుతూ.. సయ్యద్ ఖయ్యూం తీసుకున్న నిర్ణయాన్ని ఇతరులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బోరబండ ఎస్‌హెచ్‌ఓ సురేందర్, ఎస్సై నాగూల్ మీరా, కాంగ్రెస్ నాయకులు కాసుల మహేష్‌గౌడ్, ఆనంద్, చెట్టి దేవేందర్, బాలరాజ్‌గౌడ్, రవీందర్, మహేందర్ గౌడ్, సమీ, అజయ్, ఇనాయత్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నృసింహ జయంతి ఉత్సవాలు


పూజల్లో ఎమ్మెల్యే దానం నాగేందర్



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని హరేకృష్ణ గోల్డెన్ టెంపుల్‌లో శ్రీనృసింహ జయంతి ఉత్సవాలు ఆదివారం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా స్వయంభూ శ్రీలక్ష్మీ నరసింహస్వామి మూలవిరాట్‌కు మహా అభిషేకం, నారసింహ హోమం, శ్రీదేవి భూదేవి సమేత నరసింహస్వామి కల్యాణ ఉత్సవం, ఉత్సవ విగ్రహానికి 108 కలశాలతో మహాభిషేకం, పంచామృతం, పంచగవ్య, ఫలరసాలు, నవరత్నాలు, దేశంలోని పవిత్ర నదుల నుంచి భక్తులు సేకరించిన పవిత్ర జలాలతో అభిషేకం జరిపారు. అలాగే ఊంజల్ సేవ, పల్లకీ ఉత్సవంతో పాటు హరేకృష్ణ మూవ్‌మెంట్ హైదరాబాద్ అధ్యక్షులు సత్యగౌర చంద్రదాస ప్రభూజీ ప్రత్యేక ప్రవచనం చేశారు.

◆ భక్త ప్రహ్లాదుడిని రక్షించేందుకు భగవాన్ శ్రీకృష్ణుడు నరసింహ స్వరూపంగా అవతరించారన్నారు. స్తంభం నుంచి అవతరించిన అర్థ సింహ, అర్ధ మానవ స్వరూపంలో ఆయన భక్తులైన బ్రహ్మ, ప్రహ్లాదుని మాటలు నిజం చేశారన్నారు. ఈ దివ్య అవతారాన్ని నరసింహ జయంతిగా చతుర్దశి తిథినాడు జరుపుకుంటామన్నారు.

◆ ఈ పవిత్రమైన రోజున నరసింహ క్షేత్రాలను సందర్శించడం ద్వారా భక్తులు అపారమైన ఆధ్యాత్మిక ఫలాలను పొందగులుగుతున్నారని అన్నారు. అనంతరం స్వయంభూ స్వామి వారి ప్రత్యేక దర్శనం,యోగ నరసింహ స్వామిగా ప్రత్యేక అలంకారం, ఊంజల్ సేవ భక్తులకు అపూర్వమైన దివ్యానుభూతిని అందించాయి. చివరిగా చప్పన్ భోగ్ నైవేద్యం, మహా మంగళ హారతి, పుష్పాంజలి, పల్లకీ ఉత్సవం, రాత్రి ప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి.

యూపీహెచ్‌సీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తా


జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్‌కు సమస్యను వివరిస్తున్న యూపీహెచ్‌సీ సిబ్బంది

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ జవహర్‌నగర్‌లోని యూపీహెచ్‌సీ సెంటర్‌ను స్థానిక కమ్యూనిటీ హాల్‌కు షిఫ్టు చేసేలా చర్యలు తీసుకుని ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తానని కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ అన్నారు. యూపీహెచ్‌సీలో నెలకొన్న సమస్యను ఆదివారం సిబ్బంది ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా యూపీహెచ్‌సీ అద్దె చెల్లించకపోవడంతో ఆ భవన యజమాని కరెంటు, మంచినీటి సరఫరా నిలిపివేసి ఖాళీ చేయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని కార్పొరేటర్‌కు వివరించారు. ఈ సెంటర్‌కు ప్రతిరోజూ గర్భిణులు, గిరిజన, పేద ప్రజలు పెద్ద సంఖ్యలో విచ్చేసి యూపీహెచ్‌సీ సేవలు వినియోగించుకుంటారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ సెంటర్‌లో సేవలు అందించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.

◆ వెంటనే యూపీహెచ్‌సీ సెంటర్‌ని జవహర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌కు షిఫ్టు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి స్పందించిన కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ సెంటర్ కొనసాగిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అద్దె కూడా చెల్లించలేని స్థితిలో ఉందని దుయ్యబట్టారు. యూపీహెచ్‌సీ సేవలు నిరాటంకంగా కొనసాగేవిధంగా జీహెచ్ఎంసీ, వైద్య ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. ఎమ్మెల్యే కూడా దీనిపై స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటే బాగుంటుందన్నారు.

నగరంలో నేడు

- తాళ్లపాక అన్నమాచార్యుల 617 జయంత్యుత్సవాల్లో భాగంగా రామాభిరామం, రాజీవ నేత్రాయ.. రాఘవాయ.. గ్రంథాల ఆవిష్కరణ కార్యక్రమం రవీంద్రభారతిలో సాయంత్రం 5 గంటలకు జరుగుతుంది.
- మాదాపూర్ హైటెక్స్‌లో ప్రపంచ సుందరి పోటీలు జరుగుతాయి.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో సెవెన్ విజన్స్ పేరిట చిత్ర ప్రదర్శన ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మిస్ వరల్డ్ పోటీల ప్రారంభ వేడుకల్లో భాగంగా గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జానపద కళాకారుల ప్రదర్శన జరుగుతుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళాశక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- కేపీహెచ్‌బీ కాలనీలో లులు మాల్‌లో లులు బిగ్ చాకో దేస్ ఫెస్టివల్ ఉదయం 10 నుంచి రాత్రి 9 గంటల వరకు కోకో మిలన్ యాక్టివిటీస్, చిన్నారులకు పెయింటింగ్, డ్రాయింగ్, త్రీడీ యానిమేషన్ చిత్రాలు, వీడియోలతో ఇంగ్లిష్ పద్యాలు, పాటలపై శిక్షణ ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో వేసవి సెలవుల సందర్భంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సమ్మర్ ఆర్ట్ క్యాంప్ జరుగుతుంది.
- మైలార్‌దేవ్‌పల్లి గణేష్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 8 నుంచి ఉదయం 11 గంటల వరకు ఉచిత వేసవి శిక్షణ శిబిరం జరుగుతుంది.
- అన్నమాచార్య 617వ జయంతి సందర్భంగా మాదాపూర్ అన్నమయపురంలోని అన్నమాచార్య భావనావాహినిలో సాయంత్రం 5.45 గంటలకు తందనాన పేరిట అన్నమాచార్య అంతర్జాతీయ మ్యూజిక్ కాంపిటేషన్ జరుగుతుంది.
- అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆధ్వర్యంలో బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటలకు అరుణోదయ 50 వసంతాల స్ఫూర్తి సభ జరుగుతుంది. ఉదయం 9 గంటలకు విజ్ఞాన కేంద్రం నుంచి వీఎస్‌టీ వరకు ప్రజాకళల ప్రదర్శన ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

ప్రేమకు మారుపేరు అమ్మ



మహిళలను సత్కరించి చీరలు అందజేస్తున్న జనార్దనమూర్తి, కొల్లి నాగేశ్వర్‌రావు తదితరులు

చిక్కడపల్లి: ప్రేమకు మారుపేరు అమ్మ అని గాన సభ అధ్యక్షుడు వీఎస్ కళా జనార్దనమూర్తి అన్నారు. ఆదివారం త్యాగరాయగానసభలో కళావేదికలో అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో మహిళలకు ఆత్మీయసత్కారం చేసి చీరలు అందజేశారు. ఈ సందర్భంగా జనార్ధనమూర్తి మాట్లాడుతూ అమ్మే అందరికి ఆదర్శమన్నారు. కుటుంబం కోసం అహర్నిశలు పనిచేస్తూ కుటుంబసభ్యుల క్షేమాన్ని కాంక్షిస్తుందని కొనియాడారు. అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక అధ్యక్షుడు కొల్లి నాగేశ్వర్‌రావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో నేతలు మాధవి, సాంబశివరావు, శ్రీనివాస్, రాంచందర్, జయహరి, పవన్, ఉమ, సత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

గోవు ప్రాముఖ్యతను భావితరాలకు అందించాలి



గోమాత శతకాన్ని ఆవిష్కరిస్తున్న గౌరీశంకర్, గోపాలకృష్ణ, శ్రావణ్‌కుమార్, మల్లికార్జునరావు

చిక్కడపల్లి: సాధన సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ప్రముఖ హాస్యావధాని శంకర నారాయణ రచించిన గోమాత శతకం ఆవిష్కరణ ఆదివారం చిక్కడపల్లిలోని శ్రీ కృష్ణ మందిరంలో జరిగింది. తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరీశంకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గౌరీశంకర్ మాట్లాడుతూ గోమాతపై విద్యార్థులకు పోటీలను నిర్వహించాలన్నారు. గోవు ప్రాముఖ్యతను భావితరాలకు అందించాలని సూచించారు. ఆవిష్కరించిన శతకాన్ని గోమాత సేవా ట్రస్ట్ చైర్మన్ లక్ష్మణరేఖ ఎన్.గోపాలకృష్ణకు అంకితమిచ్చారు. కార్యక్రమంలో శ్రావణ్‌కుమార్, మల్లికార్జునరావు, విశ్వేశ్వరరావు, నరసింహాచార్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గడువు పూర్తి.. పనులు అసంపూర్తి!

నత్తనడకన మూడు టిమ్స్ నిర్మాణాలు

- తరుముకొస్తున్న వ్యాధుల సీజన్
- జూన్ 2న ప్రారంభించడం అనుమానమే?
- వ్యాధుల సీజన్ ప్రారంభమైతే ప్రభుత్వాసుపత్రులకు రోగుల తాకిడి!



సాక్షి, సిటీబ్యూరో: మూడు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులు.. మూడు వేల పడకలు.. నగరానికి మూడు వైపులా నిర్మాణాలు.. లక్ష్యం ఘనంగా ఉంది. గుత్తేదారుల నిర్లక్ష్యం కూడా తక్కువేమీ కాదు. ఉద్దేశం ఉదాత్తంగా ఉంది. ఉన్నతాధికారుల ఉపేక్షా తక్కువేమీ కాదు.. గడువు పూర్తి అయినా పనులు అసంపూర్తిగా మిగిలాయి.. ఇదీ ఎల్‌బీనగర్, సనత్ నగర్, అల్వాల్ టిమ్స్ పరిస్థితి. వ్యాధుల సీజన్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి ఈ ఏడాది ఏప్రిల్ నాటికి ఈ మూడు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణాలను పూర్తి చేయాలని ప్రభుత్వం మూడేళ్ల క్రితం లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజు ఆసుపత్రులను ప్రారంభిస్తామని తొలుత ప్రకటించినా వాస్తవ పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. నిర్మాణాల్లో తాత్సారం చేసినందుకు చర్యలు తీసుకోవాల్సింది పోయి ఆగస్టు నాటికైనా అందుబాటులోకి తేవాలని ప్రభుత్వ పెద్దలు గుత్తేదారులను ప్రాధేయపడుతున్నారు. రూ.2,679 కోట్ల విలువైన, రూ.3 వేల పడకల సామర్థ్యం కలిగిన ఆసుపత్రుల నిర్మాణ పనులు ఇంకా కొనసాగుతున్నాయి. శాఖాధికారుల ఖచ్చితమైన పర్యవేక్షణ లేకపోవడం, గుత్తేదారుల నిర్లక్ష్యం వెరసి ఈ సీజన్‌కు ఆసుపత్రులు అందుబాటులోకి రావడం అసాధ్యంగా కనిపిస్తోంది.

మూడు ఆసుపత్రులు.. మూడేళ్లు..

హైదరాబాద్ నగరంలో తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్(టిమ్స్) ఎల్‌బీ నగర్, అల్వాల్, సనత్ నగర్ ప్రాంతాల్లో వెయ్యి పడకల చొప్పున మూడు సూర్‌స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం టెండర్లు పిలిచింది. 2022 ఏప్రిల్‌లో నిర్మాణ పనులకు నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ భూమిపూజ చేశారు. 2025 ఏప్రిల్ మొదటి వారంలో పనులు పూర్తి చేసి ప్రభుత్వానికి అప్పగించాలని గడువు పెట్టింది. ఇందుకోసం రూ.2,679 కోట్లు కేటాయించింది. మూడేళ్లు పూర్తయినా నేటికీ భవన నిర్మాణ పనులు అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. అల్వాల్‌లో గ్యాస్ట్రో ఎంట్రాలజీ, ఎల్‌బీనగర్‌లో న్యూరో, సనత్‌నగర్‌లో గుండె సంబంధిత సూపర్ స్పెషాలిటీ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇవి పూర్తయితే సామాన్యులు, పేదలకు సైతం నాణ్యమైన స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులోకి తెచ్చినట్లు అవుతుంది. ఇటీవల వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. గడువునాటికి పనులు పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదని, కనీసం ఆగస్టు నాటికైనా ఆసుపత్రులను అందుబాటులోకి తీసుకురావాలని గుత్తేదారులను ఆదేశించారు.

ఆ ఆసుపత్రులపై ఒత్తిడి..

దశాబ్దాలుగా కొనసాగుతున్న గాంధీ, ఉస్మానియా, నిమ్స్, ఫీవర్ ఆసుపత్రి, సుల్తాన్‌బజార్, పేట్లబురుజు ప్రభుత్వ ఆసుపత్రులపై రోగుల తాకిడి పెరుగుతోంది. మూడు టిమ్స్ నిర్మాణాలు పూర్తి అయితే పడకలు, వైద్యులు, వైద్య సిబ్బంది సంఖ్య పెరుగుతుంది. కొత్త సాంకేతిక పరిజ్ఞానం, యంత్ర పరికరాలు సమకూరుతాయి. అయితే నిర్మాణ పనుల్లో ఆలస్యంపై అధికారుల మాట వేరే విధంగా ఉంది. పనుల్లో వేగం పెంచాలని ఒత్తిడి చేస్తే తమకు ప్రభుత్వ పెద్దల నుంచి ఒత్తిళ్లు వస్తున్నాయని ఆరోపిస్తున్నారు.

ఆసుపత్రి	అంచనా వ్యయం	పడకలు	నిర్మాణాల గడువు
ఎల్‌బీ నగర్	రూ.900 కోట్లు	1,000	7.04.2025
సనత్‌నగర్	రూ.897 కోట్లు	1,000	7.04.2025
అల్వాల్	రూ.882 కోట్లు	1,000	8.04.2025

వైద్య రంగం ప్రక్షాళన అవసరం: కోదండరాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కోదండరాం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కార్పొరేట్ వైద్యఖర్చులు భరించలేని స్థితిలో ప్రజలున్నారని, భూములను సైతం అమ్ముకొని వైద్యం చేయించుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని, అందుకే వైద్య రంగాన్ని ప్రక్షాళన చేయాలని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విజ్ఞాన దర్శిని, మన హెల్త్ ఇండియా ఆధ్వర్యంలో 'ఆరోగ్య తెలంగాణ సమష్టి బాధ్యత'అనే అంశంపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ రాష్ట్రంలో వైద్య కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు పెంచాలని అన్నారు. విద్యతో పాటు వైద్యరంగంపై కూడా పాలకులు దృష్టి పెట్టి సంస్కరించాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ వి.బ్రహ్మారెడ్డి అన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచన ప్రకారం ప్రతి వెయ్యి మంది ప్రజలకు ఒక వైద్యుడు ఉండాలని, రాష్ట్రంలో 20 వేల మందికి ఒక వైద్యుడు మాత్రమే అందుబాటులో ఉన్నారని అన్నారు. విజ్ఞాన దర్శిని కన్వీనర్ టి. రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 16 వందలకుపైగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల కొరత తీవ్రంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ప్రభుత్వం 24 గంటలపాటు ప్రజలకు వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ కేజీ గోవింద్ రెడ్డి, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ స్టేట్ ఎథిక్స్ కమిటీ చైర్మన్ డాక్టర్ కె.అశోక్‌రెడ్డి, మెడికల్ జర్నలిస్ట్ రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి



సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నేతలు

హిమాయత్‌నగర్: కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మొట్టే నరసింహ డిమాండ్ చేశారు. మే 20న జరుగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి దేవేందర్‌రెడ్డితో కలిసి సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయం జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్, ఉపాధ్యక్షులు జి.రాజు, గాదె లక్ష్మీనారాయణ, జి.పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

అవయవదానం గొప్ప త్యాగం



సాక్షి, సిటీబ్యూరో: అవయవదానం అనేది గొప్ప త్యాగం లాంటిదని ఏఐఎన్‌యూ(ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ) ఎండీ డాక్టర్ మల్లికార్జున అన్నారు. మాతృదినోత్సవం సందర్భంగా'అమ్మ ఇచ్చిన రెండో జీవితం'అనే పేరుతో పిల్లలకు కిడ్నీ దానం చేసిన తల్లులను ఘనంగా సన్మానించారు. ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సమాజంలో నానాటికీ అవయవదానంపై అవగాహన పెరుగుతోందన్నారు. అమ్మ అంటేనే త్యాగం, అంతులేని ప్రేమకు ప్రతీక అని పేర్కొన్నారు. ఒకసారి జన్మనిచ్చి, రెండో దఫా కిడ్నీ దానం చేసి పునర్జన్మనిచ్చిన తల్లులను గౌరవించుకోవడం, కిడ్నీ మార్పిడి తరువాత కోలుకున్న తల్లీ, పిల్లలను ఒక చోటకు చేర్చి, వారి అనుభవాలను పంచుకునే ప్లాట్‌ఫాం ఏర్పాటు చేయడం సంతోషకరమని అన్నారు. ఇలాంటి త్యాగమూర్తులను సమాజం గుర్తు పెట్టుకుంటుందని కొనియాడారు. సన్నిహితుల నుంచి సేకరించిన కిడ్నీలు త్వరగా కోలుకుంటాయని తెలిపారు.కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు, కిడ్నీ దానం చేసిన, స్వీకరించిన వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

'కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలి

హిమాయత్‌నగర్: రాష్ట్ర వ్యాప్తంగా కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీకి పేద, మధ్య తరగతి కుటుంబాలు గురవుతున్నాయని బీసీ కులాల సమన్వయ వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండు లక్ష్మీనారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. 2025 - 26 విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే కొన్ని ప్రైవేటు పాఠశాలలు, కార్పొరేట్ కాలేజీలు అధిక ఫీజులతో తల్లిదండ్రుల గుండెల్లో గుబులు రేపుతున్నాయని పేర్కొన్నారు. విద్యాశాఖ బాధ్యతలు నిర్వర్తిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ఈ విషయంపై దృష్టి పెట్టి సరైన చర్యలు తీసుకోవాలన్నారు. వెంటనే సమీక్ష సమావేశం నిర్వహించి ప్రత్యేక జీవోను ప్రవేశపెట్టి ఫీజు నియంత్రణ చట్టం కచ్చితంగా అమలు జరిగే విధంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

గంజాయి సేవిస్తున్న యువకుల అరెస్ట్

వెంగళరావునగర్: గంజాయి సేవిస్తున్న యువకులను మధురానగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఏపీలోని గుంటూరు ప్రాంతానికి చెందిన ధనుంజయ, వినోద్‌కుమార్, ఈశ్వర్, సైఫ్, ప్రవీణ్ రహమత్‌నగర్‌లో నివాసం ఉంటూ ప్రైవేట్ జాబ్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం బీదర్ నుంచి గంజాయిని తెప్పించుకుని సేవిస్తున్నారు. ఈ విషయాన్ని స్థానికులు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. మధురానగర్ పోలీసులు హుటాహుటిన గంజాయి సేవిస్తున్న ప్రాంతానికి వెళ్లి వారిని అదుపులోనికి తీసుకున్నారు. అనంతరం వారిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కరాటేలో 6వ వరల్డ్ రికార్డ్ పోస్టర్ ఆవిష్కరణ



వరల్డ్ రికార్డు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మేయర్ గద్వాల విజయలక్ష్మి

కాచిగూడ: తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జీవీఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీన కాచిగూడలోని అకాడమిలో అమృత రెడ్డి, ఘన సంతోషిణిరెడ్డి అనే అక్కాచెల్లెళ్లు 6వసారి వరల్డ్ రికార్డ్స్ నమోదు చేయనున్నారని అకాడమి డైరెక్టర్ డాక్టర్ జీవీఎస్ గోపాల్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు వరల్డ్ రికార్డ్ పోస్టర్‌ను ఆదివారం జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మీ ఆవిష్కరించారు. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు హాజరై ఈ వరల్డ్ రికార్డ్స్‌ను నమోదు చేయనున్నారని గోపాల్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహాలక్ష్మీ రామన్ గౌడ్, అమృతరెడ్డి, ఘణ సంతోషిణిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అందాల హుస్సేన్ సాగర్ తీరం వెంట..ట్యాంక్‌బండ్‌పై విహరించాలని అందరికీ ఇష్టంగానే ఉంటుంది. కానీ...అక్కడి నీటి నుంచి వచ్చే దుర్వాసన పర్యాటకులకు ఇబ్బందిగా మారింది. సాయంత్రం వేళ మరీ ఎక్కువగా వాసన వస్తుండడంతో సందర్శకులు వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోతున్నారు. ఈ నేపథ్యంలో దుర్వాసనను కొంతమేరకైనా తగ్గించాలనే ఉద్దేశంతో ఆదివారం జీహెచ్‌ఎంసీ సిబ్బంది కొన్ని రసాయనాలను సాగర్ జలాల్లోకి ఇలా పిచికారి చేయడం కన్పించింది. ఇది ఎంత వరకు సత్ఫలితాలు ఇస్తుందో మరి!

పునఃస్థాపన.. పునరుజ్జీవం

శంషాబాద్–షాబాద్ రహదారి విస్తరణకు అడ్డుగా ఉన్న చెట్ల తొలగింపు



రహదారి విస్తరణలో అడ్డుగా ఉన్న చెట్లను వేర్లతో సహా తవ్వి తీస్తున్న దృశ్యం

శంషాబాద్ రూరల్: రోడ్డు విస్తరణ పనుల కారణంగా తొలగిస్తున్న చెట్లకు పునరుజ్జీవం పోస్తున్నారు అధికారులు. రోడ్డుకిరువైపులా పునఃస్థాపన చేస్తున్నారు. శంషాబాద్ మండలంలోని శంషాబాద్–షాబాద్ రోడ్డు విస్తరణ పనులు సాగుతున్నాయి. అడ్డుగా ఉన్న కానుగ, పెల్టోఫోరం, వేప చెట్లను వేర్లతో సహా తొలగించి క్రేన్ సహాయంతో తీసుకెళ్లి ఇరువైపులా మళ్లీ నాటుతున్నారు. ముందుగా నాలుగడుగుల చొప్పున వెడల్పు, పొడవు, లోతు గుంతను తవ్వుతున్నారు. గుంతల్లోకి ఐదు రోజుల పాటు నీటిని వదిలిన అనంతరం రెండు కిలోల వేప పిండి, 30 కిలోల వర్మీ కంపోస్టుతో మట్టిని జత చేస్తున్నారు. ఇప్పటివరకు ఈ గుంతల్లో 250 చెట్లకు పునఃస్థాపన చేశారు. మరో 100 మొక్కలను ఇదే తరహాలో నాటనున్నారు. నాటిన నెల రోజుల తర్వాత 80 శాతం చెట్లు చిగురించినట్లు నిర్వాహకులు తెలిపారు. చెట్టుకు చెట్టుకు మధ్య ఐదు అడుగుల దూరం వదులుతూ మధ్య మధ్యలో కొత్తగా మొక్కలను కూడా నాటుతున్నారు. తొలగిస్తున్న చెట్లను ఐదు, పది అడుగుల ఎత్తు వరకు కట్ చేసి రీలొకేషన్ చేస్తున్నారు.

కుశల ప్రశ్నలు.. కులాసా పలకరింపులు

నల్లగొండ మల్టీపర్పస్ హైస్కూల్ 1970 బ్యాచ్ విద్యార్థుల అపూర్వ కలయిక



బంజారాహిల్స్: రేయ్ నువ్వా..! ఎలా ఉండేవాడివిరా ఎలా అయిపోయావు.. ఎంతమంది పిల్లలు.. ఎంతమంది మనవాళ్లు, మనవరాళ్లు.. అంటూ ఒకరికొకరు కుశల ప్రశ్నలు వేసుకున్నారు. ఆలింగనం చేసుకున్నారు. ఆనంద పరవశమయ్యారు. ఒకటి, రెండు కాదు, ఏకంగా 55 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. ఇదీ పూర్వ విద్యార్థుల అపూర్వ కలయికలో కనిపించిన దృశ్యం. నల్లగొండ మల్టీపర్సప్ హైస్కూల్‌కు చెందిన 1970 బ్యాచ్ గెట్ టు గెదర్ పార్టీలో చోటు చేసుకున్న సన్నివేశం ఇది. ఏడు పదుల వయస్సులో వారంతా ఆడిపాడారు. ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం సోమాజిగూడలోని ఓ హోటల్‌లో ఉల్లాసంగా సాగింది. 12వ తరగతి పూర్తి చేసిన 55 ఏళ్లకు వారంతా ఒకచోట చేరారు. అప్పటి గురువులు బోధనలను గుర్తుచేసుకున్నారు. నగరానికి చెందిన మంచుకొండ ప్రకాశం తనతో చదువుకున్న విద్యార్థులందరినీ ఒకచోట చేర్చాలని ఆలోచించారు. నాలుగు నెలలు శ్రమించి సుమారు 100 మంది వివరాలను సేకరించగలిగారు. మిత్రులు వినోద్, వెంకన్నలతో పాటు మరికొంతమంది సహాయంతో ఈ అపూర్వ సమ్మేళనం రూపుదిద్దుకుంది. 'ఏ'సెక్షన్ నుంచి 'జి'సెక్షన్ వరకు సుమారు 400 మంది విద్యార్థులు ఉండగా కేవలం 81 మంది మాత్రమే హాజరయ్యారంటూ ప్రకాశం విచారం వ్యక్తం చేశారు. ఇప్పటి చదువులకు, అప్పటి చదువులకు ఎంతో తేడా ఉందని, గురువులను దైవం కంటే అధికంగా భావించి విద్యాబుద్ధులు నేర్చుకున్నామని తెలిపారు. గురువే నిజమైన భగవంతుడు అని నమ్మి వారు చెప్పిన విషయాలను తూ.చ. తప్పకుండా పాటించడం వల్లే ఈ స్థాయికి ఎదిగామని పోస్టల్ డిపార్ట్‌మెంట్ రిటైర్డ్ ఉద్యోగి వెంకన్న, వినోద్ అన్నారు.

హక్కులను ప్రతి స్త్రీ తెలుసుకోవాలి



'లీగల్లీ యువర్స్' రచయిత మానసిచౌదరి, హార్పర్ కాలిన్స్ ఇండియా ఎడిటర్ రిధిమా

ప్రముఖ న్యాయవాది మానసిచౌదరి

రాయదుర్గం: భారతదేశంలోని ప్రతి స్త్రీ తన హక్కులను తెలుసుకోవాలని 'పింక్ లీగల్' వ్యవస్థాపకురాలు, ప్రముఖ న్యాయవాది మానసి చౌదరి అన్నారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని ఐటీసీ కోహినూర్‌లో భారతదేశంలో 'బెస్ట్ సెల్లర్'గా పేరొందిన, దేశంలో మహిళల హక్కులపై మొట్టమొదటి పుస్తకం 'లీగల్లీ యువర్స్' పుస్తక రచయిత మానసి చౌదరి పుస్తకం, హక్కులపై ఆదివారం సాయంత్రం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఈ పుస్తకం సంక్లిష్టమైన చట్టాలను సూటిగా వివరిస్తుందన్నారు. చర్య తీసుకోదగిన చట్టపరమైన పరిష్కారాలను అందిస్తుందన్నారు. స్త్రీ తన హక్కుల గురించి తెలుసుకున్నప్పుడే ఆమె వాటి కోసం నిలబడగలదన్నారు. జ్ఞానం అనేది సాధికారత వైపు మొదటి అడుగు అని ఆమె అభివర్ణించారు. హార్పర్ కాలిన్స్ ఇండియా కమిషనింగ్ ఎడిటర్ రిధిమా కుమార్ మాట్లాడుతూ 'ఈ పుస్తకంపై పనిచేయడం నాకు కళ్ళు తెరిపించింది. నమ్మకంగా, స్వతంత్ర మహిళగా, నాకు నా హక్కులు తెలుసు అని అనుకున్నా, కానీ నాకు తెలియనివి చాలా ఉన్నాయని నేను గ్రహించాను' అని వివరించారు. కార్యక్రమంలో పలువురు మహిళలు పాల్గొన్నారు.

'తందనాన' సంగీత పోటీలు

ఆగస్టు 31వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలి



తందనాన సంగీత పోటీలను ప్రారంభించిన సాక్షి రూపానంద స్వామీజీ తదితరులు

మాదాపూర్: అన్నమయ్య కీర్తనలను ఆలపించి ప్రతిభను ప్రదర్శించే నిమిత్తం 'తందనాన'సంగీత పోటీలు నిర్వహిస్తున్నట్లు చిన్మయ మిషన్ హైదరాబాద్ సాక్షి రూపానంద స్వామీజీ తెలిపారు. మాదాపూర్ అన్నమయ్యపురంలో ఆదివారం తందనాన అంతర్జాతీయ అన్నమాచార్య సంగీత పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ పోటీలలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సంగీతప్రియులు పాల్గొనవచ్చన్నారు. పోటీలలో సబ్ జూనియర్ 6 సంవత్సరాలలోపు, జూనియర్ 7 నుంచి 15 సంవత్సరాల లోపు సీనియర్ 16 సంవత్సరాలు, ఆపైన వారు పాల్గొనవచ్చని అన్నమాచార్య భావన వాహిని వ్యవస్థాపకురాలు పద్మశ్రీ డాక్టర్ శోభరాజు తెలిపారు. ఆగస్టు 31వ తేదీలోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. గ్రాండ్ ఫినాలే అన్నమయ్య పురంలో అక్టోబర్ 8వ తేదీన జరగనున్నట్లు తెలిపారు. బహుమతుల ప్రదానోత్సవం, అన్నమాచార్య సాంస్కృతిక వేడుకను అమరావతిలో నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో మార్గదర్శి చిట్‌ఫండ్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శైలజా కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

దర్గాగా కబ్జాలు.. అక్రమంగా నిర్మాణాలు

కుంచించుకు పోయిన బంజారా హిల్స్ రోడ్డు నెంబర్–11లోని నాలా



బంజారా హిల్స్ రోడ్డు నెంబర్-11లో నాలా పక్కన అక్రమ నిర్మాణాలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-11లోని అంబేద్కర్‌నగర్ బస్తీ నాలా బఫర్ జోన్‌లో చేపట్టిన అక్రమ నిర్మాణాల వద్ద ఆదివారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. సుమారు 400 గజాల విస్తీర్ణంలో కబ్జాదారుడు బ్లూ షీట్లు ఏర్పాటు చేశారంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు శనివారం వచ్చి బఫర్ జోన్‌లో నిర్మాణాలు చేపట్టవద్దంటూ హెచ్చరించారు. అయితే జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకోవద్దని, తమకు కోర్టు నుంచి ఆదేశాలు ఉన్నాయని సదరు కబ్జాదారుడు అధికారులనే అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయితే ఈ స్థలం బఫర్ జోన్‌లో ఉందో లేదో తేల్చేవరకు నిర్మాణాలు చేపట్టవద్దంటూ పోలీసులు సూచించారు. అయితే బఫర్ జోన్ 3.70 మీటర్లు వదిలినట్లు ఎల్‌టీసీ తీసుకున్న సదరు యజమాని నిబంధనలు ఉల్లంఘించి ఒక మీటరు మాత్రమే వదిలి ఆదివారం కూడా ఈ నిర్మాణాలు చేపట్టారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏనాడూ ఇరిగేషన్ శాఖ అధికారులు ఇటువైపు తొంగి చూడకపోవడంతోనాలా కుంచించుకుపోయింది. తాజ్ బంజారా చెరువు చుట్టూ స్థలాలు ఆక్రమణకు గురయ్యాయి. ఇప్పటికైనా అధికారులు అక్రమ నిర్మాణాలను అడ్డుకుని బఫర్ జోన్‌లో స్థలాలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, సోమవారం, 12, మే, 2025



నేషనల్ టెక్నాలజీ డే సందర్భంగా హైదరాబాద్ నగరం మరోసారి తన సాంకేతిక ప్రావీణ్యాన్ని చాటుకుంటోంది. 1998లో భారతదేశం పోఖ్రాన్‌లో అణు పరీక్షలు విజయవంతంగా నిర్వహించినందుకు ఈ రోజును గుర్తుంచుకుంటారు. ఈ పరీక్షల ఫలితంగా భారతదేశం అణు ఆయుధాలు కలిగిన ఆరో దేశంగా రూపాంతరం చెందింది. ఈ అణు పరీక్షల విజయాన్ని గుర్తిస్తూ ప్రతి ఏడాది మే 11న ఈ రోజును టెక్నాలజీ డే గా జరుపుకుంటారు. ఈ సందర్భంగా ఆదివారం నగరంలోని ప్రముఖ శాస్త్ర, సాంకేతిక సంస్థలు, విద్యా సంస్థలు, స్టార్టప్‌లు వివిధ కార్యక్రమాలు చేపట్టాయి.

- సాక్షి, సిటీబ్యూరో



హైటెక్ సిటీ..

వినూత్న ఆవిష్కరణలకు కేంద్రంగా హైదరాబాద్

అంకుర సంస్థలు మొదలు గ్లోబల్ కంపెనీల వరకూ

నైపుణ్యాలున్న యువతకు స్వర్గధామం

టెక్నాలజీ డే నేపథ్యంలో టెక్ నిపుణుల స్పందన

హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్‌ఐఎన్), డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ ల్యాబొరేటరీ (డీఆర్‌డీఎల్) వంటి ప్రముఖ పరిశోధనా సంస్థలు తమ తాజా ఆవిష్కరణలు దేశ విశిష్టతకు తార్కాణాలుగా నిలుస్తున్నాయని వెల్లడించాయి. యువ శాస్త్రవేత్తల కృషికి గుర్తింపుగా పలు వేదికల్లో స్మార్ట్ హెల్త్ మానిటరింగ్ సిస్టమ్స్, ఏఐ ఆధారిత భద్రతా పరిష్కారాలు, పర్యావరణ సాంకేతికతలపై ప్రదర్శనలు నిర్వహించారు. హైటెక్ సిటీ, గచ్చిబౌలి ప్రాంతాల్లో ఉన్న స్టార్టప్ సంస్థలు 'టెక్నాలజీ ఫర్ బెటర్ ఫ్యూచర్' అనే థీమ్‌పై ప్రత్యేక వెబ్‌నార్‌లు, డెమో ప్రాజెక్టులు నిర్వహించాయి. పలు అంతర్జాతీయ టెక్ కంపెనీలు కూడా ఈ వేడుకల్లో భాగస్వాములయ్యాయి.





పని తగ్గించి ఉత్పత్తి పెంచే సాధనాలు..

హైదరాబాద్ నుంచి వచ్చిన నిపుణులు అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ప్రపంచ వేదికపై టెక్నాలజీ పరిణామక్రమంపై అవగాహనను కలిగి ఉన్నారు. క్రిటికల్ రివర్‌లో ఈ విజ్ఞానం అంతర్జాతీయ స్థాయి క్లయింట్లు ఆశించే నాణ్యతను అందించడానికి సహాయపడుతుంది. హైదరాబాద్ భవిష్యత్ టెక్నాలజీ కేంద్రంగా ఎదుగుతోంది. మా హైదరాబాద్ బృందం ఆటో-రీకన్సిలియేషన్స్, ఆటోమేటెడ్ చెక్, డేటా విజిబిలిటీని అందించే డాష్‌బోర్డ్‌లు వంటి ఆర్థిక కార్యకలాపాలను క్రమబద్ధీకరించే వినూత్న ఏఐ ఉత్పత్తులను అభివృద్ధి చేయడంలో కృషి చేస్తుంది. మేన్యువల్ పనిని తగ్గిస్తూ, ఉత్పత్తిని వేగవంతం చేసే ఆటోమేషన్ డేటా సాధనాలను అభివృద్ధి చేస్తున్నాము. డేటా ఖచ్చితత్వంతో ఫైనాన్స్ బృందాలకు సహాయపడే ఏఐ సాధనాలను అభివృద్ధి చేయడంలో మా బృందం కీలక పాత్ర పోషించింది. ఈ సాధనాలను ఇప్పటికే ఎంటర్‌ప్రైజ్ క్లయింట్లు ఉపయోగిస్తున్నారు.

– అంజి మారం, క్రిటికల్ రివర్ సీఈఓ, వ్యవస్థాపకులు.

డ్రోన్ సాంకేతికతకు గ్లోబల్ హబ్‌గా..



ఆధునిక యుద్ధ విధానాల్లో సాంకేతికత ఎలా విప్లవాత్మకంగా మారిందో చూస్తూనే ఉన్నాం. ఈ పరిణామంలో డ్రోన్ సాంకేతికత రక్షణ వ్యూహంలో ప్రముఖ స్థానాన్ని సంపాదించుకుంది. భారత-పాకిస్తాన్ సరిహద్దు వద్ద ఏర్పడిన ఇటీవలి ఉద్రిక్తతలు డ్రోన్ల అవసరాన్ని స్పష్టంగా వెల్లడించాయి. ఇవి ఇకపై ఐచ్ఛికం కాదు, అత్యవసరం. నేడు డ్రోన్లు గగనతల గమనిక, పక్కాగా సమాచార సేకరణలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఇది మన దళాలకు వేగవంతమైన, సమర్థవంతమైన స్పందనను అందించడమే కాక, మనుషుల ప్రాణాలను కాపాడటంలో సహాయపడుతోంది. భారత్‌లో స్థానిక డ్రోన్ రంగం వేగంగా అభివృద్ధి చెందుతుండటం 'ఆత్మనిర్భర్త' అవసరాన్ని హైలైట్ చేస్తోంది. దేశాన్ని అధునాతన డ్రోన్ సాంకేతికత గ్లోబల్ హబ్‌గా దిశగా మలచడంలో ఇది కీలక అడుగు.

–ప్రేమ్ కుమార్ విశ్లావత్, మారుత్ డ్రోన్స్ సీఈఓ, సహ–వ్యవస్థాపకులు.



నగర మార్కెట్లోకి ఎంజీ విండ్సర్ ప్రో



సాక్షి, సిటీ బ్యూరో: హైదరాబాద్ మార్కెట్లోకి ఎంజీ విండ్సర్ ప్రో అందుబాటులోకి వచ్చింది. ఇందులో భాగంగా జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా సంస్థ తన ఎంజీ విండ్సర్ ప్రో కారును నగరంలోని ఎల్బీనగర్ పీపీఎస్ మోటార్స్ ఎంజీ షోరూం వేదికగా ఆవిష్కరించింది. మరిన్ని సాంకేతిక, భద్రతా ఫీచర్లతో ఈ కారు బిజినెస్ క్లాస్ ప్రయాణ అనుభవాన్ని అందిస్తుందని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. సరికొత్తగా 'బ్యాటరీ యాజ్ ఎ సర్వీస్ బాస్' పద్ధతిని వినియోగదారులకు అందించేందుకు ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్, కోటక్ మహీంద్ర ప్రైమ్ సంస్థలతో జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా ఒప్పందం చేసుకుంది. ఇది భారతీయ వాహన కొనుగోలు దారులకు ఈ పద్ధతిని తేలిక చేస్తుందని పీపీఎస్ మోటార్స్ ఎండీ రాజీవ్ సంఘ్వీ తెలిపారు.

అందాల సందడి..



నగర వేదికగా నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మక మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొంటున్న వివిధ దేశాలకు చెందిన అందాల ముద్దుగుమ్మలు ఆదివారం సందడి చేశారు. హైటెక్ సిటీలోని ట్రైడెంట్ హోటల్ వేదికగా వివిధ దేశాలకు చెందిన కంటెస్టెంట్స్ ఇలా ఫొటోలకు ఫోజులిచ్చారు. ఈ నెల 31వ తేదీ వరకూ కొనసాగనున్న మిస్ వరల్డ్ పోటీల నేపథ్యంలో నగరంలోని ట్రైడెంట్ హోటల్ వేదికగా వసతితో పాటు పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేసింది రాష్ట్ర ప్రభుత్వం.

- సాక్షి, సిటీబ్యూరో

పాతబస్తీలో మిస్ వరల్డ్ సుందరాంగులు సందడి చేయనున్నారు. నగరంలో జరుగుతున్న మిస్ వరల్డ్-2025లో పాల్గొంటున్న పోటీదారులతో ఈ నెల 13న చార్మినార్‌లో హెరిటేజ్ వాక్ జరగనుంది. దాదాపు 120 దేశాలకు చెందిన ప్రపంచ సుందరాంగులు ఈ హెరిటేజ్ వాక్‌లో పాల్గొనున్నారు. చార్మినార్ నుంచి లాడ్ బజార్ వరకూ నిర్వహించే వాక్‌లో కంటెస్టెంట్స్ ఇక్కడి ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలను తెలుసుకోనున్నారు. పాతబస్తీ చారిత్రక కట్టడాల విశేషాలతో పాటు లాడ్ బజార్‌లోని గాజుల తయారీ కళాకారులతో ప్రత్యక్షంగా మాట్లాడనున్నారు. దీనికి సంబంధించి వివిధ విభాగాల ఉన్నతాధికారులు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తిచేశారు.

- చార్మినార్

హెరిటేజ్ వాక్‌కు సర్వం సిద్ధం..

- పాతబస్తీలో సందడి చేయనున్న ప్రపంచ సుందరాంగులు
- ఈ నెల 13న చార్మినార్-లాడ్ బజార్‌లో హెరిటేజ్ వాక్
- కట్టుదిట్టమైన భద్రతతో ఆదివారం రిహార్సల్స్ పూర్తి





హెరిటేజ్ వాక్ సందర్భంగా పాతబస్తీని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఇప్పటికే చార్మినార్ కట్టడాన్ని మువ్వన్నెల జెండా రంగుల్లో విద్యుత్ దీపాలంకరణ చేశారు. పర్యాటకులు చార్మినార్ వద్ద సెల్ఫీలు దిగుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా చెట్లు, డివైడర్లకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. అఫ్జల్‌గంజ్ ద్వారా పాతబస్తీకి ప్రవేశించే నయాపూల్ బ్రిడ్జిపై కొత్తగా మొక్కలతో అలంకరించారు.






రిహార్సల్స్ పూర్తి..

నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ పర్యవేక్షణలో దక్షిణ మండలం డీసీపీ స్నేహా మెహ్రా ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం చార్మినార్ నుంచి లాడ్‌బజార్ వరకూ హెరిటేజ్ వాక్ రిహార్సల్స్ జరిగాయి. పోలీసు, పర్యాటక, విద్యుత్, జీహెచ్ఎంసీ, ట్రాఫిక్, ఆర్కియాలజీ, జలమండలి.. ఇలా ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు సమన్వయంతో వ్యవహరించి ఈ రిహార్సల్స్‌లో పాల్గొన్నారు. తెలంగాణ జరూర్ ఆనా..అనే టైటిల్‌తో రూపొందించిన ఏసీ బస్సులో మిస్ వరల్డ్–2025 అభ్యర్థులను తరలించనున్నారు. శివారు ప్రాంతమైన ఆరంఘర్ నుంచి డాక్టర్ మన్మోహన్ సింగ్ ఫ్లైఓవర్ ద్వారా పాతబస్తీకి ప్రవేశించి బహదూర్‌పురా, పురానాపూల్, పేట్లబురుజు, మదీనా సర్కిల్, పత్తర్‌గట్టి, గుల్జార్‌హౌజ్, చార్‌కమాన్ ద్వారా చార్మినార్‌కు చేరుకోనుంది.

గుర్రపు స్వారీకి సై..



- గుర్రపు స్వారీపై నగర యువత ఆసక్తి
- వయసుతో సంబంధం లేకుండా ట్రెయినింగ్
- సినీ స్టార్స్, టాప్ మోడల్స్‌తో పాటు సామాన్యులు



గోల్కొండ: గుర్రపు స్వారీపై యువతతో పాటు సీనియర్ సిటిజన్స్ సైతం మక్కువ చూపుతున్నారు. ఆరు నుంచి అరవై సంవత్సరాలు పైబడిన సీనియర్ సిటిజన్స్ వరకూ గుర్రపు స్వారీ చేయవచ్చు. ప్రముఖ సినీ స్టార్స్, వీఐపీలు, టాప్ మోడల్స్ గుర్రపు స్వారీ నేర్చుకోడానికి క్యూ కడుతున్నారు. గుర్రపు స్వారీపై ప్రజల ఆసక్తిని గమనించిన హార్స్ ట్రైనర్స్ మేలు జాతి గుర్రాలను తెచ్చి హార్స్ క్లబ్స్ ఏర్పాటు చేస్తున్నారు. మరో వైపు ఈక్వెస్ట్రియన్ క్రీడకు ఆదరణ పెరుగుతుండడంతో వర్ధమాన క్రీడాకారులు కూడా హార్స్ రైడింగ్ క్లబ్స్‌కు వెళ్తున్నారు. గుర్రపు స్వారీ శిక్షణలో సుదీర్ఘ అనుభవం ఉన్న ఎంఏ.వహాబ్ శిక్షణ పొందిన మేలు జాతి గుర్రాలను సేకరించి షేక్‌పేట్, గండిపేట్, తదితర ప్రాంతాల్లో హార్స్ రైడింగ్ క్లబ్‌లు ఏర్పాటు చేశారు. కాగా గుర్రపు స్వారీకి వయసు అడ్డంకి కాకపోవడంతో తమ క్లబ్‌లకు వచ్చే వారి సంఖ్య పెరుగుతోందన్నారు.

మచ్చిక చేసుకుంటే సులువే..

రెండు దశాబ్దాల క్రితం నగరంలో గుర్రపు స్వారీపై అంత మోజు లేకుండాపోయేది. రాను రాను యువత గుర్రపు స్వారీ నేర్చుకోడానికి ఆసక్తి చూపుతున్నారు. గుర్రపు స్వారీ నేర్చుకోడం ఎంతో సులువు. గుర్రపు స్వారీ చేయడానికి డ్రెస్ కోడ్ నిబంధన కూడా ఉంది. ఫుల్ షూ్యజ్, జాకెట్, హెల్మెట్ తప్పకుండా ఉండాల్సిందే. గుర్రాన్ని ఒక్కసారి మచ్చిక చేసుకుంటే ఆ గుర్రం ఏ మాత్రం ఇబ్బందిచేయకుండా ఉంటుంది. గుర్రాన్ని అదుపు చేయడంలో కళ్లెం ఎంతో ముఖ్యం. అయితే తనపై స్వారీ చేసే వారు తనపై ఏమాత్రం దౌర్జన్యం చేసిన శిక్షణ పొందిన గుర్రం తనపై ఉన్న వ్యక్తిని కిందపడేయడం ఖాయం. ట్రైనర్ చెప్పినట్లు గుర్రాన్ని అదుపులో పెట్టుకుంటే సులువుగా ఎంత దూరమైన స్వారీ చేయవచ్చు. ఇదిలా ఉండగా షేక్‌పేట్, రేతిబౌలి, రింగ్‌రోడ్ తదితర ప్రాంతాల్లోని హార్స్ రైడ్ క్లబ్‌ల వారు వేసవిలో ప్రత్యేక గుర్రపు స్వారీ శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. కాగా గుర్రంపై సవారీ చేయడం ఒక విభిన్నమైన అనుభూతిని కలిగించడమే కాకుండా గుర్రంపై స్వారీ చేసే వారు ఎంతో గర్వంగా ఫీల్ అవుతారని శిక్షకులు అంటున్నారు.

ఆటల వేళ.. అలసట తీరేలా..

సాక్షి, సిటీబ్యూరో: వేసవి సెలవుల సందర్భంగా ఆటల్లో మునిగిపోయే చిన్నారులను సేద తీర్చేందుకు గ్లూకోజ్ ఆధారిత ఎనర్జీ డ్రింక్ గ్లూకాన్-డీ ని నగరంలోని చిన్నారులకు ఉచితంగా అందజేశారు. ఇందిరా పార్క్, స్టేడియం, చింతల్ బస్తీ ప్లే గ్రౌండ్, తిరుమలగిరి ఫుట్‌బాల్ గ్రౌండ్, భువన విజయం గ్రౌండ్స్ మైదానాలు తదితర ప్రదేశాల్లో చిన్నారులకు వీటిని పంపిణీ చేశారు.. ఈ సందర్భంగా ఆటల్లో నిమగ్నమైన పిల్లలకు తక్షణ శక్తిని ఇవి ఇస్తాయని, నారింజ, మామిడి, నీంబూ పానీ వంటి రుచులలోని గ్లూకాన్-డీ నింపిన 700 కిలోలకు పైగా చిల్డ్ గోలాలను 100కి పైగా ఆట స్థలాలు స్టేడియంలలో పంపిణీ చేస్తున్నామని జైడస్ వెల్నెస్ సీఈఓ తరుణ్ అరోరా చెప్పారు.

కైనన్-సబీరా జోడీకి కాంస్య పతకం

అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) షాట్‌గన్ ప్రపంచకప్ టోర్నమెంట్‌లో భారత్‌కు కాంస్యం రూపంలో ఏకైక పతకం లభించింది. సైప్రస్ రాజధాని నికోసియాలో ఆదివారం ఈ టోర్నీ ముగిసింది. చివరిరోజు ట్రాప్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో హైదరాబాద్‌కు చెందిన కైనన్ చెనాయ్, ఉత్తరప్రదేశ్ అమ్మాయి సబీరా హారిస్ కలిసి కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నారు. కాంస్య పతకం కోసం జరిగిన మ్యాచ్‌లో కైనన్-సబీరా ద్వయం 34-33 పాయింట్ల తేడాతో టోల్గా టంకర్-రుమేసా పెలిన్ కాయ (తుర్కియే) జోడీపై విజయం సాధించింది. ఫైనల్లో కి యింగ్-జాంగ్ జిజి (చైనా) జంట 42-39 పాయింట్ల తేడాతో టొమాజ్-సాండ్రా (పోలాండ్) జోడీని ఓడించి స్వర్ణ పతకం దక్కించు కుంది. 34 జోడీలు పోటీపడ్డ క్వాలిఫయింగ్‌లో టొమాజ్-సాండ్రా తొలి స్థానంలో, కి యింగ్-జాంగ్ జిజి రెండో స్థానంలో నిలిచి స్వర్ణ-రజత మ్యాచ్‌కు.... టోల్గా-రుమేసా మూడో స్థానంలో, కైనన్-సబీరా నాలుగో స్థానంలో నిలిచి కాంస్య పతక మ్యాచ్‌కు అర్హత సాధించారు.



జయం మనదే

మహిళల ముక్కోణపు వన్డే క్రికెట్ టోర్నీ విజేత భారత్

- ఫైనల్లో 97 పరుగుల తేడాతో శ్రీలంకపై ఘనవిజయం
- స్మృతి మంధాన సెంచరీ
- రాణించిన హర్లీన్, జెమీమా, హర్మన్
- మెరిసిన స్నేహ్ రాణా, అమన్‌జ్యోత్


స్నేహ్ రాణా


స్మృతి మంధాన సెంచరీ అభివాదం

కొలంబో: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన భారత మహిళల క్రికెట్ జట్టు ముక్కోణపు వన్డే టోర్నమెంట్‌లో విజేతగా అవతరించింది. ఆతిథ్య శ్రీలంక జట్టుతో ఆదివారం జరిగిన ఫైనల్లో హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిండియా 97 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. గత మ్యాచ్‌లో ఫిఫ్టీతో ఫామ్‌లోకి వచ్చిన స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన తుదిపోరులో వీరోచిత శతకంతో భారత్‌కు ట్రోఫీ దక్కడంలో కీలకపాత్ర పోషించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 342 పరుగుల భారీ స్కోరు చేసింది. వైస్ కెప్టెన్ స్మృతి మంధాన (101 బంతుల్లో 116; 15 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీ సాధించగా... హర్లీన్ డియోల్ (56 బంతుల్లో 47; 4 ఫోర్లు), జెమీమా రోడ్రిగ్స్ (29 బంతుల్లో 44; 4 ఫోర్లు), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (30 బంతుల్లో 41; 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. అనంతరం శ్రీలంక జట్టు 48.2 ఓవర్లలో 245 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ చమరి ఆటపట్టు (66 బంతుల్లో 51; 6 ఫోర్లు, 1 సిక్స్), నీలాక్షిక సిల్వా (58 బంతుల్లో 48; 5 ఫోర్లు) రాణించారు. భారత బౌలర్లలో స్పిన్నర్ స్నేహ్ రాణా 4, పేసర్ అమన్‌జ్యోత్ కౌర్ 3 వికెట్లు తీశారు. ఈ మ్యాచ్‌లో సెంచరీ సాధించిన స్మృతి మంధానకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', సిరీస్‌లో 15 వికెట్లు తీసిన స్నేహ్ రాణాకు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు లభించాయి.

సూపర్ స్మృతి...

ఓపెనర్లు స్మృతి, ప్రతీక రావల్ (30; 2 ఫోర్లు)లు తొలి వికెట్‌కు 70 పరుగులతో చక్కని ఆరంభమిచ్చారు. తర్వాత హర్లీన్ జతయ్యాక 55 బంతుల్లో స్మృతి అర్ధసెంచరీ పూర్తి చేసుకుంది. ఇద్దరు నిలదొక్కుకోవడంతో 22వ ఓవర్లో భారత్ 100 పరుగులకు చేరింది. మరోవైపు లంక శిబిరం ఈ జోడీని విడగొట్టేందుకు చేసిన ప్రయత్నాలన్నీ నిష్ఫలయ్యాయి. చమరి వేసిన 31వ ఓవర్లో వరుసగా 4, 4, 4, 4లతో స్మృతి వన్డేల్లో 11వ సెంచరీని 92 బంతుల్లో పూర్తి చేసుకుంది. కాసేపటికి జట్టు స్కోరు 190 వద్ద ఆమె నిష్క్రమించింది. తర్వాత వచ్చిన హర్మన్‌ప్రీత్, జెమీమాలు కూడా లంక బౌలర్లపై యథేచ్ఛగా పరుగులు సాధించడంతో భారత్ స్కోరు దూసుకెళ్లింది. ముఖ్యంగా జెమీమా, హర్మన్‌ప్రీత్‌లు దూకుడుగా ఆడి పరుగులు రాబట్టడంతో భారత జట్టు చివరి 10 ఓవర్లలో 90 పరుగులు సాధించింది. ఆఖర్లో దీప్తి (14 బంతుల్లో 20 నాటౌట్; 3 ఫోర్లు), అమన్‌జ్యోత్ (12 బంతుల్లో 18; 2 ఫోర్లు) వేగంగా పరుగులు జతచేశారు.

ఆరంభం నుంచే తడబాటు...

ఆరంభం నుంచి ఇన్నింగ్స్ ముగిసేదాకా లంక జట్టు ఏ దశలోనూ లక్ష్యఛేదనవైపు నడవ లేదు. మీడియం పేసర్ అమన్‌జ్యోత్ వైవిధ్యమైన బంతులతో లంక ఓపెనర్లను హడలెత్తించింది. ఖాతా తెరువక ముందే హాసిని (0) డకౌట్ కాగా, కాసేపటికి విష్మీ గుణరత్నే (36; 5 ఫోర్లు)ని కూడా అమన్‌జ్యోత్ క్లీన్‌బౌల్డ్ చేసింది. కెప్టెన్ చమరి, నీలాక్షిక కాసేపు భారత బౌలింగ్‌ను ఎదుర్కొన్నారే తప్ప లక్ష్యానికి అవసరమైన వేగాన్ని అందిపుచ్చుకోలేదు. అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న చమరి 121 స్కోరు వద్ద పెవిలియన్ చేరింది. తర్వాత హర్షిత నిలబడేందుకు ప్రయత్నం చేసినా... స్నేహ్ రాణా, అమన్‌జ్యోత్, శ్రీచరణి చావుదెబ్బ తీశారు. దీంతో 173/2తో పటిష్టంగా కనిపించిన లంక 19 పరుగుల వ్యవధిలో 4 వికెట్లను కోల్పోయి 192/7 వద్ద కుదేలైంది. సుగంధిక (27; 5 ఫోర్లు) చేసిన ఆ మాత్రం స్కోరుతో జట్టు 240 పైచిలుకు స్కోరు చేయగలిగింది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: ప్రతీక (సి) వత్సల (బి) ఇనోక 30; స్మృతి (సి) హర్షిత (బి) విహంగ 116; హర్లీన్ (సి అండ్ బి) విహంగ 47; హర్మన్‌ప్రీత్ (సి) మాల్కి మదర (బి) సుగంధిక 41; జెమీమా (సి) నీలాక్షిక (బి) సుగంధిక 44; రిచా ఘోష్ (సి) సబ్-కరుణరత్నే (బి) మాల్కి మదర 8; అమన్‌జ్యోత్ (సి) సబ్-కరుణరత్నే (బి) మాల్కి మదర 18; దీప్తి శర్మ (నాటౌట్) 20; క్రాంతి గౌడ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 18; **మొత్తం (50 ఓవర్లలో 7 వికెట్లకు) 342. వికెట్ల పతనం:** 1-70, 2-190, 3-219, 4-267, 5-294, 6-304, 7-341. **బౌలింగ్:** మాల్కి మదర 10-0-74-2, దేమి విహంగ 10-0-69-2, సుగంధిక 10-0-59-2, ఇనోక రణవీర 10-0-62-1, చమరి 8-0-61-0, పియుమి వత్సల 2-0-17-0.

శ్రీలంక ఇన్నింగ్స్: హాసిని (బి) అమన్‌జ్యోత్ 0; విష్మీ గుణరత్నే (బి) అమన్‌జ్యోత్ 36; చమరి (బి) స్నేహ్ రాణా 51; నీలాక్షిక (సి) హర్లీన్ (బి) స్నేహ్ రాణా 48; హర్షిత (సి) స్మృతి (బి) అమన్‌జ్యోత్ 26; దేమి విహంగ (సి) స్నేహ్ రాణా (బి) శ్రీ చరణి 4; అనుష్క (సి) అమన్‌జ్యోత్ (బి) స్నేహ్ రాణా 28; వత్సల రనౌట్ 9; సుగంధిక (రనౌట్) 27; మాల్కి మదర (బి) స్నేహ్ రాణా 0; ఇనోక (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 16; **మొత్తం (48.2 ఓవర్లలో ఆలౌట్) 245. వికెట్ల పతనం:** 1-0, 2-68, 3-121, 4-173, 5-178, 6-178, 7-192, 8-243, 9-244, 10-245. **బౌలింగ్:** అమన్‌జ్యోత్ కౌర్ 8-0-54-3, క్రాంతి 5-0-22-0, దీప్తి శర్మ 10-0-43-0, శ్రీచరణి 10-0-55-1, స్నేహ్ రాణా 9.2-1-38-4, ప్రతీక రావల్ 5-0-18-0, హర్లీన్ డియోల్ 1-0-12-0.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

కాంస్యాలు నెగ్గిన దీపిక, పార్థ్


దీపిక


పార్థ్

షాంఘై: ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-2 టోర్నమెంట్‌ను భారత్ ఏడు పతకాలతో ముగించింది. కాంపౌండ్ విభాగంలో శనివారం భారత ఆర్చర్లు ఐదు పతకాలు నెగ్గగా... చివరిరోజు ఆదివారం రికర్వ్ విభాగంలో భారత్ ఖాతాలో రెండు పతకాలు చేరాయి. మహిళల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో ప్రపంచ మాజీ నంబర్‌వన్, నాలుగుసార్లు ఒలింపిక్స్‌లో పాల్గొన్న దీపిక కుమారి... పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో పార్థ్ సుశాంత్ సాలుంఖే కాంస్య పతకాలు సాధించారు. చెయంగ్ కాంగ్ (దక్షిణ కొరియా)తో జరిగిన కాంస్య పతక మ్యాచ్‌లో జార్ఖండ్‌కు చెందిన 30 ఏళ్ల దీపిక 7-3 (27-27, 28-27, 27-30, 30-29, 29-28) సెట్ పాయింట్ల తేడాతో గెలుపొందింది. ఓవరాల్‌గా ప్రపంచకప్ టోర్నీల చరిత్రలో దీపికకు ఇది 37వ పతకం కావడం విశేషం. అంతకుముందు సెమీఫైనల్లో దీపిక 1-7 (26-27, 28-28, 28-30, 28-29) సెట్ పాయింట్ల తేడాతో పారిస్ ఒలింపిక్స్‌లో మూడు పసిడి పతకాలు గెలిచిన లిమ్ సిహైన్ (దక్షిణ కొరియా) చేతిలో ఓడిపోయింది. పురుషుల రికర్వ్ కాంస్య పతక మ్యాచ్‌లో మహారాష్ట్రకు చెందిన పార్థ్ సాలుంఖే 6-4 (30-28, 28-28, 25-25, 27-30, 29-28) సెట్ పాయింట్లతో అడిస్ బాప్టిస్ట్ (ఫ్రాన్స్)పై గెలుపొంది తన కెరీర్‌లో తొలిసారి ప్రపంచకప్ పతకాన్ని సాధించాడు. అంతకుముందు సెమీఫైనల్లో పార్థ్ 4-6 (26-27, 28-30, 28-27, 29-28, 25-28) సెట్ పాయింట్లతో దక్షిణ కొరియా దిగ్గజం కిమ్ వూజిన్ చేతిలో పరాజయం పాలయ్యాడు. 32 ఏళ్ల కిమ్ వూజిన్ ఒలింపిక్స్‌లో ఐదు స్వర్ణాలు, ప్రపంచ చాంపియన్‌షిప్‌లో తొమ్మిది స్వర్ణాలు, ప్రపంచకప్ టోర్నీలలో తొమ్మిది స్వర్ణాలు సాధించాడు. తదుపరి ప్రపంచకప్ స్టేజ్-3 టోర్నమెంట్ తుర్కియేలోని అంటాల్యా నగరంలో జూన్ 3 నుంచి 8 వరకు జరుగుతుంది.

16 లేదా 17 నుంచి ఐపీఎల్!



న్యూఢిల్లీ: ప్రతీ వేసవిలో మెరుపు క్రికెట్ వినోదాన్ని పంచే ఐపీఎల్‌కు ఈసారి ఉద్రిక్త పరిస్థితుల సెగ తగిలింది. భారత్, పాక్‌ల మధ్య డ్రోన్ల యుద్ధంతో లీగ్‌ను వారంపాటు వాయిదా వేశారు. ఇపుడు తాజా కాల్పుల విరమణ నేపథ్యంలో పరిస్థితుల్ని ఎప్పటికప్పుడు నిశితంగా గమనిస్తున్న బీసీసీఐ ఐపీఎల్ పునః ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తోంది. ఈ వారాంతంలోనే ఆటను తిరిగి ప్రారంభించాలని బీసీసీఐ భావిస్తోంది. ఈ నెల 16 లేదంటే 17 నుంచి ఐపీఎల్ మళ్లీ మొదలవనుంది. ఫైనల్ వేదికను కోల్‌కతా నుంచి అహ్మదాబాద్‌కు మార్చే యోచనలో బీసీసీఐ ఉంది. ఈ మార్పునకు వర్ష సూచనే కారణమని తెలిసింది. ఆటగాళ్ల సంసిద్ధత, విదేశీ ఆటగాళ్లను వెంటనే రప్పించే ఏర్పాట్లను వెంటనే పూర్తిచేయాలని రేపటికల్లా ఫ్రాంచైజీలన్నీ రెడీగా ఉండాలని బీసీసీఐ సూచించింది.

అన్నీ డబుల్ హెడర్‌లేనా?

ఈ నెలాఖరుకల్లా ఐపీఎల్‌ను పూర్తిచేయాలని పట్టుదలతో ఉన్న లీగ్ పాలకమండలి మిగతా లీగ్ మ్యాచ్‌ల్ని డబుల్ హెడర్ (రోజూ రెండు మ్యాచ్‌ల చొప్పున)లుగా నిర్వహించే ప్రణాళికతో ఉంది.

హైదరాబాద్‌లోనే ఆ రెండు ప్లే ఆఫ్స్

హైదరాబాద్ అభిమానులకు ఎలాంటి నిరాశలేకుండా ముందనుకున్న షెడ్యూల్ ప్రకారమే రెండు 'ప్లేఆఫ్స్' మ్యాచ్‌లు ఉప్పల్ స్టేడియంలోనే జరుగుతాయని ఐపీఎల్ వర్గాలు తెలిపాయి. తేదీలు మారినా... తొలి క్వాలిఫయర్, ఎలిమినేటర్ మ్యాచ్‌లు హైదరాబాద్‌లోనే నిర్వహిస్తారు. అయితే రెండో క్వాలిఫయర్ సహా ఫైనల్ పోరుకు వేదికైన కోల్‌కతాలోనే వాతావరణ సమస్యలు ఎదురవుతాయని తెలిసింది. ఈ నేపథ్యంలో విజేతను తేల్చే మ్యాచ్‌కు వర్షం అడ్డులేకుండా ఉండేలా అహ్మదాబాద్‌ను ఫైనల్ వేదికగా ఖరారు చేసే అవకాశముంది. మొత్తానికి సోమవారం షెడ్యూల్‌పై కసరత్తు పూర్తి చేస్తారని ఐపీఎల్ వర్గాలు తెలిపాయి.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

బ్యాంక్ ఆఫ్ బరోడాలో 500 ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులు

బ్యాంక్ ఆఫ్ బరోడా దేశవ్యాప్తంగా ఉన్న బ్రాంచిల్లో ఆఫీస్ అసిస్టెంట్(ప్యూన్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 500.
» **వేతనం:** నెలకు రూ.19,500.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు స్థానిక భాష చదవడం, రాయడం వచ్చి ఉండాలి. వయసు: 18 నుంచి 26 ఏళ్లు ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష, స్థానిక భాష పరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 23.05.2025
» **వెబ్‌సైట్:** www.bankofbaroda.in

డీఆర్‌డీవో-ఎల్‌డీఆర్‌ఈ, బెంగళూరులో 118 అప్రెంటిస్‌లు

బెంగళూరులోని డీఆర్‌డీవో-ఎలక్ట్రానిక్స్ అండ్ రాడార్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్ (ఎల్‌డీఆర్ఈ).. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి గ్రాడ్యుయేట్, డిప్లొమా, ట్రేడ్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 118.
» **ఖాళీల వివరాలు:** ట్రేడ్ అప్రెంటిస్-30, డిప్లొమా అప్రెంటిస్-30, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్-58. -కోర్సు వ్యవధి: ఏడాది.
» **ట్రేడులు:** కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్/డేటా ఎంట్రీ ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానిక్, టర్నర్, మెషినిస్ట్/సీఎన్‌సీ మెషినింగ్ టెక్, మెకానిక్ మోటార్ వెహికల్, టర్నర్, వెల్డర్, ఫోటోగ్రాఫర్, మెకానికల్ ఇంజనీరింగ్, బీకాం, బీఎస్సీ, బీసీఏ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్ తదితరాలు.
» **అర్హత:** సంబంధిత ట్రేడుల్లో ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
» **స్టైపెండ్:** నెలకు ట్రేడ్ అప్రెంటిస్‌కు రూ.7000, డిప్లొమా అప్రెంటిస్‌కు రూ.8000, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.9000.
» **కనిష్ట వయోపరిమితి:** 18 ఏళ్లు నిండి ఉండాలి.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, విద్యార్హత మార్కులు, రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **దరఖాస్తులకు చివరితేది:** 25.05.2025.
» **వెబ్‌సైట్:** https://drdo.gov.in

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో జీఎంఈ కోర్సులో ప్రవేశాలు

కొచ్చిలోని కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్, మెరైన్ ఇంజనీరింగ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్(ఎంఈటీఐ) 2025 విద్యా సంవత్సరానికి సంబంధించి గ్రాడ్యుయేట్ మెరైన్ ఇంజనీరింగ్(జీఎంఈ)కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 120.
» **కోర్సుల వివరాలు:**
» ఐఎంసీఈ ఇండియన్ గ్రాడ్యుయేట్ మెరైన్ ఇంజనీరింగ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్.
» ప్రీ-సీ గ్రాడ్యుయేట్ మెరైన్ ఇంజనీరింగ్ ప్రోగ్రామ్.
» **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో బీటెక్(మెకానికల్ ఇంజనీరింగ్ /నేవల్/ఆర్కిటెక్చర్/మెరైన్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 24 ఏళ్లు మించకూడదు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తులకు చివరితేది:** 20.07.2025.
» **వెబ్‌సైట్:** https://cochinshipyard.in

సీఎస్ఐఆర్-ఐఎంటీ, చండీగఢ్‌లో సైంటిస్ట్ పోస్టులు

చండీగఢ్‌లోని సీఎస్ఐఆర్-ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మైక్రోబయాల్ టెక్నాలజీ(ఐఎంటీ) సైంటిస్ట్-గ్రేడ్4 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 03
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీహెచ్‌డీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 04.06.2025 నాటికి 32 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.67,700 నుంచి 2,08,700
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 04.06.2025.
» **వెబ్‌సైట్:** www.imtech.res.in

అవుతారా.. బ్యాంక్ మేనేజర్

ప్రభుత్వ రంగ బ్యాంకు.. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 500 అసిస్టెంట్ మేనేజర్ (క్రెడిట్, ఐటీ) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆన్‌లైన్ పరీక్ష, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నారు. బ్యాంకింగ్ కార్యకలాపాల్లో ఎంతో కీలకమైన ఈ స్పెషలిస్ట్ పోస్టులకు ఎంపికైతే ప్రారంభంలోనే నెలకు రూ.80వేలకు పైగా వేతనం అందుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. యూనియన్ బ్యాంక్ నోటిఫికేషన్ సమాచారం, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ తదితర వివరాలు..


బ్యాంక్ జాబ్స్

» యూనియన్ బ్యాంక్‌లో 500 పోస్టులకు నోటిఫికేషన్
» ఆన్‌లైన్ పరీక్ష, జీడీ, ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక ప్రక్రియ
» ప్రారంభంలోనే నెలకు రూ.80వేలకు పైగా వేతనం

ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఉద్యోగమంటే.. ఎంతో క్రేజ్. భారీగా వేతనం, కెరీర్‌లో వేగంగా ఎదిగేందుకు అవకాశంతో పాటు స్థిరమైన కొలువు కావడంతో బ్యాంక్ జాబ్స్ నోటిఫికేషన్ల కోసం ఎంతో మంది ఎదురుచూస్తుంటారు. నోటిఫికేషన్లు రాకముందు నుంచే బ్యాంక్ ఉద్యోగాల కోసం దీర్ఘకాలిక ప్రిపరేషన్ సాగిస్తుంటారు. ఇలాంటి వారికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాజా నోటిఫికేషన్ చక్కటి అవకాశం. ముఖ్యంగా ఎంబీఏ, సీఏ, బీటెక్ వంటి ప్రొఫెషనల్ అర్హతలున్న వారు ఈ స్పెషలిస్ట్ పోస్టులను అందిపుచ్చుకోవచ్చు.

పోస్టులు- అర్హతలు

అసిస్టెంట్ మేనేజర్ క్రెడిట్

- **పోస్టుల సంఖ్య:** 250.
- **అర్హతలు:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి గ్రాడ్యుయేషన్‌తోపాటు సీఏ/సీఎంఏ(ఐసీడబ్ల్యూఏ)/సీఎస్ ఉత్తీర్ణులవ్వాలి లేదా కనీసం 60 శాతం మార్కులతో ఫైనాన్స్ స్పెషలైజేషన్‌గా రెండేళ్ల ఎంబీఏ/ఎంఎంఎస్/పీజీడీఎం /పీజీడీబీఎం ఉత్తీర్ణత ఉండాలి. ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ/పీడబ్ల్యూడీ అభ్యర్థులు కనీసం 55 శాతం మార్కులు సాధించాలి. 20.05.2025 నాటికి విద్యార్హతలు పొంది ఉండాలి. పీఎస్‌బీలు, బీఎఫ్ఎస్ఐలో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుంది.

అసిస్టెంట్ మేనేజర్ ఐటీ

- **పోస్టుల సంఖ్య:** 250.
- **అర్హతలు:** కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/ఐటీ/ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్ సైన్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్/డేటా సైన్స్/మెషిన్ లెర్నింగ్ అండ్ ఏఐ/సైబర్ సెక్యూరిటీ విభాగాల్లో గుర్తింపు పొందిన యూనివర్సిటీ లేదా ఇన్‌స్టిట్యూట్ నుంచి బీఈ/బీటెక్/ఎంసీఏ/ఎమ్మెస్సీ(ఐటీ)/ఎంఎస్/ఎంటెక్/ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ ఉత్తీర్ణులవ్వాలి. 20.05.2025 నాటికి విద్యార్హతలు పొంది ఉండాలి. ఐటీ డొమైన్‌లో కనీసం ఏడాది పని అనుభవం ఉండాలి.

వయసు

01.04.2025 నాటికి 22 ఏళ్ల నుంచి 30 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. గరిష్ట వయోపరిమితిలో ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీ(నాన్ క్రీమీలేయర్)లకు మూడేళ్ల సడలింపు లభిస్తుంది.

వేతనం

అసిస్టెంట్ మేనేజర్ క్రెడిట్, అసిస్టెంట్ మేనేజర్ ఐటీ ఉద్యోగాలకు ఎంపికైన వారికి నెలకు రూ.48,480 మూల వేతనం లభిస్తుంది. దీంతోపాటు డీఏ, హెచ్ఆర్ఏ, ప్రత్యేక అలవెన్స్‌లు, ఇతర అలవెన్సులు కలుపుకొని ప్రారంభంలోనే నెలకు రూ.80వేలకు పైగా అందుకునే అవకాశముంది. అదే విధంగా బ్యాంక్ నిబంధనలను అనుసరించి నివాస వసతి, వైద్య ఖర్చుల రీయింబర్స్‌మెంట్ వంటి సౌకర్యాలు పొందే వీలుంది.

ప్రొబేషన్, సర్వీస్ బాండ్

ఎంపికైన అభ్యర్థులకు బ్యాంక్‌లో చేరిన తేదీ నుంచి రెండేళ్లపాటు ప్రొబేషన్ ఉంటుంది. దీంతోపాటు మూడేళ్లపాటు బ్యాంకులో పనిచేస్తామని హామీ ఇస్తూ రూ.2,50,000 సర్వీస్ బాండ్‌ను ఇవ్వాల్సి ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ

- దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఆన్‌లైన్ పరీక్ష, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ... ఇలా మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.
- ఆన్‌లైన్ పరీక్ష పార్ట్ 1, పార్ట్ 2లుగా 150 ప్రశ్నలు-225 మార్కులకు ఉంటుంది. పరీక్ష సమయం 150 నిమిషాలు. పార్ట్1లో క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ 25 ప్రశ్నలు-25 మార్కులు, రీజనింగ్ 25 ప్రశ్నలు-25 మార్కులు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 25 ప్రశ్నలు-25 మార్కులకు ఉంటాయి.
- పార్ట్ 2లో ఆయా పోస్టును అనుసరించి సంబంధిత ప్రొఫెషనల్ నాలెడ్జ్ నుంచి 75 ప్రశ్నలు-150 మార్కులకు అడుగుతారు. ఈ విభాగం ద్వారా అభ్యర్థుల ప్రొఫెషనల్ పరిజ్ఞానాన్ని అంచనావేస్తారు.
- నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి పావు వంతు మార్కును తగ్గిస్తారు. సమాధానం గుర్తించని ప్రశ్నకు జీరో మార్కులు ఉంటాయి.
- ఆన్‌లైన్ పరీక్షలో ప్రతిభ చూపిన వారితో మెరిట్ జాబితా రూపొందించి, రిజర్వేషన్లను అనుసరించి గ్రూప్ డిస్కషన్‌కు ఎంపిక చేస్తారు.

గ్రూప్ డిస్కషన్, పీఐ

ఆన్‌లైన్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు గ్రూప్ డిస్కషన్(జీడీ) నిర్వహిస్తారు. ఈ జీడీకి 50 మార్కులు కేటాయించారు. ఇందులో జనరల్/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు కనీసం 25 మార్కులు, రిజర్వ్‌డ్ కేటగిరీ(ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ) అభ్యర్థులు కనీసం 22.5 మార్కులు సాధించాలి. జీడీలో కనీస అర్హత మార్కులు సాధించిన వారినే పర్సనల్ ఇంటర్వ్యూ(పీఐ)కు పిలుస్తారు.

పర్సనల్ ఇంటర్వ్యూ

పర్సనల్ ఇంటర్వ్యూకు సైతం 50 మార్కులు కేటాయించారు. ఒక్కో పోస్టుకు ముగ్గురిని చొప్పున (1:3 నిష్పత్తి) పీఐకి ఎంపిక చేస్తారు. ఇందులో అభ్యర్థి అకడెమిక్ సామర్థ్యాలు, జాబ్ నాలెడ్జ్, ఆలోచనల్లో స్పష్టత, నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి వాటిని పరిశీలిస్తారు. పీఐలోనూ జనరల్/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు కనీసం 25 మార్కులు, రిజర్వ్‌డ్ కేటగిరీ(ఎస్సీ/ఎస్టీ/ఓబీసీ) అభ్యర్థులు కనీసం 22.5 మార్కులు సాధించాలి. మూడు దశల ఎంపిక ప్రక్రియలో చూపిన ప్రతిభ ఆధారంగా తుది నియామకాలు ఖరారు చేస్తారు.

ఆన్‌లైన్ పరీక్షలో రాణించేలా

- క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్, రీజనింగ్, ఇంగ్లిష్‌లో 25 ప్రశ్నలు చొప్పున మొత్తం 75 ప్రశ్నలు-75 మార్కులకు ఉంటాయి. కాబట్టి అభ్యర్థులు ఈ మూడు విభాగాల్లోని సిలబస్ అంశాలను పరిశీలించి, గత ప్రశ్న పత్రాల ఆధారంగా ఎక్కువ వెయిటేజీ ఉన్న టాపిక్స్‌ను గుర్తించాలి. ఆయా టాపిక్స్ బేసిక్స్, ఫార్ములాలపై పట్టు సాధించడంతోపాటు సాధ్యమైనన్ని ఎక్కువ ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి. ఇప్పటికే బ్యాంక్ పీఓ తదితర పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు మెయిన్స్ స్థాయిలో ప్రశ్నలు ఉంటాయని భావించి ప్రిపరేషన్ సాగించాలి.
- క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్‌కు సంబంధించి సింప్లిఫికేషన్స్, ప్రాఫిట్ అండ్ లాస్, రేషియో అండ్ ప్రపోర్షన్స్, పర్సంటేజెస్, టైమ్ అండ్ డిస్టెన్స్, టైమ్ అండ్ వర్క్, మిక్చర్స్ అండ్ అలిగేషన్స్, సింపుల్ ఇంటరెస్ట్, కాంపౌండ్ ఇంటరెస్ట్, ప్రాబబిలిటీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్స్ అంశాలపై పట్టు సాధించాలి.
- రీజనింగ్‌లో లాజికల్ రీజనింగ్, డేటా సఫిషియెన్సీ,ఆల్ఫాన్యూమరిక్ సిరీస్, అల్ఫాబెట్ టెస్ట్,డైరెక్షన్స్,కోడింగ్-డీకోడింగ్,పజిల్స్, సిలాజిజమ్స్‌కు సంబంధించి గత పీవో, క్లరికల్ పరీక్షల ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి. ప్రాక్టీస్‌తోనే వేగం,కచ్చితత్వం అలవడుతుందని గుర్తించాలి.
- జనరల్ ఇంగ్లిష్‌లో రీడింగ్ కాంప్రహెన్షన్, వొకాబులరీ, గ్రామర్‌తోపాటు ఫిల్ ఇన్ ద బ్లాంక్స్, పారా జంబుల్స్, ఎర్రర్ స్పాటింగ్, సెంటెన్స్ కంప్లీషన్‌పై అవగాహన పెంచుకోవాలి.
- పార్ట్ 2లో ప్రొఫెషనల్ నాలెడ్జ్‌కి సంబంధించి 75 మార్కులకు-75 ప్రశ్నలు అడుగనున్నారు. కాబట్టి పరీక్షలో సక్సెస్‌కు పార్ట్ 2 అత్యంత కీలకమని గుర్తించాలి. ఇందులో గరిష్ట మార్కులు సాధించేందుకు కృషి చేయాలి.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 20.05.2025
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.unionbankofindia.co.in/en/home

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ-మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం-బయాలజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం-జనరల్ స్టడీస్-తెలంగాణ ఎకానమీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం-రీజనింగ్

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	880	79,454
నిఫ్టీ ▽	266	24,008

విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)			
నాస్‌డాక్	17,929		0
డోజోన్స్	41,249	▽	119
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,555	△	23
డాక్స్	23,499	△	147
షాంఘై	3,342	▽	10
నికాయ్	37,503	△	575

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ధూమపాన	83.54	87.22
£	బ్రిటన్ పౌండ్	ధూమపాన	116.15	111.23
€	యూరో	ధూమపాన	94.18	98.62
¥	జపాన్ యెన్ (100)	ధూమపాన	47.00	69.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ధూమపాన	53.87	56.06
S$	సింగపూర్ డాలర్	ధూమపాన	63.55	68.22
SAR	సౌదీ రియాల్	ధూమపాన	21.87	23.38
UAE D	యూఏఈ దిర్హామ్	ధూమపాన	22.35	24.13
¥	చైనా యువాన్	ధూమపాన	10.92	12.74

మిస్ సెల్లింగ్.. బుట్టలో పడకూడదంటే..?



- బ్యాంకుల్లో బీమా, ఫండ్స్ విక్రయాలు
- కొన్ని సందర్భాల్లో తప్పుదోవ పట్టించి అమ్మకాలు
- మోసపోతే చర్యలు తీసుకోవచ్చు
- పూర్తి సమాచారం తెలుసుకోవాలి
- నిపుణుల సలహాతో నిర్ణయం బెటర్

ఇటీవలే పదవీ విరమణ చేసిన ప్రకాష్ (60)కు వివిధ ప్రయోజనాల రూపంలో రూ.40 లక్షలు సమకూరాయి. వీటిని బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి (ఎఫ్‌డీ) దానిపై ప్రతి నెలా ఆదాయం తీసుకోవాలని భావించాడు. సీనియర్ సిటిజన్స్‌కు అర శాతం అదనపు రేటు కూడా అతన్ని ఆకర్షించింది. తీరా బ్యాంక్‌కు వెళ్లిన తర్వాత అక్కడి రిలేషన్ షిప్ మేనేజర్ (ఆర్ఎం) సూచనలతో మరింత రాబడి కోసం 'స్పెషల్ ఎఫ్‌డీ'లో ఇన్వెస్ట్ చేశాడు. అది కాస్తా యులిప్ ప్లాన్ అని తర్వాత తెలియడంతో ఎవరికి చెప్పుకోలేక లోలోపలే ఆవేదన చెందాడు. గత రాబడుల గురించి గొప్పగా చెప్పడంతో ఆర్ఎం మాటలతో బోల్తా పడ్డాడు. 55 ఏళ్ల నారాయణ మూర్తి చిన్న కిరాణా దుకాణం నడుపుతున్నాడు. ఒక్కతే కుమార్తె. ఉన్నత విద్య కోసం అమెరికాకు పంపాడు. ఇటీవలే ఊళ్లో భూమిని విక్రయించగా రూ.20 లక్షలు చేతికి వచ్చింది. ఫిక్స్‌డ్ డిపాజిట్ చేద్దామని బ్యాంక్‌కు వెళ్లాడు. అక్కడి మేనేజర్ ఎఫ్‌డీ కంటే మంచి రాబడి వస్తుందంటూ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో ఆ మొత్తాన్ని ఇన్వెస్ట్ చేయించాడు. మనలో చాలా మందికి ఇలాంటి అనుభవాలు ఎదురుకావొచ్చు. అవగాహనతోనే ఇలాంటి వాటికి చెక్ పెట్టడం సాధ్యపడుతుంది.

తిరుచ్చిరాపల్లికి చెందిన నారాయణస్వామి దంపతులకూ ఇలాంటి అనుభవమే ఎదురైంది. గడువు తీరిన ఎఫ్‌డీని రెన్యువల్ చేద్దామని బ్యాంక్‌కు వెళ్లగా.. దానికి బదులు యులిప్ ప్లాన్‌లో ఇన్వెస్ట్ చేసుకోవాలన్న సూచన బ్యాంక్ నుంచి వచ్చింది. దీంతో వారు ఫైనాన్షియల్ అడ్వైజర్ (ఆర్థిక సేవల సలహాదారు)ను సంప్రదించారు. యులిప్ ప్లాన్‌లో పెట్టుబడులకు దూరంగా ఉండాలన్న సూచనతో ఎఫ్‌డీ రెన్యువల్‌కే మొగ్గు చూపించారు. బీమా పాలసీలు, మ్యూచువల్ ఫండ్స్, ఇతర పెట్టుబడి సాధనాలను తప్పుడు మార్గాల్లో విక్రయించడం ఇటీవలి కాలంలో ఎక్కువగా కనిపిస్తోంది. దీన్నే మిస్ సెల్లింగ్‌గా చెబుతున్నారు. బ్యాంక్‌లు, మ్యూచువల్ ఫండ్స్ పంపిణీదారులు, బీమా ఏజెంట్ల బుట్టలో పడకుండా ఉండాలంటే కావాల్సింది అవగాహన, స్వీయ జాగ్రత్తలే. ఇలాంటి సందర్భాల్లో కార్యాచరణ ఎలా ఉండాలన్నది చూద్దాం.

- సాక్షి, బిజినెస్ డెస్క్

2023 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరం ఐఆర్‌డీఏఐ గణాంకాల ప్రకారం బీమా కంపెనీలకు వ్యతిరేకంగా 1,27,378 ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో 50 శాతం జీవిత బీమా కంపెనీలు మిస్ సెల్లింగ్ విధానాలకు వ్యతిరేకంగా దాఖలైనవే ఉన్నాయి. బ్యాంకింగ్ ఉత్పత్తుల కంటే మ్యూచువల్ ఫండ్స్, ఇన్సూరెన్స్ ఉత్పత్తులకు సంబంధించి తప్పుదోవ పట్టించి విక్రయించడం అతిపెద్ద సమస్యగా ఉన్నట్టు గ్రాంట్ థార్న్‌టన్ పార్ట్‌నర్ వివేక్ అయ్యర్ తెలిపారు. ''బ్యాంకుల ఉత్పత్తులు సులభంగా, సరళంగా ఉంటాయి. అదే మ్యూచువల్ ఫండ్స్, ఇన్సూరెన్స్ అన్నవి మార్కెట్ రిస్కులు, షరతులతో ముడిపడి ఉంటాయి. కొన్ని సందర్భాల్లో నిపుణులకు సైతం వీటి గురించి చెప్పడం కష్టంగానే ఉంటుంది'' అని వివరించారు. బ్యాంకుల ద్వారా ఎక్కువ మిస్ సెల్లింగ్ అవుతున్నది బీమా ఉత్పత్తులేనని ఆర్థిక సర్వే 2024 సైతం స్పష్టం చేసింది. ఈ సందర్భంగా యస్ బ్యాంక్ ఉదాహరణ గురించి కూడా చెప్పుకోవాలి. లోగడ యస్ బ్యాంక్ సిబ్బంది ఎఫ్‌డీల పేరుతో ఏటీ-1 బాండ్లను కస్టమర్లకు విక్రయించారు. నిజానికి అవి పర్పెచ్యువల్ బాండ్లు. ఈ విషయం తమకు చెప్పనేలేదని కస్టమర్లు ఆరోపించడం గమనార్హం. ఏటీ-1 బాండ్లకు మెచ్యూరిటీ ఉండదు. నిర్ణీత కాలానికోసారి వడ్డీ చెల్లింపులు చేస్తారు. ఎఫ్‌డీల కంటే వీటిపై అధిక రేటు ఉంటుంది. బ్యాంక్ నష్టపోతే వీటికి ఎలాంటి చెల్లింపులు చేయరు. వాటిని రద్దు చేయొచ్చు కూడా. 2020లో యస్ బ్యాంక్ తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొన్నప్పుడు రూ.8,400 కోట్ల ఏటీ-1 బాండ్లను రద్దు చేసింది.

మార్కెటింగ్ లక్ష్యాలు..

- బీమా ఉత్పత్తులను ఎఫ్‌డీల కంటే అధిక రాబడులను ఇచ్చే సాధనాలుగా బ్యాంక్ ఆర్ఎంలు విక్రయిస్తుండడం తరచుగా కనిపిస్తోంది. కొన్ని సందర్భాల్లో మూడు నుంచి ఐదేళ్ల కాలం కోసం ఉద్దేశించిన పెట్టుబడి సాధనాలుగా వాటిని బ్యాంక్ సిబ్బంది విక్రయిస్తున్నట్టు డెలాయిట్ ఇండియా ఇన్సూరెన్స్ సెక్టార్ లీడర్ దేవాశిష్ బెనర్జీ తెలిపారు.
- బ్యాంక్ రుణం మంజూరునకు, లాకర్ల సదుపాయం తెరవాలంటే ఇన్సూరెన్స్ పాలసీ తీసుకోవడం తప్పనిసరి అని కొన్ని బ్యాంకులు షరతు పెడుతున్నాయి.
- యూనిట్ లింక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్లు (యులిప్‌లు), డిఫర్డ్ యాన్యుటీ ప్లాన్లు (ఇన్వెస్ట్ చేసిన కొంత కాలం తర్వాత నుంచి దానిపై ఆదాయం చెల్లించేవి), గ్యారంటీడ్ ఇన్‌కమ్ ప్లాన్లు సైతం తప్పుడు మార్గాల్లో విక్రయిస్తున్నారు.
- రిస్క్ అంతగా తీసుకునే సామర్థ్యం లేని సంప్రదాయ ఇన్వెస్టర్లకు అధిక రిస్క్ మ్యూచువల్ ఫండ్స్ పథకాలను విక్రయిస్తున్నారు.
- పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సర్వీసెస్ (పీఎంఎస్), ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ (ఏఐఎఫ్‌లు)ను తరచుగా మ్యూచువల్ ఫండ్స్ కంటే మెరుగైనవంటూ మార్కెటింగ్ చేస్తున్నారు.
- కొన్ని సందర్భాల్లో అవసరం లేకపోయినా కస్టమర్లతో రుణాలు తీసుకునేలా ప్రోత్సహిస్తున్నారు. ఎఫ్‌డీ ప్రారంభిస్తే తక్కువ రేటుపై పర్సనల్ లోన్ ఇస్తామంటూ కొన్ని సందర్భాల్లో బ్యాంక్ సిబ్బంది కస్టమర్లను కోరుతున్నారు. తమకు విధించిన లక్ష్యాలను చేరుకునేందుకు వీలుగా బ్యాంక్ సిబ్బంది ఇలాంటి ఉత్పత్తులను ఏదో ఒక రకంగా కస్టమర్లతో కొనిపించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.
- 1 ఫైనాన్స్ మ్యాగజైన్' 2024 అక్టోబర్ సర్వే నివేదిక ప్రకారం .. లక్ష్యాలను చేరుకోకపోతే ఉద్యోగం కోల్పోవాల్సి వస్తుందన్న భయంతో బ్యాంక్ ఆర్ఎంలలో 57 శాతం మంది ఆర్థిక ఉత్పత్తులను తప్పుడు మార్గాల్లో విక్రయిస్తున్నట్టు చెప్పారు.





అవగాహనతోనే నివారణ



ఏ ఉత్పత్తిని అయినా కొనుగోలు చేసే ముందు పూర్తి పరిశీలన అవసరం. దాని గురించి సమగ్రంగా తెలుసుకుని, అవగాహన ఏర్పడిన తర్వాతే కొనుగోలుపై నిర్ణయం తీసుకోవాలి. బ్యాంక్‌లు విక్రయిస్తున్నవన్నీ తప్పుదోవపట్టించి అంటగట్టేవిగా చూడడం సరికాదు. ఎందుకంటే ప్రతి ఒక్కరికీ జీవిత, ఆరోగ్య బీమా అవసరం. ఇప్పుడు చాలా బ్యాంక్‌లు గ్రూప్ లైఫ్ ఇన్సూరెన్స్ కవరేజీని, గ్రూప్ హెల్త్ ఇన్సూరెన్స్ కవరేజీని నాన్ గ్రూప్‌తో పోల్చితే తక్కువ ప్రీమియానికే ఆఫర్ చేస్తున్నాయి. కనుక బ్యాంక్‌ల్లో అందుబాటులో ఉండే ఉత్పత్తుల్లో కొన్ని ప్రయోజనకరమైనవీ ఉంటాయన్నది మర్చిపోవద్దు. ముఖ్యంగా అధిక రాబడుల కాంక్షతో పెట్టుబడి సాధనాలను కొనుగోలు చేయడం సరికాదు. ఇంటర్నెట్‌లో సంబంధిత ఉత్పత్తి గురించి శోధిస్తే సమగ్ర సమాచారం చిటికెలో లభిస్తుంది. ''ఏజెంట్‌ను గుడ్డిగా నమ్మకుండా కస్టమర్లు తమ పరిశోధన తర్వాత సహేతుక నిర్ణయాలు తీసుకోవాలి. ప్రతి రోజూ ఎన్నో కొత్త ఉత్పత్తులు వస్తుండడంతో బ్యాంక్ ఆర్ఎంలపై లక్ష్యాల భారం పడుతోంది. ఈ ఒత్తిడితో ఆయా సాధనాల గురించి కస్టమర్లకు వివరంగా చెప్పకుండానే తప్పుడు మార్గాల్లో విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంది'' అని గ్రాంట్ థార్న్‌టన్ పార్ట్‌నర్ వివేక్ అయ్యర్ తెలిపారు.

ప్రయోజనాలు.. రిస్కులు చూడాలి...



బ్యాంక్ ఆఫర్ చేస్తున్న ఉత్పత్తిలోని ప్రయోజనాలు, రిస్కులు, అవి తమకు ఏ మేరకు అనుకూలమన్నది ప్రశ్నించాలి. అర్థవంతమైన వివరణ అనంతరం సరైన నిర్ణయం తీసుకోవాలి. రుణం మంజూరు కావాలంటే దానికి అనుబంధంగా టర్మ్ ప్లాన్ తీసుకోవాలని కోరొచ్చు. అవసరం లేకపోతే అదే విషయం తేల్చిచెప్పండి. తమకు అప్పటికే లైఫ్ ఇన్సూరెన్స్ కవరేజీ లేకపోతే కొనుగోలును పరిశీలించొచ్చు. సంతకాలు చేసే ముందు ఆయా పత్రాలను వివరంగా చదివి అర్థం చేసుకోవాలి. గ్యారంటీడ్ (హామీతో కూడిన) రాబడుల పేరుతో ఏదైనా ఉత్పత్తిని విక్రయించే ప్రయత్నం చేస్తుంటే.. అది డెట్ సాధనమే అయి ఉండాలి. అధిక రాబడులు వస్తాయంటుంటే అది ఈక్విటీ సాధనమైనా అయి ఉండొచ్చు. గత రాబడులు భవిష్యత్ పనితీరుకు హామీ కాదు. ఉత్పత్తి ఏదైనా సరే తమ అవసరాలకు సరితూగే విధంగా ఉండాలి. ఉదాహరణకు 60 ఏళ్లు నిండిన వారికి జీవిత బీమా కవరేజీ అవసరం ఉండదు. కనుక వారు కొనుగోలు చేయాల్సిన అవసరం లేదు. యులిప్‌లు అయినా, ఈక్విటీలు అయినా అధిక రిస్క్‌తో కూడినవి. వృద్ధాప్యంలో మెజారిటీ మొత్తం సురక్షిత సాధనాల్లోనే ఉండాలన్న విషయాన్ని మర్చిపోకూడదు. సెబీ, యాంఫి, ఆర్‌బీఐ, ఐఆర్‌డీఏఐ ఇప్పటికే తమ నియంత్రణల పరిధిలో సంస్థలకు ఈ విషయమై ఆదేశాలు జారీ చేశాయి.

- మీ అవసరాలను, ఆర్థిక లక్ష్యాలను ముందుగా తేల్చుకోవాలి. ఆ తర్వాత అందుకు అనుకూలమైన సాధనాన్ని ఎంపిక చేసుకోవాలి.
- పెట్టుబడుల పత్రాలను సమగ్రంగా చదివి, సందేహాలను తీర్చుకున్న తర్వాతే ముందుకు వెళ్లాలి.
- రిస్క్ తీసుకోలేని వారు అధిక రాబడులను ఆశించడం సరికాదు. అధిక రాబడులను ఇచ్చే సాధనాల్లో ఎలాంటి హామీ ఉండదు.
- పెట్టుబడులు, రక్షణ కలసిన ఉత్పత్తులకు దూరంగా ఉండాలి. ఈ రెండింటినీ వేర్వేరుగా తీసుకోవాలి.

మోసపోతే ఏం చేయాలి?



- ఇప్పటికే బ్యాంక్ నుంచి ఏదైనా ఉత్పత్తిని కొనుగోలు చేసి, అది తమ అవసరాలను సరిపడదని గుర్తిస్తే దీనిపై చర్యలు చేపట్టొచ్చు. బ్యాంక్ కస్టమర్ సేవల విభాగం లేదా ఆర్ఎం వద్ద ఫిర్యాదు దాఖలు చేయాలి. ఫలితం రాకపోతే అదే బ్యాంక్‌లో ఫిర్యాదుల పరిష్కార విభాగం దృష్టికి తీసుకెళ్లాలి.
- బ్యాంక్ స్థాయిలో సమస్య పరిష్కారం కాకపోతే లేదా సంతృప్తికరమైన ఫలితం రాకపోతే అప్పుడు బ్యాంకింగ్ అంబుడ్స్‌మన్‌ను సంప్రదించాల్సి ఉంటుంది. ''సంబంధిత లావాదేవీని రద్దు చేయాలని అంబుడ్స్‌మన్ ఆదేశించగలదు. లేదా పరిహారం ఇప్పిస్తుంది. లేదా దిద్దుబాటు చర్యలకు ఆదేశిస్తుంది. ఇదొక సమర్థవంతమైన పరిష్కార యంత్రాంగం. దీనికి న్యాయపరమైన ప్రతినిధి అవసరం లేదు'' అని ఢిల్లీకి చెందిన న్యాయవాది నిషాంత్ దత్తా సూచించారు.
- బ్యాంక్, అంబుడ్స్‌మన్ స్థాయిల్లో పరిష్కారం రాకపోతే అప్పుడు వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార కమిషన్ (వినియోగదారుల ఫోరమ్) వద్ద కేసు దాఖలు చేయాలి.
- చివరిగా కోర్టును ఆశ్రయించడం ద్వారా న్యాయం కోసం ప్రయత్నించొచ్చు. గతంలో పలు హైకోర్టులు, సుప్రీంకోర్టుల వరకు ఇలాంటి మిస్ సెల్లింగ్ కేసులు వెళ్లాయి. ఆ సమయంలో కోర్టులు సైతం కఠినంగా స్పందించాయి.
- వీరేంద్ర పాల్ కపూర్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (2014) కేసులో.. రాబడులపై తప్పుడు సమాచారంతో పాలసీని విక్రయించిన బీమా సంస్థ అందుకు పూర్తి బాధ్యత వహించాలని ఆదేశించింది. బ్యాంక్ సిబ్బంది చర్యలకు బ్యాంకులే బాధ్యత వహించాలని సుప్రీంకోర్టు సైతం 2013లో ఓ కేసు సందర్భంగా స్పష్టం చేసింది.
- మ్యూచువల్ ఫండ్స్ పంపిణీదారులు లేదా ఏజెంట్లు ఉత్పత్తులను తప్పుగా అంటగడితే సెబీ వద్ద ఫిర్యాదు దాఖలు చేయాలి.
- బీమా ఏజెంట్ల కారణంగా తమకు అనుకూలం కాని ఉత్పత్తులను కొనుగోలు చేసినట్టయితే బీమా అంబుడ్స్‌మన్‌ను ఆశ్రయించాలి.

న్యూ ఫండ్ ఆఫర్స్

ఏంజెల్ వన్ నుంచి రెండు ప్యాసివ్ ఫండ్స్..



ఏంజెల్ వన్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ కొత్తగా నిఫ్టీ 50 ఇండెక్స్ ఫండ్, నిఫ్టీ 50 ఈటీఎఫ్ పేరిట రెండు ప్యాసివ్ ఫండ్స్‌ను ఆవిష్కరించింది. మే 16 వరకు ఈ న్యూ ఫండ్ ఆఫర్స్‌లో (ఎన్ఎఫ్ఓ) ఇన్వెస్ట్ చేయొచ్చు. కనీసం రూ. 1,000 నుంచి పెట్టుబడి పెట్టొచ్చు. సిప్ రూపంలోనైతే రోజువారీ, వారంవారీ, పక్షానికోసారి, నెలవారీ, త్రైమాసికాలవారీగా రూ. 250 నుంచి రూ. 3,000 వరకు ఇన్వెస్ట్ చేయొచ్చు. ఇవి రెండూ నిఫ్టీ 50 సూచీని ట్రాక్ చేస్తాయి. నాణ్యమైన లార్జ్ క్యాప్ స్టాక్స్‌లో పెట్టుబడుల ప్రయోజనాలను పొందాలనుకునే ఇన్వెస్టర్లు వీటిని ఎంచుకోవచ్చని సంస్థ ఈడీ హేమేన్ భాటియా తెలిపారు.

బరోడా బీఎన్‌పీ పారిబా ఇన్‌కం ప్లస్ ఆర్బిట్రేజ్ ఎఫ్ఓఎఫ్



ఇన్‌కం ప్లస్ ఆర్బిట్రేజ్ యాక్టివ్ ఫండ్ ఆఫ్ ఫండ్ (ఎఫ్ఓఎఫ్) పేరిట న్యూ ఫండ్ ఆఫర్‌ను బరోడా బీఎన్‌పీ పారిబా మ్యూచువల్ ఫండ్ (బీబీపీఎంసీ) ఆవిష్కరించింది. ఇది మే 21న ముగుస్తుంది. రిస్కులను అంతగా ఇష్టపడకుండా.. మూలధన వృద్ధి, మెరుగైన రాబడులు కోరుకునే ఇన్వెస్టర్లకు ఈ ఫండ్ అనువైనదిగా ఉంటుంది. బీబీపీఎంసీకి చెందిన డెట్ ఆధారిత ఫండ్స్‌లో 50-65 శాతం నిధులను, ఆర్బిట్రేజ్ పథకంలో 30-50 శాతం, మిగతా మొత్తాన్ని మనీ మార్కెట్ సాధనాల్లో ఇది ఇన్వెస్ట్ చేస్తుంది.

వేల్యూ ఇన్వెస్టింగ్‌కి పెరుగుతున్న ప్రాధాన్యత

టాటా అసెట్ మేనేజ్‌మెంట్ ఫండ్ మేనేజర్ సోనమ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల్లో వేల్యూ ఇన్వెస్టింగ్‌కి ప్రాధాన్యత పెరుగుతున్నట్లు టాటా అసెట్ మేనేజ్‌మెంట్ ఫండ్ మేనేజర్ సోనమ్ ఉదాసీ తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో టాటా ఈక్విటీ పీఈ ఫండ్‌లోకి రూ. 884 కోట్లు రాగా, ఏయూఎం రూ. 8,004 కోట్లకు పెరగడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. సాధారణంగా నెగెటివ్ మార్కెట్ సెంటిమెంట్ వంటి అంశాల వల్ల ఉండాల్సిన దానికన్నా తక్కువ విలువకి ట్రేడవుతున్న స్టాక్స్‌లో ఈ ఫండ్స్ ఇన్వెస్ట్ చేస్తుంటాయని వివరించారు. టారిఫ్‌లపరంగా కఠినతర పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఫైనాన్షియల్స్, యుటిలిటీస్, ఇంధన, సిమెంట్, పెట్రోకెమికల్స్, సర్వీసెస్ వంటి దేశీ పరిస్థితుల ఆధారిత రంగాలు ఆకర్షణీయంగా ఉండొచ్చన్నారు.

న్యూ ఫండ్ ఆఫర్లలో ఇన్వెస్ట్ చేసుకోవచ్చా?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నా వద్దనున్న పెట్టుబడుల్లో 60% బ్యాంకు ఎఫ్‌డీలలో ఇన్వెస్ట్ చేశాను. మిగిలిన 40% ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టాను. ఇప్పుడు ఈక్విటీ పెట్టుబడుల విలువ బాగా పెరిగింది. ఇలాంటి సందర్భాల్లో నేను ఏం చేయాలి? - మనోజ్ సిన్హా

మీరు ఈక్విటీకి 60 శాతం, డెట్‌కు 40 శాతం కేటాయింపులతో అస్సెట్ అలోకేషన్ విధానాన్ని నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. ఇప్పుడు మీ మొత్తం పెట్టుబడుల్లో ఈక్విటీ వాటా 80%కి చేరి డెట్ పెట్టుబడులు 20%గా ఉన్నాయని అనుకుంటే.. పోర్ట్‌ఫోలియో పరంగా రిస్క్ పెరిగినట్టు అవుతుంది. ఎందుకంటే ఎక్కువ పెట్టుబడులు ఈక్విటీల్లో ఉండడంతో మార్కెట్ల ఆటుపోట్ల ప్రభావం పెట్టుబడుల విలువపై అధికంగా పడుతుంది. దీంతో మానసిక ప్రశాంతత కోల్పోవచ్చు. రిస్క్ ఎక్కువగా తీసుకోకూడదన్నది మీ అభిప్రాయం అయితే.. ఈక్విటీ పెట్టుబడులను తిరిగి 60%కి తగ్గించుకుని, డెట్ పెట్టుబడులను 40%కి పెంచుకోవాలి. దీన్నే అస్సెట్ రీఅలోకేషన్‌తో లేదా అస్సెట్ రీబ్యాలన్స్‌గా చెప్పుకోవచ్చు. అస్సెట్ రీబ్యాలన్సింగ్‌తో ఉన్న మరో ప్రయోజనం.. అధిక స్థాయిల్లో విక్రయించి, తక్కువలో కొనుగోలు చేయడం సాధ్యపడుతుంది. అంటే విలువ గణనీయంగా పెరిగిన చోట విక్రయించి.. అదే సమయంలో పెద్దగా పెరగని చోట కొనుగోలు చేస్తాం. ఉదాహరణకు పెట్టుబడుల్లో ఈక్విటీల వాటా పెరిగితే.. ఈక్విటీలు బాగా ర్యాలీ చేశాయని అర్థం. దాంతో అస్సెట్ రీబ్యాలన్స్‌లో భాగంగా అధిక వ్యాల్యూయేషన్ల వద్ద పెట్టుబడులు కొంత వెనక్కి తీసుకుని డెట్‌కు మళ్లిస్తాం. తరచూ కాకుండా.. ఏడాదికి ఒకసారి పెట్టుబడులను సమీక్షించుకుని అస్సెట్ రీబ్యాలన్స్ చేసుకోవచ్చు. లేదా ఏదైనా ఒక సాధనంలో (ఈక్విటీ లేదా డెట్) పెట్టుబడుల విలువ మీరు నిర్ణయించుకున్న పరిమితికి మించి 5 శాతానికి పైగా పెరిగిపోయిన సందర్భాల్లోనూ రీబ్యాలన్స్ చేసుకోవాలి.



మ్యూచువల్ ఫండ్స్ న్యూ ఫండ్ ఆఫర్ (ఎన్ఎఫ్ఓ) ప్రకటనలు తరచూ కనిపిస్తున్నాయి. వీటిల్లో ఇన్వెస్ట్ చేసుకోవడం మంచి నిర్ణయమేనా? లేక ఇప్పటికే మార్కెట్లో ఉన్న ఫండ్స్‌లో మంచి ట్రాక్ రికార్డు ఉన్నవి ఎంపిక చేసుకోవాలా? - జైరూప్

కొత్త పథకాల పట్ల, మరీ ముఖ్యంగా పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టినప్పుడు ఆసక్తి ఏర్పడడం సహజమే. పెట్టుబడుల ప్రపంచంలో కొత్త అంటే అది మెరుగైనదని కాదు. చాలా వరకు ఎన్ఎఫ్ఓలు ఇన్వెస్టర్ల కోసం కొత్తగా తీసుకొచ్చేదేమీ ఉండదు. ఇప్పటికే గొప్పగా నిర్వహిస్తున్న మ్యూచువల్ ఫండ్స్ వ్యూహాలను పోలినవే ఎక్కువ సందర్భాల్లో ఎన్ఎఫ్ఓలుగా వస్తుంటాయి. ఇప్పటికే ఉన్న పథకాల మాదిరి కాకుండా.. ఎన్ఎఫ్ఓలకు గత పనితీరు చరిత్ర ఉండదు. సదరు ఎన్ఎఫ్ఓ ఫండ్ మేనేజర్ మార్కెట్ సైకిల్స్, రిస్కును సమర్థవంతంగా ఎలా ఎదుర్కొంటారన్నది తెలియదు. కొత్త ఫండ్ అని ఎంపిక చేసుకోవడం అంటే.. మంచి ట్రాక్ రికార్డు ఉన్న క్రికెటర్లను కాదని, అప్పటి వరకు ఒక్క మ్యాచ్ కూడా ఆడని క్రికెటర్‌ను జట్టులోకి తీసుకోవడం వంటిదే. కొత్త అస్సెట్ క్లాస్ లేదా పెట్టుబడుల విధానాన్ని ఆఫర్ చేయకుండా, అప్పటికే ఉన్న పథకాల పెట్టుబడుల వ్యూహాలకు నకలుగా వచ్చే ఫండ్‌ను ఎంపిక చేసుకోవడానికి ఎలాంటి కారణం కనిపించడం లేదు.

ఎస్ఆర్ఎం కాంట్రాక్టర్స్ | బ్రోకరేజ్: ఖండ్వాలా సెక్యూరిటీస్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 304 టార్గెట్: రూ. 694

ఎందుకంటే: జమ్మూ కేంద్రంగా మౌలిక సదుపాయ అభివృద్ధి కార్యకలాపాలు విస్తరించిన కంపెనీ ఎస్ఆర్ఎం కాంట్రాక్టర్స్. సవాళ్లతోకూడిన ప్రాంతాలలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను అభివృద్ధి చేయడంలో ప్రత్యేకత కలిగి ఉంది. ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్(ఈపీసీ)తోపాటు.. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్(హెచ్ఏఎం) ప్రాజెక్టులను చేపడుతోంది. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగ వృద్ధిపై కంపెనీ ఆధారపడి పురోగతి సాధించనుంది. నిర్మాణం, మౌలిక సదుపాయాల అభివృద్ధితో కంపెనీకున్న నైపుణ్యాలు ఇందుకు దోహదపడనున్నాయి. వార్షికంగా 100 కిలోమీటర్లకుపైగా రహదారులను అభివృద్ధి చేయడం ద్వారా పటిష్ట ట్రాక్ రికార్డ్‌ను సొంతం చేసుకుంది. వీటిలో నాలుగు లేన్ల జాతీయ రహదారులతోపాటు, పట్టణాభివృద్ధి ప్రాజెక్టులు సైతం ఉన్నాయి. తద్వారా దీర్ఘకాలిక వృద్ధికి బాటలు వేసుకుంది. ఎక్విప్‌మెంట్ ఓనర్‌షిప్, పటిష్ట ఫైనాన్షియల్ పనితీరు, సొంత ఇంటిగ్రేటెడ్ విధానాలు కంపెనీ బలాలుగా పేర్కొనవచ్చు. వీటితో మార్కెట్లో అవకాశాలను అందిపుచ్చుకోవడంతోపాటు.. ఆర్థికంగా పటిష్ట స్థితిలో కొనసాగేందుకు వీలుంటుంది. 2024 ఏడాది ఆదాయంతో పోలిస్తే దాదాపు 5 రెట్లు అధికంగా రూ. 1,664 కోట్ల విలువైన ఆర్డర్‌బుక్, ఎల్ఓఏను కంపెనీ కలిగి ఉంది. రహదారులు, బ్రిడ్జీలు, చిన్నతరహా జల విద్యుత్ ప్రాజెక్టులు తదితరాలతో విభిన్న ఆర్డర్ల పోర్ట్‌ఫోలియో కంపెనీ సొంతంకాగా.. ఇవి సమీప భవిష్యత్‌లో కంపెనీ పనితీరుకు భరోసానిస్తున్నాయి. కాంట్రాక్టులను సాధించడంలో 440 శాతం వార్షిక వృద్ధిని సాధించిన కంపెనీ భవిష్యత్ ఫలితాలలో నిలకడను కొనసాగించే వీలుంది.

సాక్షి షేర్లు

ఏబీబీ ఇండియా | బ్రోకరేజ్: మోతీలాల్ ఓస్వాల్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 5,443 టార్గెట్: రూ. 6,700

ఎందుకంటే: డైవర్సిఫైడ్ దిగ్గజం ఏబీబీ ఇండియా తాజా వార్షిక నివేదికలో అధిక వృద్ధికి వీలున్న రంగాలపై దృష్టి సారించినట్లు పేర్కొంది. అంతేకాకుండా ద్వితీయ శ్రేణి(టైర్-2) పట్టణాలలో మరింత విస్తరించే ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు తెలియజేసింది. వీటికి దన్నుగా కొత్త ప్రొడక్టులను అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించింది. గత ఏడాది పొడవునా ప్రీమియం ప్రొడక్టులకు డిమాండ్ కొనసాగడంతో కంపెనీ లబ్ది పొందింది. మరోవైపు ద్వితీయ, తృతీయ శ్రేణి(టైర్-3) పట్టణాలలో కార్యకలాపాలు మరింత విస్తరించింది. కెమికల్స్, ఫార్మాస్యూటికల్స్, ఆటోమోటివ్, విద్యుత్ పంపిణీ, వాటర్, ఎలక్ట్రానిక్స్, డేటా సెంటర్లు తదితరాలు అత్యధిక వృద్ధికి వీలున్న రంగాలుగా కంపెనీ పేర్కొంటోంది. ఇవన్నీ భవిష్యత్‌లో భారీస్థాయిలో పెట్టుబడులను ఆకట్టుకోనున్నట్లు భావిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుత రాజకీయ, భౌగోళిక అనిశ్చిత పరిస్థితులు సైతం ఇందుకు ప్రభావం చూపవచ్చని విశ్వసిస్తోంది. ఈ బాటలో గ్రీన్ హైడ్రోజన్, బ్యాటరీ స్టోరేజీ, డేటా సెంటర్లు తదితర ఆధునిక విభాగాలపై అధిక దృష్టిని పెట్టనుంది. గత ఐదేళ్లలో ఆదాయం వార్షికంగా 20 శాతం పురోగతిని సాధించింది. గత నాలుగేళ్లలో నికర లాభాలు రెట్టింపయ్యాయి. అయితే గతేడాది(2024 జనవరి-డిసెంబర్) ఆర్డర్లు అంచనాలను అందుకోకపోయాయి. అంతేకాకుండా సమీప భవిష్యత్‌లోనూ ఇదే పరిస్థితి కనిపించవచ్చు. పెట్టుబడి వ్యయాలు మందగించడంతో ఆర్డర్లరాక నెమ్మదించే అవకాశముంది. అయినప్పటికీ కంపెనీ అధిక వృద్ధికి వీలున్న విభాగాలపై దృష్టి కొనసాగిస్తుండటంతో కొద్ది త్రైమాసికాల తదుపరి ఆర్డర్లరాకతోపాటు.. ఎగ్జిక్యూషన్ జోరందుకోవచ్చని భావిస్తున్నాం.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ఇండో పాక్ ఉద్రిక్తలపై ఇన్వెస్టర్ల దృష్టి
జోరు మీదున్న అగ్రెస్సివ్ హైబ్రిడ్ ఫండ్స్

క్లుప్తంగా...



ఆలయ ముఖ మండపంలో సహస్ర కలశాలకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిలో ముగిసిన జయంత్యుత్సవాలు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి పుణ్యక్షేత్రంతో పాటు శ్రీపూర్వగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీనృసింహ జయంత్యుత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఆలయంలో నిత్య హవనాలు నిర్వహించిన అర్చకులు.. అనంతరం యాగశాలలో పూర్ణాహుతి, ముఖ మండపంలో బంగారు, వెండి, రాగి వంటి సహస్ర కలశాలకు పూజలు చేపట్టి స్వయంభూ మూర్తులకు అభిషేకం జరిపారు. ఇక రాత్రి నృసింహ జయంతి, నృసింహ ఆవిర్భావ ప్రవచనం, నివేదన, తీర్థ ప్రసాద గోష్ఠి, మంగళ నీరాజనం చేసి ఉత్సవాలను ముగించారు. పూర్వగిరి ఆలయంలో సైతం ఉదయం పూర్ణాహుతి, శతఘటాభిషేకం, సాయంత్రం నృసింహ జయంతి, నృసింహ ఆవిర్భావం వంటి పూజలు జరిపించారు. ఆయా ఆలయాల్లో జరిగిన కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, కలెక్టర్ హనుమంతరావు పాల్గొన్నారు. ఇక సోమవారం నిత్య, శాశ్వత కల్యాణం, శ్రీసుదర్శన నారసింహ హోమం, నిత్య, శాశ్వత బ్రహ్మోత్సవాలు పునః ప్రారంభం కానున్నాయి.

కిక్కిరిసిన యాదగిరి క్షేత్రం

- 85 వేలమంది భక్తుల రాక
- వివిధ పూజలతో నిత్యాదాయం రూ.63.64 లక్షలు

యాదగిరిగుట్ట: వేసవి సెలవులతో పాటు ఆదివారం సెలవు కలిసి రావడం.. శ్రీస్వామి వారి జయంతి కావడంతో యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం కిటకిటలాడింది. సుమారు 85 వేల మంది స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ఒకేరోజు ఇంతమంది స్వామివారిని దర్శించుకోవడం ఆలయ చరిత్రలో ఇది తొలిసారని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ధర్మ దర్శనానికి 4 గంటలు, వీఐపీ దర్శనానికి గంటన్నర సమయం పట్టింది. వివిధ పూజలతో శ్రీస్వామి వారికి నిత్యాదాయం రూ.63,64.480 వచ్చినట్లు ఆలయాధికారులు వెల్లడించారు.

సఫారీలో పెద్దపులి ప్రత్యక్షం



నాగర్‌కర్నూల్ జిల్లా నల్లమలలోని అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో సఫారీ సందర్శకులకు ఆదివారం పెద్దపులి దర్శనమిచ్చింది. అడవిలో ఫర్హాబాద్ నుంచి సఫారీ వాహనంలో వెళ్తుండగా.. గుండం సమీపంలో పెద్దపులి కనిపించినట్లు అటవీ అధికారులు తెలిపారు.

– మన్ననూరు (అచ్చంపేట)

సతీశ్‌రెడ్డికి జీవిత సాఫల్య పురస్కారం



సాక్షి, హైదరాబాద్: జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా ఆదివారం డాక్టర్ జి.సతీశ్‌రెడ్డికి.. జీవిత సాఫల్య పురస్కారాన్ని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అందజేశారు. అకాడమీ ఫర్ సైన్స్, టెక్నాలజీ అండ్ కమ్యూనికేషన్ హైదరాబాద్‌లోని ఐఐసీటీ ఆడిటోరియంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.


హిందీ సలహా సంఘం సభ్యుడిగా 'యార్లగడ్డ'



సాక్షి, న్యూఢిల్లీ: 'పద్మ భూషణ్' అవార్డు గ్రహీత, హిందీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌కు మరో అరుదైన అవకాశం దక్కింది. కేంద్ర వైద్య శాఖ హిందీ సలహా సంఘం సభ్యునిగా యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌ను నియమించింది. పది మంది సభ్యులు గల ఈ సలహా సంఘంలో దక్షిణ భారతదేశం నుంచి యార్లగడ్డ ఒక్కరే ఉండటం విశేషం. మూడేళ్లు ఆయన ఈ బాధ్యతల్లో కొనసాగుతారు. కేంద్ర వైద్యశాఖలో హిందీ కార్యక్రమాలకు సలహాలు, సూచనలు అందిస్తారు. ప్రధాని నరేంద్ర మోదీ చైర్మన్‌గా ఉన్న కేంద్రీయ హిందీ సంస్థలో సభ్యునిగా పనిచేసిన అనుభవం యార్లగడ్డకు ఉంది.

యువతకు మెంటల్ హెల్తే ముఖ్యం





ఆసియా దేశాల్లో దీని గురించి ఎవరూ పట్టించుకోవట్లేదు

- నచ్చిన రంగంలో రాణించడమే మహిళా సాధికారత
- బంగ్లా స్టూడెంట్ రెవల్యూషన్ నాకు స్ఫూర్తి.
- 'సాక్షి'తో అభిప్రాయాలు పంచుకున్న మిస్ బంగ్లాదేశ్ అక్లిమా అతికాకొనికా

సాక్షి, హైదరాబాద్: 'ఈ తరం యువతపైన అత్యంత సున్నితమైన సామాజిక బాధ్యతలున్నాయి. వీటిని నెరవేర్చడానికి వారిలో మానసిక పరిపక్వత కీలక అంశం' అని మిస్ బంగ్లాదేశ్ అక్లిమా అతికాకొనికా అన్నారు. ప్రస్తుతమున్న పలు సామాజిక సమస్యలకు పరిష్కారాలన్నీ యూత్ మెంటల్‌హెల్త్ పైనే ఆధారపడి ఉన్నాయని ఆమె అభిప్రాయపడ్డారు. మిస్‌వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు వచ్చిన అతికా 'సాక్షి'తో మాట్లాడారు. పూర్తి వివరాలు ఆమె మాటల్లోనే..

★ సహజత్వమే సౌందర్యం

కొన్ని సంవత్సరాల క్రితం వరకూ నాకు ఫ్యాషన్ అంటేనే సరిగ్గా తెలియదు. కంఫర్ట్‌గా అనిపించే దుస్తులు వేసుకోవడం, ఎవరైనా పలకరించినా స్పందించలేని మొహమాటం ఉండేది. ఎలాంటి ఫ్యాషన్ సెన్స్ లేదు. అలాంటిది అనుకోకుండా మోడలింగ్ రంగంలోకి వచ్చి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. నా దృష్టిలో బ్యూటీ అంటే సహజత్వం. ప్రతి ఒక్కరికీ ఒక ప్రత్యేకత ఉంటుంది. అదే వారి సౌందర్యానికి మెరుగులద్దుతుంది. అత్యంత సహజత్వమే సౌందర్యంగా కనిపిస్తుందని నేను నమ్ముతా.

★ ఎన్నో దాటుకొని వచ్చాను

నేనూ ఒక మనిషినే. అందరిలానే విభిన్న అనుభవాలు, బాధాకరమైన సందర్భాలను దాటుకొని వచ్చాను. నన్ను నేను సముదాయించుకోవడానికి, ఒత్తిడి పోగొట్టుకోవడానికి ధ్యానం చేస్తాను. ప్రకృతి ప్రేమికురాలిని. ప్రకృతికి మన మానసిక అనిశ్చితి, అస్థిరత్వాన్ని తొలగించే శక్తి ఉంది. నాకు ఏ మాత్రం బాగా లేకున్నా ప్రకృతిలోకి వెళతాను. నాకు నేను సమయం ఇచ్చుకుంటా. సాధారణంగా మాట్లాడటమే నాకున్న పెద్ద చాలెంజ్. అలాంటిది ఇప్పుడు మిస్‌వరల్డ్ వేదికపైన మాట్లాడగలుగుతున్నానంటే అది నా పరిణామ క్రమమే. మహిళలు బయటికెళ్లి ఉద్యోగం, వ్యాపారం ఇంకేదైనా చేయడమే సాధికారత అని అనుకోను. ఒక మహిళ తనకు నచ్చిన రంగంలో తన అభిరుచులకు అనుగుణంగా రాణించడమే సాధికారత అని నమ్ముతాను.

★ భారత్‌లో సాంస్కృతిక వైవిధ్యం

భారత్ ఒక అద్భుత సాంస్కృతిక సమ్మేళనం. ఢిల్లీ వెళితే ఒకలా, చెన్నై, లడక్ వెళితే మరోలా.. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో సాంస్కృతిక వైవిధ్యం. భారత్ మొత్తం తిరిగితే చాలు ప్రపంచం తిరిగినట్టే. కోల్‌కతా (బెంగాల్) వెళితే మా దేశ మూలాలు ఆత్మీయంగా పలకరిస్తాయి. హైదరాబాద్ అయితే మినీ ఇండియా. దేశంలోని ప్రత్యేకతలన్నీ ఇక్కడే ఆతిథ్యమిస్తాయి. నాకు మరో ఇల్లులా అనిపిస్తుంది హైదరాబాద్. తెలంగాణ ప్రజల ఆత్మీయత నా మనసు దోచుకుంది. నేను మంచి భోజన ప్రియురాలిని. నాకు నచ్చినట్టు ఇక్కడ స్పైసీ ఫుడ్ లభిస్తుంది. ఇక్కడి వారసత్వ వంటకాలు చాలా బాగున్నాయి.

★ యంగ్ మైండ్ మ్యాటర్స్

మానసిక ఆరోగ్యం.. మానసిక పరిపక్వత ఈ తరం సామాజిక బాధ్యతగా భావిస్తాను. ఇందులో భాగంగానే యువత మెంటల్ హెల్త్‌పై అవగాహన కల్పించడానికి ప్రత్యేకంగా 'యంగ్ మైండ్ మ్యాటర్స్'అనే ప్రాజెక్ట్ చేపట్టా. భారత్‌లో పరిస్థితులు చెప్పలేను కానీ.. ఆసియా దేశాల్లో యువత మానసిక అస్థిరత, మెంటల్ హెల్త్ గురించి ఎవరూ అంతగా ప్రస్తావించట్లేదు. దీనితో ముడిపడి ఎన్నో సామాజిక సమస్యలున్నాయి. తమపైన తమకు విశ్వాసం ఉన్నప్పుడే మిగతా సమస్యలు సులభంగా పరిష్కారమవుతాయి. నేను ప్రపంచ సుందరి విజేతగా నిలిస్తే.. నా గుర్తింపు, ప్రశస్తిని అంతర్జాతీయంగా యూత్ మెంటల్ హెల్త్‌పై అవగాహన కల్పించడానికి, దానితో ముడిపడి ఉన్న అంశాల కార్యాచరణకు వినియోగిస్తాను.

★ అపురూప స్నేహం భారత్-బంగ్లా

మా దేశ యువతలో నైపుణ్యాలకు కొదువ లేదు. ఎన్నో విషయాలను బయటికొచ్చి నేర్చుకుంటున్నాం. గతేడాది మా దేశ యువత చేపట్టిన స్టూడెంట్ రెవల్యూషన్ నాకు స్ఫూర్తి. ఒక బంగ్లా అమ్మాయిగా మా యువత తరఫున ప్రపంచానికి మా ప్రశస్తిని చూపించే బాధ్యత నాపై ఉంది. ఆ ఆశయంతోనే మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొంటున్నాను. వినయం లేకుండా విజయం ఉండదని గట్టిగా నమ్ముతాను. భారత్-బంగ్లాదేశ్‌లది స్నేహపూర్వక సంబంధం. రాజకీయంగా, ఆర్థిక పరమైన అంశాల్లో అనుబంధంతో ముందుకు సాగుతున్నాం. ఇక్కడి ప్రజల ప్రేమ నాకెప్పుడూ గుర్తుండిపోతుంది.

జుగల్‌బందీ సూపర్ హిట్

- వెస్ట్రన్ బీట్‌కు సంప్రదాయ నృత్యరీతుల జోడింపు
- మిస్ వరల్డ్ పోటీల ప్రారంభోత్సవంలో కొత్త ప్రయోగం
- ప్రత్యేకంగా ఆస్వాదించిన మిస్ వరల్డ్ బృందం



సాక్షి, హైదరాబాద్: ప్రపంచ సుందరి పోటీల ప్రారంభోత్సవంలో ఈసారి మిస్ వరల్డ్ లిమిటెడ్ చేసిన కొత్త ప్రయోగం బాగా ఆకట్టుకుంది. వాస్తవానికి తెలంగాణ సాంస్కృతిక శాఖ ఈ ప్రతిపాదన చేసింది. దీనిపై తొలుత కాస్త విముఖత ప్రదర్శించిన మిస్ వరల్డ్ సంస్థ తర్వాత ఆమోదించింది. చివరకది మిస్ వరల్డ్ బృందాన్నే బాగా ఆకట్టుకోవడంతో పాటు అనూహ్య స్పందన లభించింది. ఏ నగరంలో జరిగినా.. మిస్ వరల్డ్ పోటీల ప్రారంభోత్సవంలో స్థానిక సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించటం సహజం. ఇదే తరహాలో హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన ప్రారంభోత్సవంలో 250 మంది కళాకారులతో తెలంగాణ సంప్రదాయ పేరిణి నృత్య విన్యాసాన్ని ప్రదర్శించారు. ఇంతవరకు ఎప్పుడూ జరిగే తంతే. సాంస్కృతిక కార్యక్రమాల తర్వాత, మిస్ వరల్డ్ పోటీదారులను వేదిక మీదకు ఆహ్వానించి పరిచయం చేస్తారు. కానీ హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ పరిచయ భాగాన్ని ఒకింత కొత్తగా డిజైన్ చేశారు. పోటీదారులను ఖండాల వారీగా నాలుగు బృందాలుగా విభజించి, ఒక్కో బృందం పరిచయానికి పైలట్ తరహాలో ఒక్కో సంప్రదాయ నృత్యరీతిని ప్రదర్శించేలా రూపకల్పన చేశారు. గుస్సాడీ, ఒగ్గు డోలు, లంబాడీ, కొమ్ము కోయ నృత్య కళాకారులను నాలుగు బృందాలుగా చేసి, ఒక్కో ఖండం పోటీదారులను కళాకారులు తమ విన్యాసాన్ని ప్రదర్శిస్తూ ఆహ్వానించే తరహాలో రూపొందించారు. దీనికి పాశ్చాత్య సంగీతాన్ని కూడా జోడించారు. ఈ కార్యక్రమానికి ప్రపంచ వీక్షకుల నుంచి అభినందనలు వెల్లువెత్తడంతో నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అందాల పోటీకి తగ్గట్టుగా ప్రత్యేకంగా పేరిణి గీతం

250 మంది కళాకారులతో సంప్రదాయ పేరిణి నృత్యం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇందుకు వినియోగించిన గీతాన్ని అందాల పోటీలను దృష్టిలో ఉంచుకుని రాయించటం విశేషం. 'అతివల హంస నడకలతో అందమే సాగెనే..లలిత శృతుల గతుల లయల హొయల..అరవిరిసిన కన్నులకు అభినయాల వందనం.. అతి కోమల అధరాలకు అతి సుందర వందనం.. మనసెరిగిన మగువలకు మయూరాల వందనం..'అంటూ సాగిన గీతానికి తగ్గట్టుగా కళాకారులు నర్తించి ఆకట్టుకున్నారు. ఈ విధంగా సంప్రదాయ నృత్యాలతో పోటీదారులను స్వాగతించి పరిచయం చేసే కార్యక్రమాన్ని ప్రత్యేకంగా రూపొందించామని, పేరిణి సందీప్, ఫణి నారాయణ, శ్రీరాంభట్ల ఆదిత్య శర్మలు శ్లోకంతో కూడిన గీతాలను రచించారని సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ తెలిపారు.

నేడు సాగర్.. రేపు చార్మినార్..

▶ మొదటి పేజీ తరువాయి

యధావిధిగా నిర్వహించాలని నిర్ణయించారు. సరిహద్దులో ఉద్రిక్తతలు కొంత తగ్గిన నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ఈ కార్యక్రమాలను యధావిధిగా నిర్వహించనున్నారు. స్వాగత విందులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు సినీ, క్రీడారంగ ప్రముఖులు పాల్గొనే అవకాశం ఉంది. ఇక సోమవారం సాయంత్రం పోటీదారులు, విదేశీ ప్రతినిధులు నాగార్జున సాగర్ సమీపంలోని బుద్ధవనం పర్యటనకు వెళ్లనున్నారు. బుద్ధ జయంతి సందర్భంగా అక్కడ జరిగే కార్యక్రమాన్ని వారు ప్రత్యక్షంగా వీక్షించనున్నారు. అక్కడే రాత్రి విందు అనంతరం హైదరాబాద్‌కు బయలుదేరతారు.

చార్మినార్ నుంచి లాడ్‌బజార్ వరకు నడక

మంగళవారం సాయంత్రం పోటీదారులు చార్మినార్ నుంచి లాడ్‌బజార్ వరకు నడుస్తూ పరిసరాలను వీక్షిస్తారు. షాపింగ్ చేస్తారు. చార్మినార్ చరిత్రను తెలుసుకుంటారు. అనంతరం చౌమొహల్లా ప్యాలెస్‌లో జరిగే స్వాగత విందులో పాల్గొంటారు. ఈ సందర్భంగా సంప్రదాయ వాద్యకచేరీ కొనసాగుతుంది.

విందులో ఇంటర్ కాంటినెంటల్, తెలంగాణ వంటకాలు

విందులో తెలంగాణకు సంబంధించి హైదరాబాద్ ధమ్ కీ బిర్యానీ, ఖుర్బానీ కా మీఠా, బగారా బైంగన్, పత్థర్ కీ ఘోష్, పనీర్ టిక్కా, పులావ్, దహీ వడ, పానీపురి, బాదుషా, గులాబ్ జామూన్ లాంటి వంటకాలు రుచి చూపించనున్నారు. ధమ్ కీ బిర్యానీ ఎక్కువ మసాలా ఘాటు లేకుండా తయారు చేయాలని ఆదేశించారు. ఇక యూరప్, ఆఫ్రికా, ఆమెరికా, కరేబియన్, ఆసియా ఓషియానా ప్రాంతాల సుందరీమణులు సైతం ఉన్నందున వారి స్థానిక వంటకాలను కూడా అందుబాటులో ఉంచుతున్నారు. పోటీల్లో పాల్గొనే సుందరీమణుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నగరంలోని నాలుగు ఫైవ్ స్టార్ హోటళ్లనుంచి మెనూ తెప్పించి పరిశీలించి, ఒక హోటల్‌కు ఆర్డర్ ఇచ్చారు. ఆసియా వంటకాలలో సుషీ (జపాన్), డిమ్‌సమ్ (చైనా), థాయ్ గ్రీన్ కర్రీ (థాయ్‌లాండ్) వంటివి, యూరోపియన్ వంటకాలైన ఇటాలియన్ పాస్తా, ఫ్రెంచ్ రాటటౌలీ, స్పానిష్ పాయెల్లా, అమెరికా ఖండానికి సంబంధించిన మెక్సికన్ టాకోస్, బ్రెజిలియన్ ఫెయిజోడా, అమెరికన్ బార్బెక్యూ రిబ్స్ లాంటివి, ఆఫ్రికాకు చెందిన ఇథియోపియన్ డోరో వాట్, మొరాకన్ టాగిన్, హమ్మస్‌తో పాటు మెడిటరేనియన్ ఫలాఫెల్, క్వినోవా సలాడ్ లాంటి వాటిని వడ్డించే వీలుందని సమాచారం. మెనూను మిస్ వరల్డ్ లిమిటెడ్ ప్రతినిధులకు చూపి వారు అనుమతించినవే సిద్ధం చేస్తారని తెలుస్తోంది. మే 26న హైటెక్స్‌లో జరిగే గలా డిన్నర్ సందర్భంగా తెలంగాణ ఫుడ్ ఫెస్టివల్ కూడా ఉంటుందని చెబుతున్నారు.



బుద్ధవనంలోని ప్రవేశ ద్వారం వద్ద ఉన్న అశోక చక్రం

భయంభయంగా గడిపాం

- యుద్ధ భయంతో కశ్మీర్, పంజాబ్ నుంచి వెనుదిరిగిన తెలుగు విద్యార్థులు
- ఢిల్లీలోని ఏపీ, తెలంగాణ భవన్‌కు చేరిన 500 మంది



సాక్షి, న్యూఢిల్లీ: పాకిస్తాన్‌తో సైనిక ఘర్షణ నేపథ్యంలో సరిహద్దు రాష్ట్రాలైన జమ్ముకశ్మీర్, పంజాబ్‌లో విద్యనభ్యసిస్తున్న తెలుగు విద్యార్థులు స్వరాష్ట్రాలకు తరలి వస్తున్నారు. తాము ఉంటున్న ప్రాంతాల్లో పరిస్థితి భయంకరంగా ఉందని, అందుకే ఇంటికి వెళ్లిపోతున్నట్లు తెలిపారు. అక్కడున్నంత సేపు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని గడిపామని ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీ వచ్చే వరకు ఏం జరుగుతుందోననే భయం వెంటాడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దాదాపు 300 మంది, తెలంగాణకు చెందిన 200 మంది విద్యార్థులు సురక్షితంగా ఢిల్లీలోని ఏపీ/తెలంగాణ భవన్‌కు ఆదివారం ఉదయం చేరుకున్నారు. వీరికి ఏపీ రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్, తెలంగాణ రెసిడెంట్ కమిషనర్ డాక్టర్ గౌరవ్ ఉప్పల్‌లు.. వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల కోసం రెండు రాష్ట్రాలు బస, భోజన ఏర్పాట్లు చేశాయి. ఢిల్లీ నుంచి గమ్యస్థానాలకు రైళ్లలో వెళ్లేవారి కోసం టిక్కెట్లు కన్‌ఫాం చేయించడం, క్యాబ్ సర్వీసులు వంటి సేవలను దగ్గర ఉండి చూసుకున్నారు.

హైదరాబాద్ మెట్రోకు అరుదైన గౌరవం

- పరిశోధన పత్రం ప్రచురించిన హార్వర్డ్ యూనివర్సిటీ
- ప్రపంచంలోనే అతి పెద్ద పీపీపీ మెట్రోగా గుర్తింపు
- హెచ్‌ఎంఆర్ విజయాలను కేస్ స్టడీగా తీసుకున్న వైనం



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ మెట్రోరైల్‌కు మరో అరుదైన గౌరవం లభించింది. ప్రతిష్టాత్మకమైన హార్వర్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ మెట్రోపై పరిశోధన పత్రాన్ని సమర్పించింది. ప్రపంచంలోనే ఎంతో పేరొందిన అతిపెద్ద పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) ప్రాజెక్టు అంటూ అందులో ప్రముఖంగా ప్రస్తావించింది. హైదరాబాద్ మెట్రో రైల్‌కు ఐఎస్‌బీ, స్టాన్‌ఫర్డ్ వంటి అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల నుంచి ఇప్పటికే సముచితమైన గుర్తింపు లభించింది. మన మెట్రో విజయగాథను పరిశోధనా పత్రాలుగా ప్రచురించాయి. తాజాగా హెచ్‌ఎంఆర్‌ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి సారథ్యంలో మెట్రో రైల్ వ్యవస్థ ఒక ప్రముఖ రవాణా వ్యవస్థగానే కాకుండా మౌలిక వసతుల కల్పనలో నూతన ఒరవడిని ప్రదర్శించిందని, పీపీపీ విధానంలో ప్రపంచంలోనే విశేషమైన ప్రాజెక్టుగా అవతరించిందని హార్వర్డ్ వర్సిటీ తన పరిశోధనా పత్రంలో స్పష్టం చేసింది. ప్రాజెక్టు నిర్మాణంలో ఎదురైన అనేక సవాళ్లను వ్యూహాత్మకంగా అధిగమిస్తూ, నిర్మాణంలోనూ, నిర్వహణలోనూ ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకుంటూ పరుగులు తీస్తోందని పేర్కొంది. మెట్రో మ్యాన్‌గా పేరొందిన ఎన్వీఎస్ నైపుణ్య శైలిని, నాయకత్వ లక్షణాలను ప్రధానంగా ప్రస్తావించింది. హైదరాబాద్‌లో ఉన్న ప్రతిష్టాత్మకమైన ఇండియన్ స్కూల్ అఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) ప్రొఫెసర్లు, పరిశోధకులు.. హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు స్థాపనకు బీజం పడినప్పటి నుంచి ప్రాజెక్టు నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించడం, ప్రభుత్వ ప్రతిపాదనలను, ఆలోచనలను నిర్మాణాత్మకంగా అమలు చేసిన తీరుపై 'హైదరాబాద్ మెట్రో – ఆలోచన నుంచి అమలు వరకు' అనే ప్రధాన శీర్షికన తమ ప్రతిష్టాత్మక హార్వర్డ్ బిజినెస్ జర్నల్‌లో ప్రచురించింది 'పీపీపీ పద్ధతిలో ప్రపంచంలోనే అతిపెద్ద మెట్రో రైల్ ప్రాజెక్ట్'అనే ఇతివృత్తంతో చేసిన పరిశోధనను హార్వర్డ్ విశ్వవిద్యాలయం ఒక కేస్ స్టడీగా తీసుకుంది.

ఎన్వీఎస్ కృషి అపూర్వం

నగర రవాణా సమస్యలను పరిష్కరించేందుకు 2006లో ఎన్వీఎస్ రెడ్డి మెట్రో ప్రాజెక్టుకు ఆలోచన చేశారని పరిశోధన పత్రం తెలిపింది. మేటాస్ పతనం, భూసేకరణ సమస్యలు, అనేక రకాల ఆందోళనలు, రాజకీయ ఒడిదుడుకులు వంటి అడ్డంకులను అధిగమించి, అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులతో కూడిన మెగా ప్రాజెక్టుగా అవతరించిందని పేర్కొంది. హైదరాబాద్ నగరానికి మెట్రో రైల్ ఆవశ్యకతను, ఆ ఆవశ్యకతకు కార్యరూపం ఇచ్చి ఏ విధంగా అమలు చేశారో వివరించింది. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రజా రవాణా వ్యవస్థలో ఒక విప్లవాత్మక మార్పు వచ్చినట్లు పేర్కొంది. ఈ ప్రాజెక్టును విజయవంతంగా అమలు చేయడానికి ఎన్వీఎస్ రెడ్డి అనుసరించిన విధానం, చేసిన కృషి అపూర్వమైనదని అభివర్ణించింది. విలక్షణమైన ప్రణాళికా తీరు, సాంకేతిక పరిజ్ఞానం, ఆర్థిక విషయాలపై లోతైన అవగాహన, సమస్యలను అధిగమించే నాయకత్వ సామర్థ్యం ఈ ప్రాజెక్టును చరిత్రలో నిలిచిపోయేలా చేశాయని స్పష్టం చేసింది.

పెరగనున్న ఎండల తీవ్రత

- రానున్న రెండురోజులు అధిక ఉష్ణోగ్రతలకు చాన్స్
- గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉక్కపోత
- అక్కడక్కడా తేలికపాటి వర్షాలకు సూచన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎండలు తీవ్రం కానున్నాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు పెరగనున్నాయి. రానున్న రెండు రోజులు సాధారణం, అంతకంటే కాస్త ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సూచించింది. వాస్తవానికి గత ఐదు రోజులుగా రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదవుతున్నాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో సాధారణం కంటే 1 నుంచి 4 డిగ్రీ సెల్సియస్ తక్కువగా నమోదయ్యాయి. అయితే ప్రస్తుతం వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈ కారణంగా వచ్చే రెండు రోజులు ఉష్ణోగ్రతలు కాస్త పెరుగుతాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో సాధారణ ఉష్ణోగ్రతలే నమోదైనప్పటికీ ఉక్కపోత పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు.

పెరిగిన ఉష్ణోగ్రతలు

ఆదివారం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే.. ఖమ్మంలో అత్యధికంగా 41.4 డిగ్రీ సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదయ్యింది. కనిష్ట ఉష్ణోగ్రత నల్లగొండలో 24.4 డిగ్రీ సెల్సియస్‌గా నమోదైంది. ఖమ్మం, హైదరాబాద్, మహబూబ్‌నగర్ మినహా మిగిలిన ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదయ్యాయి. శనివారం నాటి ఉష్ణోగ్రతలతో పోలిస్తే మాత్రం దాదాపు అంతటా గరిష్ట ఉష్ణోగ్రతల్లో పెరుగుదల కనిపించింది.

దక్షిణాది జిల్లాలకు వర్ష సూచన

ప్రస్తుతం మరత్వాడ నుంచి అంతర్గత కర్ణాటక, తమిళనాడు మీదుగా గల్ఫ్ ఆఫ్ మన్నార్ వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. ఇది సముద్రమట్టం నుంచి సగటున 0.9 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని దక్షిణ ప్రాంత జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు నమోదయ్యే అవకాశం ఉంది.

ఆదివారం రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు(సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం
ఆదిలాబాద్	40.0	26.7
భద్రాచలం	39.4	27.2
దుండిగల్	38.8	27.8
హకీంపేట్	38.8	25.8
హనుమకొండ	39.0	24.5
హైదరాబాద్	38.9	27.3
ఖమ్మం	41.4	26.0
మహబూబ్‌నగర్	40.0	28.5
మెదక్	39.7	24.8
నల్లగొండ	40.0	24.4
నిజామాబాద్	40.3	27.3
రామగుండం	40.0	27.0

సీఎంవో కూర్పులో మార్పులు

- ముఖ్య కార్యదర్శి శేషాద్రికి మరిన్ని కీలక బాధ్యతలు
- శ్రీనివాసరాజుకు ఆర్‌అండ్‌బీ, గృహ నిర్మాణం
- అజిత్‌రెడ్డి వద్దే సీఎం అపాయింట్‌మెంట్లు..కొత్తగా సీఎం భద్రత
- వేముల శ్రీనివాసులుకు సీఎంఆర్‌ఎఫ్ బాధ్యతలు

సాక్షి, హైదరాబాద్: సీఎంగా బాధ్యతలు స్వీకరించి ఏడాదిన్నర పూర్తైన నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి తన కార్యాలయం (సీఎంఓ) పనితీరును సమీక్షించి మార్పులు, చేర్పులకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు సీఎంఓలోని విధులను ఆయా అధికారులకు ప్రభుత్వం బట్వాడా చేసింది. సీఎం ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి ఇప్పటివరకు సీఎంఓలో కీలకమైన సాధారణ పరిపాలన, శాంతిభద్రతలు, హోం, న్యాయ, ఆర్థిక, ప్రణాళిక, శాసనసభ వ్యవహారాలు, రెవెన్యూ శాఖల వ్యవహారాలతో పాటు సీఎంఓ ఓవరాల్ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఆయనకు కొత్తగా పౌర సరఫరాలు, వ్యవసాయం, పశుసంవర్థక, పాడి అభివృద్ధి, సహకార, మార్కెటింగ్ శాఖల బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. సీఎం ముఖ్య కార్యదర్శిగా ఇటీవల నియమితులైన శ్రీనివాసరాజుకి రవాణా, రోడ్లు, భవనాలు, గృహ నిర్మాణం, దేవాదాయ, సమాచార, ప్రజాసంబంధాలు, క్రీడలు, యువజన అభ్యుదయం, సాంస్కృతిక, పర్యాటక శాఖలు కేటాయించింది.

మాణిక్‌రాజ్‌కు పురపాలన, పంచాయతీ రాజ్

సీఎం కార్యదర్శి కె.మాణిక్‌రాజ్ ఇప్పటివరకు ఇంధన, నీటిపారుదల, విద్య, వాణిజ్య పన్నులు, ఆబ్కారీ, గనుల శాఖల వ్యవహారాలను చూశారు. కొత్తగా పురపాలక, పట్టణాభివృద్ధి, వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, విపత్తుల నిర్వహణ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖలను కేటాయించింది.

అజిత్‌రెడ్డికి ఇంధన, విద్య శాఖలు

ఐడీఈఎస్ అధికారి బి.అజిత్‌రెడ్డి సీఎంఓ ప్రత్యేక కార్యదర్శి హోదాలో ఇప్పటివరకు సీఎం అపాయింట్‌మెంట్స్‌తో పాటు ఐటీ, కార్మిక, ఉపాధి కల్పన, శిక్షణ, కర్మాగారాల శాఖలను పర్యవేక్షించారు. కొత్తగా ఆయనకు ప్రభుత్వం ఇంధన, విద్య, పరిశ్రమల శాఖల వ్యవహారాల పర్యవేక్షణతో పాటు సీఎం భద్రత, సీఎంఓ పరిపాలన బాధ్యతలను అప్పగించింది. పురపాలక, పరిశ్రమలు, కార్మిక, ప్రజాసంబంధాల శాఖల పర్యవేక్షణ బాధ్యతల నుంచి ఆయన్ను తప్పించింది.

వేముల శ్రీనివాసులుకు ప్రజావాణి తదితరాలు

సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులకు కొత్తగా ప్రభుత్వం స్త్రీ, శిశు సంక్షేమం, వికలాంగ, వయోజనుల సంక్షేమం, పర్యావరణ, అటవీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సంక్షేమం శాఖలతో పాటు సీఎంఆర్‌ఎఫ్‌పై పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించింది. సీఎంఓ కంప్యూటరీకరణ, సీఎంకు వచ్చే విజ్ఞప్తులు, ప్రజావాణి వ్యవహారాలు యథాతథంగా ఆయన పర్యవేక్షణలోనే కొనసాగనున్నాయి.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

ప్రకృతి ఆరోగ్యనిధి చింత చిగురు



చింతచిగురు కోస్తున్న మహిళలు

రుచితోపాటు ఆరోగ్య ప్రయోజనాలు కూడా..

గ్రామీణ జీవనంలో ఒక భాగం • ఏటా మే నెలలో చెట్లకు పూత..

ప్రకృతి మానవాళికి అందించిన వరాల్లో చింతచెట్టు ఒకటి. ఈ చెట్టు నీడను మాత్రమే కాక ఆరోగ్యాన్ని పంచే కాయలు, చిగురునూ అందిస్తుంది. ఇందులో చింతచిగురు రుచితోనే కాక పోషక విలువలతో ఆరోగ్యాన్ని కాపాడేదిగా నిలుస్తోంది. ప్రకృతి వైద్యంలో చింతచిగురును భాగంగా చేస్తారు. దీంతో చెడు కొవ్వును తగ్గించడం, రక్త ప్రసరణను మెరుగుపరచడం, జీర్ణక్రియను సులభతరం చేయడం వంటి ప్రయోజనాలు ఉంటాయని చెబుతారు. అంతేకాక చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపర్చడం లోనూ సాయపడుతుందని నమ్ముతారు. కాగా, సంప్రదాయ వైద్యంలో చింతచిగురును ఉపయోగిస్తారు. ఆయుర్వేద వైద్యవిధానంలో శరీరంలోని వేడి తగ్గించే, జీర్ణ సమస్యలను పరిష్కరించే గుణాలు కలిగిన ఆహారంగా పరిగణిస్తారు. దీన్ని కషాయంగా చేసి జ్వరం, గొంతు నొప్పి వంటి సమస్యలతో బాధపడుతున్న వారికి ఇస్తారు. అంతేకాక చింతచిగురు శరీరంలోని విష పదార్థాలను తొలగించే డిటాక్స్ ఏజెంట్‌గా కూడా పనిచేస్తుందని చెబుతారు. – కరకగూడెం



సేకరించిన చింతచిగురు

రుచి, ఆరోగ్యం

అద్భుతమైన రుచి కలిగి ఉండే చింతచిగురు ఆరోగ్య సమతుల్యానికి అండగా నిలుస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో నేరుగా చింతచిగురుతో కూరలు చేయడమే కాక పప్పు, చేపలు, చికెన్, మటన్ వంటి వాటిలోనూ కలిపి వండుతారు. ఇక చట్నీలు, పచ్చళ్లు కూడా పలువురు చేస్తారు. 'సీ'విటమిన్ లోపంతో బాధపడేవారు టాబ్లెట్లకు బదులుగా చింతచిగురును ఆహారంలో చేర్చుకోవడం ద్వారా సహజంగా విటమిన్ అందుతుందని చెబుతారు. అందుకే ఇది గ్రామీణ జీవనంలో ఒక భాగంగా నిలుస్తోంది. చింతచిగురు మార్కెట్లలో మంచి ధర పలుకుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, వ్యాపారులు ఈ చిగురును సేకరించి విక్రయించడం ద్వారా సీజనల్ ఆదాయాన్ని పొందుతారు.

పర్యావరణ పరిరక్షణ

చింతచెట్టు కేవలం ఆహారం ఆరోగ్య ప్రయోజనాలకు మాత్రమే కాక పర్యావరణ పరిరక్షణలో కూడా కీలకపాత్ర పోషిస్తుంది. ఈ చెట్టు తన దట్టమైన ఆకులతో వేసవి తాపాన్ని తగ్గించి నీడను అందిస్తుంది. అంతేకాక చింతచెట్టు వేర్లు నేల కోతను నివారించడంతో ఈ చెట్టు నేల సంరక్షణలో సాయపడుతుంది. అలాగే, పక్షులు, కీటకాలు ఆధారంగా నిలుస్తూ పర్యావరణ సమతుల్యతను కాపాడతాయి.





"వంటకాలకు ప్రత్యేక రుచి



చింతచిగురు అంటే చాలా ఇష్టం. ఇది వంటకాలకు ప్రత్యేకమైన రుచి ఇస్తుంది. పప్పు, చేపలు, చికెన్, మటన్ వంటి కూరల్లో ఉపయోగిస్తాం. ప్రత్యేకంగా చింతచిగురు కూర కూడా వండుతాం. చింత చిగురుతో చట్నీలు, పచ్చళ్లు చేస్తాం. ఆరోగ్యానికి మంచిదని నమ్ముతాం. – పోలేబోయిన విజయలక్ష్మి, వెంకటాపురం

చిన్నప్పటి నుంచీ తీసుకుంటున్నా..



నేను చిన్నప్పటి నుంచి చింతచిగురును ఆహారంలో తీసుకుంటున్నా. గతంలో లేత చిగురు కోసం అడవికి వెళ్లేవాళ్లం. చింత చిగురుతో చేసే కూరలు రుచిగా ఉంటాయి. ఇది ఆరోగ్యానికి కూడా మంచిది. అందుకే సీజనల్‌లో తప్పకుండా చిగురును ఆహారంలో తీసుకోవాలి. – పాయం రామయ్య, మొగిలితోగు

చాలారకాల వంటలు చేస్తాం..



మా ఇంట్లో చింత చిగురుతో చాలా రకాల వంటలు చేస్తాం. ప్రధానంగా పప్పుతో కలిపి వండటం ద్వారా మంచి రుచి వస్తుంది. చింత చిగురులో చాలా పోషకాలుంటాయి. ఆరోగ్యానికి చాలా మంచిది. సీజనల్‌లో పిల్లలు, పెద్దలు చిగురుతో చేసే వంటలను ఇష్టపడతారు. – జాడి నర్సక్క, చొప్పల

అభినవ బుద్ధ ఆచార్య నాగార్జునుడి నేల

- రెండువేల ఏళ్ల క్రితమే ప్రఖ్యాత విశ్వవిద్యాలయం
- తెలుగు నేలపై బౌద్ధ చరిత్రకు గొప్ప సాక్ష్యం
- నేడు బుద్ధవనం సందర్శనకు ప్రపంచ సుందరీమణులు

మహాద్భుతం.. బుద్ధవనం

బౌద్ధ వారసత్వ ప్రాంగణం బుద్ధవనం

తెలంగాణలో బౌద్ధమతం ఆగమనం బుద్ధుని జీవితకాలం నాటిది. సుత్తనిపాత పారాయణవగ్గ ప్రకారం 'కవిట్టవనమిష్టి గోదావరి రివేరిన్'అనే బ్రాహ్మణ ఋషి బుద్ధుని బోధనలను వినడానికి తన 16 మంది శిష్యులను మగధకు పంపాడు. బుద్ధుని అనుచరులుగా మారిన పింగియా.. బుద్ధుని బోధనలను తీసుకువచ్చారు. అప్పటినుంచి నుంచి తెలంగాణలో థేరవాద, మహాయాన, వజ్రయాన బౌద్ధ శాఖలు విస్తరించాయి. అస్సీఘాట్, కోటిలింగాల, కంబాలపల్లి, పాశిగావ్, ధూళికట్ట, ఫణిగిరి, తిరుమలగిరి, వర్ధమానుకోట, గాజులబండ, నేలకొండపల్లి, శ్రీపర్వతం ప్రాంతాల్లో (నాగార్జునసాగర్ ప్రాంతం) బౌద్ధమతం మూడు దశల్లో పరిఢవిల్లింది.





బుద్ధవనంలోని మహాస్థూపం ఏరియల్ వ్యూ

రెండు వేల సంవత్సరాల క్రితం ఆచార్య నాగార్జునుడు స్థాపించిన విజయపురి విశ్వవిద్యాలయం, ఇక్కడ విలసిల్లిన బౌద్ధమత ప్రాచుర్యం ఆధారంగా కృష్ణా తీరంలో (నాగార్జునసాగర్ తీరంలో) బుద్ధిస్టు హెరిటేజ్ థీం పార్కును బుద్ధవనం ప్రాజెక్టుగా మహాద్భుతంగా తీర్చిదిద్దారు. అభినవ బుద్ధుడు ఆచార్య నాగార్జునుడు నడయాడిన నేల ఇది. ఆ చరిత్ర ఆధారంగానే సాగర్ తీరంలో 274 ఎకరాల్లో బుద్ధవనం (శ్రీపర్వతారామం), 30 ఎకరాల్లో విపశ్యన కేంద్రం నిర్మించారు. అష్టాంగ విభాగాలుగా దీని నిర్మాణం చేశారు. ఆసియా ఖండంలోనే సిమెంట్‌తో నిర్మించిన అతిపెద్ద మహాస్థూపం బుద్ధవనం. ఈ నెల 12వ తేదీన బుద్ధపూర్ణిమ సందర్భంగా ప్రపంచ సుందరి పోటీల్లో పాల్గొంటున్న సుందరీమణులు ఈ చారిత్రక ప్రదేశాన్ని సందర్శించనున్నారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక బస్సుల్లో బయలు దేరి వెల్లంకిలో కొంతసేపు సేద దీరి, నాగార్జునసాగర్‌కు చేరుకుంటారు. విజయవిహార్ అతిథిగృహంలో వారికి స్వాగత ఏర్పాట్లు చేశారు. విజయవిహార్ ముందు ఏర్పాటు చేసిన ఫొటో సెషన్‌లో పాల్గొంటారు. అనంతరం విజయవిహార్ వెనుకభాగంలో, సాగర్ తీరాన పచ్చికబయళ్లలో వారు ప్రత్యేకంగా ఫొటోలు దిగుతారు. ఆ తరువాత బుద్ధవనం చేరుకుంటారు. బుద్ధుని పాదుకల వద్ద 25 మంది బౌద్ధ సన్యాసులు నిర్వహించే బొలికుప్ప మహాబోధి పూజల్లో పాల్గొంటారు. అక్కడినుంచి మహాస్థూపం వద్దకు చేరుకొని, వెనుక భాగాన ఉన్న మెట్ల ద్వారా పైకి ఎక్కుతారు. దానికి వంద అడుగుల దూరంలో ఏర్పాటు చేసిన గిరిజన సంప్రదాయ నృత్యాన్ని తిలకిస్తారు. అనంతరం మహాస్థూపం అంతర్భాగంలో అష్టబుద్ధుల వద్దకు చేరుకొని అక్కడ కొవ్వొత్తులు వెలిగించి పూజలు చేస్తారు. ఈ సందర్భంగా బౌద్ధమత గురువు నిర్వహించే 5 నిమిషాల ప్రార్థనలో పాల్గొంటారు. అనంతరం రెండు నిమిషాల పాటు ధ్యానం చేస్తారు. అక్కడి నుంచి మహాస్థూపం చుట్టూ ఉన్న 2,500 విగ్రహాల గురించి పర్యాటక శాఖ ప్రతినిధి శివనాగిరెడ్డి వివరిస్తారు. అనంతరం జాతకవనంలోకి వెళతారు. అక్కడ వారికి బుద్ధవనం, తెలంగాణలో బౌద్ధ చరిత్ర ప్రాధాన్యత గురించి పర్యాటక శాఖ ప్రతినిధి వివరిస్తారు. బుద్ధుని పుట్టుక నుంచి నిర్యాణం వరకు ప్రత్యేక డ్రామాను ప్రదర్శిస్తారు. – సాక్షి ప్రతినిధి, నల్లగొండ

బుద్ధుని జీవిత విశేషాలు

తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ 2003లో దీనిని ప్రారంభించింది. సిద్ధార్థ గౌతముని జీవితంలోని ప్రధాన ఘట్టాలను వర్ణించే అనేక నేపథ్య విభాగాలతో కూడినదే బుద్ధవనం. ఆయన పూర్వ జన్మ కథలను చిత్రీకరించిన జాతక పార్క్, సూక్ష్మ స్థూపాలతో కూడిన స్థూప పార్క్, మహాస్థూపం, బౌద్ధ హెరిటేజ్ మ్యూజియం, మహాస్థూపం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఆచార్య నాగార్జున విగ్రహం, 27 అడుగుల బుద్ధ విగ్రహం ఇందులో ఏర్పాటు చేశారు. ధమ్మ గంటను శ్రీలంక ప్రభుత్వం విరాళంగా ఇచ్చింది. దేశంలోనే ఇది మొదటిది.

ప్రవేశ వేదిక

ప్రవేశ వేదిక అష్టమంగళ (ఎనిమిది శుభ) చిహ్నాలు, ఐకానిక్ రూపంలో బుద్ధుడు, జంతువులు, పక్షులు, బోధి వృక్షం, మిథునాలు (రసిక జంటలు), బుద్ధపాదాలు వంటివి ఇక్కడ ఉంటాయి. ప్రధాన ఇతివత్తాలు, సిద్ధార్థుని కిరీటం (జుట్టు) మోస్తున్న అగ్ని స్తంభం, నాగముచిలింద, పవిత్ర అవశేషాల ఆరాధన, మధ్యలో అశోక ధర్మ చక్రం స్తంభంతో శక్తివంతమైన విల్లును మోస్తున్న సిద్ధార్థుడు వంటి శిల్పాలు ఉంటాయి.

బుద్ధ చరిత్రవనం



సిద్ధార్థ గౌతమ జీవితంలో ఐదు ప్రధాన సంఘటనలు ఉన్నాయి. అవి జననం, నాలుగు సమావేశాలు, మహా నిష్క్రమణ, జ్ఞానోదయం. బుద్ధుని మొదటి ఉపన్యాసం, మహాపరినిర్వాణం వంటి అంశాలపై చిత్రాలను కాంస్యంతో చేశారు. పల్నాడు సున్నపు రాయిలో చెక్కబడిన బుద్ధపాద స్లాబ్ అష్టమంగళ (ఎనిమిది శుభ) చిహ్నాలు ఉద్యానవన ప్రవేశ ద్వారం వద్ద ప్రధాన ఆకర్షణలుగా ఉంటాయి.

జాతక వనం (బోధిసత్వ పార్క్)



బోధిసత్వుడు బుద్ధుడిగా మారటానికి ముందు పది పరిపూర్ణతలను ఆచరిస్తూ జీవితాన్ని గడుపుతాడు. వాటినే దశపారమిత అంటారు. అవి దాన (ఉదారత), శీల (ధర్మం), శాంతి (సహనం), వీర్య (ధైర్యం), ధ్యాన (ఏకాగ్రత), ప్రజ్ఞ (జ్ఞానం), త్యాగ (త్యజించడం), సత్య (సత్యం), కరుణ (ప్రేమపూర్వక దయ), సమత (సమానత్వం). 547 జాతక కథలలో 40 జాతక కథలు అమరావతి, ఫణిగిరి, నాగర్జునకొండ, గోలి, జగ్గయ్యపేట, చందవరం బౌద్ధ క్షేత్రాలలోని అసలు శిల్పకళా ఫలకాల ఆధారంగా పల్నాడు లైమ్ స్టోన్‌లో చిత్రీకరించారు.

ధ్యానవనం (మెడిటేషన్ పార్క్)

27 అడుగుల అవుకాన బుద్ధను ధ్యానవనంలో ఏర్పాటు చేశారు. దీనిని శ్రీలంక ప్రభుత్వం అందజేసింది.

స్తూపవనం (మినియేచర్ స్తూప పార్క్)

కర్లా, అజంతా (మహారాష్ట్ర), సాంచి (మధ్యప్రదేశ్), సారనాథ్ (ఉత్తరప్రదేశ్), మంకియాలా, (పంజాబ్- పాకిస్తాన్), అనురాధపుర, శ్రీలంక, కహు-జో-దారో, మిర్పూర్ ఖాస్, పాకిస్తాన్, బౌధానాత్, మహాత్రాస్తాన్, నేపాల్‌లోని స్థూపాల ప్రతిరూపాలు ఇక్కడ ఏర్పాటు చేశారు. థాయ్‌లాండ్, పార్లో కాలింగ్ చోర్టెన్ టిబెట్, శ్వేసాం డాప్- మయన్మార్, గ్యాంగ్జు, దక్షిణ కొరియా, భారతదేశం, ఆగ్నేయాసియాలోని బౌద్ధ స్థూప నిర్మాణాల రూపాలను ఇక్కడ ఏర్పాటు చేశారు.

మహాస్తూపం


బుద్ధవనం ప్రాజెక్ట్ ప్రధాన ఆకర్షణ మహాస్తూపం. అమరావతిలోని అసలు స్థూపం కొలతలు, వాస్తుశిల్పం ప్రకారం దీనిని నిర్మించారు. దాని పైభాగంలో వేదిక (డ్రమ్), గోపురం (అండ), హార్మిక ఉన్నాయి. 42 మీటర్ల వెడల్పు, 21 మీటర్ల ఎత్తుతో దాని డ్రమ్, గోపురం భాగాలపై బౌద్ధ ఇతివృత్తాల శిల్ప ఫలకాలతో ఏర్పాటు చేశారు. మహాస్తూపం చుట్టూ గోడపై బుద్ధుని జీవితంలోని ముఖ్యమైన రాజులు, ధర్మ పోషకుల దృశ్యాలు ఉంటాయి. గోపుర భాగంపై వజ్రాసన, బోధి వక్షం, అగ్ని స్తంభం, జాతక కథలు, బుద్ధుని జీవితంలోని సంఘటనలు వంటి బౌద్ధ చిహ్నాలను వర్ణించే శిల్పాలు చెక్కారు. స్థూపం గ్రౌండ్ ఫ్లోర్‌లో ఆచార్య నాగార్జున విగ్రహం ఉంటుంది.

మహాస్థూపం లోపల వర్చువల్ ఆకాశ దృశ్యం

మహాస్థూపం లోపల 25 అడుగుల ఎత్తులో పంచ ధ్యాన బుద్ధులను ఏర్పాటు చేశారు. మహాస్తూపం పైకప్పు ఆకాశాన్ని తలిపిస్తూ తామరపువ్వు రేకుల ఆకారంలో ఉంటుంది. పైకప్పు లోపలి భాగం చిల్లులు గల ట్రాపెజోయిడల్ ప్యానెల్‌లతో ఆకాశాన్ని ప్రతిబింబిస్తుంది. ప్రతి ఒక్కటి మరొకదానికి భిన్నంగా 2.5 మీటర్ల పరిమాణంలో, కాంతి థర్మోడైనమిక్స్, ప్రత్యేక ప్రకాశాన్ని జోడించేలా ఉంటాయి. ఇందులో లోటస్ రేకులు (960), స్కై ప్యానెల్‌లు (528) ఉంటాయి. ప్రపంచంలోనే తొలిసారిగా ఉపయోగించిన జర్మన్ టెక్నాలజీతో వీటిని ఏర్పాటు చేశారు.

బుద్ధవనానికి అవార్డులు

విశిష్ట ఆకర్షణలతో కూడిన ఈ ప్రాజెక్టుకు అనేక అవార్డులు లభించాయి. పర్యాటకులకు ఉత్తమ పౌర సౌకర్యాలు, మౌలిక సదుపాయాలను అందించినందుకు తెలంగాణ పర్యాటక శాఖ 2022లో అవార్డును అందజేసింది. దీనిపై నిర్మించిన డాక్యుమెంటరీకి ఉత్తమ డాక్యుమెంటరీ చిత్రం అవార్డును అందుకుంది. 2022లో కోల్‌కతాలో బౌద్ధ టూర్ ఆపరేటర్ల సంఘం 'భూటాన్ బంగ్లాదేశ్ ఇండియా అండ్ నేపాల్ టూరిజం మిత్ర అవార్డు'ను కూడా అందుకుంది.



జీవన పోరాటం



ఆ ఇంటా ఈ ఇంటా పనిచేసుకుంటూ జీవనం సాగించే ఈమెపై విధి కన్నెర్రచేసింది. ఆటో బోల్తాపడటంతో జరిగిన ప్రమాదంలో నడుం విరిగిపోయి కదల్లేని స్థితికి చేరుకుంది. భర్త చిన్నచిన్న పనులు చేస్తూ తెచ్చే డబ్బులతో కుటుంబ పోషణ కష్టంగా మారడంతో గుంటూరు జిల్లా తాడేపల్లి పరిసర ప్రాంతాల్లో తన ఇద్దరు చిన్నారులను తీసుకుని ఇలా యాచిస్తూ జీవనం సాగిస్తోంది.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

రేషన్ కోసం పడిగాపులు



మే నెల ప్రారంభమై పదకొండు రోజులు పూర్తయింది.. రేషన్ బండి ఎప్పుడొస్తుందో తెలియదు. రేషన్ బియ్యంపైనే ఆధారపడి బతుకు నెట్టుకొచ్చే నిరుపేదలు బియ్యం బండి కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తుంటారు. విశాఖ నగరంలోని శివాజీ పాలెం చిన్నపూలమ్మ గుడి వద్ద రేషన్ బండికోసం ముందుగా గోనె సంచులు లైన్‌లో పెట్టి ఎదురుచూస్తున్న దృశ్యం.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

తీరంలో జనసంద్రం



పగలంతా ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన విశాఖ ప్రజలు సాయంత్రం కాగానే తండోప తండాలుగా బీచ్‌కి చేరుకున్నారు. ఆదివారం సాయంత్రం విశాఖలోని ఆర్కేబీచ్ సందర్శకులతో కిటకిటలాడింది. సముద్రం నుంచి వచ్చే చల్లగాలిని ఆస్వాదిస్తూ, సముద్రంలో ఈతకొడుతూ ప్రజలు ఆనందంగా గడిపారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

ఆధ్యాత్మిక సమాచారం

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 21 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 85,078 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 35,791 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.2.67 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు ఉంటే 3 గంటల్లోనే దర్శనమవుతోంది.

బోయకొండ కిటకిట



చౌడేపల్లె: బోయ కొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తుల రద్దీ ఊహించని రీతిలో పెరగడంతో కిటకిటలాడింది. సెలవు దినం కావడంతో పాటు పరీక్షల ఫలితాలు వెలువడడంతో అధిక సంఖ్యలో విద్యార్థులు, యువత హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు భక్తుల రద్దీ కొనసాగింది.

కిక్కిరిసిన కాణిపాకం



కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు కిక్కిరిశారు. సెలవులు కావడంతో భక్తులు స్వామి దర్శనార్థం ఉదయం నుంచే క్యూ కట్టారు. ఉచిత, శ్రీఘ్ర, అతిశీఘ్ర, వీఐపీ దర్శన క్యూలైన్లు అన్నీ కిటకిటలాడాయి. దర్శనానికి 2 గంటల సమయం పట్టింది. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆలయ అధికారులు చర్యలు చేపట్టారు. క్యూలో ఉన్న భక్తులకు అల్పాహారం అందజేశారు. ప్రముఖులు వచ్చినా భక్తులకు ఇబ్బంది లేకుండా దర్శన సేవలు కల్పించారు.

ఘనంగా నృసింహ జయంతి



ఆగిరిపల్లి: ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఆదివారం నృసింహ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో విశేష పూజలు, అభిషేకాలు చేశారు. లక్ష్మీ నృసింహ మూలమంత్ర హోమం, నీరాజన మంత్ర పుష్పం జరిపించారు.

నేత్రపర్వంగా చిన వెంకన్న కల్యాణోత్సవం



ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లా ద్వారకా తిరుమలలో సర్వాభరణ భూషితుడైన శ్రీవారు నుదుటున కల్యాణ తిలకం, బుగ్గన చుక్కలతో సిగ్గులొలుకుతున్న అమ్మవార్లను పెండ్లాడారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన ద్వారకాతిరుమల చినవెంకన్న తిరుకల్యాణ మహోత్సవం ఆదివారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ తూర్పు రాజగోపురం వద్ద కల్యాణ వేదికపైకి శ్రీవారు, అమ్మవార్లను వేర్వేరు వాహనాల్లో తీసుకువచ్చి రజత సింహాసనంపై వేంచేపు చేశారు. అనంతరం అర్చకులు కల్యాణ తంతును ప్రారంభించి, పలు ఘట్టాలను పూర్తిచేసి శుభముహూర్త సమయంలో నూతన వధూవరుల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ధరింపజేసి, మాంగల్యధారణ, తలంబ్రాల వేడుకలను జరిపించారు.

నోరూరగాయ..



- ఆంధ్రులకు ఆవకాయతో అనుబంధం
- వేసవి కాలంలో ఇంటింటా సందడే సందడి
- కానీ అదంతా ఒకప్పటి మాట
- మారిన అభిరుచులతో తగ్గిన ఆదరణ
- పెరిగిన ధరలతో తయారీ భారమే..



'ముద్దపప్పు మిత్రమై వర్థిల్లే ఆవకాయ వేసవిలో పుట్టి చవులూరించే ఆవకాయ'

వేసవి వచ్చిందంటే చాలు వంటగదిలో హడావుడి మొదలయ్యేది.. ఆ ఏడాది ఆవకాయ పెట్టే కార్యక్రమం గురించి చర్చోపచర్చలు జరిగేవి.. మంచి మామిడి కాయలు తెచ్చుకోవాలి.. కరెక్ట్ సైజులో ముక్కలు కొట్టించాలి.. సరైన మోతాదులో సంబారాలన్నీ కలుపుకోవాలి.. శుచిగా శుభ్రంగా చేసుకోవాలి, ఎందుకంటే ఏడాదంతా నిల్వ ఉండాలి కదా.. ఆవకాయ పెట్టే విధానం గురించి కొత్త కోడలికి పాఠాలు.. సరిగ్గా నేర్చుకోవడం లేదని కూతురికి అక్షింతలు.. ఇంటి పెద్ద హడావుడే హడావుడి.. ఇదంతా గతం. ఇప్పుడు ఆవకాయ పెట్టే ఓపిక, తీరిక ఎవరికుంది? ఆవకాయ పెట్టడం ఎందరికి వచ్చు? పెరిగిన ధరలతో అది భారంగా మారిన వేళ అంత శ్రమ ఎవరు తీసుకుంటారు?



నక్కపల్లి: ఊరగాయ ఒక్కటి చాలు.. ముద్దపప్పులో కలుపుకొని తినొచ్చు.. నెయ్యి వేసుకొని అన్నంలో కలుపుకొని ఆరగించవచ్చు.. పెరుగన్నంతో నంజుకుంటూ.. ఆహా ఏమి రుచి అని రాగాలు తీయవచ్చు. ఎక్కువ వంటలు చేయడానికి అవకాశం లేకపోతే ఆ పూట గడిపేయడానికి ఊరగాయ ఒక్కటి చాలు.. కానీ ఏం లాభం.. ఈ తరం రుచులే మారిపోయాయి. వారు కొత్త కొత్త వంటకాలు కోరుతారు. బీపీ పెరుగుతుందని తినే వారిని కూడా తిననివ్వరు. ఇదీ నేటి పరిస్థితి. అయితే ఆవకాయ పెట్టడం అంత ఆషామాషీకాదు. తగ్గిన మామిడి దిగుబడి, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో ఆవకాయ వాసనలు అక్కడక్కడ మాత్రమే ముక్కుపుటాలను సోకుతున్నాయి.

ధరల దరువు

కొన్ని దశాబ్దాలుగా ఆవకాయ పచ్చడితో ఆంధ్రులకు మంచి అనుబంధం ఉంది. ప్రతి ఇంటా కచ్చితంగా తయారు చేసేవారు. కానీ సరకుల ధరలు ఆకాశాన్నంటడంతో రానురాను ఆవకాయ పెట్టేవారు తగ్గిపోతున్నారు. 40 మామిడి కాయలనుపయోగించి ఆవకాయ పెట్టాలంటే సుమారు రూ.5 వేల వరకు ఖర్చవుతోంది. ప్రస్తుతం మామిడి కాయల దిగుబడి అంతంతమాత్రంగానే ఉంది. మార్కెట్లో మామిడి కాయలు ఒక్కొక్కటి రూ.20లకు కొనుగోలు చేసి ఆవకాయ పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి.


నాణ్యమైన మామిడి కాయలేవీ?

వర్షాభావ పరిస్థితుల కారణంగా దిగుబడి బాగా తగ్గిపోయింది. దీనికితోడు తెగుళ్లు కూడా బాగా సోకడంతో నాణ్యమైన మామిడి కాయలు దొరకడం కష్టంగా ఉంటోందని గృహిణులు, పచ్చడి తయారీదార్లు వాపోతున్నారు. ఆవకాయ కోసం ఎక్కువగా కోలంగోవా, కొత్తపల్లి కొబ్బరి, సువర్ణరేఖ, కలెక్టర్ తదితర రకాల మామిడి కాయలను వినియోగిస్తుంటారు. ఈ ఏడాది కలెక్టర్ మినహా మిగతా రకాల మామిడి కాయల దిగుబడి తగ్గిపోయింది. ఏడాదిపాటు నిల్వ ఉండే ఆవకాయకోసం ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు. సరైన సమయంలో లేతపరువుతో ఉన్న కాయలనే ఆవకాయ కోసం వినియోగిస్తుంటారు. కొత్తపల్లి కొబ్బరి కాయ రకంతోనే ఆవకాయ పెట్టడానికే ప్రాధాన్యం ఇస్తారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, నాణ్యమైన మామిడి కాయల కొరత తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని చాలామంది సొంతంగా ఆవకాయ పెట్టుకునే బదులు సీజనల్ వ్యాపారుల వద్ద సూపర్ మార్కెట్లో లభించే ఆవకాయ డబ్బాలను కొనుగోలు చేసుకునేందుకు సిద్ధపడుతున్నారు. ఇన్ని వ్యయప్రయాసలు పడి నిల్వ ఉండే పచ్చళ్లు పెట్టే బదులు మార్కెట్లో రెడీమేడ్‌గా దొరికే పచ్చళ్ల కొనుగోలు చేయడానికే కొంతమంది మొగ్గు చూపుతున్నారు. అయితే ఇంట్లో తయారు చేసిన ఆవకాయకు మరేదీ సాటి రాదన్న ఉద్దేశంతో ఖర్చుకు వెనుకాడకుండా ఇళ్లల్లోనే తయారు చేసేవారూ ఉన్నారు.

ఆవకాయ చాలా కాస్ట్‌లీ గురూ..

40 మామిడి కాయలతో ఆవకాయ పెడితే ఖర్చు ఇలా అవుతోంది..

మామిడి కాయల ధర రూ.800లు, పొట్టు తీసిన ఆవపొడి 2 కిలోలు రూ.560లు, కారం 2 కిలోలు రూ.1450లు, 2 కిలోల దంపిన ఉప్పు రూ.100లు, వెల్లుల్లి కిలో రూ.200లు, గానుగ నూనె 4 కిలోలు రూ.1600లు, కాయలు ముక్కలుగా కోయించడానికి రూ.240లు.. ఇలా 40 కాయల ఆవకాయకు సుమారు రూ.5 వేలు ఖర్చవుతోంది. ఒక కాయకు ఖర్చు రూ.124లు అవుతోంది. ఒక మామిడి కాయను 12 ముక్కలుగా కట్ చేస్తారు. ఈ లెక్కన ఒక ఆవకాయ ముక్క ఖరీదు రూ.10లు పడుతోంది.



ధర పెరిగింది.. వ్యాపారం తగ్గింది

పెరిగిన నిత్యావసర వస్తువుల ధరల కారణంగా పచ్చళ్ల వ్యాపారం పెద్దగా రాణించడం లేదు. గతంలో తక్కువ ఖర్చులతో నిల్వ ఉండే ఊరగాయలు పెట్టేవాళ్లం. పది రోజులపాటు చాలా జాగ్రత్తలు తీసుకుని తయారయిన తర్వాత భద్రపరచాల్సి ఉంటుంది. చుట్టుపక్కల వాళ్లు కొనుగోలు చేసేవారు. ఇప్పుడు పెరిగిన ధరలను దృష్టిలో ఉంచుకుని ఊరగాయల ధరలు పెంచాల్సి వస్తోంది. 200 గ్రాముల ఆవకాయ రూ.150లకు విక్రయిస్తే తప్ప గిట్టుబాటు కావడం లేదు. అంత ధర పెట్టి కొనడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. ఈ నేపథ్యంలో మేము చెప్పిన ధరలకు కొనుగోలు చేసే వారి నుంచి ఆర్డర్లు తీసుకుని మాత్రమే తయారు చేస్తున్నాం. ఊరగాయల వ్యాపారం తగ్గించేశాం.
– సుబ్బలక్ష్మి, పచ్చళ్ల వ్యాపారి, పాయకరావుపేట

జాగ్రత్తలు తీసుకుంటేనే ఎక్కువ కాలం నిల్వ



నిల్వ ఉండే ఊరగాయలు సొంతంగా పెట్టుకుంటేనే మంచిది. ఆవకాయ పెట్టినప్పుడు అన్ని జాగ్రత్తలు తీసుకుంటే ఏడాదిపాటు నిల్వ ఉంటాయి. నాణ్యమైన మామిడి కాయలు తెచ్చుకోవాలి. నెంబర్ వన్ సరకులు ఉపయోగించాలి. గానుగ నూనె వాడటం మంచిది. మాగాయి, తొక్కుడు పచ్చడి వంటి వాటికి ఉప్పులో ఊరబెట్టి అప్పటికప్పుడు ఉప్పు కారం నూనె వంటివి కలుపుకుని వాడుకోవచ్చు. ఆవకాయ అలా కాదు కదా అన్ని ఒకేసారి కలుపుతాం కాబట్టి జాగ్రత్తలు తీసుకోవాలి. 50 మామిడి కాయలతో ఊరగాయ పెట్టాలంటే రూ.6 వేలకు పైగానే ఖర్చవుతోంది. తప్పని పరిస్థితుల్లో ఖర్చయినా ఇళ్లల్లో వాడకం కోసం పెట్టక తప్పడం లేదు. తయారు చేసిన ఆవకాయను పింగాణీ జాడీల్లో పెడితే పాడవకుండా ఎక్కువ కాలం నిల్వ ఉండే అవకాశం ఉంది. ప్లాస్టిక్ డబ్బాల్లో ఉంచకూడదు.
– విశ్వమోహిని, గృహిణి, ఉద్దండపురం

'ఓడు'పోయిన మట్టి బతుకులు

మట్టి పరిమళం వారికి జీవనశ్వాస... మట్టితో ముడిపడిన జీవితాలవి... తోటి మనుషులను నమ్మినా లేకున్నా మట్టిని ప్రేమిస్తారు. చేతివృత్తుల్లో ఒకటైన మట్టి పాత్రల తయారీలో 'కుల వృత్తికి సాటిరాదు గువ్వల చెన్నా' అనుకుంటూ మమేకమైన దృశ్యం అక్కడ గోచరిస్తుంది. ఇంటిల్లిపాదికీ అది నిత్యం శ్రమైక జీవన సమరమే. వారు చిందించే స్వేదం నుంచే మట్టి కుండ రూపుదిద్దుకుని, అందులోని నీటి చల్లదనం దాహార్తులను సేదదీరుస్తుంది. మట్టికి అందమైన ఆకృతినివ్వగల ఆ మృణ్మయ కళాకారులు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారు.

- కడుపు నింపని చేతివృత్తి
- మృణ్మయ కళాకారుల జీవితం.. శ్రమకు దక్కని ఫలం
- మట్టికుండల చల్లదనం వెనుక శ్రామికుల స్వేదం
- కష్టాలను భరిస్తూ సంప్రదాయ చేతివృత్తిని కొనసాగిస్తున్న శాలివాహనులు



ఆరబెట్టిన మట్టి కుండల కాల్పుకు ఆము ఏర్పాటు

తెనాలి: గుంటూరు జిల్లాలో పది గ్రామాల్లో 350 పైగా కుటుంబాలు వంశపారంపర్యంగా వస్తున్న మట్టి పాత్రల తయారీలో దశాబ్దాలుగా కొనసాగుతున్నాయి. శలపాడు, గరువుపాలెం, కొలకలూరు, కావూరు, చింతాయపాలెం, మంగళగిరి, శృంగారపురం, తుమ్మలపాలెం, కొండవీడు, కోటప్పకొండ పరిసరాల్లో ఈ కుటుంబాలున్నాయి. పెళ్లిరోజున గరిక పాత్ర నుంచి పేదవాడి ఫ్రిజ్‌లుగా పిలుచుకునే కుండలు, కూజాలు, వంటపాత్రలు, పూలుకుండీలు, ప్రమిదెల సహా రకరకాల అవసరాల కోసం వాడే పాత్రల తయారీలో సిద్ధహస్తులు. ఏడాదిలో వేసవి కాలం మాత్రమే మట్టి పాత్రలకు గిరాకీ ఉంటుందని తెలిసిందే. మనిషి జీవితంలో ప్రవేశించిన ఆధునికత వీరి వృత్తికి కష్టకాలం తీసుకొచ్చింది. వేసవిలో అకాల వర్షాలు సంభవిస్తే వారి కష్టమంతా నీటిపాలవుతుంది. అన్నింటినీ భరిస్తూ కొనసాగిస్తున్న వారసత్వ చేతివృత్తిలో కళాత్మకత అబ్బురపరుస్తుంది.

దొరకని మట్టి

వృత్తికి ప్రధానమైన మట్టి లభ్యత సమస్యగా మారింది. ట్రక్కు రూ.5 వేలు పెట్టినా అనువైనది దొరకడం కష్టంగా ఉంది. వడ్లమూడి క్వారీ ఆపడంతో వీరికి నాణ్యమైన మట్టి కోసం పలుచోట్ల వెతుకులాట తప్పనిసరైంది. టన్ను పుల్లలు రూ.5 వేలు, పొలం పొట్టు రూ.5 వేలు చొప్పున మొత్తం రూ.20 వేల వ్యయంతో ఏటా సంక్రాంతి తర్వాత జనవరి నెలాఖరులోపు అవసరమైనవి సమకూర్చుకుంటారు. ముందుగా మట్టిని ఎండబెట్టి, నలగ్గొట్టి, గాబులో పోసి వడపోసిన మట్టిని పాత్రల తయారీకి వినియోగిస్తారు. ఈ పనిలో ఇంటావిడ శ్రమిస్తే, మట్టిని అందమైన పాత్రలుగా మలచే పనిని ఇంటాయన చేస్తుంటారు.

కుండలకు తగ్గిన గిరాకీ



విద్యుత్ మోటారు అమర్చిన సారెపై కుండ తయారీ

ఎంత కళాత్మకంగా మట్టి పాత్రలు చేసినా మార్కెటింగ్‌లో నష్టపోతున్నామనే భావన వీరిలో ఉంది. అదేమంటే వినియోగదారులు 'మట్టి కుండేగా' అనేస్తున్నారని వృత్తిదారులు వాపోతున్నారు. మట్టి కుండ తయారీకి సగటున రూ.70–80 ఖర్చయితే, వీరి నుంచి రూ.120 కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్‌లో అదే కుండను రూ.250లకు అమ్ముతున్నారు. తయారీదారుకు రూ.50 లోపు మిగిలితే మధ్య వ్యాపారికి రూ.100 పైగా లభిస్తోంది. ఫ్రిజ్‌ల కారణంగా కుండలకు గిరాకీ తగ్గిన విషయం తెలిసిందే. ఆ తర్వాత కూలింగ్ క్యాన్లు వీరి వృత్తికి చేటు తెస్తున్నాయి. వేసవిలో విస్తృతంగా నడిచే చలివేంద్రాల్లో గతంలో కుండల స్థానంలో ఇప్పుడు కూలింగ్ వాటర్ క్యాన్లు వెలుస్తున్నాయి. ఈ క్యాన్ల నీటికన్నా కుండల నీరే శ్రేష్ఠమని తెలిసినా, అవే వాడుతున్నారు.

ఇరుగుపొరుగు సాయంతో ఆము ఏర్పాటు

పదిహను, ఇరవై రోజులు మట్టి పాత్రలు చేశాక వాటిని ఎండలో ఆరబెడతారు. తర్వాత ఒకరోజు ఇరుగుపొరుగు సాయంతో ఆము పెట్టుకుంటారు. సాయంత్రం పూట ఏడెనిమిది మంది కలిసి రెండు గంటలసేపు శ్రమిస్తే గాని ఆము తయారుకాదు. పగిలిన కుండలను చుట్టూ పేర్చుకుని, వాటిపైన ఆరబెట్టిన కుండలను భద్రంగా అమర్చుకుంటూ, అయిదారు వరుసలతో అన్నింటినీ సర్దుతారు. పగిలిన కుండపెంకులతో పైన కప్పును రూపుదిద్దుతారు. దిగువన కట్టెపుల్లలు, పొలం పొట్టు, ఊక ఏర్పాటు చేస్తారు. కాల్చిన పిడకలను చుట్టూ ఖాళీల్లో సర్దుతారు. ఆ పిడకలు రగులుకొని, ఊక, పొలం పొట్టుతో సహా కట్టెపుల్లలను మండించి, లోపలున్న మట్టిపాత్రలను ఎర్రగా కాలుస్తాయి.

ఉదయాని కల్లా 'రెడీ టు సేల్'


మట్టి పాత్రల తయారీలో సంప్రదాయ విధానాలకు మృణ్మయ కళాకారులు కూడా ఆధునిక సాంకేతికతను అందుకున్నారు. పాత్రల తయారీ కోసం ముందుగా మట్టిని కలిపి పాకంగా చేయాలి. గతంలో ఇందు కోసం గంటన్నరపాటు కాళ్లతో తొక్కేవారు. ఇప్పుడు పది నిముషాల్లోనే విద్యుత్ మిషను మట్టి పాకాన్ని సిద్ధం చేస్తోంది. మరోవైపు చక్రంలాంటి సారెపై మట్టి ముద్ద తిరుగుతుంటే చేతితో అందమైన రూపంలో కుండను చేస్తారు. మధ్యమధ్యలో కర్రతో సారెను తిప్పుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు సారెను కర్రతో తిప్పే విధానానికి స్వస్తి పలికారు. విద్యుత్ మోటారుతో అవసరమైనంతసేపు తిరుగుతూనే వుంటోంది. దీనితో పాత్రల తయారీకి సమయం తగ్గింది. ప్రమిదెల తయారీకి సెరామిక్ బ్లాంకెట్ వాడుతున్నారు.

మట్టి పాత్రల తయారీలో మూడో తరం



కుండల తయారీలో మాది మూడో తరం. నేను 30 ఏళ్లుగా ఈ వృత్తిలో ఉన్నా. భార్య వెంకటరమణతో కలిసి వేసవి రోజుల్లో మట్టి పాత్రలను చేస్తుంటాను. ఇద్దరు కుమార్తెలు. పదో తరగతి వరకు చదివించి పెళ్లిళ్లు చేశాం. మా అల్లుళ్లు పాత్రలు చేయరు. మట్టి పాత్రల విక్రయం వ్యాపారంలో ఉన్నారు. మట్టి పాత్రల తయారీ గిట్టుబాటు కావడం లేదు. భవిష్యత్‌లో మా వారసులు ఈ వృత్తిలో ఉండరు.
– శాదరాజుపల్లి బోజిబాబు, వెంకటరమణ, గరువుపాలెం

గిట్టుబాటు కాని మార్కెట్ ధర



మట్టి పాత్రల వృత్తిలో నాది రెండోతరం. 30 ఏళ్లుగా కుండల తయారీలో ఉన్నాను. ఒక అబ్బాయి, ఒక అమ్మాయి. అమ్మాయిని ఇంటర్ వరకు చదివించి పెళ్లి చేశాను. అబ్బాయి డెయిరీలో పనిచేస్తున్నాడు. వృత్తిలో విద్యుత్ మిషన్లతో కొంత వెసులుబాటు వచ్చింది. ధర మాత్రం గిట్టుబాటు కావటం లేదు. మా ఇంటి నుంచి మూడో తరం ఈ వృత్తిలో లేనట్టే.
– బెజ్జంకి వీరభద్రరావు, గరువుపాలెం



ట్రావెల్

సాక్షి ప్లస్
సోమవారం ॥ 12-5-2025

వడోదరలో పూల గడియారం... అహ్మదాబాద్‌లో సబర్మతి ఆశ్రమం.
గాంధీనగర్‌లో అక్షరధామ్... పోర్‌బందర్‌లో కీర్తిమందిర్.
ద్వారకలో కృష్ణుడి జగత్‌మందిర్... కేలాడియాలో స్టాచ్యూ ఆఫ్ యూనిటీ.
జామ్‌నగర్ లఖోటా కోట... సోమనాథ్ జ్యోతిర్లింగ దర్శనం.

సుందర సౌరాష్ట్ర
సమైక్యత యాత్ర

సుందర సౌరాష్ట్ర (ఎస్‌హెచ్‌ఆర్066) టూర్‌లో భాగంగా... ట్రైన్ నంబర్ 20967 సికింద్రాబాద్- పోర్‌బందర్ ఎక్స్‌ప్రెస్ ప్రతి బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరుతుంది. కంఫర్ట్ కేటగిరీ అంటే థర్డ్ ఏసీలో ప్రయాణం. ఇందులో ట్విన్ షేరింగ్‌లో ఒక్కొక్కరికి 30 వేలు, ట్రిపుల్ షేరింగ్‌లో ఒక్కొక్కరికి 29 వేలవుతాయి. స్టాండర్డ్ కేటగిరీలో ట్విన్ షేరింగ్‌కి దాదాపు 27 వేలు, ట్రిపుల్ షేరింగ్‌కి దాదాపు 26 వేలవుతుంది. ఇందులో సింగిల్ ఆక్యుపెన్సీకి అవకాశం లేదు. ప్యాకేజ్‌లో నాలుగు బ్రేక్‌ఫాస్ట్‌లు, నాలుగు రాత్రి భోజనాలు ఇస్తారు.

1 రోజు
సికింద్రాబాద్- పోర్‌బందర్ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం మూడు గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరుతుంది. ఇది ఎనిమిది రోజుల టూర్. ఇందులో వడోదర, అహ్మదాబాద్, ద్వారక, సోమనాథ్, పోర్‌బందర్ కవర్ అవుతాయి.

2వ రోజు
ఉదయం పదకొండు గంటలకు రైలు వడోదర స్టేషన్‌కు చేరుతుంది. రైలు దిగి హోటల్ గదిలో చెక్ ఇన్ అవాలి. మధ్యాహ్నం స్టాచ్యూ ఆఫ్ యూనిటీ విగ్రహాన్ని చూడడానికి తీసుకెళ్తారు (ఎంట్రీ టికెట్ ప్యాకేజ్‌లో వర్తించదు, పర్యాటకులు కొనుక్కోవాలి). రాత్రికి వడోదర హోటల్ గదిలో బస.

రాజ్యాలన్నింటికీ ఒకటే జెండా: స్టాచ్యూ ఆఫ్ యూనిటీ... స్వాతంత్ర్యసమరయోధుడు సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ విగ్రహం. దీని ఎత్తు 597 అడుగులు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన విగ్రహం. గుజరాత్ రాష్ట్రం, కెవాడియా ప్రదేశంలో ఉంది. నర్మదానది మీద నిలబడి సర్దార్ సరోవర్ డ్యామ్‌ను చూస్తున్నట్లు ఉంటుంది. వడోదరకు వందకిలోమీటర్ల దూరం. దేశంలోని రాజ్యాల మధ్య ఐక్యత కోసం, జమీందారాలన్నింటినీ భారత్ రిపబ్లిక్‌లో విలీనం చేసి ఒక పతాకం కిందకు తీసుకురావడానికి పటేల్ చేసిన కృషిని గౌరవిస్తూ ఆయన విగ్రహానికి స్టాచ్యూ ఆఫ్ యూనిటీ అనే పేరు పెట్టారు.




3వరోజు
ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తర్వాత వడోదరలో హోటల్ గది చెక్ అవుట్ చేసి బయలుదేరాలి. నగరంలో లక్ష్మీవిలాస్ ప్యాలెస్ తదితరాలను చూసిన తర్వాత అహ్మదాబాద్‌కు ప్రయాణం. అహ్మదాబాద్‌లో సబర్మతి ఆశ్రమం, అక్షరధామ్ టెంపుల్ చూసిన తర్వాత హోటల్ చెక్ ఇన్. రాత్రి బస.

ప్యాలెస్‌లో స్టెప్‌వెల్: వడోదర... చారిత్రక ప్రాధాన్యత ఉన్న నగరం. ఈ నగరం విశ్వామిత్రి నది తీరాన ఉంది. నగరంలో మహారాజా షాయాజీరావు యూనివర్శిటీ... సిటీ హాల్... ఇలా ప్రముఖమైన కట్టడాలన్నీ రాజా పేరుతోనే ఉంటాయి. ప్యాలెస్‌ల ఆర్కిటెక్చర్ అద్భుతంగా ఉంటుంది. గైక్వాడ్ రాజకుటుంబం నివసించిన మహారాజా ప్యాలెస్‌లో సర్కార్‌వాడా, లక్ష్మీవిలాస్ ప్యాలెస్, ప్రతాప్ ప్యాలెస్, మోతీబాగ్ ప్యాలెస్, మోతీబాగ్ స్టేడియం, మహారాజా ఫతే సింగ్ మ్యూజియం, జూ, నవలాక్షి స్టెప్ వెల్ ఉన్నాయి. ఇది తొమ్మిది మిలియన్ల గ్యాలన్ల నీటిని స్టోర్ చేయగలిగిన బావి. ఇక లక్ష్మీ ప్యాలెస్ అయితే ఇటాలియన్ మార్బుల్ ఫ్లోరింగ్, గోడలకు మొజాయిక్ డెకరేషన్, టెర్రకోట శిల్పాలు... ఇలా ప్రతిదీ ఒక కళాఖండమే. ఫతే సింగ్ మ్యూజియం కూడా ఇదే ప్రాంగణంలో ఉంది. ఇందులో గ్రీకు, రోమన్, యూరప్ శిల్పాలు, ఫ్రెంచ్ ఫర్నిచర్ ఉంది. రాజారవివర్మ చిత్రలేఖనాలు కూడా ఉన్నాయి. షాయాజీ రావు గైక్వాడ్ ఆధునిక వాది. నగరాన్ని శాస్త్రసాంకేతికంగా వృద్ధి చేశాడు. అంబేద్కర్ విదేశీ విద్యకు ఆర్థిక సహాయం అందించాడు.




4వరోజు
ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తర్వాత హోటల్ గది చెక్ అవుట్ చేసి ద్వారక వైపు సాగిపోవాలి. దారిలో జామ్ నగర్‌లోని లఖోటా ప్యాలెస్, మ్యూజియం విజిట్. సాయంత్రానికి ద్వారక చేరి హోటల్ చెక్ ఇన్, రాత్రి బస.

సరస్సులో కోట: కోటల చుట్టూ కందకాలుంటాయి. కానీ ఇక్కడ నీటి మధ్యలో దీవి మీద కోట ఉంటుంది. లఖోటా సరస్సు మధ్యలో ఉన్న కోట కావడంతో దీనిని లఖోటా కోట అనే పిలుస్తారు. జామ్‌నగర్ పాలకులు ఉపయోగించిన వస్తువులతోపాటు నాటి కళాకృతులతో కోటలోపల మ్యూజియం ఉంది.



ఐదవ రోజు
ఉదయం ద్వారకాధీశుని దర్శనం, బేట్ ద్వారక, నాగేశ్వర్ టెంపుల్ దర్శనం. ఆ తర్వాత ద్వారకకు తిరుగు ప్రయాణం. రాత్రి బస ద్వారకలోనే.

బీసీ కాలపు జగత్‌మందిర్: కృష్ణుడు పూజలందుకునే ఈ ఆలయాన్ని ద్వారకాధీశ్ మందిర్ అంటారు. ఐదంతస్థుల ఆలయం మనకు విచిత్రంగా అనిపిస్తుంది. క్రీ.పూ రెండు వందల ఏళ్ల నాటిదని ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా గుర్తించింది. మనకు ఇప్పుడు కనిపిస్తున్నది క్రీ.శ 15-16 శతాబ్దాల నాటి పునర్నిర్మాణం. ఆలయాలు పశ్చిమముఖంగా ఉండడం కూడా అరుదైన విషయం. ఆలయంఅరేబియా సముద్రాన్ని చూస్తున్నట్లుగా ఉంటుంది. తెలుగు రాష్ట్రం చిత్తూరు జిల్లా, నాగులాపురంలోని వేదనారాయణస్వామి ఆలయంలో విష్ణుమూర్తి పశ్చిమముఖంగా ఉంటాడు.



6వరోజు
ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తర్వాత హోటల్ గది చెక్ అవుట్ చేసి సోమనాథ్ వైపు సాగిపోవాలి. దారిలో పోర్‌బందర్‌లోని కీర్తిమందిర్, సుధామ టెంపుల్ విజిట్. సోమనాథ్ చేరిన తర్వాత సోమనాథ జ్యోతిర్లింగ దర్శనంతోపాటు ఆలయం చుట్టు పక్కల ఉన్నవాటిని తిరిగి చూడడం, సాయంత్రం తర్వాత పోర్‌బందర్‌కు ప్రయాణం. రాత్రికి పోర్ బందర్ రైల్వే స్టేషన్‌కి చేరడంతో యాత్ర పూర్తవుతుంది.

145 ఏళ్లుగా ఆగని గడియారం: ఫ్లోరల్ క్లాక్... వడోదర సిటీసెంటర్‌లోని షాయాజీ బాగ్‌లో ఉంది. క్రీ.శ 1879లో మూడవ మహారాజా షాయాజీరావు నిర్మించాడు. 13 ఎకరాల ఉద్యానవనంలో బరోడా మ్యూజియం అండ్ పిక్చర్ గ్యాలరీ, ఒక జూ, సర్దార్‌పటేల్ ప్లానిటోరియం... గార్డెన్ మొత్తం చూడడానికి టాయ్‌ట్రెన్ ఉన్నాయి. ప్లానిటోరియం పక్కనే ఆస్ట్రానమీ పార్క్ ఉంది. పురాతన కాలంలో వాడిన ఆస్ట్రనామికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ కూడా ఉన్నాయి. బరోడా మ్యూజియంలో పిక్చర్ గ్యాలరీలో మినియేచర్ కళాఖండాల నిలయం. హజీరా మఖ్బారా, న్యాయ మందిర్, దభోయి ఫోర్ట్, మకాయ్ కోట, జమామసీదు, కీర్తి మందిర్, అరబిందో సొసైటీ చూడవచ్చు. స్థానికులు గుజరాతీతో పాటు సింధీ భాష కూడా మాట్లాడతారు.

అహ్మదాబాద్: అహ్మదాబాద్ గురించి మాట్లాడాలంటే సబర్మతి నది గురించి మాట్లాడాలి. నదికి రెండువైపులా విస్తరించిన నగరం ఇది. ఒక వైపు వాళ్లు మరో వైపుకు రావడానికి నగరంలో ఈ నది మీద పదకొండు వంతెనలున్నాయి. ఎల్లిస్, గాంధీ, నెహ్రూ, సుభాష్, వాదాజ్ దూధేశ్వర్, సర్దార్, చంద్రభాగా, అంబేద్కర్, లాల్ బహదూర్ శాస్త్రి, ఫెర్నాండెజ్, దండి బ్రిడ్జిలు. బ్రిటిష్‌పాలకులతోపాటు జాతీయనాయకులను గౌరవిస్తూ నామకరణం చేయడం గొప్పగా అనిపిస్తుంది. మీరు నగరంలో ఏ వంతెన మీద ప్రయాణించారో సరదాగా గమనించండి. సబర్మతి రివర్ ఫ్రంట్ సూర్యోదయాలు, సాయంత్రాలను ఆస్వాదించడానికి మంచి ప్రదేశం. ఇక మనకు చిన్నప్పటి నుంచి చిరపరిచితమైన సబర్మతి ఆశ్రమం గాంధీజీ నివసించిన ప్రదేశం. ఇక్కడ జాతీయోద్యమ చర్చలు జరిగేవి. గాంధీజీ దండి సత్యాగ్రహాన్ని ఇక్కడి నుంచే ప్రారంభించారు. ఇప్పుడు ఆశ్రమంలో గాంధీజీ ఉపయోగించిన వస్తువులను చూడవచ్చు. నగరంలో సయ్యద్ సిద్ధిఖీ జాలీలో రాతిలో సునిశితంగా చెక్కిన డిజైన్‌ని తప్పకుండా చూడాలి. జైన్ మందిరం, కాలికో మ్యూజియం, సర్దార్ పటేల్ మ్యూజియం కూడా చూడాల్సిన ప్రదేశాలు.


సబర్మతి నది తీరం... 2014లో చైనా అధ్యక్షుడు జింగ్‌పింగ్ దంపతులకు సబర్మతి రివర్ ఫ్రంట్‌లో ఆతిథ్యం (ఫైల్ ఫోటో)

ప్రశాంత ధామం: అక్షరధామ్ టెంపుల్ గుజరాత్ రాజధాని గాంధీనగర్‌లో ఉంది. అహ్మదాబాద్‌కు 40 కిమీల దూరం. నగరంలో రాజధాని హడావుడి, ట్రాఫిక్ జామ్‌లు ఉండవు. అసెంబ్లీ, సెక్రటేరియట్, ప్రభుత్వ ఆఫీసులు, వాటి అనుబంధ భవనాలు తప్ప ఇతర వర్తక వాణిజ్యాలు ఉండవు. నగరం ప్రశాంతంగా ఉంటుంది.



సోమనాథ జ్యోతిర్లింగం: సోమనాథ్ జ్యోతిర్లింగ దర్శనం ఓ గొప్ప ఆధ్యాత్మిక అనుబూతి. సోమనాథుడిని దర్శనం తర్వాత ఆలయం ఆవరణలో ఉన్న ద్వాదశ జ్యోతిర్లింగాల నమూనాలను చూడవచ్చు. ఆలయం బేస్ మెంట్ ఎత్తుగా ఉంటుంది. ఆలయం వెనుక సముద్రపు అలలు ఆలయాన్ని అలవోకగా తాకుతూ ఉంటాయి. ఆయలం ఎదురుగా ఉన్న సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం స్టాచ్యూ ఆఫ్ యూనిటీ విగ్రహం నమూనాలోనే ఉంటుంది. నర్మద తీరాన పెద్ద విగ్రహస్థాపనకు ముందు నుంచే సోమనాథ్ ఆలయ ప్రాంగణంలో ఈ విగ్రహం ఉంది.

7వ రోజు
00.50 నిమిషాలకు (అర్ధరాత్రి 12.50 నిమిషాలు) ట్రైన్ నంబరు 20968 పోర్‌బందర్- సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ పోర్‌బందర్ స్టేషన్ నుంచి బయలుదేరుతుంది.

8వ రోజు... ట్రైన్ ఉదయం 8.20 నిమిషాలకు సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరుతుంది. బుధవారం మొదలైన పర్యటన బుధవారంతో పూర్తవుతుంది. ఈ ట్రైన్ అదే రోజు మధ్యాహ్నం మూడు గంటలకు ఇదే రైలు తిరిగి సికింద్రాబాద్ నుంచి పోర్‌బందర్‌కు బయలుదేరుతుంది. ఇది వీక్లీ ట్రైన్.




గాంధీజీ ఇక్కడే పుట్టాడు: పోర్‌బందర్.... గాంధీజీ పుట్టిన నేల. ఇక్కడ గాంధీజీ పుట్టిన ఇల్లు బాపూ మహల్ ఉంది. దాని పక్కనే స్మారక మందిరం కీర్తిమందిర్, బాపూ మహల్ వెనుకగా కస్తూర్బా గాంధీ ఇల్లు ఉన్నాయి. గాంధీజీ ఇంటిలో అటకల నిర్మాణాన్ని గమనించాలి. పోర్‌బందర్‌లో శ్రీకృష్ణుని స్నేహితుడు సుధాముడికి మందిరం, వాళ్ల గురువు సాందీపుడి మందిరం ఉన్నాయి. సుధాముడి మందిరం విశాలంగా ఉంటుంది. ఇక్కడ భక్తులకు ప్రసాదంగా అటుకుల ప్యాకెట్ ఇస్తారు. ఈ ఐటెనరీ ప్రకారం సోమనాథ్ నుంచి తిరుగు ప్రయాణంలో పోర్‌బందర్‌కు చేరే ప్రయాణం అరేబియా తీరం వెంబడే సాగుతుంది. కాబట్టి జర్నీలో సూర్యాస్తమయాన్ని ఆస్వాదించవచ్చు.







- వాకా మంజులారెడ్డి
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి



రుణదాతలకు రుణగ్రహీతలకంటే మెరుగైన జ్ఞాపకశక్తి ఉంటుంది
- బెంజమిన్ ఫ్రాంక్లిన్, అమెరికా తత్వవేత్త, రచయిత

ఇన్ఫో ఎడ్జ్‌కు స్టార్టప్‌ల రాబడి

- 2007 నుంచి పెట్టుబడులు
- 10 రెట్లు అధికంగా ఆర్జన

న్యూఢిల్లీ: నౌకరీ.కామ్ మాతృ సంస్థ ఇన్ఫో ఎడ్జ్ కొన్నేళ్లుగా స్టార్టప్‌లలో ఇన్వెస్ట్ చేస్తూ వస్తోంది. ప్రధానంగా ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటో, పీబీ ఫిన్‌టెక్ (పాలసీబజార్)లో పెట్టుబడులు భారీ రాబడి అందించినట్లు కంపెనీ వ్యవస్థాపకుడు, చైర్మన్ సంజీవ్ బిక్‌చందానీ తాజాగా పేర్కొన్నారు. గతేడాది(2024–25) ఫలితాల విడుదల సందర్భంగా వాటాదారులకు రాసిన లేఖలో ఈ అంశాలను వివరించారు. 2007లో ఫైనాన్షియల్ ఇన్వెస్ట్‌మెంట్లకు తెరతీసినట్లు తెలియజేశారు. వివిధ ప్లాట్‌ఫామ్‌లపై గత 15 ఏళ్ల కాలంలో రూ. 3,959 కోట్లు ఇన్వెస్ట్ చేసినట్లు తెలియజేశారు. ప్రస్తుతం వీటి అసలు విలువ దాదాపు 10 రెట్లు ఎగసి రూ. 36,855 కోట్లకు చేరినట్లు వెల్లడించారు. ప్రధానంగా జొమాటోలో రూ. 484 కోట్లు, పాలసీబజార్‌లో రూ. 591 కోట్లు చొప్పున ఇన్వెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	12-5-2025
విశాఖ	505-00
చిత్తూరు	583-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	500-00
విజయవాడ	500-00
రిటైల్ ధర (డజను)	66.00
హైదరాబాద్	500-00
వరంగల్	502-00
రిటైల్ ధర	5.60

ఇండో-పాక్ ఉద్రిక్తతలపై ఇన్వెస్టర్ల దృష్టి

- విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడులకూ ప్రాధాన్యం
- ఈ వారం స్టాక్ మార్కెట్ల ట్రెండ్‌పై విశ్లేషకుల అంచనాలు

ముంబై: భారత్, పాకిస్తాన్ మధ్య దాదాపు యుద్ధ మేఘాలు అలుముకోవడంతో దేశీ స్టాక్ మార్కెట్లు గత వారం చివర్లో బలహీనపడ్డాయి. అయితే వారాంతాన కాల్పుల విరమణకు అంగీకారం కుదిరినప్పటికీ సరిహద్దు పొడవునా పాక్ అతిక్రమణలకు పాల్పడినట్లు వెలువడిన వార్తలు ఇన్వెస్టర్లలో ఆందోళనలు పెంచినట్లు స్టాక్ నిపుణులు తెలియజేశారు. దీంతో మరోసారి అనిశ్చిత పరిస్థితులు తలెత్తినట్లు పేర్కొన్నారు. వెరసి రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గేవరకూ మార్కెట్లు బలహీనపడవచ్చని అభిప్రాయపడ్డారు.

ద్రవ్యోల్బణంపై కన్ను

ఏప్రిల్ నెలకు రిటైల్ ధరల ద్రవ్యోల్బణం(సీపీఐ) గణాంకాలు మంగళవారం(13న) విడుదలకానున్నాయి. మార్చిలో సీపీఐ వరుసగా ఐదో నెలలోనూ నీరసిస్తూ 3.34 శాతానికి పరిమితమైంది. ఈ బాటలో ఏప్రిల్ నెలకు టోకు ధరల ద్రవ్యోల్బణ(డబ్ల్యూపీఐ) వివరాలు 14న వెల్లడికానున్నాయి. మార్చిలో డబ్ల్యూపీఐ 2.38 శాతం నుంచి 2.05 శాతానికి బలహీనపడింది. ఇక ప్రభుత్వం ఏప్రిల్ నెల వాణిజ్య గణాంకాలను గురువారం (15న) ప్రకటించనుంది. మార్చిలో దేశీ వాణిజ్య లోటు 21.54 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ఆర్థిక గణాంకాలు కొంతమేర మార్కెట్లను ప్రభావితం చేయవచ్చని రెలిగేర్ బ్రోకింగ్ రీసెర్చ్ ఎస్‌వీపీ అజిత్ మిశ్రా పేర్కొన్నారు.

ఆర్థిక గణాంకాలు, క్యూ4 ఫలితాలు కీలకం



దేశీ స్టాక్ మార్కెట్లలో ఈ వారం ట్రెండ్‌ను పలు అంశాలు నిర్దేశించనున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. ప్రధానంగా పాకిస్తాన్ ఓవైపు కాల్పుల విరమణకు అంగీకరిస్తూనే ఎల్‌వోసీ పొడవునా ఉల్లంఘనలకు పాల్పడటంతో ఆందోళనలు పెరిగినట్లు తెలియజేశారు. గత వారాంతాన ఉన్నట్టుండి విదేశీ ఇన్వెస్టర్లు అమ్మకాలకు దిగడంతో సెంటిమెంటు బలహీనపడినట్లు విశ్లేషించారు. వివరాలు చూద్దాం..

ఫలితాలు కీలకం

ఇప్పటికే గతేడాది(2024-25) చివరి త్రైమాసిక ఫలితాల సీజన్ ముగింపునకు వచ్చింది. ఈ బాటలో ఈ వారం సైతం మరికొన్ని కార్పొరేట్ దిగ్గజాలు జనవరి-మార్చి(క్యూ4) పనితీరును వెల్లడించనున్నాయి. జాబితాలో రేమండ్, టాటా స్టీల్, యూపీఎల్(12న), టాటా మోటార్స్, భారతీ ఎయిర్‌టెల్, సిప్లా, హీరోమోటో కార్ప్, సీమెన్స్, గెయిల్(13న), ఐషర్ మోటార్స్, లుపిన్, శ్రీ సిమెంట్, టాటా పవర్(14న), అబాట్ ఇండియా, గాడ్‌ఫ్రే ఫిలిప్స్ ఇండియా, గోద్రెజ్ ఇండస్ట్రీస్(15న), బీహెచ్ఈఎల్(16న) ఫలితాలు ప్రకటించనున్నాయి. భారత్, పాక్ ఉద్రిక్తతలతోపాటు క్యూ4 ఫలితాలు ట్రెండ్‌కు కీలకంగా నిలవనున్నట్లు మాస్టర్ ట్రస్ట్ గ్రూప్ డైరెక్టర్ పునీత్ సింఘానియా అభిప్రాయపడ్డారు.

విదేశీ అంశాలు

ఈ వారం ఏప్రిల్ నెలకు యూఎస్ గణాంకాలు వెలువడనున్నాయి. ద్రవ్యోల్బణం 13న, రిటైల్ అమ్మకాలు 15న విడుదలకానున్నాయి. గురువారం ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమీ పావెల్ ప్రసంగించనున్నారు. వరుసగా మూడో సమావేశం(మే)లోనూ ఫెడ్ ఫండ్స్ రేట్లను 4.25-4.5 శాతంవద్ద కొనసాగించేందుకే కట్టుబడిన సంగతి తెలిసిందే. శుక్రవారం(16న) జపాన్ జీడీపీ(జనవరి-మార్చి) ప్రాథమిక వృద్ధి రేటు గణాంకాలు వెలువడనున్నాయి.

అమ్మకాలు పెరిగితే

మార్కెట్లు గత వారం చివర్లో బలహీనపడటంతో ఎన్ఎస్ఈ ప్రధాన ఇండెక్స్ నిఫ్టీ 24,000 పాయింట్లవద్ద నిలిచింది. భారత్, పాక్ మధ్య ఘర్షణలు నెలకొనడంతో నిఫ్టీ 23,900స్థాయి దిగువకు చేరే వీలున్నట్లు సాంకేతిక నిపుణులు పేర్కొంటున్నారు. ఇది జరిగితే మార్కెట్లు మరింత బలహీనపడవచ్చని అభిప్రాయపడ్డారు. ఇలాకాకుండా 24,250 పాయింట్ల ఎగువకు చేరితే బలాన్ని పుంజుకునే వీలున్నట్లు అంచనా వేశారు. భారత్, పాక్ మధ్య కాల్పుల విరమణతోపాటు పరిస్థితులు కుదుటపడితే సెంటిమెంటుకు ప్రోత్సాహం లభించవచ్చని మెహతా ఈక్విటీస్ సీనియర్ వీపీ(రీసెర్చ్) ప్రశాంత్ తాప్సీ విశ్లేషించారు. సాధారణంగా మార్కెట్లు ఇలాంటి పరిస్థితుల నుంచి త్వరగా రికవరీ సాధిస్తాయని అభిప్రాయపడ్డారు.

ఎఫ్‌పీఐలు రివర్స్‌గేర్

గత రెండు వారాలుగా దేశీ స్టాక్స్‌లో నికర కొనుగోలుదారులుగా నిలుస్తున్న విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) గత వారాంతాన ఉన్నట్టుండి నికర అమ్మకందారులుగా నిలిచారు. నగదు విభాగంలో శుక్రవారం (9న) రూ. 3,799 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు.అయితే ఈ నెలలో ఇప్పటివరకూ రూ. 14,167 కోట్లు ఇన్వెస్ట్ చేయడం గమనార్హం! జీఎస్‌టీ వసూళ్లు, ఎఫ్‌పీఐ పెట్టుబడులు ఇన్వెస్టర్లలో విశ్వాసాన్ని పెంచుతాయని జియోజిత్ ఇన్వెస్ట్‌మెంట్స్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయిర్ పేర్కొన్నారు. జనవరిలో రూ. 78,027 కోట్లు, ఫిబ్రవరిలో రూ. 34,574 కోట్లు, మార్చిలో 3,973 కోట్లు వెనక్కి తీసుకున్న ఎఫ్‌పీఐలు ఏప్రిల్‌లో రూ. 4,223 కోట్లు ఇన్వెస్ట్ చేశారు. తిరిగి ఈ నెలలో దేశీ స్టాక్స్ కొనుగోళ్లకు ఆసక్తి చూపుతున్నారు.

గత వారమిలా..

భారత్, పాక్ మధ్య తలెత్తిన ఉద్రిక్తతల నేపథ్యంలో గత వారం(5-9) దేశీ స్టాక్ మార్కెట్లు డీలాపడ్డాయి. బీఎస్ఈ సెన్సెక్స్ నికరంగా 1,048 పాయింట్లు(1.3 శాతం) క్షీణించి 79,454 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 339 పాయింట్లు(1.4 శాతం) నీరసించి 24,008 వద్ద స్థిరపడింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఇండెక్స్‌లు సైతం 1.4 శాతం చొప్పున నష్టపోయాయి.

అమ్మ నేర్పించే పెట్టుబడి పాఠాలు



రోహిత్ మట్టూ
నేషనల్ హెడ్ (రిటైల్ సేల్స్), యాక్సిస్ మ్యుచువల్ ఫండ్

మాతృమూర్తుల ప్రపంచం చాలా అసాధారణంగా, అద్భుతంగా ఉంటుంది. ఇల్లు, కుటుంబం, ఆర్థిక వ్యవహారాలను మాతృమూర్తులు చక్కబెట్టే తీరును ఒకసారి పరిశీలిస్తే వారు ఎంత ఆలోచనాత్మకంగా వ్యవహరిస్తారనేది అర్థమవుతుంది. పరిమిత వనరులతోనే అన్ని అవసరాలను చక్కబెట్టడం నుంచి దీర్ఘకాలిక కోణంలో పిల్లల భవిష్యత్ కోసం ఎన్నో సంవత్సరాల ముందు నుంచే ప్రణాళికలు వేసి, అమలు చేయడం వరకు అమ్మ ఎంతో ఓర్పుగా, క్రమశిక్షణగా అనుసరించే విధానం ఒక మాస్టర్‌క్లాస్‌గా ఉంటుంది. ఇన్వెస్టర్లకు కూడా ఇదే ఓరిమి, క్రమశిక్షణ, దీర్ఘకాలిక దృక్పథాలు ఉంటే సంపద సృష్టికి దోహదం చేస్తాయి. డబ్బు గురించి ఎలా ఆలోచించాలి, ఎలాంటి ప్రణాళికలు వేసుకోవాలి, మనకు ఎంతో ఇష్టమైన వారి జీవితాలను తీర్చిదిద్దే నిర్ణయాలకు ఎలా కట్టుబడి ఉండాలనే విషయాలకు సంబంధించి అమ్మ నుంచి ఎన్నో విలువైన పాఠాలను నేర్చుకోవచ్చు.

ఓర్పు: ప్రక్రియను విశ్వసించడం

ఒకసారి చిన్నప్పటి రోజులను గుర్తు చేసుకోండి. పిల్లలు మొదటి మాట పలకడం కావచ్చు, మొదటి అడుగు వేయడం కావచ్చు ప్రతీ దాని కోసం అమ్మ ఎంతో ఓపికగా ఎదురుచూస్తుంది. తొందరపడదు. పిల్లలు తప్పకుండా సాధిస్తారు, వారిలో ఆ సామర్థ్యం ఉంది అని గట్టిగా నమ్ముతుంది. పెట్టుబడులు కూడా ఇందుకు భిన్నమైనవి కావు. మార్కెట్లు పెరుగుతాయి, పడతాయి. కానీ పెట్టుబడులను అలా కొనసాగించడం వల్ల కాంపౌండెడ్ ప్రభావంతో సంపద స్థిరంగా వృద్ధి చెందుతుంది. స్వల్పకాలిక ఒడిదుడుకుల ప్రభావాలకు మనం సులభంగా భయపడిపోవచ్చేమో. కానీ చిన్ననాటి మైలురాళ్లలాగే, ఆర్థిక మైలురాళ్లను సాధించడానికి కూడా సమయం పడుతుంది. నిలకడగా, చిన్న మొత్తాలను పెట్టుబడులు పెడుతూ సంవత్సరాలు గడిచే కొద్దీ పెద్ద నిధిని సమకూర్చుకునేందుకు సిప్‌లు (సిస్టమాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్లు) చక్కని సాధనాలుగా నిలుస్తాయి. రూపీ కాస్ట్ యావరేజింగ్, కాంపౌండింగ్ ప్రయోజనాలను పొందుతూ కాలక్రమేణా సంపదను పెంచుకునేందుకు ఇవి తోడ్పడతాయి.



క్రమశిక్షణ: చిన్న చిన్న పనులు, భారీ ఫలితాలు

అమ్మ రోజువారీ దినచర్యే మనకు క్రమశిక్షణ పాఠంగా నిలుస్తుంది. పేరెంటింగ్ కావచ్చు, ఇన్వెస్టింగ్ కావచ్చు క్రమం తప్పకుండా, తరచుగా చేసే పనులు చిన్నవిగానే కనిపించినా భవిష్యత్తును తీర్చిదిద్దే పెద్ద ఫలితాలనిస్తాయి. ఎలాంటి సవాళ్లనైనా అధిగమించగలిగే సామర్థ్యాలనిస్తాయి. మార్కెట్లు పతనమైనప్పుడైనా లేక వ్యక్తిగతంగా ఆటంకాలు ఏర్పడిన కష్ట పరిస్థితుల్లోనైనా సిప్‌ల ద్వారా క్రమం తప్పకుండా పెట్టుబడులు పెట్టడాన్ని కొనసాగించడం వల్ల ఆర్థిక సామర్థ్యం బలపడుతుంది. సిప్‌ను మధ్య మధ్యలో మానేసినా ఫర్వాలేదని అప్పుడప్పుడు అనిపించినప్పటికీ, అలా చేయడం వల్ల, దీర్ఘకాలిక లక్ష్యాలకు హాని కలుగుతుంది. పేరెంటింగ్‌లాగే ప్రతి విషయంలోనూ నిలకడగా ఉండటం ముఖ్యం.

దీర్ఘకాలిక విజన్: భారీ లక్ష్యాలపై దృష్టి

మాతృమూర్తులు కేవలం ఇవాళ్టి గురించే ఆలోచించరు. రాబోయే రోజుల గురించి కూడా ముందు నుంచే ప్రణాళికలు వేస్తూ ఉంటారు. స్కూలు ఫీజుల కోసం పొదుపు చేయడం దగ్గర్నుంచి పిల్లల పెళ్లిళ్ల ఖర్చుల వరకు ప్రతి విషయం గురించి ఎన్నో సంవత్సరాల ముందు నుంచే ఆలోచిస్తారు. పెట్టుబడులు పెట్టే విషయంలోనూ ఈ దీర్ఘకాలిక విజన్ ఉండటం చాలా ముఖ్యం. సంపద సృష్టి అనేది కేవలం ట్రెండ్‌ల వెంట పరుగెత్తడం ద్వారా కాదు, ప్రణాళికలు పట్టాలు తప్పకుండా చూసుకోవడం ద్వారానే సాధ్యపడుతుంది. పిల్లల చదువులు, ఇంటి కొనుగోలు లేదా రిటైర్మెంట్ నిధిని సమకూర్చుకోవడం ఇలా లక్ష్యాల ఆధారితమైనదిగా ఇన్వెస్ట్‌మెంట్ ఉండాలి.

సిప్‌లు: అమ్మ స్టయిల్‌లో పెట్టుబడులు పెట్టడం

ఒక్క ముక్కలో చెప్పాలంటే, మనం ఎంచుకున్న మ్యుచువల్ ఫండ్ స్కీములో క్రమం తప్పకుండా (సాధారణంగా నెలవారీగా), ఇంత మొత్తం చొప్పున ఇన్వెస్ట్ చేసేందుకు సిప్ ఉపయోగపడుతుంది. ఈ విధానంతో మూడు శక్తివంతమైన ప్రయోజనాలు ఉన్నాయి:

రూపీ-కాస్ట్ యావరేజింగ్: మార్కెట్ హెచ్చుతగ్గులను అధిగమించేందుకు సిప్‌లు ఆటోమేటిక్‌గా సహాయపడతాయి. మార్కెట్లు పడినప్పుడు ఎక్కువ యూనిట్లు వస్తాయి. మార్కెట్లు పెరిగినప్పుడు కాస్త తక్కువ యూనిట్లు వస్తాయి. క్రమేణా కొనుగోలు ధర, నిర్దిష్ట సగటు స్థాయిలో ఉండటం వల్ల కాస్త అదనపు ప్రయోజనాలు చేకూరతాయి.

అలవాటు ఏర్పడటం: మాతృమూర్తుల దినచర్య ఎలాగైతే ఉంటుందో, సిప్‌లు కూడా ఆర్థిక క్రమశిక్షణను అలవాటు చేస్తాయి. ప్రతి నెలా సిప్ కట్టడమనేది ఒక అలవాటుగా మారుతుంది. దీర్ఘకాలిక పొదుపునకు దోహదపడుతుంది.

సరళత్వం: తక్కువ మొత్తాలతోనే పెట్టుబడులను పెట్టడాన్ని ప్రారంభించేందుకు సిప్‌లు ఉపయోగపడతాయి. యువ ఇన్వెస్టర్లకు లేదా వివిధ బాధ్యతలున్న కుటుంబాలకు ఇలాంటి విధానం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. కుటుంబ బాధ్యతల్లో మార్పులు, ఆదాయం పెరిగే కొద్దీ, పెట్టుబడి మొత్తాన్ని పెంచుకోవచ్చు.

మాతృమూర్తులు కేవలం నేటి గురించే కాదు, భవిష్యత్తు కోసం కూడా ఆలోచిస్తారు. పిల్లల చదువుల కోసం పొదుపు చేయడం కావచ్చు లేదా డబ్బు విలువ గురించి నేర్పించడం కావచ్చు, వారు నిలకడగా చేసే చిన్న చిన్న పనులే భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తాయి. సిప్‌లు కూడా ఇలాగే ఉంటాయి. ఆలోచనాత్మకంగా, నిలకడగా పని చేస్తాయి. క్రమశిక్షణతో క్రమం తప్పకుండా చేసే పెట్టుబడులే, అమ్మ కృషిలాగే, పెరిగి పెద్దయి, మంచి ఫలితాలనిస్తాయి. సత్వర లాభాల వెంటబడకుండా, అనిశ్చితుల్లోనూ పెట్టుబడులకు కట్టుబడాలి. ఫలితాలు వచ్చేందుకు తగిన సమయం ఇవ్వాలి. అమ్మలాగా పెట్టుబడి పెట్టడమంటే, సహన శక్తిపై నమ్మకం ఉంచడం. ప్రణాళికలు పట్టాలు తప్పకుండా చూసుకోవడం. సురక్షితమైన, స్వతంత్రమైన భవిష్యత్తును తీర్చిదిద్దుకోవడం. ఇది స్మార్ట్ ఇన్వెస్టింగ్ మాత్రమే కాదు, దీర్ఘకాలిక దృక్పథంతో నెమ్మదిగా, అర్థవంతమైన విధంగా సంపదను పెంపొందించుకోవడం కూడా.

జీడీపీ వృద్ధి 6.5 శాతం

ద్వైపాక్షిక వాణిజ్యాలతో ఫలితం
- సీఐఐ ప్రెసిడెంట్ సంజీవ్ పురి



న్యూఢిల్లీ: దేశ జీడీపీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2025-26) 6.5 శాతం వృద్ధిని నమోదు చేస్తుందని, స్వల్పకాల ప్రభావాలను అధిగమించే సామర్థ్యం దేశ ఆర్థిక వ్యవస్థకు ఉందని సీఐఐ ప్రెసిడెంట్ సంజీవ్ పురి అన్నారు. వడ్డీ రేట్లు కొంత తగ్గడం, ద్రవ్యోల్బణం దిగిరావడాన్ని ప్రస్తావించారు. వడ్డీ రేట్లు మరింత దిగొస్తాయన్న అంచనాను వ్యక్తీకరించారు. బడ్జెట్‌లో ఆదాయ పన్ను రాయితీలు కల్పించడం, ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులు పుంజుకోవడాన్ని సానుకూలంగా పేర్కొన్నారు. ఇంధనం, రవాణా, మెటల్స్, కెమికల్స్, ఆతిథ్య రంగాల్లో ప్రైవేటు పెట్టుబడులు పెరిగాయన్నారు. అయితే ప్రస్తుతం నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెట్టుబడుల విషయంలో కొంత అప్రమత్తతకు దారితీయవచ్చని అభిప్రాయపడ్డారు. వాణిజ్య అడ్డంకులు పెరిగిపోతున్న క్రమంలో దేశ ప్రయోజనాలను కాపాడుకునేందుకు కీలక భాగస్వాములతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలను తప్పకుండా కుదుర్చుకోవాలని సూచించారు. ముఖ్యంగా యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధిక టారిఫ్‌లు ప్రకటించడాన్ని గుర్తు చేశారు. ప్రపంచవ్యాప్తంగా రక్షణాత్మక ధోరణి పెరుగుతున్నట్టు చెప్పారు. వాణిజ్యానికి మరిన్ని అవరోధాలు ఏర్పడుతున్న దృష్ట్యా ద్వైపాక్షిక వాణిజ్యాల ద్వారా దేశ ప్రయోజనాలను కాపాడుకోవాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. ముఖ్యంగా యూఎస్, ఈయూలతో ఒప్పందం ఎంతో కీలకమన్నారు. దేశీయంగా వృద్ధి చోదకాలు, పోటీతత్వం పెంపుపై దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయం, వాతావరణ మార్పుల విషయంలో ఎంతో పరిశోధన, కృషి అవసరమన్నారు. గ్రామీణ వినియోగం పుంజుకున్నప్పటికీ పట్టణ వినియోగం ఫ్లాట్‌గా ఉన్నట్టు చెప్పారు. వచ్చే కొన్ని త్రైమాసికాల్లో పట్టణ వినియోగం సైతం వేగాన్ని అందుకుంటుందని సంజీవ్ పురి అంచనా వేశారు.

డీసీఎం శ్రీరామ్ చేతికి డీఎస్‌వీ గ్లోబల్

53 శాతం వాటా కొనుగోలు

న్యూఢిల్లీ: డీసీఎం శ్రీరామ్ గ్రూప్ సంస్థ ఫినెస్టా యూపీవీసీ, అల్యూమినియం డోర్లు, కిటికీల తయారీలో మరింత విస్తరించనుంది. ఇందుకు అనుగుణంగా డీఎస్‌వీ గ్లోబల్‌లో 53 శాతం వాటా కొనుగోలు చేసింది. ఇందుకు రూ. 44 కోట్లు వెచ్చించింది. రెండు నెలల్లోగా డీల్ పూర్తికాగలదని అంచనా కాగా.. తాజా కొనుగోలు ద్వారా ఫినెస్టా బ్యాక్‌వార్డ్ ఇంటిగ్రేషన్‌కు వీలు చిక్కనుంది. అంతేకాకుండా కొత్త బిజినెస్(హార్డ్‌వేర్) విభాగంలోకి ప్రవేశించనుంది. డీసీఎస్ శ్రీరామ్ గ్రూప్ కంపెనీ ఫినెస్టా యూపీవీసీ, అల్యూమినియం డోర్లు, కిటికీలతోపాటు సాలిడ్ ప్యానల్ డోర్లు, ఫాసేడ్స్ తయారీలో ఉన్న సంగతి తెలిసిందే.

జీతాలు.. పన్ను భారం

మొత్తం ఆదాయాలన్నింటిని 5 శీర్షికలుగా విభజించారు. అందులో మొదటిది జీతాలు. ఈ వారం జీతాలకు సంబంధించిన కొన్ని విషయాలు తెలుసుకుందాం. జీతం అనే ఆదాయాన్ని పొందే వ్యక్తులను మూడు రకాలుగా వర్గీకరించవచ్చు.

- ప్రభుత్వ ఉద్యోగులు
- ప్రైవేటు సెక్టార్ ఉద్యోగులు
- క్యాజువల్ లేబర్

ప్రభుత్వం అంటే కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, ప్రభుత్వ అనుబంధ సంస్థలు, ప్రభుత్వరంగ సంస్థలు ఇలా.. పెద్ద జాబితా తయారవుతుంది. ప్రైవేటు సెక్టార్ పరిధిలో కంపెనీలు, సంస్థలు .... ఇదొక జాబితా. ఈ రెండూ కాకుండా క్యాజువల్‌గా పని చేసే కార్మికులు, పనివారు.

ఉద్యోగులు .. అంటే ప్రస్తుతం పని చేసేవారే కాకుండా రిటైర్ అయిన వారు పదవీ విరమణ తర్వాత డ్రా చేసే ఫైనాన్స్‌ని కూడా 'జీతం'గానే పరిగణిస్తారు. ఫ్యామిలీ ఫైనాన్స్‌ని మాత్రం ఇతర ఆదాయంగా పరిగణిస్తారు. డబ్బులు ఇచ్చే వ్యక్తికి, ఆ డబ్బులు పుచ్చుకునే వ్యక్తికి మధ్య యజమాని-సేవకుడు అనే సంబంధం ఉంటేనే ఈ వ్యవహారాలను జీతంగా పరిగణిస్తారు. ఎటువంటి ఉద్యోగం ..? ప్రైవేటా... ప్రభుత్వమా.., ఫుల్‌టైమా.., పార్ట్ టైమా.., రెగ్యులరా..? పర్మినెంటా..? తాత్కాలికమా..? క్యాజువలా..? ఇటువంటి విషయాలతో నిమిత్తం లేదు.

సెక్షన్ 15, సెక్షన్ 17లోని అంశాలు పరిశీలిస్తే జీతాల పరిధిని, నిర్వచనాన్ని చాలా జాగ్రత్తగా తయారు చేశారనిపిస్తుంది. నిర్దిష్టంగా, సంక్షిప్తంగా, క్లుప్తంగా నిర్వచించే సందర్భాల్లో... ఒక జాబితా తయారు చేసి ఇందులో అంశాలన్నీ 'జీతం' అని అంటారు. చెల్లించవల్సిన జీతం టాక్సబుల్, చెల్లించకపోయినా టాక్సబుల్. ప్రస్తుత యజమాని, పూర్వపు యజమాని .. ఎవరు ఇవ్వాల్సినా, దాని మీద పన్ను పడుతుంది. చెల్లించిన జీతాల గురించి చెప్పక్కర్లేదు. ఎరియర్స్ జీతాల మీద పన్ను పడుతుంది. 'డ్యూ' జీతం, చెల్లించిన జీతం... ఏది ముందు జరిగితే దానికి టాక్స్ వర్తింపచేస్తారు. అడ్వాన్స్ జీతం చెల్లించిన సంవత్సరంలో టాక్స్ వర్తింపచేస్తారు.


జీతం... అంటే వేతనాలు, పెన్షన్లు, అలవెన్సులు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, గ్రాట్యుటీ, అడ్వాన్స్ జీతం, కమీషన్, ప్రావిడెంట్ ఫండ్ క్రెడిట్ ద్వారా ప్రతి సంవత్సరం వచ్చి చేరే మొత్తం, న్యూ పెన్షన్ స్కీంలో చేసే చెల్లింపులు లాంటివన్నీ దీని పరిధిలోకి వస్తాయి. విదేశాల నుంచి జీతం వస్తే దాన్ని మన కరెన్సీలోకి మార్చి ఆ విలువను పరిగణనలోకి తీసుకుంటారు. బోనస్ ఏ సంవత్సరం చేతికొచ్చిందో ఆ సంవత్సరం టాక్స్ వేస్తారు. గత సంవత్సరాల జీతాలు 'ఎరియర్స్' ప్రస్తుత సంవత్సరం వస్తే మీకు రెండు ఆప్షన్లు ఉంటాయి. మొదటిది ఏంటంటే మొత్తాన్ని కరెంట్ సంవత్సరంలో వచ్చినట్లు లెక్కించడం లేదా రెండో ఆప్షన్ ప్రకారం గత ఆర్థిక సంవత్సరానికి సర్దుబాటు చేయడం వలన రిలీఫ్ వస్తే దాన్ని పొందడం. వదులుకున్న జీతం మీద టాక్సు పడుతుంది. కేంద్ర ప్రభుత్వానికి వదిలేసిన జీతం మీద పన్ను భారం లేదు. జీతాలు విదేశాల్లో చెల్లించినా ఇండియాలోనే టాక్స్ వేస్తారు. డిప్యుటేషన్ మీద విదేశాలకు వెళ్లిన వారు ఇండియాలోనే పన్ను చెల్లించాలి.

ఇక పెర్క్స్, పెర్క్విజిట్స్.. ఇదొక జాబితా.. రెంట్, ఫ్రీ వసతి, రాయితీ మీద ఇల్లు ఇవ్వడం, ఇతర సదుపాయాలు.. ఇలా ఎన్నో అంశాలు ఉంటాయి. ఎంత మొత్తం మీద పన్ను పడుతుందనేది వాల్యుయేషన్ చేయాలి. రూలు 3 ప్రకారం... టాక్సు వర్తించే అంశాన్ని, దాన్ని ఎలా వాల్యూ చెయ్యాలో విశదీకరించారు.

పెర్క్స్ తర్వాత చెప్పుకోదగినది జీతానికి బదులుగా ఇచ్చే మొత్తం. ఈ మొత్తం మీద కూడా పన్ను భారం పడుతుంది. ఉదాహరణకు పరిహారం. ఇక కొన్ని అలవెన్సులు మీద మినహాయింపు ఉంది. లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, గ్రాట్యుటీ, ఇంటి అద్దె అలవెన్సు మొదలైనవి ఇంకా ఎన్నో ఉంటాయి. పన్ను భారం తగ్గించుకోవడానికి అనేక ఇన్వెస్ట్‌మెంట్ పద్ధతులున్నాయి. ఇవే 80 ఇ నుంచి మొదలయ్యే అంశాలు ఉన్నాయి. ఇదొక పెద్ద జాబితా. జీతం ఒక చిన్న పదం. దాని పరిధిలో ఎన్నో అంశాలు ఉంటాయి. ఎంతో జాగ్రత్తగా పన్ను భారాన్ని లెక్కించాలి.




కె.సీహెచ్. ఎ.వి.ఎస్.ఎన్ మూర్తి
కె.వి.ఎన్ లావణ్య
ట్యాక్సేషన్ నిపుణులు



పన్నుకు సంబంధించిన సందేహాలు ఏవైనా ఉంటే పాఠకులు business@sakshi.comకు ఈ-మెయిల్ పంపించగలరు.

ఫార్మాలో పెట్టుబడులకు మార్గం

నిప్పాన్ ఇండియా ఫార్మా ఫండ్



ఫార్మా రంగాన్ని ఎవర్‌గ్రీన్‌గా చెబుతారు. ఈ రంగంలో వృద్ధి ఎప్పటికీ ఉంటుంది. అందుకే ఈక్విటీ పెట్టుబడుల విషయంలో 'ఫార్మా' పెట్టుబడులను రక్షణగా చూసే ధోరణి ఉంది. జీవనశైలి, కొత్త రకాల వైరస్‌లతో ఏటేటా ఫార్మా వినియోగం పెరుగుతూ వస్తోంది. కనుక ఈ రంగానికి ఎప్పుడూ మంచి భవిష్యత్ ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు. పైగా కాంట్రాక్ట్ రీసెర్చ్ అండ్ తయారీ (సీడీఎంఓ) విభాగంలో భారత ఫార్మా కంపెనీలకు రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున వ్యాపార అవకాశాలు వస్తాయన్న అంచనా ఉంది. కనుక ఇన్వెస్టర్లు తమ ఈక్విటీ పెట్టుబడుల్లో కొంత భాగాన్ని వైవిధ్యం కోసం ఫార్మాకు కేటాయించుకోవచ్చు. ఈ విభాగంలో నిప్పాన్ ఇండియా ఫార్మా ఫండ్ పనితీరు దీర్ఘకాలానికి మెరుగ్గా ఉంది.

రాబడులు

ఈ పథకం డైరెక్ట్ ప్లాన్ గడిచిన ఏడాది కాలంలో 15 శాతం రాబడులు అందించింది. మూడేళ్లలో 22 శాతం, ఐదేళ్లలో 23 శాతం, ఏడేళ్లలో 20 శాతం, పదేళ్లలో 15 శాతం చొప్పున వార్షిక రాబడుల చరిత్ర ఈ పథకం సొంతం. ఫార్మా ఫండ్స్ విభాగం, బీఎస్ఈ హెల్త్‌కేర్ టీఆర్ఐ సూచీలతో ఈ పథకం రాబడిని పోల్చి చూస్తే.. ఏడేళ్లు, పదేళ్లలో రాబడుల పరంగా ముందుంది. మిగిలిన కాలాల్లో సమీపంగా ఉండడాన్ని గుర్తించొచ్చు. 2013లో ఈ పథకం ప్రారంభం కాగా, నాటి నుంచి చూస్తే వార్షిక రాబడి 18 శాతంగా ఉంది. ఫార్మా ఫండ్స్ స్వల్పకాలం పెట్టుబడులకు అనుకూలం కాదు. ఎందుకంటే ఫార్మా కంపెనీలు ఎన్నో నియంత్రణల మధ్య పనిచేస్తుంటాయి. ముఖ్యంగా యూఎస్ఎఫ్‌డీఏ తనిఖీల ప్రభావం స్టాక్స్‌పై ఉంటుంది. దీర్ఘకాలంలో వీటన్నింటినీ ఎదుర్కొని ఫార్మా కంపెనీలు మెరుగైన పనితీరు చూపిస్తుంటాయి. అందుకే దీర్ఘకాల లక్ష్యాల కోసమే ఇన్వెస్టర్లు ఫార్మా ఫండ్స్‌ను పరిశీలించొచ్చు. ఈ పథకంలో కనీసం రూ.5,000 ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. సిప్ అయితే రూ.100 నుంచి పెట్టుబడి పెట్టుకోవచ్చు. ఈ పథకంలో ఎక్స్‌పెన్స్ రేషియో 0.91 శాతంగా ఉంది. పెట్టుబడులను 30 రోజుల్లోపు విక్రయిస్తే విలువపై ఒక శాతం ఎగ్జిట్ లోడ్ అమలవుతుంది.



పోర్ట్‌ఫోలియో

ప్రస్తుతానికి ఈ పథకం నిర్వహణలో రూ.8,260 కోట్ల పెట్టుబడులు (ఏయూఎం) ఉన్నాయి. ఇందులో 99.71 శాతం పెట్టుబడులను ఇప్పటికే ఇన్వెస్ట్ చేసి ఉంది. 0.29 శాతం నగదు రూపంలో కలిగి ఉంది. ఈక్విటీ పెట్టుబడులను గమనిస్తే 56 శాతం లార్జ్‌క్యాప్ కంపెనీల్లోనే ఉన్నాయి. మిడ్‌క్యాప్ కంపెనీలకు 31.36 శాతం, స్మాల్‌క్యాప్ కంపెనీలకు 12.67 శాతం చొప్పున పెట్టుబడులు కేటాయించింది. పథకం పోర్ట్‌ఫోలియోలో 37 స్టాక్స్ ఉన్నాయి. ఇందులో టాప్ 10 స్టాక్స్‌లోనే 60 శాతం పెట్టుబడులు ఉండడాన్ని గమనించొచ్చు. సెక్టోరల్ ఫండ్స్‌లో అస్థిరతలు ఎక్కువ. కనుక ఇన్వెస్టర్లు తమ మొత్తం పెట్టుబడుల్లో 5-10 శాతం మించకుండా వీటికి కేటాయించుకోవచ్చు.


టాప్ ఈక్విటీ హోల్డింగ్స్

కంపెనీ	పెట్టుబడులు శాతం
సన్ ఫార్మా	13.88
దివిస్ ల్యాబ్స్	9.57
లుపిన్	6.30
సిప్లా	6.01
అపోలో హాస్పిటల్స్	5.48
డాక్టర్ రెడ్డీస్	5.25
గ్లాక్సో స్మిత్‌క్లెయిన్	3.63
మెడ్‌ప్లస్ హెల్త్	3.54
విజయ దయాగ్నోస్టిక్స్	3.43
అబాట్ ఇండియా	3.23

త్రుటిలో చేజారిన పతకాలు

నాలుగో స్థానంలో నిలిచిన కార్తికేయన్, పద్మిని ● ఆసియా బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్

అల్ అయిన్ (యూఏఈ): ఆసియా వ్యక్తిగత చెస్ చాంపియన్‌షిప్ బ్లిట్జ్ విభాగంలో భారత్‌కు త్రుటిలో రెండు కాంస్య పతకాలు చేజారాయి. పురుషుల విభాగంలో తమిళనాడు గ్రాండ్‌మాస్టర్ మురళీ కార్తికేయన్... మహిళల విభాగంలో ఒడిశా అమ్మాయి పద్మిని రౌత్ నాలుగో స్థానంలో నిలిచి కాంస్య పతకాలను కోల్పోయారు. నిర్ణీత తొమ్మిది రౌండ్ల తర్వాత కార్తికేయన్ ఏడు పాయింట్లతో మరో ముగ్గురితో కలిసి ఉమ్మడిగా నాలుగో స్థానంలో నిలిచాడు. దాంతో మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించారు. రుడిక్ మకారియన్ (రష్యా)కు మూడో స్థానంతోపాటు కాంస్య పతకం ఖరారైంది. కార్తికేయన్‌కు నాలుగో స్థానం, నీలాశ్ సాహా (భారత్)కు ఐదో స్థానం, జియాంగ్ హావోచెన్ (చైనా)కు ఆరో స్థానం లభించాయి. పురుషుల విభాగంలో మొత్తం 111 మంది ప్లేయర్లు పోటీపడగా... 8 పాయింట్లతో 15 ఏళ్ల ఇవాన్ జెమ్లియాన్స్కి (రష్యా) విజేతగా అవతరించాడు. ఇరాన్‌కు చెందిన 15 ఏళ్ల సినా మొవాహెద్ 7.5 పాయింట్లతో రజతాన్ని దక్కించుకున్నాడు.



మహిళల విభాగంలో నిర్ణీత తొమ్మిది రౌండ్ల తర్వాత పద్మిని రౌత్, యుజిన్ సాంగ్ (చైనా), ఎల్నాజ్ కలియాక్‌మెత్ (కజకిస్తాన్) ఏడు పాయింట్లతో సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచారు. దాంతో మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా కాంస్య పతకాన్ని ఖరారు చేయగా... యుజిన్ సాంగ్‌కు కాం



స్యం లభించింది. పద్మిని నాలుగో స్థానంలో, ఎల్నాజ్ ఐదో స్థానంలో నిలిచారు. 7.5 పాయింట్లతో అలువా నుర్మాన్ (కజకిస్తాన్), వాలెంటీనా గునీనా (రష్యా) సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంక్‌లను వర్గీకరించగా... నుర్మాన్‌కు స్వర్ణం, గునీనాకు రజతం లభించాయి.

ఆసియా టోర్నీలో రష్యా ప్రాతినిధ్యం ఎందుకంటే...

ఉక్రెయిన్, రష్యా యుద్ధం నేపథ్యంలో అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) రష్యా క్రీడాకారులు అంతర్జాతీయ టోర్నీలలో రష్యా తరఫున పాల్గొనడంపై నిషేధం విధించాయి. అయితే రష్యా క్రీడాకారులు దేశం తరఫున కాకుండా తటస్థ క్రీడాకారులుగా పాల్గొనవచ్చని ఐఓసీ వెసులుబాటు కల్పించింది. దాంతో పలువురు రష్యా క్రీడాకారులు అంతర్జాతీయ టోర్నీలలో ఆయా క్రీడా సమాఖ్య పతాకాలపై బరిలోకి దిగుతున్నారు. ఇక రష్యా చెస్ క్రీడాకారుల విషయానికొస్తే 2023లో రష్యా యూరోపియన్ చెస్ యూనియన్ నుంచి బయటకు వచ్చి ఆసియా సమాఖ్యలో చేరింది. పలు టోర్నీలలో రష్యా ప్లేయర్లు ప్రపంచ చెస్ సమాఖ్య (ఫిడే) తరఫున పాల్గొంటున్నారు. తాజాగా ఆసియా చాంపియన్‌షిప్‌లో రష్యా క్రీడాకారులు 'ఫిడే' పతాకంపై పోటీపడుతున్నారు.

క్షిపణి దాడి నుంచి తప్పించుకున్న ఆసీస్ క్రికెటర్లు

రావల్పిండి: ఆస్ట్రేలియా క్రికెటర్లు క్షిపణి దాడి నుంచి త్రుటిలో తప్పించుకున్నారు. భారత్, పాకిస్తాన్ మధ్య సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో పాకిస్తాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్) వాయిదా పడగా... అందులో పాల్గొంటున్న పలువురు విదేశీ ఆటగాళ్లు పాక్‌లోని రావల్పిండి నూర్ ఖాన్ విమానాశ్రయం నుంచి బయలుదేరిన కాసేపటికి అక్కడ క్షిపణి దాడి జరిగింది. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడికి బదులుగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టగా... దానికి పాక్ ప్రతిదాడి చేసింది. దీంతో తీవ్రంగా స్పందించిన భారత సైన్యం... పాకిస్తాన్‌లోని మూడు వైమానిక స్థావరాలపై దాడులు నిర్వహించింది. ఈ దాడి జరగడానికి కాసేపు ముందే అంతర్జాతీయ క్రికెటర్లు నూర్ ఖాన్ విమానాశ్రయం నుంచి బయలుదేరినట్లు ఆస్ట్రేలియా మీడియా వెల్లడించింది. ఆసీస్‌కు చెందిన సీన్ అబాట్, బెన్ డ్వార్షుయిస్, ఆస్టన్ టర్నర్, మిచ్ ఓవెన్ ఆ సమయంలో పాక్‌లో ఉన్నట్లు పేర్కొంది. పీఎస్ఎల్ వాయిదా పడటంతో శనివారం విదేశీ ఆటగాళ్లు చార్టర్ ఫ్లయిట్లో రావల్పిండి నుంచి బయలుదేరగా... గంటల వ్యవధిలోనే అక్కడ క్షిపణి దాడితో పరిస్థితి భయానకంగా మారిందని పేర్కొంది. పౌర విమాన రాకపోకలను కవచంగా వినియోగించుకుంటూ పాకిస్తాన్ దాడులకు పాల్పడిందనే అంశం ఈ ఘటనతో మరోసారి నిరూపితమైంది. మరోవైపు పీఎస్ఎల్‌లోని మిగిలిన 8 మ్యాచ్‌లను వాయిదా వేస్తున్నట్లు పీసీబీ ప్రకటించింది. మిగిలిన టోర్నీని యూఏఈలో నిర్వహించాలని నిర్ణయించినా... అటువైపు నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో నిరవధికంగా వాయిదా వేసింది.



పాకిస్తాన్‌కు వెళ్లాలా వద్దా?

- పునరాలోచనలో బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు
- ఈనెల 21 నుంచి పాక్‌తో ఐదు టి20 మ్యాచ్‌ల సిరీస్

ఢాకా: ఉగ్రదాడుల నేపథ్యంలో సుదీర్ఘకాలం సొంతగడ్డపై క్రికెట్ మ్యాచ్‌లకు దూరమైన పాకిస్తాన్ జట్టు తిరిగి అలాంటి పరిస్థితులు ఎదుర్కొనే సూచనలు కనిపిస్తున్నాయి. 2009లో శ్రీలంక జట్టుపై పాకిస్తాన్‌లో ఉగ్రవాదులు దాడి చేయడంతో అంతర్జాతీయ జట్లు ఆ దేశంలో పర్యటించడాన్ని దాదాపు నిషేధించగా... ఇటీవలే పరిస్థితులు తిరిగి మెరుపడడంతో కొన్ని జట్లు పాకిస్తాన్‌లో పర్యటిస్తున్నాయి. ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ నిర్వహణతో పాకిస్తాన్‌లో క్రికెట్‌కు పూర్వవైభవం రావడం ఖాయమే అనుకుంటున్న దశలో... మరోసారి దీనికి బ్రేక్ పడేలా కనిపిస్తోంది. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి నేపథ్యంలో భారత సైన్యం... 'ఆపరేషన్ సిందూర్' పేరిట పాకిస్తాన్‌లోని పలు ఉగ్ర శిబిరాలను ధ్వంసం చేసింది. దీనికి బదులుగా పాకిస్తాన్ ప్రతిదాడులు ప్రారంభించగా... భారత సాయుధ బలగాలు వాటిని బలంగా తిప్పికొట్టాయి. ఈ నేపథ్యంలో అతిత్వరలో పాకిస్తాన్‌లో పర్యటించాల్సి ఉన్న బంగ్లాదేశ్ జట్టు... ఈ పర్యటనపై పునరాలోచనలో పడింది. ప్రస్తుత పరిస్థితులను నిశితంగా పరిశీలించడంతో పాటు పాకిస్తాన్ క్రికెట్ బోర్డుతో నిరంతరం చర్చిస్తోంది. షెడ్యూల్ ప్రకారం ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్న ఈ పర్యటనలో పాకిస్తాన్, బంగ్లాదేశ్ 5 మ్యాచ్‌ల టి20 సిరీస్ ఆడనున్నాయి. 'ఆటగాళ్ల భద్రతే అన్నిటికంటే ముఖ్యం. పాకిస్తాన్ బోర్డుతో చర్చిస్తున్నాం. ఏ నిర్ణయమైనా త్వరలోనే వెల్లడిస్తాం' అని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. అంతకుముందు బంగ్లాదేశ్ జట్టు ఈ నెల 17 నుంచి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)తో రెండు మ్యాచ్‌ల టి20 సిరీస్ ఆడనుంది. మరోవైపు పాకిస్తాన్‌లో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పాకిస్తాన్ సూపర్ లీగ్ నిలిచిపోగా... అందులో పాల్గొంటున్న రిషాద్ హుసేన్, నహీద్ రాణా ఇప్పటికే బంగ్లాదేశ్‌కు చేరుకున్నారు.

నీరజ్ చోప్రా సారథ్యంలో...

దోహా డైమండ్ లీగ్ బరిలో భారత్

దోహా: డైమండ్ లీగ్‌లో పాల్గొననున్న భారత అథ్లెట్ల బృందానికి స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా సారథ్యం వహించనున్నాడు. ఈ నెల 16న దోహాలో జరగనున్న ఈ ప్రతిష్టాత్మక లీగ్‌లో భారత్ నుంచి నలుగురు అథ్లెట్లు పాల్గొంటున్నారు. నీరజ్‌తో పాటు కిశోర్ జేనా జావెలిన్ త్రో పోటీల్లో పాల్గొంటుండగా... పురుషుల 5000 మీటర్ల పరుగులో గుల్వీర్ సింగ్, మహిళల 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌లో పారుల్ చౌధరీ దేశానికి ప్రాతినిధ్యం వహించనున్నారు. 2023 పోటీల్లో జావెలిన్‌ను 88.67 మీటర్ల దూరం విసిరి టైటిల్ నెగ్గిన నీరజ్ చోప్రా... గతేడాది 88.36 మీటర్లతో రెండో స్థానంలో నిలిచాడు. ఇక 2024 పోటీల్లో పాల్గొన్న కిశోర్ జేనా జావెలిన్‌ను 76.31 మీటర్ల దూరం విసిరి 9వ స్థానంతో సరిపెట్టుకున్నాడు. రెండుసార్లు ప్రపంచ చాంపియన్ అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా), జాకుబ్ వాడ్లేచ్ (చెక్ రిపబ్లిక్), జూలియన్ వెబర్, మ్యాక్స్ డేనింగ్



(జర్మనీ), జూలియస్ యెగో (కెన్యా), రోడ్రిక్ డీన్ (జపాన్) సహా పలువురు అంతర్జాతీయ స్టార్లు పాల్గొంటున్న ఈ పోటీలో నీరజ్‌కు గట్టి పోటీ ఎదురయ్యే అవకాశం ఉంది. గుల్వీర్, పారుల్ తమ తమ విభాగాల్లో జాతీయ రికార్డులు కలిగి ఉన్నారు.



సినెర్ శుభారంభం

రోమ్: పురుషుల టెన్నిస్ ప్రపంచ నంబర్‌వన్ యానిక్ సినెర్ విజయంతో పునరాగమనం చేశాడు. రోమ్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టోర్నీలో సినెర్ మూడో రౌండ్‌లోకి ప్రవేశించాడు. డోపింగ్‌లో విఫలమై మూడు నెలలు నిషేధానికి గురైన సినెర్ ఆ గడువు పూర్తి కావడంతో రోమ్ ఓపెన్‌లో బరిలోకి దిగాడు. టాప్ సీడ్ పొందిన సినెర్‌కు తొలి రౌండ్‌లో 'బై' లభించింది. నేరుగా రెండో రౌండ్ మ్యాచ్ ఆడిన సినెర్ 6-3, 6-4తో మరియానో నవోన్ (అర్జెంటీనా)పై విజయం సాధించాడు. 98 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సినెర్ ఒక ఏస్ సంధించి, ఒక డబుల్ ఫాల్ట్ చేశాడు. తన సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశాడు. నెట్ వద్దకు ఎనిమిదిసార్లు దూసుకొచ్చి ఆరుసార్లు పాయింట్లు సాధించాడు. ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో విజేతగా నిలిచిన సినెర్ ఆ తర్వాత మరే టోర్నీలోనూ ఆడలేదు. గత ఏడాది డోపింగ్‌లో పట్టుబడ్డ సినెర్ ప్రత్యేక పరిస్థితుల్లో ప్రపంచ డోపింగ్ నిరోధక సంస్థ (వాడా) నుంచి ఎలాంటి శిక్ష పడకుండా తప్పించుకున్నాడు. అయితే 'వాడా'పై, సినెర్‌పై విమర్శలు రావడంతో ఈ ఏడాది మూడు నెలలు నిషేధం ఎదుర్కొనేందుకు అంగీకరించాడు.



నెరవేరిన కేన్ కల

- కెరీర్‌లో తొలిసారి మేజర్ ట్రోఫీని సాధించిన ఇంగ్లండ్ స్టార్ ఫుట్‌బాలర్
- జర్మనీలోని ప్రతిష్టాత్మక బుండెస్‌లీగా టైటిల్‌ను సొంతం చేసుకున్న బాయెర్న్ మ్యూనిక్ జట్టు
- 25 గోల్స్‌తో బాయెర్న్ మ్యూనిక్ విజయంలో కీలకపాత్ర పోషించిన హ్యారీ కేన్

బెర్లిన్: ఒకటి కాదు.. రెండు కాదు.. మూడు కాదు... ఏకంగా ఆరుసార్లు కెరీర్‌లో మేజర్ ట్రోఫీలు సాధించే అవకాశాన్ని త్రుటిలో కోల్పోయిన ఇంగ్లండ్ ఫుట్‌బాల్ జట్టు కెప్టెన్ హ్యారీ కేన్ ఏడో ప్రయత్నంలో విజయవంతమయ్యాడు. ప్రతిష్టాత్మక జర్మనీ అంతర్జాతీయ ఫుట్‌బాల్ లీగ్ బుండెస్‌లీగాలో హ్యారీ కేన్ తన స్వప్నాన్ని సాకారం చేసుకున్నాడు. 2024-2025 బుండెస్‌లీగా సీజన్‌లో బాయెర్న్ మ్యూనిక్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టును విజేతగా నిలబెట్టాడు. ఈ క్రమంలో తన కెరీర్‌లో లోటుగా ఉన్న మేజర్ ట్రోఫీని అందుకున్నాడు. బొరుసియా మొంచెన్‌గ్లాడ్‌బాచ్ క్లబ్‌తో జరిగిన 33వ లీగ్ మ్యాచ్‌లో మాన్యుయెల్ నెయుర్ సారథ్యంలోని బాయెర్న్ మ్యూనిక్ జట్టు 2-0 గోల్స్ తేడాతో గెలిచింది. తద్వారా ఈ సీజన్‌లో మరో మ్యాచ్ మిగిలి ఉండగానే బాయెర్న్ మ్యూనిక్ జట్టు రికార్డుస్థాయిలో 33వసారి బుండెస్‌లీగా టైటిల్‌ను హస్తగతం చేసుకుంది. మ్యూనిక్ జట్టుకు హ్యారీ కేన్ (31వ నిమిషంలో), మైకేల్ ఒలిస్ (90వ నిమిషంలో) ఒక్కో గోల్ అందించారు. ఈ సీజన్‌లు 30 మ్యాచ్‌లు ఆడిన హ్యారీ కేన్ 25 గోల్స్‌తో టాప్ స్కోరర్‌గా ఉన్నాడు. సీజన్‌లోని చివరి మ్యాచ్ మే 17న హాఫెన్‌హీమ్ జట్టుతో బాయెర్న్ మ్యూనిక్ జట్టు ఆడుతుంది. మొత్తం 18 జట్లు ఇంటా, బయట పద్ధతిలో బుండెస్‌లీగాలో పోటీపడుతున్నాయి. ఒక్కో జట్టు 34 మ్యాచ్‌లు ఆడుతుంది. 33 మ్యాచ్‌లు పూర్తి చేసుకున్న బాయెర్న్ మ్యూనిక్ జట్టు 24 విజయాలు సాధించింది. 7 మ్యాచ్‌లను 'డ్రా' చేసుకొని, 2 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. 95 గోల్స్ సాధించి, 32 గోల్స్‌ను సమర్పించుకుంది. మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 79 పాయింట్లతో టాప్ ర్యాంక్‌ను ఖరారు చేసుకుంది. 68 పాయింట్లతో బాయెర్ 04 లెవెర్‌కుసెన్ జట్టు రన్నరప్ ట్రోఫీని ఖరారు చేసుకుంది. 31 హ్యారీ కేన్ సారథ్యంలో ఇంగ్లండ్ జట్టు 2021, 2024 'యూరో' టోర్నీలో రన్నరప్‌గా నిలిచింది. హ్యారీ కేన్ సభ్యుడిగా ఉన్న టోటెన్‌హామ్ హాట్‌స్పర్ క్లబ్ జట్టు 2015, 2019లలో ఇంగ్లిష్ ఫుట్‌బాల్ లీగ్ కప్‌లో రన్నరప్‌గా... 2019 చాంపియన్స్ లీగ్‌లో రన్నరప్‌గా నిలిచింది. 2023లో కేన్ సభ్యుడిగా ఉన్న బాయెర్న్ మ్యూనిక్ జట్టు జర్మన్ సూపర్ కప్‌లో రెండో స్థానాన్ని దక్కించుకుంది. దాంతో ఆరుసార్లు హ్యారీ కేన్‌కు టైటిల్ దక్కినట్లే దక్కి చేజారిపోయింది. అయితే ఏడో ప్రయత్నంలో హ్యారీ కేన్ ఖాతాలో బుండెస్‌లీగా రూపంలో మేజర్ టైటిల్ చేరింది.



బాబ్ కూపర్ కన్నుమూత



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా గడ్డపై తొలి ట్రిపుల్ సెంచరీ చేసిన టెస్టు క్రికెటర్ బాబ్ కూపర్ (84) మృతి చెందారు. అనారోగ్యంతో బాధపడుతున్న కూపర్ ఆదివారం కన్నుమూసినట్లు క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) వెల్లడించింది. ఆసీస్ క్రికెట్‌కు విశేష సేవలందించిన కూపర్ మృతికి సంతాపం వ్యక్తం చేసింది. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. 1964 నుంచి 1968 మధ్య ఆస్ట్రేలియా జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన కూపర్ 27 టెస్టులాడి 2,061 పరుగులు చేశారు. తన ఆఫ్‌స్పిన్‌తో 36 వికెట్లు సైతం పడగొట్టాడు. 1966లో మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టు మ్యాచ్‌లో కూపర్ 12 గంటల పాటు క్రీజులో నిలిచి 589 బంతుల్లో 307 పరుగులు చేశారు. 20వ శతాబ్దంలో ఆస్ట్రేలియాలో నమోదైన ఏకైక త్రిశతకం ఇదే. 28 ఏళ్లకే ఆటకు వీడ్కోలు పలికిన అనంతరం కూపర్ స్టాక్ బ్రోకర్‌గా మారడంతో పాటు ఐసీసీ మ్యాచ్ రిఫరీగానూ పనిచేశారు. ఆస్ట్రేలియా క్రికెట్‌కు చేసిన సేవలకు గానూ కూపర్‌కు 2023లో 'మెడల్ ఆఫ్ ద ఆర్డర్' అవార్డు దక్కింది.

నిరుపమాకు నాలుగో స్థానం

జియాంగ్‌షన్ (చైనా): భారత వెయిట్‌లిఫ్టర్ నిరుపమా దేవి ఆసియా చాంపియన్‌షిప్‌లో త్రుటిలో పతకం చేజార్చుకుంది. చైనా వేదికగా జరుగుతున్న ఈ టోర్నీ మహిళల 64 కేజీల విభాగంలో నిరుపమా దేవి నాలుగో స్థానంలో నిలిచింది. ఆదివారం జరిగిన ఈ పోటీల్లో స్నాచ్‌లో 91 కేజీల బరువెత్తిన భారత లిఫ్టర్... క్లీన్ అండ్ జెర్క్‌లో 115 కేజీల బరువెత్తింది. ఆ తర్వాత రెండు ప్రయత్నాల్లో 120 కేజీలు, 125 కేజీలు ఎత్తడంలో నిరుపమా విఫలమైంది. దీంతో ఓవరాల్‌గా 206 కేజీలతో నాలుగో స్థానానికి పరిమితమైంది. లి షువాంగ్ 239 కేజీల (105 కేజీలు+134 కేజీలు; చైనా) బరువెత్తి స్వర్ణం గెలుచుకోగా... ఎల్రీర్ ఆన్ 232 కేజీలు (102 కేజీలు+130 కేజీలు; ఫిలిప్పీన్స్), మున్ మిన్ హీ 214 కేజీలు (94 కేజీలు+120 కేజీలు; దక్షిణ కొరియా) వరసగా రజత, కాంస్యాలు దక్కించుకున్నారు. చివరి ప్రయత్నంలో 24 ఏళ్ల మణిపూర్ లిఫ్టర్ నిరుపమా 125 కేజీల బరువెత్తి ఉంటే...

అన్నివిధాలా పైచేయి

ఆపరేషన్ సిందూర్‌తో పాక్‌కు చావుదెబ్బ

- సైనికంగా, రాజకీయంగా, భావోద్వేగపరంగా విజయం
- మోదీ మాట నిలబెట్టుకున్నారు: ప్రభుత్వ వర్గాలు

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాకిస్తాన్‌తో నాలుగు రోజుల పాటు జరిగిన ఘర్షణలో సైనికంగా, రాజకీయంగా, మానసిక భావోద్వేగపరంగా భారత్ పూర్తిగా పైచేయి సాధించినట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు ఆదివారం అభిప్రాయపడ్డాయి. పాకిస్తాన్ గడ్డ పైనుంచి భారత్‌కు వ్యతిరేకంగా కుట్రలు సాగిస్తే శిక్ష తప్పదన్న స్పష్టమైన సంకేతాలను ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చారని తెలిపాయి. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా ఉగ్రవాద సంస్థల ప్రధాన కేంద్రాలు, కీలక స్థావరాలు, శిక్షణ కేంద్రాలు, మౌలిక సదుపాయాలను భారత సైన్యం ధ్వంసం చేయడం తెలిసిందే. లష్కరే తొయిబా, జైషే మొహమ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్‌కు చెందిన తొమ్మిది స్థావరాలు నామరూపాల్లేకుండా పోయాయి. ముష్కరులను మట్టిలో కలిపేస్తామన్న మాటను మోదీ నిలబెట్టుకున్నారని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. ఉగ్రవాదుల ఇళ్లల్లో దూరి మరీ బుద్ధి చెప్తామని హెచ్చరించినట్లుగానే పాక్‌తో పాటు పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో సైన్యం చేసిన దాడుల్లో 100 మందికిపైగా ఉగ్రవాదులు హతమయ్యారు. వారిలో అత్యంత కరడుగట్టిన ఉగ్రవాదులూ ఉన్నారు. ముష్కరులను వారి సొంత గడ్డపైనే దెబ్బకొట్టడంలో విజయం సాధించామయని ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి.

'సింధూ' ఒప్పందం నిలిపివేతపై పాక్ హాహాకారాలు

పాక్ ఉగ్రవాదులను వారి సొంత దేశంలోనే మట్టుబెట్టడగలమన్న సంగతి ఆపరేషన్ సిందూర్ ద్వారా తేలిపోయింది. ఇది భారతీయులకు భావోద్వేగభరిత విజయంగా పరిగణిస్తున్నారు. ఉగ్రవాదులు ఎక్కడ నక్కినా చావుదెబ్బ కొట్టగలమని సైన్యం నిరూపించింది. పహల్గాం దాడి తర్వాత సింధూ నది జలాల ఒప్పందాన్ని భారత ప్రభుత్వం నిలిపివేసింది. దానిపై పాక్ హాహాకారాలు చేసినా పట్టించుకోలేదు. 1960 నుంచి నిరాటంకంగా కొనసాగుతూ వచ్చిన ఒప్పందం ఒక్కసారిగా ఆగిపోవడం పాక్‌కు మింగుడుపడడం లేదు. ప్రపంచ దేశాలకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండాపోయింది. ఇది భారత్‌కు అతిపెద్ద రాజకీయ విజయమని నిపుణులు పేర్కొంటున్నారు. సీమాంతర ఉగ్రవాదాన్ని పూర్తిగా ఆపేదాకా ఈ ఒప్పందాన్ని నిలిపివేస్తామని పాకిస్తాన్‌కు భారత్ తేల్చిచెప్పింది.

వీరులారా వందనం

అమర జవాన్లకు అంతిమ వీడ్కోలు

- అధికార లాంఛనాలతో అంత్యక్రియలు
- గ్రామాల్లో ఉద్విగ్నభరిత వాతావరణం
- కన్నీటి నివాళులర్పించిన వేలాదిమంది


సునీల్

జమ్మూ/ముజఫర్‌నగర్: దేశంకోసం ప్రాణాలర్పించారన్న గర్వం ఓవైపు.. తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారన్న బాధ మరోవైపు.. సరిహద్దు వెంబడి పాక్ కాల్పుల్లో మృతి చెందిన సైనికుల అంత్యక్రియల సందర్భంగా స్వగ్రామాల్లో కనిపించిన ఉద్విగ్నభరిత దృశ్యమది. కట్టుకున్న భార్య, కడుపున పుట్టిన బిడ్డలు, కన్న తల్లిదండ్రులే కాదు.. గ్రామాలకు గ్రామాలు దుఃఖ నదులయ్యాయి. వేలాది మంది అమర జవాన్లకు కన్నీటి నివాళులర్పించారు. 'అమర్ రహే' అంటూ నినదించారు.

కాల్పుల్లో ఆర్నియా సెక్టార్‌లోని త్రివా గ్రామానికి చెందిన రైఫిల్‌మెన్ సునీల్ కుమార్‌కు కన్నీటి వీడ్కోలు పలికారు. 4జేకే లైట్ ఇన్‌ఫాంటరీ రెజిమెంట్‌లో సేవలందిస్తున్న సునీల్.. ఆర్‌ఎస్‌పుర సెక్టార్‌లో ఉండగా శనివారం కాల్పుల్లో తీవ్రంగా గాయపడ్డారు. పరిస్థితి విషమించి ప్రాణాలు కోల్పోయారు. 25 ఏళ్ల సునీల్ కుటుంబానిది మిలిటరీ నేపథ్యం. తండ్రి గతంలో పనిచేశారు. ప్రస్తుతం ఇద్దరన్నలు సాయుధ దళాల్లో పనిచేస్తున్నారు. వారి స్ఫూర్తితో దేశంకోసం ఆర్మీలో పనిచేయాలని చిన్నతనం నుంచే స్ఫూర్తిని పెంచుకున్న సునీల్.. దేశ సేవలోనే ప్రాణాలర్పించారు. హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రా జిల్లాకు చెందిన సుబేదార్ మేజర్ పవన్ కుమార్‌కు అతని స్వగ్రామంలో కన్నీటి వీడ్కోలు పలికారు. పవన్.. జమ్మూకశ్మీర్‌లోని పూంచ్‌లో షెల్లింగ్‌లో గాయపడి మృతి చెందారు. అతని కొడుకు చితికి నిప్పటించగా.. వేలాది మంది 'సుబేదార్ మేజర్ పవన్ కుమార్ అమర్ రహే', 'పాకిస్తాన్ ముర్దాబాద్' అని నినాదాలు చేశారు. కాల్పుల్లో ప్రాణాలు పోగొట్టుకున్న సర్జెంట్ సురేంద్రకు రాజస్థాన్‌లోని ఝున్‌ఝును జిల్లాలోని స్వగ్రామంలో, ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన ముడావత్ మురళీనాయక్‌కు అధికారిక లాంఛనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. ఆర్ఎస్ పురా సెక్టార్‌పై డ్రోన్ దాడిలో మరణించిన బీఎస్ఎఫ్ ఎస్ఐ మహమ్మద్ ఇంతియాజ్‌కు జమ్మూ కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, డిప్యూటీ సీఎం సురీందర్ చౌదరీ నివాళులర్పించారు. అనంతరం పార్థివ దేహాన్ని స్వస్థలం బీహార్‌కు తరలించారు.


జమ్మూలో ఆదివారం బీఎస్ఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఇంతియాజ్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

అధికారులు, సామాన్యులు సైతం..

పాక్ శనివారం జరిపిన షెల్లింగ్‌లో సామాన్య పౌరులు సైతం ప్రాణాలు కోల్పోయారు. తన ఇంట్లో షెల్ పడటంతో రాజౌరీ జిల్లా అడిషనల్ డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ కమిషనర్ రాజ్‌కుమార్ థప మృతి చెందారు. జమ్మూ శివార్లలోని రూప్‌నగర్‌లో ఉన్న అతని నివాసానికి పార్థివ దేహాన్ని తరలించి, అంత్యక్రియలు నిర్వహించారు. రాజ్‌కుమార్‌కు లెఫ్టినెంట్ గవర్నర్ సిన్హా నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాజౌరీ జిల్లాలో జరిగిన షెల్లింగ్‌లో 35 ఏళ్ల మహమ్మద్ సాహిబ్, అతని మేనకోడలు రెండేళ్ల అయేషా మరణించారు. ఉత్తర ప్రదేశ్‌లోని వారి స్వగ్రామం ఖాయ్‌ఖేడిలో వందలాది మంది కన్నీటివీడ్కోలు మధ్య అంత్యక్రియలు నిర్వహించారు.

నేనూ సైన్యంలో చేరతా

పాక్‌పై ప్రతీకారం తీర్చుకుంటా • అమర జవాను కూతురు ప్రతిన


వర్తిక

ఝున్‌ఝును: పెద్దయిన తరువాత తానూ సైన్యంలో చేరతానని, తన తండ్రి ప్రాణాలు తీసిన పాకిస్తాన్‌పై ప్రతీకారం తీర్చుకుంటానని పాక్ వైమానిక దాడిలో ప్రాణాలు కోల్పోయిన సైనికుడు సురేంద్ర సింగ్ మోగా కూతురు వర్తిక ప్రతిజ్ఞ చేసింది. కాల్పుల విరమణను ఉల్లంఘిస్తూ శనివారం జరిపిన డ్రోన్ దాడుల్లో జమ్మూ కశ్మీర్‌లోని ఉద్ధంపూర్ వైమానిక స్థావరంలో విధులు నిర్వహిస్తున్న రాజస్థాన్‌కు చెందిన జవాను సురేంద్ర సింగ్ మోగాతోపాటు బీఎస్ఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్ కూడా ప్రాణాలు కోల్పోయారు. పాక్ డ్రోన్ శకలం ఢీకొని సురేంద్ర మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. ''శనివారం రాత్రి 9 గంటలకు కూడా నాన్నతో మాట్లాడా. ఆకాశంలో పాక్ డ్రోన్లు తిరుగుతున్నాయని, తాము బాగానే ఉన్నామని నాతో చెప్పాడు. అంతలోనే ఇలా జరిగింది'' అంటూ 11 ఏళ్ల వర్తిక విలపించింది. తన తండ్రి దేశాన్ని కాపాడుతూ అమరుడైనందుకు గర్వంగా ఉందని చెప్పింది. పాక్ పేరు కూడా వినపడని రీతిలో అంతం కావాలని ఆకాంక్షించింది. ''నా తండ్రి ప్రాణా లు తీసిన పాక్‌ను వదలను. సైన్యంలో చేరి వాళ్లను ఒకరి తర్వాత ఒకరిగా ఖతం చేస్తా'' అని చెప్పింది.

అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు

బెంగళూరు కేంద్రంగా విధులు నిర్వహిస్తున్న సురేంద్రకు నాలుగు రోజుల కిందట సరిహద్దుకు రావాలని పిలుపు వచ్చింది. దీంతో తన భార్య, 11 ఏళ్ల వర్తిక, 7 ఏళ్ల కొడుకు దక్ష్‌ను స్వస్థలమైన రాజస్థాన్‌లోని ఝున్‌ఝును జిల్లా మెహ్రాదాసికి పంపించాడు. అంనతరం తాను ఉద్ధంపూర్‌కు బయల్దేరి వెళ్లాడు. అయితే ఊర్లోని కొత్త ఇల్లు గృహప్రవేశానికి వస్తాడనుకున్న కొడుకు.. త్రివర్ణ పతకాన్ని కప్పుకొని నిర్జీవంగా రావడంతో సురేంద్ర తల్లి కుప్పకూలిపోయింది. ధైర్యవంతుడైన సురేంద్రకు వీడ్కోలు పలికేందుకు వేలాది మంది ప్రజలు తరలివచ్చారు. గ్రామంలో నెలకొన్న ఉద్విగ్నభరిత వాతావరణంలో, ఆదివారం అధికారిక లాంఛనాలతో సురేంద్ర అంత్యక్రియలు పూర్తయ్యాయి.

ఆపరేషన్ సిందూర్‌పై అలహాబాదియా వివాదాస్పద పోస్ట్

విమర్శలతో తొలగించిన యూట్యూబర్



న్యూఢిల్లీ: పాడ్‌కాస్టర్ రణ్‌వీర్ అలహాబాదియా మరో వివాదంలో చిక్కుకున్నాడు. 'పాకిస్తానీ అన్నదమ్ములారా, అక్కచెల్లెలారా' అంటూ ఇన్‌స్టాలో పోస్ట్ చేసిన రణ్‌వీర్.. వ్యతిరేకంగా విమర్శలు వెల్లువెత్తడంతో పోస్ట్‌ను తొలగించాడు. పహల్గాం ఉగ్రవాదాడి అనంతరం.. పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలు లక్ష్యంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. దీనిపై యూట్యూబర్ రణ్‌వీర్ అలహాబాదియా ఇన్‌స్టాగామ్‌లో పోస్ట్ చేశాడు.

''ప్రియమైన పాకిస్తానీ సోదర సోదరీమణులారా.. ఇది రాయడం వల్ల మరో వివాదానికి ఆహ్వానం పలుకుతానని నాకు తెలుసు. చాలా మంది భారతీయులు నాపై ద్వేషం చిందిస్తారు. అయితే.. చాలా మంది భారతీయుల్లా నా హృదయంలో మీ మీద ద్వేషం లేదు. ఎందుకంటే మీలో చాలా మంది మాలాగే శాంతిని కోరుకుంటున్నారు. తరువాత ఎప్పుడైనా మేము మిమ్మల్ని కలిసినప్పుడు మమ్మల్ని ప్రేమతో స్వాగతిస్తారు. మేం ద్వేషాన్ని వ్యాప్తి చేస్తున్నాం అనిపిస్తే క్షమించేయండి. మిమ్మల్ని కలిసినప్పుడు భారతీయులు కచ్చితంగా మిమ్మల్ని అర్థం చేసుకుంటారు. కానీ, ఇప్పుడు రెండు దేశాల్లో మీడియా చానళ్లు అబద్ధాలను ప్రచారం చేస్తున్నాయి. ఇరుదేశాల్లోని ప్రజలు శాంతిని కోరుకుంటున్నారు. సరిహద్దుల్లో ఉండే ప్రజలు క్షేమంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నారు. కానీ.. పాకిస్తాన్ ఆర్మీ, ఐఎస్ఐ కలిసి పెంచి పోషిస్తున్న ఉగ్రవాదాన్ని అంతం చేయాలని భారత్ కోరుకుంటోంది. ఉగ్రవాదాన్ని ఆర్మీ పెంచి పోషిస్తుందనడానికి మూడు ఉదాహరణలున్నాయి. ఒకటి.. ఇన్నేళ్లలో పట్టుబడిన ఉగ్రవాదులంతా పాకిస్తాన్‌వారే. రెండోది.. జైషే మహ్మద్ చీఫ్ సోదరుడు హాఫీజ్ అబ్దుర్ రవూఫ్ అంత్యక్రియలను అధికారికంగా నిర్వహించారు. దానికి పాక్ మిలిటరీ అధికారులు కూడా హాజరయ్యారు. మూడోది.. పాక్ రక్షణ శాఖా మంత్రి ఖవాజా ఆసిఫ్ స్కై న్యూస్‌తో మాట్లాడుతూ టెర్రరిజాన్ని పాక్ ప్రభుత్వమే పెంచి పోషిస్తోందని అంగీకరించాడు. అయినా.. పాకిస్తాన్ ప్రజల పట్ల మాకు సానుభూతి ఉంది. ఈ ఆపరేషన్ భారతీయులు, పాకిస్తానీయుల మధ్య యుద్ధం కాదు. భారత్.. పాకిస్తాన్ మిలిటరీ, ఐఎస్ఐపై చేస్తున్నది. శాంతి కొనసాగుతుందని ఆశిస్తున్నా'' అని పోస్టులో పేర్కొన్నాడు. రణ్‌వీర్ పోస్టుపై విమర్శలు వెల్లువెత్తాయి. ఆయన భారత ప్రజల మనోభావాలను దెబ్బతీయడమే కాదు, భారత ఆర్మీని కూడా అవమానించాడని నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాకిస్తాన్‌కు బహిరంగంగా మద్దతిస్తున్నాడని మండిపడ్డారు. దీంతో.. ఆయన పోస్టును డెలిట్ చేశారు. రణ్‌వీర్ అల్లహాబాదియా ఇలా వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం మొదటిసారి కాదు. తల్లిదండ్రుల గురించి అనుచిత జోకులు వేసినందుకు ఈ ఏడాది ప్రారంభంలో అన్ని వైపుల నుంచి విమర్శలు ఎదుర్కొన్నారు.

మోదీ వల్లే పాక్‌పై విజయం: బీజేపీ

న్యూఢిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిర్ణయాత్మక సారథ్యంలో మన దేశం పాకిస్తాన్‌ను దౌత్యపరంగా ఏకాకిగా మార్చిందని బీజేపీ పేర్కొంది. పాకిస్తాన్‌తో వ్యవహరించే విషయంలో నూతన అధ్యాయానికి నాంది పలికిందని తెలిపింది. 1971 యుద్ధంలో పట్టుబడిన 90 వేలకు మందికి పైగా పాక్ ఖైదీలను ఎలాంటి వ్యూహాత్మక ప్రయోజనాలు పొందకుండానే అప్పటి ఇందిర ప్రభుత్వం విడిచిపెట్టిందని విమర్శించింది. కశ్మీర్‌పై మూడో దేశం మధ్యవర్తిత్వాన్ని అంగీకరిస్తున్నారా లేదా అని మోదీ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రశ్నించడంపై బీజేపీ నిప్పులు చెరిగింది. ఆపరేషన్ సిందూర్‌తో తీవ్రంగా నష్టపోయిన పాకిస్తాన్ 'మోదీ చాణక్య నీతి'కి లొంగిపోయిందని తెలిపింది. కేవలం 72 గంటల్లోనే ప్రధాని మోదీ నాయకత్వ పటిమను పాకిస్తాన్ చవిచూసిందని తెలిపింది. అణ్వాస్త్రాలను ప్రయోగిస్తామన్న పాక్ బెదిరింపులకు లొంగిపోకుండా లాహోర్ నుంచి రావల్పిండి వరకు ఉగ్ర శిబిరాలను నేలమట్టం చేసిందని పేర్కొంది.

కశ్మీర్‌పై మధ్యవర్తిత్వాన్ని అంగీకరిస్తున్నారా?

కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కాంగ్రెస్

న్యూఢిల్లీ: కశ్మీర్ విషయంలో మూడో దేశం మధ్యవర్తిత్వాన్ని అంగీకరిస్తున్నారా అంటూ కాంగ్రెస్ పార్టీ ఆదివారం కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. కాల్పుల విరమణ అంటూ భారత్, పాకిస్తాన్‌ల తరఫున అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడం, ఈ అంశాన్ని అంతర్జాతీయం చేసి, రెండు దేశాలను ఇరుకుపెట్టడమేనని పేర్కొంది. కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలట్ మీడియాతో మాట్లాడారు. భారత్, పాక్‌లు కాల్పుల విరమణకు అంగీకరించాయంటూ అమెరికా ప్రకటించడం అసాధారణమైన విషయమని, దీనిపై ఎన్నో సందేహాలు కలుగుతున్నాయని పైలట్ అన్నారు. ఈ అంశాలతోపాటు, ప్రస్తుత పరిస్థితులపై చర్చించేందుకు ప్రధాని మోదీ అధ్యక్షతన అఖిల పక్ష సమావేశాన్ని, పార్లమెంట్ ప్రత్యేక భేటీని ఏర్పాటు చేయాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌కు ప్రభుత్వం తప్పక అంగీకరించాలని వ్యాఖ్యానించారు. 'అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సామాజిక వేదిక ద్వారా కాల్పుల విరమణ అంటూ ప్రకటించడంతో మేమంతా ఆశ్చర్యపోయాం. భారత్, పాక్‌ల మధ్య ద్వైపాక్షిక అంశాన్ని అంతర్జాతీయం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇది సరికాదు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం అన్ని పార్టీలకు, జాతికి స్పష్టత ఇవ్వాలి'అని పైలట్ డిమాండ్ చేశారు.

11 మంది పాలస్తీనియన్లు మృత్యువాత

గాజా: ఇజ్రాయెల్ ఆర్మీ గాజాపై శనివారం అర్ధరాత్రి చేపట్టిన దాడుల్లో 11 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. దక్షిణ ప్రాంత ఖాన్‌యూనిస్ నగరంలోని శరణార్థులుండే టెంట్లపై జరిగిన దాడుల్లో దంపతులు వారి ఇద్దరు పిల్లలు చనిపోయారు. మరో చోట జరిగిన దాడిలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి, అతడి కుమారుడు చనిపోయారు. గాజా నగరంపై జరిగిన మరో దాడిలో 16 ఏళ్ల బాలుడు మృత్యువాతపడ్డాడు. ఇలా ఉండగా, ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సౌదీ అరేబియా, ఖతార్, యూఏఈల్లో పర్యటించనున్నారు. గాజాలోని హమాస్ శ్రేణులపై సైనిక చర్య విషయంలో నెతన్యాహూకు పూర్తి మద్దతు పలుకుతున్న ట్రంప్ పర్యటన జాబితాలో ఇజ్రాయెల్ మాత్రం లేకపోవడం విశేషం.

శ్రీలంకలో బస్సు ప్రమాదం.. 21 మంది దుర్మరణం

కొలంబో: శ్రీలంకలో ఆదివారం చోటుచేసుకున్న ఘోర బస్సు ప్రమాదంలో 21 మంది మృత్యువాతపడ్డారు. మరో 30 మందికి పైగా గాయాలపాలయ్యారు. కొండప్రాంతంలో వెళ్తుండగా బస్సుపై డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో 100 మీటర్ల ఎత్తు నుంచి పడిపోయిందని అధికారులు తెలిపారు. ప్రభుత్వ రవాణా సంస్థకు చెందిన ఈ బస్సులో ప్రమాద సమయంలో 75 మంది ప్రయాణికులున్నారు.

ఎన్ఈపీ అమలుపై రాష్ట్రాలను ఆదేశించలేం: సుప్రీం

న్యూఢిల్లీ: తమిళనాడు, కేరళ, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలు నూతన విద్యా విధానం (ఎన్ఈపీ)ని అమలు చేసేలా ఆదేశాలివ్వాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసింది. ఇలాంటి చట్టాల విషయంలో జోక్యం చేసుకుని రాష్ట్రాలను నేరుగా ఆదేశించలేమని జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌ల ధర్మాసనం స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 ప్రకారం..పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లినప్పుడు మాత్రమే ఇలాంటి ఆదేశాలను జారీ చేయగలమని వివరించింది. నూతన విద్యా విధానాన్ని ఉల్లంఘిస్తూ ప్రాథమిక హక్కులు లేదా ఇతర చట్టపరమైన హక్కులకు భంగం కలిగేలా రాష్ట్రాలు వ్యవహరించినప్పుడు కూడా జోక్యం చేసుకోగలమని పేర్కొంది.

ఎయిర్ ఫోర్స్ ఒన్‌గా ఖతార్ జెట్

వాషింగ్టన్: గల్ఫ్ దేశం ఖతార్‌లోని అధికార కుటుంబం నుంచి విలాసవంతమైన బోయింగ్ 747–8 జంబో విమానాన్ని కానుకగా అందుకోనున్నారు. దీనికే అవసరమైన మార్పులు, చేర్పులు చేయించి ఎయిర్ ఫోర్స్ వన్‌గా వాడుకునే అవకాశాలున్నాయి. అయితే, ఈ బోయింగ్‌కు ఎన్ని హంగులు కల్పించినా ప్రస్తుతమున్న ఎయిర్ ఫోర్స్ వన్ ముందు దిగదుడుపేనన్నది అధికారుల మాట. ఈ వారంలోనే ఖతార్ పర్యటన సమయంలో ట్రంప్ ఈ బోయింగ్‌ను కానుకగా స్వీకరిస్తూ ప్రకటన చేయనున్నారని చెబుతున్నారు.

ఇరాన్ అణు కార్యక్రమంపై ముగిసిన 4వ విడత చర్చలు

దుబాయ్: ఇరాన్ అణు కార్యక్రమంపై ఇరాన్, అమెరికా మధ్య నాలుగో విడత చర్చలు ఆదివారం ఒమన్ రాజధాని మస్కట్‌లో ముగిశాయి. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి, అమెరికా పశ్చిమాసియా దూత స్టీవ్ విట్కాఫ్ సారథ్యంలో ఈ చర్చలు దాదాపు మూడు గంటలపాటు కొనసాగాయి. వీరిద్దరు ముఖాముఖి చర్చలు జరిపినప్పటికీ ఎక్కువ భాగం ఒమన్ విదేశాంగ మంత్రి బద్ర్ అల్ బుసైదీ జోక్యంతోనే నడిచింది. కాగా, తదుపరి చర్చల విషయంలో సంప్రదింపులు జరుగుతున్నాయని ఇరాన్ తెలిపింది.

ముందు కాల్పుల విరమణ ఆ తర్వాతే శాంతి చర్చలు

పుతిన్ ప్రతిపాదనపై జెలెన్‌స్కీ

మాస్కో/కీవ్: ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధంలో 30 రోజులపాటు సంపూర్ణ, బేషరతు కాల్పుల విరమణ పాటించాలని యూరప్ ప్రధాన దేశాల నేతలు ఇచ్చిన పిలుపుపై రష్యా అధ్యక్షుడు పుతిన్ శనివారం రాత్రి స్పందించారు. ఎలాంటి షరతులు లేకుండా తుర్కియేలోని ఇస్తాంబుల్ వేదికగా ఉక్రెయిన్‌తో తక్షణమే ముఖాముఖి చర్చలకు తాము సిద్ధమని ప్రకటించారు. చర్చల సమయంలో కాల్పుల విరమణకు అంగీకరించే అవకాశముంటుందని పుతిన్ పేర్కొన్నారు. అయితే, కాల్పుల విరమణను ముందుగా అమల్లోకి వచ్చాకే చర్చలకు కూర్చుందామని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆదివారం స్పష్టం చేశారు. కాల్పుల విరమణ చర్చలకు సానుకూల సంకేతమని తెలిపారు. దీని కోసమే యావత్ ప్రపంచం ఎప్పటి నుంచో ఎదురు చూస్తోందని 'ఎక్స్'లో పేర్కొన్నారు. కాగా, పుతిన్ ప్రతిపాదనపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హర్షం ప్రకటించారు. 'ఈ ప్రతిపాదన రెండు దేశాలకూ మంచిదే. చర్చలకు అవకాశం కల్పించేందుకు రెండు దేశాలతోనూ కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నా'అని పేర్కొన్నారు.

నక్షత్రాన్నే నమిలేస్తూ.. మింగేస్తూ

అదృశ్యం చేస్తున్న మహా కృష్ణబిలం

- గెలాక్సీ కేంద్రస్థానంలో కాకుండా దూరంగా ఉన్న సంచార బ్లాక్‌హోల్
- అంతరిక్ష వింత గుట్టు విప్పిన హబుల్ టెలిస్కోప్



నక్షత్రం అంటేనే అంతులేని ఉష్ణంతో, దేదీప్యమానంగా వెలిగిపోతూ వందల కోట్ల కిలోమీటర్ల దాకా కాంతిని వెదజల్లే శక్తియంత్రం. అలాంటి నక్షత్రాన్ని అరటిపండులా అమాంతం మింగేస్తున్న రాకాసి కృష్ణబిలం జాడను అత్యంత అధునాతన హబుల్ టెలిస్కోప్ కనిపెట్టింది. నక్షత్రం మొత్తాన్ని తనలో కలిపేసుకుంటున్న ఈ బ్లాక్‌హోల్ మిగతా కృష్ణబిలాల్లా నక్షత్రమండలం(గెలాక్సీ) కేంద్రస్థానంలో కాకుండా కోట్ల కోట్ల కిలోమీటర్ల దూరంగా ఉండటం మరో విశేషం. గెలాక్సీ మధ్యలో కాకుండా చాలా దూరంగా సైతం భారీ కృష్ణబిలాలు మన గల్గుతాయని, వాటి అపారమైన గురుత్వాకర్షణ బలాలు సమీప స్టార్‌లనూ సమాధి చేస్తాయని తొలిసారిగా వెల్లడైంది. సాధారణంగా నక్షత్రాలను కృష్ణబిలం తనలో కలిపేసుకునే (టైడల్ డిస్రప్షన్ ఈవెంట్–టీడీఈ) దృగ్విషయం గెలాక్సీ మధ్యలో చోటుచేసుకుంటుంది. కానీ ఇలా టీడీఈ అనేది గెలాక్సీ మధ్యలో కాకుండా వేరే చోట సంభవించడాన్ని తొలిసారిగా గుర్తించినట్లు శాస్త్రవేత్తలు వెల్లడించారు. దీనికి 'ఏటీ2024టీవీడీ'అని పేరు పెట్టారు. మింగేస్తున్న ఈ కృష్ణబిలం ద్రవ్యరాశి ఆ అంతర్ధానమవుతోన్న నక్షత్రం ద్రవ్యరాశికంటే ఏకంగా 10 కోట్ల రెట్లు ఎక్కువగా ఉండటం విశేషం. నక్షత్రమండలం కేంద్రస్థానం చుట్టూ తిరిగే ఏదైనా నక్షత్రం అనుకోకుండా కృష్ణబిలం చెంతకు వచ్చినప్పుడు మాత్రమే అక్కడ బ్లాక్‌హోల్ ఉందనే విషయం తెలుస్తుంది. బ్లాక్ తాను మింగేసే ఖగోళ వస్తువును ఉన్నది ఉన్నట్లుగాకాకుండా ఆకారాన్ని నూడుల్స్‌లాగా సాగదీసి సాగదీసి లోపలికి లాగేసుకుంటుంది. ఈ ప్రక్రియనే స్పాగెటిఫికేషన్ అంటారు. తాజాగా నక్షత్రాన్ని మింగేస్తున్న క్రమంలోనే ఈ కృష్ణబిలం ఉనికి వెలుగులోకి వచ్చింది. అమెరికా శాండిగోలోని పాలోమార్ అబ్జర్వేటరీలోని ఆప్టికల్ కెమెరా తొలిసారిగా దీనిని గుర్తించింది. ఈ బ్లాక్‌హోల్ మన భూమికి ఏకంగా 60 కోట్ల కాంతి సంవత్సరాల దూరంలో ఉంది. హబుల్ టెలిస్కోప్ దీనిపై మరింత పరిశోధన చేసింది. సాధారణంగా కృష్ణబిలంలోకి నక్షత్రం లాగబడే క్రమంలో ఆ నక్షత్రం ఊహించనంత స్థాయిలో అతినీలలోహిత కాంతిని బయటకు వెదజల్లుతుంది. తర్వాత బ్లాక్‌హోల్ లోపలికి వెళ్లిపోయి ఆ స్టార్ అంతర్థానమవుతుంది.

కేంద్రం నుంచి ఎంతో దూరంలో బ్లాక్‌హోల్

ఈ బ్లాక్‌హోల్ తనకు ఆశ్రయం ఇచ్చిన నక్షత్రమండలానికి సంబంధించిన కేంద్రస్థానంలో ఉండకుండా ఏకంగా 2,600 కాంతి సంవత్సరాల దూరంలో ఉంది. దీంతో కేంద్రస్థానంలోని బ్లాక్‌హోల్స్ కంటే ఇది భిన్నంగా ప్రవర్తిస్తుందేమో అని తెల్సుకునేందుకు అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా రంగంలోకి దిగింది. ఈ కృష్ణబిలంపై ఓ కన్నేశామని చంద్ర ఎక్స్‌–రే అబ్జర్వేటరీ, నేషనల్ రేడియో ఆస్ట్రోనమీ అబ్జర్వేటరీలోని వెరీ లార్జ్ అరే రేడియో టెలిస్కోప్ పరిశోధకుల బృందాలు తెలిపాయి. రెండు గెలాక్సీల విలీనం తర్వాత ఇలాంటి కృష్ణబిలాలు ఇలా సుదూరంగా మిగిలిపోయి ఉంటాయని భావిస్తున్నారు. లేదంటే రెండు అయస్కాంతాల తరహాలో రెండు కృష్ణబిలాల వ్యతిరేక బలాల వల్ల ఇది సుదూరంగా నెట్టివేయబడి ఉండొచ్చని ఇంకొందరు అధ్యయనకారులు అంచనా వేస్తున్నారు. ''కేంద్రస్థానంలో స్థిరంగా ఉండిపోకుండా ఇలా సంచార జీవిలా ఎక్కడో మౌనంగా ఉన్న ఇలాంటి కృష్ణబిలాలు కొత్త తరహా పరిశోధనలకు సాయపడతాయి''అని బెర్క్లీలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియాలో సంబంధిత పరిశోధనలో ప్రధాన రచయిత, ఖగోళశాస్త్రంలో పోస్ట్ డాక్టోరల్ యుహాన్ యాఓ చెప్పారు. త్వరలో అందుబాటులోకి రానున్న వెరీ సి.రూబిన్ అబ్జర్వేటరీ సాయంతో ఇలాంటి ఖగోళ వింతలను మరింత పరిశోధన జరగనుంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

అండమాన్ సమీపంలో కూలిన 'కాస్మోస్'

ఎవరికీ ఎటువంటి అపాయం వాటిల్లలేదన్న రాస్‌కాస్మోస్



న్యూఢిల్లీ: సోవియట్ యూనియన్ హయాంలో 53 ఏళ్ల క్రితం ప్రయోగించిన అంతరిక్ష నౌక తన ప్రస్థానాన్ని ముగించుకుంది. విఫలమైన 'కాస్మోస్ 482'శనివారం ఉదయం భూ వాతావరణంలోకి ప్రవేశించింది. అండమాన్ దీవికి పశ్చిమాన 560 కిలోమీటర్ల దూరంలో హిందూ మహా సముద్రంలో పడిపోయింది. కాస్మోస్ కారణంగా ఎవరికీ ఎటువంటి అపాయం కలగలేదని రష్యా అంతరిక్ష సంస్థ రాస్‌కాస్మోస్ ప్రకటించింది. దీని గమనాన్ని యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ, ఈయూ స్పేస్ సర్వైలెన్స్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సహా పలు అంతరిక్ష సంస్థలు దగ్గర్నుంచి పరిశీలిస్తూ వస్తున్నాయి. ఇటీవల ఇది భూవాతావరణంలో ప్రవేశించినట్లు జర్మన్ రాడార్ స్టేషన్ గుర్తించిన విషయాన్ని యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ తెలిపింది. అత్యంత వేడి వాతావరణంతో ఉండే శుక్రగ్రహం లక్ష్యంగా ప్రయోగించిన గోళాకార 500 కిలోల 'కాస్మోస్'కు టైటానియంతో కూడిన రక్షణ కవచం ఉంది. అందుకే ఇది భూవాతావరణంలో ప్రవేశించాక మండిపోకుండా యథాతథంగా పడిపోయింది. అంతర్జాతీయ అంతరిక్ష నిబంధనల ప్రకారం.. కాస్మోస్ శకలాలు రష్యాకే చెందుతాయి. ఒక వేళ భూమిపై పడినా దీనితో ప్రమాదం కలిగే అవకాశాలు చాలా తక్కువని నిపుణులు తెలిపారు. కాస్మోస్‌తో భూమ్మీదున్న ప్రతి 10 లక్షల మందిలో ఒక్కరికి మాత్రమే ప్రమాదం సంభవిస్తుందని ఏరోస్పేస్ కార్పొరేషన్ అంచనా వేసింది.

రాజ్యాంగమే అత్యున్నతం

సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్



న్యూఢిల్లీ: దేశంలో అన్నింటి కంటే అత్యున్నతం పార్లమెంట్ లేదా న్యాయ వ్యవస్థ కాదని.. రాజ్యాంగమే అత్యున్నతమని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ తేల్చిచెప్పారు. పదవీ విరమణ పొందిన తర్వాత ఇతర పదవులు చేపట్టాలన్న ఉద్దేశం తనకు లేదని అన్నారు. జస్టిస్ గవాయ్ ఈ నెల 14న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)గా బాధ్యతలు చేపట్టబోతున్నారు. తొలి బౌద్ధ మతస్తుడైన సీజేఐగా ఆయన రికార్డుకెక్కబోతున్నారు. ఈ నేపథ్యంలో జస్టిస్ గవాయ్ ఆదివారం తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. పహల్గాం ఉగ్రవాద దాడి గురించి తెలిసి తాము దిగ్భ్రాంతికి గురయ్యారని చెప్పారు. ఈ దాడిలో మృతిచెందిన వారికి సుప్రీంకోర్టు తరఫున నివాళులర్పించామని, ముష్కరుల దుశ్చర్యను ఖండించామని అన్నారు. దేశం మొత్తం ఆందోళన, సంక్షోభంలో ఉన్న సమయంలో తాము మౌనంగా ఉండలేమని పేర్కొన్నారు. దేశంలో తాము కూడా భాగమేనని వ్యాఖ్యానించారు. ఎవరు అత్యున్నతం అనేదానిపై రాజకీయ నేతలు లేవనెత్తుతున్న ప్రశ్నలపై జస్టిస్ గవాయ్ స్పందించారు. రాజ్యాంగమే అత్యున్నతం అని కేశవానంద భారతి కేసులో 13 మంది సభ్యుల సుప్రీంకోర్టు ధర్మాసనం తేల్చిచెప్పిందని గుర్తుచేశారు. తనకు ఎలాంటి రాజకీయ ఆకాంక్షలు లేవని, రిటైర్‌మెంట్ తర్వాత గవర్నర్ వంటి పదవులు తీసుకోనని స్పష్టంచేశారు. న్యాయమూర్తులు రాజకీయ నాయకులను, ఇతర రంగాల ప్రముఖులను కలిసి మాట్లాడడంలో తప్పేమీ లేదని అభిప్రాయపడ్డారు. ఇతరులను కలవకపోతే ప్రజల సమస్యలు, కొత్త విషయాలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. భారత్–పాకిస్తాన్ మధ్య దాడులు ఆగిపోవడం మంచి పరిణామం అని చెప్పారు. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం వల్ల ఆ రెండు దేశాలకు నష్టమే తప్ప ప్రయోజనం చేకూరలేదని అభిప్రాయపడ్డారు. సుప్రీంకోర్టులో 33 మంది న్యాయమూర్తులు ఉండగా, వీరిలో ఇప్పటిదాకా 21 మంది తమ ఆస్తుల వివరాలు ప్రకటించారని జస్టిస్ గవాయ్ తెలిపారు. మిగిలినవారు కూడా త్వరలో ఆస్తుల వివరాలు వెల్లడిస్తారని స్పష్టం చేశారు. ఆస్తుల సమాచారం బహిర్గతం చేసే సంప్రదాయాన్ని హైకోర్టు న్యాయమూర్తులు కూడా పాటిస్తే బాగుంటుందని సూచించారు. సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో న్యాయమూర్తులను నియమించే విషయంలో కొలీజియం చేసిన కొన్ని సిఫార్సులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలకపోవడంపై మాట్లాడేందుకు జస్టిస్ గవాయ్ నిరాకరించారు. న్యాయ వ్యవస్థలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల ప్రాతినిధ్యం తగినంతగా ఎందుకు లేదని ప్రశ్నించగా... రాజ్యాంగబద్ధమైన పదవుల్లో నియామకాలకు రిజర్వేషన్లు లేవని బదులిచ్చారు.

వర్తకం కోసం వచ్చి పెత్తనం సాగించిన వలసవాదులు

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ హిస్టరీ

ఆధునిక భారతదేశ చరిత్ర

వాస్కోడిగామా చూపిన మార్గంలో అనేక మంది పోర్చుగీసు వర్తకులు భారతదేశానికి వచ్చారు. 1503లో ఫ్రాన్సిస్-డి-అల్మీడా భారతదేశంలోని పోర్చుగీస్ స్థావరాలకు మొదటి గవర్నర్‌గా నియామకమయ్యాడు. ఇతడు నీలి నీటి విధానం (Blue Water Policy)ను విస్తరింపజేశాడు. ఆల్ఫెన్సో-డి-ఆల్బుకర్క్ 1509 నుంచి 1515 వరకు భారత్‌లో రెండో పోర్చుగీసు గవర్నర్‌గా పని చేశాడు. ఇతడు పోర్చుగీస్ సామ్రాజ్యానికి పునాదులు వేశాడు. గోవాను, పర్షియా సింధుశాఖలోని హార్మోజ్‌ను 1510లో ఆక్రమించాడు.

ఆంగ్లేయుల రాక..

భారతదేశంలో మొదటిసారి అడుగుపెట్టిన ఆంగ్లేయుడు ఫాదర్ థామస్ స్టీవెన్స్. ఇతడు 1579లో గోవా చేరాడు. 1600లో ఎలిజబెత్ రాణి (లండన్) అనుమతితో భారతదేశంలో వాణిజ్యం చేయడానికి 'ఈస్టిండియా కంపెనీ'ని స్థాపించాడు. 1611లో కెప్టెన్ జేమ్స్ హాకిన్స్ భారతదేశం వచ్చి మొదటి జేమ్స్ ఉత్తరంతో మొగలు పాదుషా జహంగీర్‌ను కలుసుకున్నాడు. జహంగీర్ అనుమతితో



ఇతడు 1612లో సూరత్‌లో మొదటి కర్మాగారం స్థాపించాడు. తర్వాత అహ్మదాబాద్, ఆగ్రా, హుబ్లీ, కాశింబజార్, ఢాకాలో కర్మాగారాలు ఏర్పాటు చేశాడు. ఆంగ్లేయులు భారతదేశంలో ప్రధానంగా దుస్తులు, నల్లమందు వ్యాపారం చేసేవారు.

పోర్చుగీసువారితో బ్రిటిషర్లకు ఆధిపత్య పోరు మొదలైంది. 1614లో ఈస్టిండియా కంపెనీవారు పోర్చుగీసువారిని 'సూర్' సమీపంలో ఓడించారు. 1618లో మొదటి జేమ్స్ రాయబారిగా సర్ థామస్ (1615-19) జహంగీర్ ఆస్థానానికి వచ్చి రెండు 'ఫర్మానా'లు పొందాడు. వీటిలో మొదటిది భారతదేశంలో వాణిజ్యం చేసుకోవడానికి అనుమతించడం. రెండోది స్వదేశీ వాణిజ్యంపై సుంకాలు తగ్గించడం.

దక్షిణ భారతదేశంలో మొదటి కర్మాగారాన్ని మచిలీపట్నంలో స్థాపించారు. 1641లో సెయింట్-జార్జికోట (మద్రాసు) ను నిర్మించారు. 1654లో ఇంగ్లిష్ కంపెనీ వాణిజ్య ఆధిపత్యాన్ని పోర్చుగీస్ గుర్తించింది. 1661లో పోర్చుగీస్ వారు బ్రిటిష్ రాజైన రెండో చార్లెస్‌కు బొంబాయిని కట్నంగా ఇచ్చారు. 1698లో ఈస్టిండియా కంపెనీ సత్నౌటి, కాలికట, గోవిందపూర్ ప్రెసిడెన్సీల్లో జమీందారీ హక్కులు పొందింది.

ఆ తర్వాత ఈ మూడు ప్రెసిడెన్సీలను కలిపి 'కలకత్తా' నగరాన్ని ఏర్పాటు చేశారు. 1690లో జాబ్ చార్నాక్ కలకత్తాకు శంకుస్థాపన చేశాడు. 1696లో ఇక్కడ జార్జి విలియం కోట నిర్మాణం మొదలైంది. 1746 నుంచి 1763 వరకు బ్రిటిషర్లు, ఫ్రెంచివారి మధ్య ఆధిపత్యం కోసం మూడు కర్ణాటక యుద్ధాలు జరిగాయి. ఇందులో మూడో కర్ణాటక యుద్ధం (1758-63) ముఖ్యమైంది. 1760లో వాండివాష్ యుద్ధంలో ఇంగ్లిషువారు, ఫ్రెంచివారిని ఓడించి పూర్తి ఆధిపత్యం సాధించారు. 1756లో బెంగాల్ నవాబైన సిరాజుద్దౌలా కలకత్తా పోర్టును ఆక్రమించి చీకటి గది ఉదంతానికి కారకుడయ్యాడు. 1757లో ప్లాసీ యుద్ధంలో సిరాజుద్దౌలాను ఓడించి ఇంగ్లిషువారు కలకత్తాను తిరిగి ఆక్రమించుకున్నారు. 1759లో ఇంగ్లిష్ కంపెనీవారు డచ్‌వారిని బెదరా యుద్ధంలో ఓడించారు. 1764 బక్సార్ యుద్ధం విజయంతో ఉత్తర భారతంలో బ్రిటిషర్ల ఆధిపత్యానికి తిరుగులేకుండా పోయింది. ఈ విజయం కారణంగా 1767లో బెంగాల్‌లో ద్వంద్వ ప్రభుత్వం ఏర్పాటైంది.


1664లో ఫ్రెంచ్ ఈస్టిండియా కంపెనీని 14వ లూయీ మంత్రి కోల్బర్ట్ స్థాపించాడు. 1667లో ఫ్రాంకోయిస్ కరన్ 'సూరత్' ఫ్యాక్టరీని స్థాపించాడు. ఫ్రాన్సిస్కో మార్టిన్ 1673లో ముస్లిం గవర్నర్ నుంచి అనుమతి పొంది పాండిచ్చేరికి పునాదులు వేశాడు. ఇతడు 1764లో గవర్నర్‌గా నియమితుడయ్యాడు. ఫ్రెంచ్‌వారు 1674లో షాయిస్థాఖాన్ నుంచి అనుమతి పొంది బాలాసోర్, కాశిం బజార్, చంద్రనాగూర్ వద్ద ఫ్యాక్టరీలు నిర్మించుకున్నారు. 1674లో డూప్లే పాండిచ్చేరి గవర్నర్‌గా నియమితుడయ్యాడు. ఇతడు రెండు ఆస్ట్రియా వారసత్వ యుద్ధాలు చేశాడు.

డచ్ కంపెనీ

డచ్చివారు యూరప్‌లోని హాలెండ్ (నెదర్లాండ్స్) దేశానికి చెందినవారు. వీరు 1602లో డచ్ ఈస్టిండియా కంపెనీ స్థాపించారు. వీరు తూర్పు ఇండియా సుగంధ దీవులపై దృష్టి కేంద్రీకరించారు. 1604లో గోల్కొండ నవాబు అనుమతితో మచిలీపట్నంలో మొదటి డచ్చి వర్తక స్థావరం ఏర్పాటు చేశారు. 1610లో పులికాట్ వద్ద స్థావరాన్ని నిర్మించుకున్నారు.

గవర్నర్ జనరల్స్

వారన్ హేస్టింగ్స్ (1772-85)




వారన్ హేస్టింగ్స్ 1772లో బెంగాల్ గవర్నర్‌గా నియమితులయ్యాడు. ఇతడు 1773 నుంచి 1785 వరకు గవర్నర్ జనరల్‌గా పనిచేశాడు. 1773లో ద్వంద్వ ప్రభుత్వాన్ని రద్దు చేశాడు. 1773లో రెగ్యులేటింగ్ చట్టం చేశారు. దీంతో కంపెనీకి తూర్పుదేశ వర్తకంపై గుత్తాధిపత్యం లభించింది. వారన్ హేస్టింగ్స్ రాజధానిని ముర్షిదాబాద్ నుంచి కలకత్తాకు మార్చాడు. సివిల్ న్యాయస్థానానికి కలెక్టరును, క్రిమినల్ న్యాయస్థానానికి భారతీయుడిని న్యాయాధిపతిగా నియమించాడు. న్యాయ సంస్కరణలలో భాగంగా ముఖ్యంగా జిల్లాల్లో 'దివానీ', 'ఫౌజ్‌దారీ' అదాలత్‌లను ప్రవేశపెట్టాడు. ప్రెసిడెన్సీ (కలకత్తా)లలో సాదర్, దివానీ సాదర్, నిజామత్ అదాలత్‌లను ఏర్పాటు చేసి హిందూ, ముస్లిం చట్టాలు అమలు చేశాడు. 1784లో బ్రిటిషర్లు పిట్స్ ఇండియా చట్టం చేశారు.

కారన్ వాలిస్ (1786-93)



ఇతడు సివిల్ సర్వీసులను ప్రవేశపెట్టాడు. ప్రభుత్వ యంత్రాంగంలో సంస్కరణలు ప్రవేశపెట్టాడు. వివిధ స్థాయిల్లో కోర్టులను ఏర్పాటు చేశాడు. న్యాయ శాఖ నుంచి పరిపాలన శాఖను వేరుపరిచాడు. 1793లో శాశ్వత శిస్తు విధానం ప్రవేశపెట్టాడు. న్యాయ విచారణ పద్ధతిని రాయించాడు. న్యాయ పద్ధతిపై కారన్ వాలీస్ కోడ్‌ను పొందుపరిచాడు. మూడో మైసూర్ యుద్ధంలో టిప్పుసుల్తాన్‌ను ఓడించి రాజ్యంలో సగభాగాన్ని తీసుకున్నాడు.

సర్ జాన్‌షోర్ (1793-98)



శాశ్వత శిస్తు విధానంలో ఇతడి పాత్ర ప్రధానమైంది. జాన్‌షోర్ కాలంలో బ్రిటిష్ పార్లమెంట్ 1793లో చార్టర్ చట్టం చేసింది.

లార్డ్ వెల్లస్లీ (1798-1805)

ఇతడు ఉద్యోగుల శిక్షణ కోసం 1800లో పోర్ట్ విలియం కళాశాల స్థాపించాడు. సంస్థానాధీశులను సామంతులుగా చేసుకున్నాడు. నాలుగో మైసూర్ యుద్ధంలో టిప్పుసుల్తాన్‌ను ఓడించాడు. 1798లో సైన్య సహకార పద్ధతిని ప్రవేశపెట్టాడు. దీనికి మొదటగా హైదరాబాద్ నిజాం అంగీకరించి ఒప్పందం చేసుకున్నాడు. వెల్లస్లీ రెండో మరాఠా యుద్ధం చేశాడు. ఇతడి కాలంలో మద్రాస్ ప్రెసిడెన్సీ ఏర్పడింది.

- 1805 నుంచి 1807 వరకు జార్జ్‌బార్లో గవర్నర్ జనరల్‌గా పని చేశాడు. ఇతడి కాలంలో వెల్లూరు తిరుగుబాటు జరిగింది.

మొదటి లార్డ్ మింటో (1807-1813)

ఇతడి కాలంలో 1813లో చార్టర్ చట్టం చేశారు. రంజిత్ సింగ్‌తో అమృత్‌సర్ ఒప్పందం చేసుకున్నాడు.

లార్డ్ హేస్టింగ్స్ (1813-1823)

ఇతడు నేపాల్ యుద్ధం, మూడో మరాఠా యుద్ధం చేశాడు. పీష్వా పదవి రద్దు చేశాడు. బొంబాయి ప్రెసిడెన్సీ ఏర్పాటు చేశాడు. పిండారులు అనే దారి దోపిడీదారులను అదుపులోకి తెచ్చాడు. బొంబాయి, మద్రాసులో రైత్వారీ పద్ధతి అమలుపరిచాడు. దీనికి సర్ థామస్ మన్రో, ఎల్ఫిన్‌స్టోన్ సహకరించారు. 1817లో కలకత్తాలో ఆంగ్ల మాధ్యమంలో బోధించే హిందూ కళాశాలను స్థాపించాడు. 1813 చట్టంతో ఇంగ్లిష్ ఈస్టిండియా కంపెనీకి చైనాతో పూర్తి స్వేచ్ఛా వాణిజ్యం చేసుకునే వెసులుబాటు కలిగింది. హేస్టింగ్స్ 1799లో పత్రికలపై ఆంక్షలు రద్దు చేశాడు.

లార్డ్ అమ్హెర్స్ట్ (1823-1828)

ఇతడి కాలంలో మొదటి బర్మా యుద్ధం జరిగింది. భరత్‌పూర్‌ను ఆక్రమించాడు.

విలియం బెంటింక్ (1828-1835)

ఇతడు గవర్నర్ జనరల్లలో గుర్తింపు పొందిన వాడు. విలియం బెంటింక్ 'థగ్గులు' అనే దారి దోపిడీ దొంగలను అణచివేశాడు. మైసూర్ రాజును పదవి నుంచి తొలగించాడు. కాచర్, జైంతియా, కూర్గ్‌ను ఆక్రమించాడు. 1828లో బెంగాల్ రాష్ట్రానికే కాకుండా భారతదేశమంతటికీ గవర్నర్ జనరల్‌గా నియమితుడయ్యాడు. 1829లో సతీసహగమనాన్ని నిషేధించాడు. పురిటిలో ఆడ పిల్లలను చంపడం లాంటి దురాచారాలను అదుపు చేశాడు. భారతీయులు ఉన్నత ఉద్యోగాలకు అర్హులని ప్రకటించాడు. బెంటింక్ కలకత్తాలో వైద్య కళాశాలను స్థాపించాడు. 1835లో మెకాలే అధ్యక్షతన న్యాయ సంఘాన్ని నియమించాడు. దీనికి సంబంధించి ఇంగ్లిష్ భాషలో విద్యా బోధన ప్రవేశపెట్టాడు. 1833లో చార్టర్ చట్టంతో స్వేచ్ఛా వాణిజ్యాన్ని ఎత్తేశారు.

- 1835 నుంచి 1836 వరకు సర్ చార్లెస్ మెట్‌కాఫ్ గవర్నర్ జనరల్‌గా పని చేశాడు.
- 1836-42 మధ్య లార్డ్ ఆక్లాండ్ గవర్నర్ జనరల్‌గా ఉన్నాడు. ఇతడు అఫ్గానిస్తాన్‌లో బ్రిటిషర్ల పరాజయం ఫలితంగా పదవి కోల్పోయాడు.

లార్డ్ ఎలెన్‌బరో (1842-44)

ఇతడు సింధ్‌ను బ్రిటిష్ ఇండియాలో విలీనం చేశాడు. ఇతడి కాలంలో మొదటి అఫ్గాన్ యుద్ధం ముగిసింది. ఇతడు గ్వాలియర్ యుద్ధం చేశాడు.

మొదటి లార్డ్ హార్డింజ్ (1844-48)

ఇతడి కాలంలో మొదటి సిక్కు యుద్ధం జరిగింది. ఆంగ్ల మాధ్యమంలో చదివిన భారతీయులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాడు. ఇతడు నరమేథాన్ని అణచివేశాడు.

లార్డ్ డల్హౌసి (1848-56)

ఇతడు రెండో సిక్కు యుద్ధం తర్వాత పంజాబ్‌ను ఆక్రమించాడు. రెండో బర్మా యుద్ధం తర్వాత బర్మా దిగువ ప్రాంతాన్ని ఆక్రమించాడు. రాజ్య సంక్రమణ సిద్ధాంతాన్ని ప్రవేశపెట్టి సతారా, సంబల్‌పూర్, ఝాన్సీ, నాగ్‌పూర్‌ను ఆక్రమించాడు. అయోధ్యను ఆక్రమించాడు. ఇతడి హయాంలో వితంతు పునర్వివాహ చట్టాన్ని ప్రవేశపెట్టారు. ఇతడి కాలంలో సంతాలులు తిరుగుబాటు చేశారు. ప్రతి రాష్ట్రంలో పబ్లిక్ వర్క్స్ శాఖను ప్రవేశపెట్టారు. 1854లో చార్లెస్ ఉడ్స్ అధ్యక్షుడిగా విద్యకు సంబంధించిన అంశాలపై కమిటీ ఏర్పాటు చేశాడు. ఈ కమిటీ సూచనలతో విద్యాలయం నుంచి విశ్వవిద్యాలయాల వరకు కీలక సంస్కరణలు ప్రవేశపెట్టాడు. 1853లో రైళ్లు, తంతితపాలా, రోడ్డు రవాణా సౌకర్యాలు ప్రవేశపెట్టాడు. బొంబాయి నుంచి థానే వరకు మొదటి రైల్వే లైన్ వేశారు. కలకత్తా నుంచి పెషావర్ వరకు మొదటి తంతి నిర్మించాడు. 1854లో మొదటిసారిగా తపాలా బిళ్లలను ప్రవేశపెట్టాడు. పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌ను ఏర్పాటు చేశాడు. 1853లో చార్టర్ చట్టంతో పోటీ పరీక్షలను ప్రవేశపెట్టారు. ఈ చట్టం వ్యాపార సంస్థలకు.. వ్యాపారంలో తప్ప మిగతా విషయాలతో సంబంధం లేకుండా చేసింది. 1854లో బొంబాయిలో మొదటి నూలు మిల్లు, కలకత్తాలో జనపనార మిల్లును స్థాపించారు.

లార్డ్ కానింగ్ (1856-62)

1857 సిపాయిల తిరుగుబాటు తర్వాత బ్రిటిష్ పార్లమెంట్ 1858లో ఒక చట్టం చేసింది. దీని ప్రకారం బ్రిటిష్ ఇండియాలో 'వైస్రాయ్' పదవిని ఏర్పాటు చేశారు. లార్డ్ కానింగ్ 1858 చట్టం ప్రకారం తొలి రాజప్రతినిధిగా నియమితులయ్యాడు. 1861లో ఇండియా కౌన్సిళ్ల చట్టం ప్రవేశపెట్టారు. 1859లో రాజ్య సంక్రమణ సిద్ధాంతాన్ని రద్దు చేశారు. 1858లో భారత శిక్షాస్మృతి, 1861లో హైకోర్టు చట్టాన్ని ప్రవేశపెట్టారు. 1865లో లారెన్స్ మూడు హైకోర్టులను స్థాపించాడు. 1857లో కానింగ్ కలకత్తా, బొంబాయి, మద్రాసులో విశ్వవిద్యాలయాలు స్థాపించాడు. ఇతడి కాలంలో 1859లో శ్వేత సైనికుల విప్లవం, 1860లో నీలి మందు రైతుల తిరుగుబాటు, 1863లో పాబ్నా రైతుల తిరుగుబాటు చెలరేగాయి.

విద్య, ఉద్యోగ సమాచారం

సీపీఆర్ఐ, బెంగళూరులో ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టులు

బెంగళూరులోని సెంట్రల్ పవర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీపీఆర్ఐ).. ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
- **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంఈ/ఎంటెక్‌లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి, 30 ఏళ్లు మించకూడదు.
- **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరితేది:** 16.05.2025.
- **వెబ్‌సైట్:** https://cpri.res.in

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో ప్రాజెక్ట్ ఆఫీసర్ పోస్టులు

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ ఒప్పంద ప్రాతిపదికన కోల్‌కతా షిప్ రిపేర్ యూనిట్‌లో ప్రాజెక్ట్ ఆఫీసర్(మెకానికల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 03.
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి 60 శాతం మార్కులతో డిగ్రీ (మెకానికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి. **వయసు:** 12.05.2025 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
- **స్టైపెండ్:** నెలకు మొదటి ఏడాది రూ.46,000, రెండో ఏడాది రూ.48,000, మూడో ఏడాది రూ.50,000, నాలుగో ఏడాది రూ.52,000, ఐదో ఏడాది రూ.54,000.
- **ఎంపిక విధానం:** పవర్ పాయింట్ ప్రజెంటేషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 12.05.2025
- **వెబ్‌సైట్:** https://cochinshipyard.in

ట్రిపుల్ ఐటీ అలహాబాద్‌లో ఎంబీఏలో ప్రవేశాలు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ట్రిపుల్ ఐటీ), అలహాబాద్‌లో.. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి రెండేళ్ల మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఎంబీఏ) కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం సీట్ల సంఖ్య:** 95.
- **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు క్యాట్/గ్మాట్ /సీమ్యాట్/మ్యాట్/జీమ్యాట్ స్కోరు సాధించి ఉండాలి.
- **ఎంపిక విధానం:** ఐమ్యాట్(ఐఐఐటీ మేనేజ్‌మెంట్ అడ్మినిస్ట్రేషన్ టెస్ట్), గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా .
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.05.2025
- **కంప్యూటర్ ఆధారిత పరీక్ష తేది:** 02.06.2025.
- **ఇంటర్వ్యూ తేది:** 02.06.2025, 03.06.2025.
- **వెబ్‌సైట్:** https://mba.iiita.ac.in

చిన్న పిల్లల్లో ఎక్కువ సంఖ్యలో ఉండే రక్త కణాలు?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
బయాలజీ

నమూనా ప్రశ్నలు (ఎస్ఏ)

1. హారిక బ్రెడ్‌ను ఆహారంగా తీసుకోవాలను కుంది. ప్యాకెట్ తెరిచి చూస్తే అది చెడిపోయినట్లు వాసన వచ్చింది. భూతద్దంతో పరిశీలిస్తే తంతువుల లాంటి పోగులు కనిపించాయి. ఆమె గుర్తించిన సూక్ష్మజీవులు ఏ రకానికి చెందుతాయి?
   1) శైవలాలు 2) శిలీంధ్రాలు
   3) బ్యాక్టీరియా 4) వైరస్
2. ఎల్లోస్పాట్‌లో ఎక్కువ సంఖ్యలో ఉండే కణాలు?
   1) దండాలు 2) రోమాలు
   3) కోనులు 4) ఉపకళా కణాలు
3. క్షయకరణ విభజనకు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
   1) ప్రత్యుత్పత్తి కణాల్లో జరుగుతుంది
   2) క్రోమోజోముల సంఖ్య సగానికి తగ్గించడానికి ఉపకరిస్తుంది
   3) జీవుల్లో క్రోమోజోముల సంఖ్య స్థిరంగా ఉండటానికి దోహదపడుతుంది
   4) ఇది శారీరక కణాల్లోనే జరుగుతుంది
4. సంక్లిష్ట కణజాలాలకు ఉదాహరణ ఇవ్వండి అని ఉపాధ్యాయుడు అడిగినప్పుడు నలుగురు విద్యార్థులు కిందివిధంగా సమాధానం చెప్పారు. వీటిలో సరైనవి ఏవి?
   శేఖర్ - దృఢ కణజాలం
   శ్వేత - మృదు కణజాలం
   శ్రియ - దారు కణజాలం
   శంకర్ - పోషక కణజాలం
   1) శేఖర్, శంకర్ 2) శ్వేత, శ్రియ
   3) శ్రియ, శంకర్ 4) శ్వేత, శేఖర్
5. క్లోమరసంలో కీమోట్రిప్సిన్ అనే ఎంజైమ్ ఏ పదార్థాన్ని వేటిగా మారుస్తుంది?
   1) కొవ్వులు - కొవ్వు ఆమ్లాలు
   2) ప్రొటీన్లు- పెప్టైడులు
   3) పిండి పదార్థాలు - మాల్టోజ్
   4) పిండి పదార్థాలు - పెప్టోనులు
6. మొక్కల్లో లెగుమినేసి - రైజోబియం మాదిరిగా జంతువుల్లో...?
   1) పీతలు - సముద్ర జంతువులు
   2) పీతలు - సీ ఎనిమోన్లు
   3) ఆల్చిప్పలు - జలగలు
   4) సముద్ర నక్షత్రం - షార్క్ చేప
7. రాడ్యులా కలిగి ఉన్న జీవికి ఉదాహరణ?
   1) దోమ 2) వానపాము
   3) నత్త 4) కప్ప
8. మానవ శరీరంలో అతి చిన్న ఎముకను కలిగి ఉండే అవయవం ఏది?
   1) కన్ను 2) చెవి
   3) ముక్కు 4) కపాలం
9. వినాళ గ్రంథులకు సంబంధించి కిందివాటిలో సరికాని ప్రవచనం?
   1) జీర్ణ రసాలను స్రవించవు
   2) అంతస్రావ గ్రంథులు అని కూడా అంటారు
   3) వీటి స్రావాలు నాళాల ద్వారా అవసరమైన చోటుకు ప్రవహిస్తాయి
   4) వీటి స్రావాలను హార్మోన్లు అంటారు
10. కిందివాటిలో వేటిలో పుపుస శ్వాసక్రియ జరగదు?
    ఎ. కప్ప బి. పావురం
    సి. చేపలు డి. టాడ్‌పోల్ లార్వా
    1) ఎ,బి 2) ఎ, డి
    3) బి, సి 4) సి, డి
11. ఎర్రరక్తకణాల శ్మశాన వాటిక అని ఏ అవయవాన్ని పేర్కొంటారు?
    1) ప్లీహం 2) కాలేయం
    3) ఊపిరితిత్తులు 4) ఎముక మజ్జ
12. విత్తనాలు లేని ఫలాలు ఏర్పడటానికి ఉపయోగపడే రసాయన పదార్థం?
    1) ఆక్సిన్లు 2) అబ్‌సిసిక్ ఆమ్లం
    3) ఇథిలిన్ వాయువు
    4) జిబ్బరెల్లిన్లు
13. పన్నెండు జతల కపాల నాడుల్లో హృదయ స్పందన నియంత్రించే వేగస్ నాడీ ఎన్నోది?
    1) 9 2) 12 3) 10 4) 8
14. రవి కోపం, బాధ, ఆనందం లాంటి భావావేశాలను నియంత్రించుకోలేకపోతున్నాడు. అతడి మెదడులోని ఏ భాగంలో లోపం ఉండవచ్చు?
    1) అనుమస్తిష్కం 2) ద్వారగోర్థం
    3) మజ్జాముఖం 4) ఘ్రాణలంబికలు
15. సినర్జిడ్లు అనేవి మొక్కల్లోని ఏ భాగానికి సంబంధించినవి?
    1) పరాగకోశం 2) పిండకోశం
    3) వేరు పోషక కణాలు
    4) శిఖరాగ్ర మొగ్గలు
16. సయాన్, స్టాక్ అనేవి వేటిలో కనిపిస్తాయి?
    1) కోరకీభవనం 2) కణజాలవర్ధనం
    3) అంటుకట్టడం 4) ఫలదీకరణం
17. కిందివాటిలో ఏ రెండు జీవుల్లో బాహ్య ఫలదీకరణం జరుగుతుంది?
    ఎ. బొద్దింక బి. వానపాము
    సి. కప్ప డి. పాము
    1) ఎ, బి 2) బి, సి
    3) సి, డి 4) ఎ, డి
18. రాజేష్ వైద్యుడిని సంప్రదించినప్పుడు అతడు ప్రొటీన్లతో కూడిన ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోకపోవడం వల్ల వ్యాధిగ్రస్తుడయ్యాడని తెలిపాడు. రాజేష్‌కు ఏ వ్యాధి వచ్చి ఉండవచ్చు?
    1) క్వాషియోర్కర్ 2) రికెట్స్
    3) అనీమియా 4) జీరాఫ్తాల్మియా
19. జ్యోతి అనే గృహిణి ఆహార పదార్థాలను అతిగా ఉడకబెడుతుంది. వారి కుటుంబ సభ్యుల్లో ఏ విటమిన్ లోపం ఉండవచ్చు?
    1) రెటినాల్ 2) కాల్సిఫెరాల్
    3) ఫోలిక్ ఆమ్లం 4) నియాసిన్
20. మలేరియా పరాన్నజీవి జీవితచక్రంలో షైజాంట్ దశ ఎక్కడ అభివృద్ధి చెందుతుంది?
    1) కాలేయ కణాలు
    2) లాలాజల గ్రంథులు
    3) ఎర్రరక్తకణాలు 4) జీర్ణాశయ గోడలు
21. ఎముకల సామాన్య విరుపునకు మరో పేరు?
    1) జటిల ఎముకల విరుపు
    2) మూసివేసిన ఎముకల విరుపు
    3) లేత ఎముక విరుపు
    4) బహిర్గత ఎముక విరుపు
22. కండరాలు ఉత్తేజం చెంది సంకోచస్థితిలోనే ఉండిపోవడాన్ని టిటాని అంటారు. ఈ స్థితికి కారణం?
    1) సమతుల ఆహార లోపం
    2) వాసోప్రెస్సిన్ తగినంత ఉత్పత్తి కాకపోవడం
    3) ఆహార పదార్థాల్లో తగినంత అయోడిన్ లేకపోవడం
    4) పారాథార్మోన్ అధికంగా ఉత్పత్తవడం
23. మెదడులోని ఏ భాగం అతి ముఖ్యమైన శ్వాసక్రియ, హృదయ స్పందన, రక్త పీడనం, శరీర ఉష్ణోగ్రత, లాలాజలం స్రవించడం లాంటి క్రియలను నియంత్రిస్తుంది?
    1) ద్వారగోర్థం 2) మజ్జాముఖం
    3) పిట్యూటరీ గ్రంథి
    4) మస్తిష్క గోళార్థాలు
24. ఒక మొక్క కణం పూర్తి మొక్కను ఇవ్వగలిగే శక్తిని ఏమంటారు?
    1) టోటిపొటెన్సీ 2) కాలస్
    3) ఎక్స్‌ప్లాంట్ 4) సయాన్
25. కిందివాటిలో ఏ రెండు ఆవశ్యక అమైనో ఆమ్లాలు కావు?
    ఎ. ఐసోటాసిన్ బి. గ్లిసరాల్
    సి. లైజీన్ డి. లిపిడ్లు
    1) ఎ, బి 2) బి, డి
    3) ఎ, సి 4) బి, సి
26. కిందివాటిలో నీటిలో, కొవ్వులో కరిగే విటమిన్లకు సంబంధించి సరైన క్రమం?
    1) BDE - ACK
    2) AEKC - BD
    3) BC - ADEK
    4) CD - ABEK
27. కిందివారిలో ఏ ఇద్దరు శాస్త్రవేత్తలు హెచ్ఐవీని కనుగొన్నారు?
    ఎ. ల్యూక్ మ్యాంట్ గ్నాయర్
    బి. ఇస్‌మార్క్
    సి. రాబర్ట్ గాలో
    డి. కార్ల్ లాండ్ స్టీనర్
    1) ఎ, బి 2) ఎ, సి
    3) బి, డి 4) బి, సి
28. సముద్ర అడుగు భాగంలో ఉండే జీవులను ఏమంటారు?
    1) నెక్టాన్ 2) ప్లవకాలు
    3) బెంథాస్ 4) నిమ్నటిక్
29. సముద్ర మొక్కలు దేన్ని నిక్షిప్తం చేసుకుంటాయి?
    1) క్లోరిన్ 2) బ్రోమిన్
    3) అయోడిన్ 4) సోడియం
30. పప్పుధాన్యాల్లో ఎక్కువగా ఉండే పోషకాలు?
    1) మాంసకృత్తులు 2) పిండి పదార్థాలు
    3) కొవ్వులు 4) విటమిన్లు
31. జుట్టు రాలకుండా ఉండటానికి ఉపయోగించే కొంథారిడియస్ తైలాన్ని స్రవించేది?
    1) సిల్వర్ ఫిష్ 2) లక్కమాత్
    3) పట్టుమాత్ 4) బ్లిస్టర్ బీటిల్
32. కిందివాటిలో ఎలక్ట్రాన్ గ్రహీత కానిది?
    1) పైరిడాక్సిన్
    2) అడినోసిన్ ట్రై ఫాస్ఫేట్
    3) సైటోక్రోం 4) ప్లాస్టో క్వినోన్
33. మైటోకాండ్రియా మాత్రికలో జరిగే శ్వాస క్రియ చర్యల వలయాలను విశదీకరించిన వారు?
    1) మెల్విన్ కాల్విన్ 2) ఆండ్రూ బెన్సన్
    3) సర్‌హాన్స్ క్రెబ్స్ 4) లిన్నియస్
34. కిరణజన్య సంయోగక్రియకు సంబంధించి కిందివాటిలో సరైంది ఏది?
    1) ఉష్ణశక్తి వినియోగితమవుతుంది
    2) ఉష్ణశక్తి విడుదలవుతుంది
    3) వికిరణ శక్తి వినియోగమవుతుంది
    4) రసాయన శక్తి విడుదలవుతుంది
35. నికర ప్రాథమిక ఉత్పాదకతను ప్రదర్శించేవి?
    1) మొక్కలు 2) సూక్ష్మజీవులు
    3) జంతువులు 4) నిర్జీవ కారకాలు
36. వాణిజ్యపరంగా విలువైన నారను ఇచ్చే మొక్క శాస్త్రీయనామం?
    1) టెక్టోనా గ్రాండ్
    2) క్రొటలేరియా జన్షియా
    3) షోరియారాబస్టా
    4) ఇల్యూసిస్ కొరకాన
37. కిందివాటిలో వరి వంగడం కానిది?
    1) బాసుమతి 2) పూసామోతి
    3) హంస 4) రవి
38. శక్తివనరు మొక్కకు సంబంధించిన కింది ఏ మొక్కలో ప్రత్యేక వేర్లు కనిపిస్తాయి?
    1) యూకలిప్టస్ 2) కాజురైనా
    3) అవిసీనియా 4) లూసినా
39. పెట్రో పంటగా దేన్ని పిలుస్తారు?
    1) డాల్బర్జియా లాటిఫోలియా
    2) డిజిటాలిస్
    3) రిసినస్ కామ్యునిస్
    4) బోట్రియో కైకస్ బ్రానై
40. ఏకదళ బీజ వర్గానికి చెందిన కార్బోహైడ్రేట్లను కలిగిన మొక్కల్లో పుష్పవిన్యాస రకం?
    1) స్పాడిక్స్ 2) సమశిఖి
    3) కంకి 4) గుచ్ఛం
41. చిన్న పిల్లల్లో ఎక్కువ సంఖ్యలో ఉండే రక్త కణాలు?
    1) ఎర్ర రక్తకణాలు 2) తెల్ల రక్తకణాలు
    3) లింఫోసైట్లు 4) త్రాంబోసైట్లు

సమాధానాలు

1) 2	2) 3	3) 4	4) 3	5) 2
6) 2	7) 3	8) 2	9) 3	10) 4
11) 1	12) 4	13) 3	14) 2	15) 2
16) 3	17) 2	18) 1	19) 3	20) 3
21) 2	22) 4	23) 2	24) 1	25) 2
26) 3	27) 2	28) 3	29) 3	30) 1
31) 4	32) 2	33) 1	34) 3	35) 1
36) 2	37) 2	38) 3	39) 4	40) 3
41) 1				

నిజాం దానంగా ఇచ్చిన భూములే జాగీర్లు..

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ ఎకానమీ

భారతదేశంలోని రైతాంగ పోరాటాల్లో తెలంగాణ, పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ఉద్యమాలే విప్లవాత్మకమైనవని కొందరు చరిత్రకారుల భావన. తెలంగాణలో జరిగిన పోరాటం ఒక్కటే విప్లవాత్మకమైందని మరికొందరు పేర్కొన్నారు. నిజాం కాలంలో అనేక రకాల భూస్వామ్య విధానాలు అమలులో ఉండేవి. వీటిలో సంస్థానాలు, జాగీర్లు, ఇనామ్‌లు, సర్ఫేఖాస్, దివానీ లేదా ఖలసా లేదా రైత్వారీ పద్ధతులు ముఖ్యమైనవి. నిజాం నవాబుకు ప్రత్యేకంగా సేవ చేసిన వారికి దానంగా ఇచ్చిన భూములను జాగీర్లు అనే వారు.



భూసంస్కరణల ఆవశ్యకత - కారణాలు

స్వాతంత్ర్యానంతరం భారతదేశం, రాష్ట్రంలోనూ వ్యవసాయ రంగంలో భూ సంస్కరణల పేరుతో భూ సంబంధాలు, వ్యవసాయక నిర్మాణంలో విప్లవాత్మకమైన మార్పులు రావడానికి అనేక కారణాలున్నాయి.

రాష్ట్రంలో భూ సంస్కరణలను ప్రధానంగా రెండు దశలుగా వర్గీకరించవచ్చు. మొదటి దశ 1947 నుంచి 1970 వరకు, రెండోదశ 1970 తర్వాత వచ్చిన భూ సంస్కరణలుగా పేర్కొనవచ్చు.

మొదటిదశ (1947-1970): భూ సంస్కరణలు రావడానికి మూడు అంశాలు ప్రధాన పాత్ర వహించాయని చెప్పొచ్చు.

1. **వ్యవస్థాపూర్వక అంశాలు:** ఇందులో భూస్వామ్య పద్ధతులు, కౌలు విధానాలు, భూ కేంద్రీకరణ మొదలైనవి ఉన్నాయి.
2. **రాజకీయ అంశాలు:** జాతీయస్థాయిలో అఖిల భారత కాంగ్రెస్, రాష్ట్ర కాంగ్రెస్ తీర్మానాలు, విధానాలు.
3. **రైతాంగ ఉద్యమాలు:** ఫ్యూడల్ దోపిడీకి వ్యతిరేకంగా తెలంగాణ రైతాంగం పోరాటం చేసింది. ఉదా: 1920లో విస్నూరు దేశ్ ముఖ్‌కు వ్యతిరేకంగా జరిగిన రైతు పోరాటం.

భారతదేశ రైతాంగ పోరాటాల్లో తెలంగాణ, పశ్చిమ బెంగాల్‌లో జరిగిన రైతాంగ పోరాటాలే విప్లవాత్మకమైనవని కొందరు భావి స్తే, మరికొందరు తెలంగాణ పోరాటం ఒక్కటే విప్లవాత్మకమైందిగా పేర్కొంటారు.

వ్యవస్థాపూర్వక అంశాలు

రాష్ట్రంలో వ్యవస్థాపూర్వకమైన అంశాల్లో భూస్వామ్య వ్యవస్థలు, కౌలు విధానాలు, భూమి కేంద్రీకరణ మొదలైనవన్నీ వ్యవసాయ రంగం అభివృద్ధికి నిరోధంగా ఉన్నాయి. అయితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ (1956) కు ముందు తెలంగాణ ప్రాంతం హైదరాబాద్ రాష్ట్రంలో, ఆంధ్రా ప్రాంతం 1953 అక్టోబర్ 1 వరకు మద్రాసు రాష్ట్రంలో భాగంగా ఉన్నాయి. ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లోని భూస్వామ్య పద్ధతుల్లో కొంత సారూప్యం ఉన్నప్పటికీ వీటిని సమగ్రంగా అర్థం చేసుకోవడానికి వేర్వేరుగా అధ్యయనం చేయడం ఉత్తమం.

- భారతదేశంలో బ్రిటిష్, నైజాం ప్రాంతాల్లో ప్రవేశపెట్టిన భూస్వామ్య పద్ధతులు రెండూ అభివృద్ధి నిరోధకాలే.
- తెలంగాణ, ఆంధ్రా ప్రాంతాల్లో ప్రవేశపెట్టిన జాగీర్దారీ లేదా జమీందారీ, రైత్వారీ మొదలైన పద్ధతులు వ్యవసాయాభివృద్ధికి ఉపయోగపడకపోగా స్తబ్ధతకు దారితీశాయి.
- జమీందారీ, రైత్వారీ పద్ధతులు రెండూ బ్రిటిష్ అధికారులు ప్రవేశపెట్టిన వ్యవసాయక విప్లవ రూపాలు. ఇవి ఒకదానికొకటి విరుద్ధమైనవిగా కార్ల్ మార్క్స్ గుర్తించారు. జమీందారీ విధానం పెత్తందారీ వ్యవస్థ కాగా, రైత్వారీ విధానాన్ని ప్రజాతంత్ర వ్యవస్థగా పేర్కొన్నారు.
- జమీందారీ విధానం బ్రిటిష్ భూస్వామ్య వ్యవస్థకు, రైత్వారీ విధానం ఫ్రెంచి రైతుస్వామ్య వ్యవస్థకు ప్రతిబింబాలు. కానీ ఈ రెండు పద్ధతులు హానికరమైనవేనని గుర్తించాలి. ఇవి రెండూ పరస్పర విరుద్ధ అంశాల మేళవింపుతో రూపొందాయి.
- ఈ పద్ధతులు భూమిని దున్నే రైతు, భూయజమానుల ప్రయోజనాలకు ఉద్దేశించినవి కావు. భూములపై పన్ను వేసి, ప్రభుత్వానికి ఉపయోగపడే సాధనాలుగా గుర్తించారు.

హైదరాబాద్ రాష్ట్రంలో భూస్వామ్య విధానాలు

- హైదరాబాద్ రాష్ట్రం నిజాం పరిపాలనలో ఉండేది. వీరి కాలంలో అనేక రకాల భూస్వామ్య విధానాలుండేవి. అవి సంస్థానాలు, జాగీర్లు, ఇనాంలు, సర్ఫేఖాస్, దివానీ లేదా ఖలసా లేదా రైత్వారీ విధానాలు ముఖ్యమైనవి.

1. జాగీర్లు

నిజాం నవాబుకు ప్రత్యేకంగా సేవ చేసినవారికి లేదా ఆ వ్యక్తి గౌరవాన్ని నిలబెట్టడానికి దానపూర్వకంగా ఇచ్చిన భూములను జాగీర్లు అనే వారు. వీటిలో అనేక రకాలైన జాగీర్లుండేవి. కొన్ని నిజాంకు కొంత బాటకం చెల్లించాల్సినవి. కొన్ని భాటకం చెల్లించనవసరం లేని జాగీర్లు.

2. ఇనాందారులు

- హైదరాబాద్ ప్రాంతంలో కొన్ని విధులను నిర్వహించినందుకు పారితోషికంగా ప్రభుత్వం ఇచ్చిన భూములను ఇనాం భూములంటారు.
- ఈ భూముల నుంచి వచ్చే భూమి శిస్తును పొందే హక్కు పూర్తిగానో, పాక్షికంగానో ఇనాందారుడికి సంక్రమిస్తుంది.
- ఉద్యోగులు, సమాజానికి సేవలు అందించిన వారికి కూడా ఇనాం భూములు ఇచ్చేవారు.
- దేవాలయాలు, ధర్మాలయాల నిర్వహణ కూ ఇనాంలు ఇచ్చేవారు.
- హైదరాబాద్ సంస్థానంలో మొత్తం ఇనాందారుల సంఖ్య 82,000 కాగా వీరిలో 57,000 మంది దివానీప్రాంతంలో ఉండగా 26000 మంది జాగీరు ప్రాంతంలో ఉండే వారు. వీరి ఆధీనంలో సుమారు 8 లక్షల ఎకరాల భూమి ఉండేది. వీటిలో కూడా అనేక రకాలైన ఇనాంలు ఉండేవి.

ఉదా: అరాజమక్తా, అరాజ అగ్రహార్, మజరాను బేసరి ఇనాం, బలవతా ఇనాం, నీరడి ఇనాం , చిధుమతి ఇనాం మొదలైనవి.

3. సర్ఫేఖాస్

- సర్ఫేఖాస్ భూములు నిజాం సొంత ఖర్చుల కోసం నిర్దేశించిన భూమి లేదా గ్రామాలు. వీటి నుంచి వచ్చే ఆదాయం లేదా భాటకం నిజాం ఖజానాకు వెళ్లేది. ఈ భూములు 5,682 చదరపు మైళ్ల విస్తీర్ణంలో 1,374 గ్రామాల్లో వ్యాపించి ఉండేవి.

4. ఖల్సా/దివానీ/రైత్వారీ పద్ధతి

- ఈ పద్ధతి హైదరాబాద్ ప్రాంతంలోని 60 శాతం విస్తీర్ణంలో ప్రభుత్వ ప్రత్యక్ష పాలన కింద ఉండేది. ప్రభుత్వ యంత్రాంగమే శిస్తు వసూలు చేసేది.
- ప్రభుత్వ యంత్రాంగమే శిస్తును వసూలు చేసే ప్రభుత్వ ప్రత్యక్ష పాలనలో ఉండే భూమిని ఖలీసా భూమి అంటారు.
- దివానీ భూములు సర్ఫేఖాస్ భూముల్లో భాగాలే. క్రమబద్ధమైన సర్వే సెటిల్‌మెంట్ పద్ధతిని మొదటి సాలార్‌జంగ్ 1875లో ప్రవేశపెట్టారు.
- క్రమబద్ధమైన సర్వే సెటిల్‌మెంట్ విధానాన్ని ప్రవేశపెట్టడానికి (1875) ముందు ఖల్సా/దివానీ భూముల్లో దళారీలు ఉండేవారు.

పామిగా జమీయత్

- పామిగా అంటే గుర్రాలను కట్టేసే స్థలం
- సైన్యానికి అవసరమైన గుర్రాలను పోషించడానికి ప్రతిఫలంగా ఇచ్చే జాగీర్లు.

జాత్

- విస్తృతమైన ప్రాంతాల్లో సేవ చేసినందుకు ఎలాంటి షరతులు లేకుండా ఇచ్చిన జాగీర్లు

అవతమామ్

- శిస్తు చెల్లించకుండానే వంశ పారంపర్యం గా వచ్చే హక్కులు ఉన్న జాగీర్లు

తనఖా

- జీతానికి బదులుగా ఇచ్చే జాగీర్లు

మాదద్ మాష్

- ఉద్యోగుల పోషణకు జీతానికి తోడుగా ఇచ్చే జాగీర్లు

మసురూదీ

- మత, సైనిక, పౌర సంబంధమైన సేవ చేసే షరతులపై ఇచ్చే జాగీర్లు
- పై విధంగా అనేక రకాలైన జాగీర్లు ఉండేవి. ఈ జాగీర్లు హైదరాబాద్‌లో 6535 గ్రామాల్లో 40,000 చదరపు మైళ్ల విస్తీర్ణంలో వ్యాపించి ఉండేవి. 1922లో జాగీర్ల సంఖ్య 1,167 కాగా, 1949 నాటికి 1500 వరకు పెరిగింది.

5. సంస్థానాలు

- హైదరాబాద్ ప్రాంతంలో మొదటి నుంచి అనేక చిన్న చిన్న ప్రాంతాలకు హిందూ రాజులు అధిపతులుగా ఉండేవారు. నిజాం వీరి హక్కులను అంగీకరించడానికి వీరు ఏటా నిజాంకు 'పేష్కష్' పేరుతో నిర్ణీతమైన డబ్బు చెల్లించాలి. వీరికి ఆయా ప్రాంతాల్లో విస్తృతమైన పరిపాలనా అధికారాలుండేవి.
- హైదరాబాద్ రాష్ట్రంలో మొత్తం 14 సంస్థానాలు ఉన్నప్పటికీ, వీటిలో ఐదు ప్రధానమైనవి. అవి
  1) గద్వాల్ (అతి పెద్దది)
  2) వనపర్తి 3) జటిప్రోలు
  4) అమరచింత 5) పాల్వంచ.
- ఈ ఐదు సంస్థానాల్లో పరిపాలన అంతా సంస్థానాధీశులదే. వీరి ఆధీనంలో 497 గ్రామాలు, 5,030 చదరపు మైళ్ల విస్తీర్ణంలో వ్యాపించి ఉండేవి. వీరికి సర్‌బస్తా, పాన్‌మక్తా, ఇజారా అనే మధ్యవర్తులుండేవారు.

సర్‌బస్తా: వేలంపాట ద్వారా శిస్తు వసూలు చేసుకునే హక్కును పొందినవారు.

పాన్‌మక్తా: స్థిరమైన కౌలును చెల్లించేవారు.

ఇజారా భూములు: నిర్మానుష్యమైన గ్రామాల్లోని భూములు. ఇక్కడ పునరావాసం ఉండే వారికి తక్కువ కౌలు చెల్లించే వెసులుబాటు ఉండేది.

- ప్రాంతీయంగా ఉండే వీరినే దేశ్‌ముఖ్, సర్ దేశ్‌ముఖ్, దేశాయ్, సర్‌దేశాయ్, దేశ్‌పాండేలుగా పిలిచేవారు. వీరికి శిస్తు వసూలు చేసే అధికారం ఉండటం వల్ల అనేక మార్గాల ద్వారా వేల ఎకరాలు తమ పేరున రాసుకొని 1875 తర్వాత ఖల్సా / దివానీ ప్రాంతాల్లో అతిపెద్ద భూస్వాములుగా చెలామణి అయ్యారు.
- పై భూస్వామ్య విధానాలన్నింటిలోనూ జాగీర్దార్లు, ఇనాందార్లు, సంస్థానాధీశులు చివరకు భాటకాన్ని పొందే ఖల్సా ప్రాంతంలోని పెద్ద భూస్వాములందరూ భాటకాన్ని పొందే అనుపస్థితి (అబ్సెంటీ ల్యాండ్‌లార్డ్స్) భూస్వాములుగా మారారు. వీరి సంఖ్య 1891లో లక్ష ఉండగా 1921 నాటికి 7.6 లక్షలకు పెరిగింది.
- ఈ ప్రాంతంలో భాటకం వసూలు చేసేవారు వ్యవసాయాభివృద్ధి కంటే కౌలును పెంచుకునే మార్గాలను అన్వేషించేవారు.
- భూమి శిస్తును ఉత్పత్తితో సంబంధం లేకుండా పెంచడం, కౌలు గడువు పెంచుకోవాలన్నా కొత్తగా సేద్యం చేసుకోవడానికి భూమిని తీసుకోవాలన్నా వీరికి 'నజరానాలు' (బహుమతులు) చెల్లించాల్సి వచ్చేది.
- భూమిశిస్తుతోపాటు ఇంటి పన్ను, వృత్తిపన్ను, మగ్గపు పన్ను..ఇలా అనేక అక్రమ పన్నులు నిర్బంధంగా వసూలు చేసేవారు.
- వీరి ఇళ్లలో ఏ శుభకార్యం జరిగినా రైతులు, కౌలుదారులు విధిగా చేసే వెట్టి చాకిరీతోపాటు కట్నాలు, కానుకలు చెల్లించేవారు.
- ఫలవృక్షాలు, చింతచెట్లు మొదలైనవి జాగీర్దార్ల ఆస్తిగా భావించేవారు.
- వీరి దోపిడీ హైదరాబాద్ ప్రాంతంలో చాలా ఎక్కువగా ఉండేది. హైదరాబాద్ సంస్థాన రెవెన్యూ ఆదాయం రూ. 8 కోట్లు కాగా హైదరాబాద్ ప్రాంతంలోని 110 మంది జమీందార్ల ఆదాయం రూ. 10 కోట్లు ఉండేది. నిజాం జారీ చేసిన ఫర్మానాలో 82 రకాలైన అక్రమ నిర్బంధ వసూళ్లు ఉండేవని తెలుస్తుంది.
- కులమతాలు, వయసు, లింగ భేదాలతో సంబంధం లేకుండా అందరూ వెట్టి చాకిరీ చేయడం ఈ ప్రాంతం అంతటా ఉండేది.
- అత్యధికమైన భూ కేంద్రీకరణ, అధికార బలం, ఆర్థికబలం, అంగబలం వల్ల ఫ్యూడల్ దోపిడీ నిరాటంకంగా కొనసాగింది. దీంతోపాటు వడ్డీ వ్యాపారం, నిర్బంధ లేవీ పద్ధతి, ఆర్థికమాంద్యం మొదలైనవాటితో రైతాంగం పూర్తిగా కుంగిపోయింది. రైతాంగం కౌలుదారులు, వ్యవసాయ కూలీలు మారడమో, వలస వెళ్లడమో జరిగింది.

కౌలుదారీ విధానాలు

- హైదరాబాద్, ఆంధ్రా ప్రాంతంలోనూ భూస్వామ్య పద్ధతుల్లో ఉండే లోపాల వల్ల భాటకం వసూలు చేసేవారి సంఖ్య విపరీతంగా పెరగడం వల్ల కౌలుదారీ సంబంధాలు ఉండడం సర్వ సాధారణ విషయంగా మారింది.

హైదరాబాద్ రాష్ట్రంలో కౌలు విధానాలు

- హైదరాబాద్ సంస్థానంలో 1354 ఫసలీ (1944)లో ఆసామీ షక్మీ చట్టం అమలులోకి వచ్చే నాటికి రెండు రకాలైన కౌలుదార్లు ఉండేవారు.

షక్మీదారులు: వీరే శాశ్వత కౌలుదారులు. కౌలుదారునికి రక్షణ, భూమిని సాగు చేసుకునే హక్కులు ఉన్న వారే షక్మీదారులు.

ఆసామీ షక్మీదారులు: వీరు ఏ హక్కులు లేని కౌలుదారులు. ఆసామీ షక్మీదారులు కౌలుభూమిని 12 ఏళ్లు తన స్వాధీనంలో ఉంచుకోగలిగినప్పుడు షక్మీదారులుగా గుర్తింపు లభించేది. కానీ హైదరాబాద్ సంస్థానం వంటి ఫ్యూడల్ వ్యవస్థలో ఏ హక్కులు లేని కౌలుదారుడు పన్నెండేళ్లు కౌలుభూమిని తన స్వాధీనంలో ఉంచుకోవడం జరగదు. ఒకవేళ పన్నెండేళ్లు ఒకే భూమిని కౌలు పద్ధతిలో సాగు చేస్తున్నప్పటికీ దాన్ని రుజువు చేసుకోవడం అంత సులభం కాదు. దీంతో కౌలుదారులందరూ ఆసామి షక్మీదారులు (రక్షణలేని కౌలుదారులు)గానే ఉండేవారు.

Who amongst the five types the fastest?



Model Questions

1. In a certain code, PLANT is written as "$@2H©" and YIELD is written as "β64@%". How is "DELAY" written in that code?
1) β4H2% 2) β4@2% 3) %42@β 4) %4@2β
5) None of these
2. How many meaningful English words can be formed with the letters ARILT using each letter only once in that word?
1) None 2) One 3) Two
4) Three 5) More than three
3. D said, "A's father is the only brother of my sister's son." How is A's father related to D?
1) Cousin 2) Nephew
3) Aunt
4) Data inadequate
5) None of these

Directions (Q. No. 4-6): The following questions are based on the 5 three-digit numbers given below:
394 632 783 576 895

4. If the positions of the first and the second digit within each number are interchanged, then which of the following will be the second highest number?
1) 632 2) 783 3) 576
4) 895 5) 394
5. If the first and second digits of each of the numbers are added, the resulting sum of which of the following numbers will not be exactly divisible by 3?
1) 895 2) 394 3) 576
4) 632 5) 783
6. If 2 is added to the last digit of each number and then the positions of the first and the third digits are interchanged, which of the following will be the highest number?
1) 576 2) 895 3) 783
4) 394 5) 632
7. If A is coded as 1, B as 3, C as 5 and so on, which of the following is the numerical value of the word "FAZED"?
1) 81 2) 79 3) 77
4) 80 5) None of these
8. Which of the following pairs of words have the same relationship as FAN : HEAT?
1) Water : Drink
2) Light : Night
3) Teach : Student
4) Air : Breathe 5) Food : Hunger
9. Q types faster than R but not as fast as V. T types faster than R. S types faster than V. Who amongst the five types the fastest?
1) V 2) T 3) S
4) Data Inadequate
5) None of these
10. If "B × C" means "B is the daughter of C", "B + C" means "B is the husband of C" and "B − C" means "B is the sister of C", then what does "M + N − P × Q" mean?
1) M is the brother-in-law of Q
2) M is the uncle of Q
3) M is the son-in-law of Q
4) Q is the mother-in-law of M
5) None of these

Directions (Q. No. 11-15): Study the following arrangement carefully and answer the questions given below:

RDAK5BI2M J EN97
UZV1 W3H4FY8 P6TG

11. How many such numbers are there in the above arrangement, each of which is immediately preceded by a consonant and immediately followed by a vowel?
1) None 2) One 3) Two
4) Three 5) More than three
12. Which of the following is the eighth to the left of the seventeenth from the left end?
1) M 2) J 3) 8
4) 5 5) None of these
13. Four of the following five are alike in a certain way based on their positions in the above arrangement and so form a group. Which is the one that does not belong to that group?
1) E 9 J 2) Z 1 U 3) H W 4
4) Y 4 8 5) B 2 K
14. Which of the following is the sixth to the right of the nineteenth from the right end?
1) 5 2) Z 3) V
4) 1 5) None of these
15. How many such consonants are there in the above arrangement, each of which is immediately preceded by a number and immediately followed by another consonant?
1) None 2) One 3) Two
4) Three 5) More than three

Bank Exams
REASONING

Directions (Q. No. 16-19): Each of the questions below consists of a question and two statements numbered I and II given below it. You have to decide whether the data provided in the statements are sufficient to answer the question. Read both the statements and

Give answer:

1) If the data in statement I alone are sufficient to answer the question, while the data in statement II alone are not sufficient to answer the question.
2) If the data in statement II alone are sufficient to answer the question, while the data in statement I alone are not sufficient to answer the question.
3) If the data either in statement I alone or in statement II alone are sufficient to answer the question.
4) If the data given in both the statements I & II together are not sufficient to answer the question.
5) If the data in both the statements I & II together are necessary to answer the question.

16. How is 'never' written in a code language?
I) "never ever go there" is written as "na ja ni ho" in that code language.
II) "go there and come back" is written as "ma ho sa ni da" in that code language.
17. Among M, P, K, J, T and W, who is lighter than only the heaviest?
I) P is heavier than M and T.
II) W is heavier than P but lighter than J who is not the heaviest.
18. What does "$" mean in a code language?
I) "5 $ # 3" means "flowers are really good".
II) "7 # 3 5" means "good flowers are available".
19. How many students are there between Suresh and Mohan in a row of fifty students?
I) Suresh is twelfth from the left end and Mohan is seventeenth from the right end.
II) Suresh is six places away from Jayesh, who is twentieth from the left end.

Key And Explanations

1. Ans: 4

P	L	A	N	T	Y	I	E	D
$	@	2	✳	©	β	6	4	%

∴ DELAY ⇒ %4@2β

2. Ans: 3. TRAIL, TRIAL,
3. Ans: 2. A's father
= the only brother of D's sister's son
= D's sister's son
= D's nephew
4. Ans: 5. Interchanging the first two digits, we get 934, 362, 873, 756 and 985. Of these, 934 is the second highest.
5. Ans: 1. 895 ⇒ 8 + 9 = 17 is not divisible by 3.
6. Ans: 1. Look for the highest third digit.
7. Ans: 2. In general, n^{th} letter of the alphabet =2n–1 Here, FAZED = 11 + 1 + 51 + 9 + 7 = 79
8. Ans: 5. The first dispels the second.
9. Ans: 4. V > Q > R; T > R; S > V
Combining, we get S > V > Q > R and T > R. Hence, either S or T is the fastest.
10. Ans: 3.
Q
|
M(+) ⇔ N(–)<—>P(–)
11. Ans: 1.
12. Ans: 1. 8^{th} to the left of 17^{th} from left = 17 – 8 = 9^{th} from the left = M
13. Ans: 5. In all others, the first and third elements are consecutive ones.
14. Ans: 3. 6^{th} to the right of 19^{th} from the right = 19 – 6 = 13^{th} from the right = V
15. Ans: 4. M, F and T
16. Ans: 4. Only two words are common between I and II.
17. Ans: 5. From I: P > M, T
From II: J > W > P
Combining, we get K > J > W > P > M, T Hence, K is the heaviest and J lighter than only the heaviest.
18. Ans: 5.
From I: 5$#3 = flowers are really good ... (i)
From II: 7#35 = good flowers are available ... (ii)
From I and II: 5#3 = flowers are good ... (iii)
Putting (iii) in (i), we get: $ = really.
19. Ans: 1. **From I:** Suresh = 12^{th} from left
Mohan = 17^{th} from right
∴ No. of students between them = 50 – 29 (12+17) = 21
From II: No data about Mohan.